సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 30

శనివారం 14-10-2023



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



చలో చిరకాల సమరానికి..


నేడు భారత్, పాకిస్తాన్ మధ్య అహ్మదాబాద్‌లో వరల్డ్‌కప్ మ్యాచ్ - 13లో



కులగణన చుట్టూ..

హిందీ బెల్ట్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అస్త్రం - 12లో


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కల్లోలాలు మంచివి కావు

ఘర్షణలు, కల్లోలాలు ఏ పక్షానికీ మంచి చేయబోవని జీ20 పార్లమెంటరీ స్పీకర్ల సదస్సులో ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



యుద్ధభూమి ఉత్తర గాజా!

ఉత్తర గాజాను ఖాళీ చేసి, దక్షిణ ప్రాంతానికి తరలివెళ్లాలని పాలస్తీనియన్లకు ఇజ్రాయెల్ సైన్యం ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 6లో ▸



కాంగ్రెస్‌కు పొన్నాల గుడ్‌బై

కాంగ్రెస్ పార్టీకి నాలుగు దశాబ్దాలకుపైగా సేవ చేసిన టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆ పార్టీకి రాజీనామా చేశారు.

వివరాలు 10లో ▸



ఎంప్లాయ్‌మెంట్ 'కార్డులు'

గ్రీన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నవారికి ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కార్డులు అంద జేయనున్నట్లు అమెరికా ప్రకటించింది.

వివరాలు 6లో ▸



పోలవరం తొలిదశ పూర్తికి రూ.15,661 కోట్లు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు సీడబ్ల్యూసీ ఆమోదం
- ఆ మేరకు నిధులివ్వాలని కేంద్ర జల్‌శక్తి శాఖకు సిఫార్సు
- నివేదికను కేంద్ర జల్‌శక్తి శాఖకు పంపినట్లు సీడబ్ల్యూసీ చైర్మన్ వెల్లడి
- ఇప్పటికే తొలిదశ పూర్తికి రూ.12,911 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక శాఖ అంగీకారం
- లైడార్ సర్వేలో 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోకి అదనంగా మరో 36 గ్రామాలు
- ఈ గ్రామాల ప్రజలకు తొలిదశలోనే పునరావాసం కల్పించేందుకూ కేంద్రం ఓకే
- 2017–18 ధరల ప్రకారం నిధులిచ్చి, ప్రాజెక్టు పూర్తికి సహకరించాలన్న సీఎం జగన్ వినతికి ప్రధాని అంగీకారం
- ఈ క్రమంలోనే తొలిదశ పూర్తికి అవసరమైన నిధుల విడుదలకు కేంద్రం రెడీ

2లో

బరువు తక్కువ డ్రామా!

చంద్రబాబుకు అనారోగ్యమంటూ టీడీపీ హడావుడి

ఆసుపత్రిలో చేర్చేందుకే 'అనారోగ్యం' పథకం.. బాబు బరువు తగ్గలేదు..

జైలుకొచ్చాక మరో కిలో పెరిగారు

ఇంటి భోజనం.. మూడు పూటా ఆరోగ్య పరీక్షలు.. పూర్తి ఆధారాలతో దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన జైళ్ల శాఖ

బాబు జైల్లో.. చినబాబు ఢిల్లీలో..

నైరాశ్యంలో తమ్ముళ్లు

ఇప్పట్లో బెయిల్ రాదనే

సానుభూతి ఎత్తుగడ

బెడిసికొట్టిన రాజకీయ కుతంత్రం



సాక్షి, అమరావతి: అవినీతికి పాల్పడి సాక్ష్యాధారాలతో సీఐడీకి దొరికిపోయిన మాజీ సీఎం చంద్రబాబు బయటపడే మార్గం కానరాకపోవడంతో అనారోగ్యమంటూ సానుభూతి నాటకానికి తెర తీశారు! స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో విచారణకు సహకరించకుండా అసలు కేసునే కొట్టివేయాలని ఒకవైపు వాదిస్తూ మరోవైపు రాజకీయ ప్రయోజనాల కోసం సరికొత్త ఎత్తుగడ వేశారు. అడ్డగోలుగా ప్రజాధనాన్ని కాజేసింది కాకుండా తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఆయన చేస్తున్న యత్నాలపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. డీ హైడ్రేషన్.. స్కిన్ అలర్జీ.. బరువు తగ్గిపోయారంటూ

మిగతా 10వ పేజీలో ▶

ఏమీ తెలియదంటూనే.. 17ఏ రక్షణ కావాలా?

చంద్రబాబు క్వాష్ పిటిషన్లో ఏపీ న్యాయవాది ముకుల్ రోహత్గీ ప్రశ్నలు

నిజాయితీ పరుల రక్షణకే 17ఏ... గత ఘటనలకూ పాత చట్టాలు వర్తిస్తాయి

ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా దర్యాప్తు చేశాయి... కోర్టుకు నివేదన

10లో

'స్కిల్' విచారణ సీబీఐకి!

ఉండవల్లి అరుణ్‌కుమార్ పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు

చంద్రబాబు, అచ్చెన్న, రాష్ట్ర ప్రభుత్వం, సీబీఐ సహా 44 మందికి నోటీసులు

కౌంటర్లు దాఖలు చేయాలంటూ... విచారణ నవంబరు 10కి వాయిదా

14లో

హక్కుగా 'ఆరోగ్యం'

వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్

- ప్రజల సంతృప్తే ప్రామాణికంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- అనారోగ్య బాధితులను వైద్య పరంగా చేయిపట్టుకుని నడిపించాలి
- చికిత్సలు, శస్త్ర చికిత్సలు, మందులు, చెకప్‌లు.. అన్నింటా అండగా నిలవాలి.. పూర్తిగా నయం అయ్యేవరకు చేయూత అందించాలి
- వైద్య శిబిరాల విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు
- ప్రతి నెలా మండలంలో నాలుగు సచివాలయాల్లో నిర్వహించాలి
- ఆరోగ్యశ్రీని వినియోగించుకోవడంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి



- ప్రకాశంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి
- విశాఖ, గుంటూరు, విజయవాడలో చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు

2లో



అంబికాపతి ప్లాట్‌లో లభ్యమైన నగదు

22 బాక్సుల్లో రూ.42 కోట్లు

కాంగ్రెస్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ ఇంట్లో పట్టివేత

అంబికాపతి, ఆయన కుమార్తె, బంధువుల ఇళ్లల్లో సోదాలు

బెంగళూరులో ఐటీ దాడులు

2లో

మా ఆదేశాలే అపహాస్యమా?

- మహారాష్ట్ర స్పీకర్‌పై సుప్రీం ఆగ్రహం.. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై నిర్ణయం ఇంకెప్పుడు?
- అసెంబ్లీ ఎన్నికల దాకా కాలయాపన చేయదలచారా?
- తీవ్రస్థాయిలో మండిపడ్డ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్
- ఎప్పట్లోగా తేలుస్తారో తమకు నివేదించాలని ఆదేశం

6లో



అభ్యర్థుల జాబితా ప్రకటించడానికి వెళ్తున్నారు!

నేడు, రేపు ఎస్సై మెయిన్స్ పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీలు ప్రశాంతి, జాషువా, శ్రీధర్

ఏలూరులో 5 పరీక్షా కేంద్రాల ఏర్పాటు	ఉదయం 9 గంటలకే కేంద్రాల్లోకి అనుమతి
	ఏలూరు రేంజ్‌లో 4,162 మంది అభ్యర్థులు

ఏలూరు టౌన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్ఐ) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా మెయిన్స్ పరీక్షకు రంగం సిద్ధమైంది. ప్రాథమిక పరీక్ష, దేహదారుఢ్య పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు తుది దశ పరీక్షలు నిర్వహించనున్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో మెయిన్స్ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఏలూరులో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఏలూరు రేంజ్ పరిధిలో కృష్ణా జిల్లా, పూర్వ ఉభయగోదావరి జిల్లాల అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్షించిన ఆయన కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహిస్తారు. ఏలూరు నగరంలో ఎస్ఐ పోస్టుల మెయిన్స్ రాత పరీక్షలకు 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏలూరు రేంజ్ పరిధిలో 4,162 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. వీరిలో 3649 మంది పురుషులు, మరో 513 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఏలూరు శివారులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల, సీఆర్ఆర్ మహిళా కళాశాలతో పాటు, కొత్త బస్టాండ్ సమీపంలోని సీఆర్ఆర్ అటానమస్ డిగ్రీ కళాశాల, ఏలూరు జీజీహెచ్ సమీపంలోని సెయింట్ థెరిస్సా కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తారు. డీఐజీతో పాటు ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, కృష్ణా ఎస్పీ జాషువా, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్, ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏలూరు డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ ఎం. సుబ్బారావు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

అభ్యర్థులకు అధికారుల సూచనలు

అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్, ఇతర ధ్రువీకరణ పత్రాలతో రావాలి. ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 10 గంటలకు మొదటి పరీక్ష ప్రారంభం. మధ్యాహ్నం 2.30 గంటలకు రెండో పరీక్ష. అభ్యర్థుల బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్స్ తీసుకుంటారు. మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు 4 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలి.అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకొచ్చేందుకు అనుమతి లేదు. పరీక్షా కేంద్రాల్లోకి అధికారులు సైతం సెల్‌ఫోన్ తీసుకువెళ్లకుండా నిబంధన.

పటిష్ట భద్రత

"ఎస్సై పోస్టుల భర్తీకి సంబంధించి మెయిన్స్ పరీక్షకు ఏలూరు నగరంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాం. నగరంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. అభ్యర్థులకు ఏలూరు కొత్త బస్టాండ్, రైల్వేస్టేషన్లలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– జీవీజీ అశోక్‌కుమార్, డీఐజీ

క్లుప్తంగా...

సీఎం జగన్‌కు వీఆర్‌ఏ సంఘం నేతల కృతజ్ఞతలు



సాక్షి, అమరావతి: వీఆర్‌ఏ సంఘం నేతలు శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఇస్తున్న రూ.300 డీఏను రద్దు చేసింది. ఈ విషయాన్ని ఏపీజీఎఫ్ ప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎం.. డీఏను పునరుద్ధరించడమే కాకుండా డీఏను రూ.500కు పెంచుతూ ఇటీవల నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో వీఆర్‌ఏ సంఘం నేతలు సీఎంను కలిసి సన్మానించారు. ఏపీజీఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి, వీఆర్‌ఏ సంఘం నేతలు ధైర్యం, సత్యరాజ్, సుధాకర్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

16న సీఎం జగన్ విశాఖ, అనకాపల్లి జిల్లాల పర్యటన

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ ఈ నెల 16న (సోమవారం) విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి విశాఖ చేరుకుని మధురవాడ ఐటీ హిల్ నంబర్ 2 వద్ద ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం హెలిప్యాడ్ వద్ద జీవీఎంసీ బీచ్ క్లీనింగ్ మిషన్లు ప్రారంభిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి అనకాపల్లి జిల్లా పరవాడ చేరుకుని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో యుజియా స్టెరైల్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవంలోను, అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలోను పాల్గొంటారు. తరువాత అచ్యుతాపురం ఏపీసెజ్‌కు చేరుకుని లారస్ ల్యాబ్స్ యూనిట్ 2 ఫార్ములేషన్ బ్లాక్ ప్రారంభిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం సాయంత్రం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

కురుపాంలో గిరిజన విద్యార్థులకు 50% సీట్లు

ప్రభుత్వం ఆదేశాలు జారీ

సాక్షి, అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా, ఏజెన్సీ ప్రాంతం కురుపాంలో నిర్మిస్తున్న ఇంజనీరింగ్ కాలేజీలో 50శాతం సీట్లు గిరిజన విద్యార్థులకే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. దీన్లో భాగంగానే న్యమైన ఉన్నత, సాంకేతిక విద్య, ప్రాథమిక సౌకర్యాలను అందుబాటులోకి తెస్తోంది. జేఎన్‌టీయూ కాకినాడకు అనుబంధంగా కురుపాంలో ఇంజినీరింగ్ కాలేజీ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇది పూర్తయితే షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి రానుంది. తాము ఎంచుకున్న రంగంలో ఉన్నత విద్య, పరిశోధనలు చేసేందుకు సమాన అవకాశాలు లభిస్తాయి. ఈ కాలేజీలో గిరిజన విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించి, మిగిలిన 50శాతం ఎస్టీలతో సహా రిజర్వేషన్ల నియమాన్ని అనుసరించి భర్తీ చేసేలా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యదర్శికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రిజర్వేషన్ ప్రకారం భర్తీలో ఇంకా సీట్లు మిగిలితే వాటిని కూడా షెడ్యూల్డ్ ఏరియాలోని గిరిజన విద్యార్థులకే కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది.

22 బాక్సుల్లో రూ.42 కోట్లు

బనశంకరి(బెంగళూరు): బెంగళూరులో ఆదాయపన్ను(ఐటీ) శాఖ అధికారులు జరిపిన దాడుల్లో భారీగా సొత్తు బయటపడింది. కాంగ్రెస్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ అశ్వత్థమ్మ, ఆమె భర్త ఆర్.అంబికాపతి, కూతురు, వారి బంధువుకు సంబంధించిన 10 ప్రాంతాల్లో సోదాలు జరిపారు. అంబికాపతి ఇంట్లో మంచం కింద దాచిన 22 పెట్టెల్లో రూ.42 కోట్ల రూ.500 నోట్ల కట్టలు బయటపడినట్లు ఐటీ శాఖ తెలిపింది. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అఖండ్ శ్రీనివాస మూర్తికి అశ్వత్థమ్మ, స్వయానా సోదరి. అశ్వత్థమ్మ భర్త ఆర్.అంబికాపతి బృహత్ బెంగళూరు మహానగర పాలికె(బీబీఎంపీ) వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఈయనే గతంలో బీజేపీ ప్రభుత్వం ప్రతి పనికీ 40 శాతం కమీషన్ తీసుకుంటోందని ఆరోపణలు చేశారు. కర్ణాటక రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం కూడా ఇదే విధమైన ఆరోపణలు చేస్తూ దర్యాప్తు జరపాలంటూ ప్రధానికి లేఖ రాసింది. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఈ ఆరోపణలపై విచారణకు ఆదేశించింది.

పోలవరం తొలిదశ పూర్తికి రూ.15,661 కోట్లు



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు తొలిదశలో మిగిలిన పనుల పూర్తికి రూ.15,661 కోట్లు అవసరమని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) తేల్చింది. ఈ మేరకు నిధులు విడుదల చేయాలని సిఫార్సు చేస్తూ శుక్రవారం కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి నివేదిక పంపినట్లు సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా వెల్లడించారు. ఇప్పటికే పోలవరం తొలిదశలో మిగిలిన పనుల పూర్తికి రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అంగీకరించారు. ఇందులో భాగంగా జూన్ 5న కేంద్ర ఆర్థిక శాఖ మెమో కూడా జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన లైడార్ సర్వేలో పోలవరం ప్రాజెక్టులో 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోకి అదనంగా 36 గ్రామాలు వస్తాయని తేలింది. ఆ గ్రామాల ప్రజలకు తొలిదశ కిందే పునరావాసం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు సూత్రప్రాయంగా అంగీకరించిన కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్.. ఆ మేరకు సవరించిన ప్రతిపాదనలను రూపొందించాలని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో తొలిదశలో మిగిలిన పనుల పూర్తికి రూ.17,148 కోట్లు అవసరమంటూ సవరించిన వ్యయ ప్రతిపాదనలను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ద్వారా సీడబ్ల్యూసీకి పంపింది. వాటిని పరిశీలించిన సీడబ్ల్యూసీ తొలిదశ పూర్తికి రూ.15,661 కోట్లు అవసరమవుతాయని లెక్కగట్టింది.

కేంద్ర కేబినెట్ ఆమోదం తర్వాత నిధుల విడుదల..

సీఎం జగన్ చేసిన విజ్ఞప్తి.. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు తొలిదశ పూర్తికి రూ.12,911.15 కోట్లు విడుదల చేసేందుకు జూన్ 5న కేంద్ర ఆర్థిక శాఖ అంగీకరించింది. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని 36 గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడానికి సూత్రప్రాయంగా కూడా అంగీకరించింది. ఆ గ్రామాల ప్రజలకు పునరవాసం కల్పించడానికి అదనంగా రూ.2,749.85 కోట్లు అవసరమని సీడబ్ల్యూసీ లెక్కగట్టింది. మొత్తం రూ.15,661 కోట్లను విడుదల చేయాలని కేంద్ర జల్‌శక్తి శాఖకు శుక్రవారం సిఫార్సు చేసింది. కేంద్ర జల్‌శక్తి శాఖ ఆ మేరకు పోలవరానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖకు సిఫార్సు చేయనుంది. దీని ఆధారంగా కేంద్ర కేబినెట్‌కు జల్‌శక్తి, ఆర్థిక శాఖలు ప్రతిపాదన పంపనున్నాయి. దీనిపై కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేస్తే పోలవరం తొలిదశ పూర్తికి అవసరమైన నిధులు విడుదలకు మార్గం సుగమం అవుతుంది.

దశల వారీగా పోలవరంలో నీటినిల్వ..

ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 45.72 మీటర్లు కాగా.. గరిష్ట నీటినిల్వ 194.6 టీఎంసీలు. కొత్తగా నిర్మించే ఏ ప్రాజెక్టులోనైనా సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారం ఆ ప్రాజెక్టు పూర్తయిన తొలి ఏడాది దాని పూర్తినిల్వ సామర్థ్యంలో 1/3వ వంతు.. మరుసటి ఏడాది 2/3వ వంతు, తర్వాత పూర్తిస్థాయిలో నీటి నిల్వ చేయాలి. లీకేజీలుంటే వాటికి అడ్డుకట్ట వేసి ప్రాజెక్టుకు భద్రత చేకూర్చాలన్న ఉద్దేశంతోనే సీడబ్ల్యూసీ ఈ మార్గదర్శకాలను రూపొందించింది. వీటి ప్రకారం పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక తొలి ఏడాది 41.15 మీటర్లలో, తర్వాత దశల వారీగా నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ గరిష్ట నీటి మట్టం 45.74 మీటర్లలో నీటినిల్వ చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి.

కేంద్రాన్ని ఒప్పించిన సీఎం జగన్..

నిజానికి.. కేంద్రమే నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కమీషన్ల కక్కుర్తితో 2013–14 ధరల ప్రకారమే పూర్తిచేస్తామని 2016, సెప్టెంబరు 7న నాటి సీఎం చంద్రబాబు అంగీకరించి పనులను దక్కించుకున్నారు. అప్పటి ధరల ప్రకారం పోలవరం వ్యయం రూ.20,398.61 కోట్లు ఇచ్చేందుకు అప్పట్లో కేంద్ర మంత్రివర్గం అంగీకరించింది. ఇందులో 2014, ఏప్రిల్ 1 నాటికి చేసిన వ్యయం రూ.4,730.71 కోట్లు మినహాయించి మిగతా అంటే రూ.15,667.91 కోట్లు ఇస్తామని తేల్చింది. 2014, ఏప్రిల్ 1 నుంచి ఇప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయంలో రూ.14,969.37 కోట్లు కేంద్రం విడుదల చేసింది. ఇక రూ.698.54 కోట్లు మాత్రమే మిగిలాయి. కానీ.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ, నిర్వాసితుల పునారావాసానికే రూ.33,168.23 కోట్లు అవసరం. ఇదే అంశాన్ని సీఎం వైఎస్ జగన్ గుర్తుచేస్తూ.. 2017–18 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ ఖరారు చేసిన సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లను ఆమోదించి, నిధులు విడుదల చేసి, ప్రాజెక్టు పూర్తికి సహకరించాలని ప్రధాని మోదీని కోరారు. ఈ క్రమంలోనే తొలిదశ పూర్తికి అడ్‌హక్‌గా రూ.పది వేల కోట్లు ఇచ్చి.. ప్రాజెక్టు ఫలాలను ముందస్తుగా రైతులకు అందించేందుకు సహకరించాలని సీఎం జగన్ చేసిన వినతిపై ప్రధాని సానుకూలంగా స్పందించారు. ఆ మేరకు నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కేంద్ర జల్‌శక్తి, ఆర్థిక శాఖలను ఆదేశించారు.

హక్కుగా 'ఆరోగ్యం'

వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్

ప్రజల సంతృప్తే ప్రామాణికంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'



వైద్య, ఆరోగ్య శాఖపై ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ప్రజలంతా సంతృప్తి చెందేలా సేవలందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. పేదలందరికీ ఆరోగ్యం అనేది హక్కుగా ఉండాలని, అనారోగ్య బాధితులను చేయి పట్టుకుని నడిపిస్తూ శిబిరాల్లో సేవలతోపాటు మందుల నుంచి చికిత్స వరకు అందించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. క్యాంపుల్లో చికిత్సతోపాటు మందులు కూడా ఇస్తున్నామన్నారు. గతంలో చికిత్స పొందిన వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ మందుల విషయంలో రాజీ పడకుండా ఎంత ఖరీదైనవి అయినా సరే వారికి అందించాలని ఆదేశించారు. సురక్ష కార్యక్రమం ప్రభుత్వ ప్రతిష్టనే కాకుండా వైద్య, ఆరోగ్య శాఖ ప్రతిష్టనూ పెంచుతుందన్నారు. ఆరోగ్య సురక్ష నిర్వహణ కోసం కలెక్టర్లకు మరిన్ని నిధులు అందిస్తామని ప్రకటించారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, నాడు – నేడు కార్యక్రమాలు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అమలును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆ వివరాలివీ...

అంతటితోనే ఆగొద్దు..

ప్రజల ఆరోగ్య అవసరాలు, సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి వివిధ సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య శిబిరాల్లో వైద్యం చేస్తున్నాం. శిబిరాల్లో వైద్యం అందించడంతోనే మన బాధ్యత ముగిసినట్లు కాదు. ఆ తర్వాత కూడా మనం ప్రజలకు అండగా నిలవాలి. వారిని వైద్య పరంగా చేయి పట్టుకుని నడిపించాలి. ఈ క్రమంలో 5 అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలి.

ఇవీ ఐదు అంశాలు..

1 వైద్య శిబిరాల్లో మెరుగైన చికిత్స అవసరమని గుర్తించిన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇలా రిఫర్ చేసిన వారి బాధ్యతను ఫ్యామిలీ డాక్టర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు తీసుకోవాలి. వారికి నెట్‌వర్క్ ఆస్పత్రిలో అవసరమైన వైద్యం, శస్త్ర చికిత్స ఆరోగ్యశ్రీ కింద అందేలా చూడాలి. ఆరోగ్య సమస్య పూర్తిగా నయం అయ్యేవరకూ చేయి పట్టుకుని నడిపించాలి. వారికి చేయూతను అందించాలి.

2 ఆస్పత్రుల్లో గతంలో చికిత్స పొందిన వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చికిత్స అనంతరం మందులను క్రమం తప్పకుండా వాడటం చాలా ముఖ్యం. లేదంటే సమస్య మళ్లీ తిరగబెడుతుంది. వీరు వాడాల్సిన మందుల విషయంలో రాజీ పడొద్దు. అవి ఎంత ఖరీదైనవి అయినా సరే వారికి అందించాలి. అంతేకాకుండా ఫ్యామిలీ డాక్టర్ వీరికి చెకప్‌లు చేయాలి. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యాలపై వాకబు చేస్తుండాలి. వైద్య పరంగా ఏ అవసరం వచ్చిన సిబ్బంది తక్షణమే స్పందించాలి.

3 ఆరోగ్యశ్రీలో కవర్ కాకుండా గతంలో చికిత్సలు చేయించుకున్న రోగులకు కూడా మనం చేయూత అందించాలి. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి ఏ విధంగా ఉందో వాకబు చేయాలి. సరిగా మందులు వాడుతున్నారో? లేదో? తెలుసుకోవాలి. చికిత్స, క్రమం తప్పకుండా చెకప్, మందులు.. ఇలా వివిధ అవసరాల్లో వారికి అండగా నిలవాలి. ఇందుకోసం ప్రత్యేకంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) రూపొందించాలి. ప్రతి సచివాలయం వారీగా ఇలాంటి వారు ఎంతమంది ఉన్నారనేది వివరాలు సేకరించి వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లతో అనుసంధానం చేయాలి. వీరికి వైద్య పరంగా అండగా నిలవడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే సమకూరుస్తుంది.

4 జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వచ్చే నెల 15వ తేదీతో ముగుస్తుంది. అయితే అనంతరం కూడా క్రమం తప్పకుండా వైద్య శిబిరాలను నిర్వహించాలి. ప్రతి నెలా మండలంలో నాలుగు సచివాలయాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలి. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

5 ప్రతి పౌరుడికి వైద్య పరంగా అండగా నిలవడం ప్రభుత్వంగా మన బాధ్యత. వైద్య శిబిరాల విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్యాంపుల్లో సంతృప్తకర స్థాయిల్లో సదుపాయాలు ఉండేలా చూడాలి. రోగులకు చేయూతను అందించడంతో పాటు ప్రతి ఒక్కరికి ఆరోగ్య సురక్ష కార్యక్రమం పట్ల అవగాహన కల్పించాలి. ప్రతి పౌరుడు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలి. ప్రతి వారం క్రమం తప్పకుండా ఈ ఐదు అంశాలపై నేనే సమీక్షిస్తా.

ఆరోగ్యశ్రీపై అందరికీ అవగాహన

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన లేని వ్యక్తి ఒక్కరూ ఉండటానికి వీల్లేదు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ఆరోగ్యశ్రీని ఎలా వినియోగించుకోవాలో తెలియని వాళ్లు ఉండకూడదు. ప్రతి ఒక్కరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్‌ని డౌన్‌లోడ్ చేయాలి. ఆరోగ్యశ్రీ చికిత్సల కోసం వెళ్లే రోగులకు ప్రయాణ చార్జీలు కూడా ఇవ్వాలి. రక్త హీనతతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారాన్ని అందించేలా ఎస్‌వోపీ రూపొందించాలి. దివ్యాంగులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలోనూ మార్పులు రావాలి. నిపుణులైన వైద్యులు ఆరోగ్య సురక్ష శిబిరాలకు వచ్చినప్పుడు అక్కడే వీరికి సర్టిఫికెట్లు జారీ చేసేలా ఆలోచన చేయాలి. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పెన్షన్లు ఇవ్వడం, వారికి అవసరమైన ఖరీదైన మందులను అందించే కార్యక్రమం చేపట్టాలి. మందులు అందడం లేదన్న మాటే రోగుల నుంచి రాకూడదు.

ఇప్పటివరకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఇలా

నిర్వహించిన వైద్య శిబిరాలు	5,216
ఓపీ సేవలు	18,61,874
సగటున ఓపీల నమోదు	357
మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రిఫరల్	27,833

నలుగురు వైద్యులు.. ఇద్దరు స్పెషలిస్టులు

ఆరోగ్య సురక్ష క్యాంపులకు స్పెషలిస్టు వైద్యులను పంపే విషయంలో మరింత శ్రద్ధ వహించాలి. రోగులకు ఉత్తమ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి. క్యాంపులకు తప్పనిసరిగా నలుగురు వైద్యులు వెళ్లాలి. వీరిలో ఇద్దరు స్పెషలిస్టులు ఉండేలా చూడాలి. రోగిని పరిశీలించినప్పుడు మరింత నిర్ధారణ కోసం అదనపు పరీక్షలు చేసి సరైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలి.

ప్రకాశం జిల్లాలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్

తిరుపతి తరహాలోనే చిన్న పిల్లలకోసం అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో కూడా ఏర్పాటు చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రకాశం జిల్లాలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నెలకొల్పడానికి చర్యలు చేపట్టాలి.

సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(ఎఫ్ఏసీ) అజయ్‌జైన్, కార్యదర్శి మంజుల డి హోస్మణి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈఓ హరేంధిర ప్రసాద్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డీఎంఈ డాక్టర్ నరసింహం, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చంద్రశేఖరరెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు వీసీ ద్వారా సమీక్షకు హాజరయ్యారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం

- గతంలోనే తీర్మానం చేసి కేంద్రానికి పంపాం
- ఈ అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉంది
- దళిత క్రైస్తవ ప్రతినిధులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- సీఎంకు క్రైస్తవ ప్రతినిధుల కృతజ్ఞతలు



సాక్షి, అమరావతి: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలని గతంలోనే తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయనను క్రైస్తవ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి సీఎం జగన్ మాట్లాడుతూ.. ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉందన్న విషయం మీకు కూడా తెలిసిందేనన్నారు. కాగా చాలాచోట్ల శ్మశాన వాటికల సమస్య ఉందని.. దీన్ని పరిష్కరించాలని క్రైస్తవ ప్రతినిధులు సీఎంకు విన్నవించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ శ్మశాన వాటికలపై ఇప్పటికే ప్రభుత్వం నివేదికలు తెప్పించుకుందని చెప్పారు. సచివాలయాల వారీగా ఎస్సీలకు శ్మశాన వాటికలు లేనిచోట ఏర్పాటుకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఈ సందర్భంగా క్రైస్తవ ప్రతినిధులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలతో నిరుపేదలకు మేలు జరుగుతోందని కొనియాడారు. పారదర్శకంగా, వివక్షలేకుండా పథకాలు అందుతున్నాయన్నారు. డీబీటీ వల్ల చివరి లబ్ధిదారుడికి సైతం పథకాల మేలు లభిస్తోందని ప్రశంసించారు. పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చి సహాయకారిగా నిలిచారని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. చర్చి ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చర్చిల ఆధ్వర్యంలోని స్కూళ్లకూ, సేవా భవనాలకు మున్సిపల్ పన్నును మినహాయించాలని విన్నవించారు. జిల్లా కేంద్రాల్లో కమ్యూనిటీ హాళ్లను నిర్మించాలని సీఎంను కోరారు. దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ల కోసం న్యాయపోరాటం చేస్తున్నామని.. దీనికి తోడుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

నాపై హత్యాయత్నం కుట్ర కోణంలో క్షుణ్ణంగా దర్యాప్తు జరపలేదు

- ఎన్ఐఏ పలు కీలక అంశాలను వదిలేసింది
- దీనిపై పిటిషన్‌ను విజయవాడ ఎన్ఐఏ కోర్టు కొట్టేసింది
- వాస్తవానికి ఆ కోర్టుకు విచారణ పరిధి లేదు
- కేవలం విశాఖ కోర్టుకు మాత్రమే పరిధి ఉంది
- హైకోర్టులో సీఎం జగన్ పిటిషన్ దాఖలు
- తదుపరి విచారణ ఈ నెల 17కి వాయిదా



సాక్షి, అమరావతి: తనపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం వెనుక ఉన్న కుట్ర కోణంపై లోతుగా దర్యాప్తు చేసేలా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను ఆదేశించాలన్న పిటిషన్‌ను విజయవాడ ఎన్ఐఏ కోర్టు కొట్టి వేయటాన్ని సవాల్ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈమేరకు గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దీనిపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం లేవనెత్తింది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రీ అభ్యంతరాలపై విచారణ జరిపే నిమిత్తం ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు వచ్చింది. న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి దీనిపై విచారణ జరిపారు. సీఎం జగన్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రిజిస్ట్రీ అభ్యంతరాలకు సంబంధించి నిరంజన్‌రెడ్డి వినిపించిన వాదనలతో న్యాయమూర్తి సంతృప్తి చెందారు. ఈ క్రమంలో ఎన్ఐఏ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలు చేసిన ఈ పిటిషన్‌కు నెంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 17కి వాయిదా వేశారు.

కుట్ర.. ప్రేరణ జోలికెళ్లని ఎన్ఐఏ

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో 2018 అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో జనిపల్లి శ్రీనివాసరావు అలియాస్ చంటి అనే వ్యక్తి ఆయనపై హత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. నిందితుడు పదునైన కత్తితో వైఎస్ జగన్ మెడపై దాడికి ప్రయత్నించాడు. ఈ ఘటనలో వైఎస్ జగన్ ఎడమ చేయికి లోతైన గాయమైంది. ఈ హత్యాయత్నాన్ని తేలిక చేస్తూ నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు, అప్పటి డీజీపీ ఠాకూర్ విలేకరుల సమావేశాలు నిర్వహించారు. ఈ ఘటనపై హైకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు జరిపిన ఎన్ఐఏ చార్జిషీట్ దాఖలు చేసింది. వైఎస్ జగన్‌ను చంపడమే నిందితుడు శ్రీనివాసరావు ఉద్దేశమని, అందుకే మెడపై కత్తితో దాడికి ప్రయత్నించాడని ఎన్ఐఏ చార్జిషీట్‌లో పేర్కొంది. ముందస్తు పథకంలో భాగంగానే శ్రీనివాసరావు కోడి కత్తి సంపాదించాడని, అదును చూసి వైఎస్ జగన్‌పై దాడి చేశాడని వెల్లడించింది. దీని వెనుక ఉన్న కుట్ర, ప్రేరణ వ్యవహారాన్ని తదుపరి దర్యాప్తులో తేలుస్తామని ప్రత్యేక కోర్టుకు ఎన్ఐఏ నివేదించింది. అయితే అటు తరువాత కుట్ర కోణంపై ఎన్ఐఏ దృష్టి సారించలేదు. నిందితుడు ఎవరి ప్రేరణతో హత్యాయత్నానికి పాల్పడ్డాడో తేల్చలేదు. ఈ నేపథ్యంలో తనపై హత్యాయత్నం ఘటన వెనుక ఉన్న కుట్రపై లోతైన దర్యాప్తు జరిపేలా ఎన్ఐఏను ఆదేశించాలని అభ్యర్థిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్‌లో విజయవాడ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్ఐఏ పలు అంశాలను విస్మరించిందన్నారు. ఎన్ఐఏ దర్యాప్తులో లోపాలను కోర్టు దృష్టికి తెచ్చారు. నిందితుడు శ్రీనివాసరావుకు నేరచరిత్ర ఉన్నా ఆ విషయాన్ని పట్టించుకోకుండా విమానాశ్రయంలోని క్యాంటీన్ నిర్వాహకులు అతడికి ఉద్యోగం ఇచ్చారని తెలిపారు. కాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు దీన్ని కొట్టివేస్తూ ఈ ఏడాది జూలై 25న తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సీఎం జగన్ తాజాగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

నిరుపేద కుటుంబాలకు సీఎం ఆపన్న హస్తం

కాకినాడ జిల్లాలో రూ.17లక్షలు అందజేత



సీఎం జగన్ ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: సీఎం వైఎస్ జగన్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. నిరుపేదలు పడుతోన్న కష్టాలను విని స్పందించి ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో గురువారం సీఎంను హెలిప్యాడ్ వద్ద పలువురు కలిసి తమ గోడు విన్నవించారు. వివిధ వైద్య అవసరాల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సాయం కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. తప్పకుండా ఆదుకుంటామని ముఖ్యమంత్రి వారికి భరోసా ఇచ్చారు. సీఎం ఆదేశాల మేరకు కాకినాడ కలెక్టరేట్‌లో 17 మంది బాధిత కుటుంబాలకు రూ.లక్ష చొప్పున చెక్కులను కలెక్టర్ కృతికా శుక్లా అందజేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ జిల్లా పర్యటనలో భాగంగా పలువురు బాధితుల సమస్యలు విని తక్షణమే స్పందించి వారికి ఆర్థిక సహాయం అందిస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని తమకు ఆదేశాలిచ్చారన్నారు. శస్త్ర చికిత్సల కోసం కొందరు, ఇతర ఆరోగ్య సేవల కోసం మరికొందరు తమకు సహాయం చేయాలని సీఎంను అడగ్గా ఆ వెంటనే తదనుగుణంగా సీఎం ఆదేశాలిచ్చారని, దీంతో తమను ఆదుకున్నందుకు సీఎం జగన్‌కు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపినట్లు కలెక్టర్ చెప్పారు. ఈ ఆర్థిక సహాయం పొందిన వారిలో ఈ సత్య సుబ్రహ్మణ్యం (పెద్దాపురం), టీ.ఆనంద్‌కుమార్ (కిర్లంపూడి), కృష్ణకాంత్ (పెద్దాపురం), బుర్రా రాజు (పెద్దాపురం), లక్ష్మి ఆకాంక్ష (పెద్దాపురం), సింగం శ్యామల భాను (కాకినాడ), ఐ సాయి వెంకట్ (పెద్దాపురం), డి నవీన్ (పెద్దాపురం) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పి.మాధురి నవ్య, ఐ.నైనిక, జె.వీరవెంకట సాయి, సిహెచ్ హర్షిత, వి.శశిశ్రీనేత్ర, జి.సుజాత, ఎస్.సతీష్, పి.ప్రేమ్ చంద్, కె.మార్తమ్మ (నంద్యాల)ఉన్నారు.

నవంబర్‌లో కందిపప్పు పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రేషన్ లబ్ధిదారులకు నవంబర్ నుంచి కందిపప్పు సరఫరాకు చర్యలు చేపట్టినట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ అగ్రికల్చరల్ కో–ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హాకా) సంస్థ ద్వారా కందిపప్పును సేకరిస్తున్నట్టు పేర్కొన్నారు. వచ్చే మూడు నెలలపాటు వినియోగదారుల అవసరాలకు సరిపడా నిల్వలను సేకరిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి నుంచి స్థానికంగా రైతుల నుంచి కొనుగోలు చేసిన కందులను మిల్లింగ్ చేసి కార్డుదారులకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

‘స్థానిక’ ఉత్పత్తుల ప్రోత్సాహానికే యూనిటీ మాల్

- విశాఖ బీచ్‌రోడ్డులో స్థలాన్ని పరిశీలించిన కేంద్ర బృందం
- రూ.172 కోట్లతో నిర్మాణం


స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధులు సోనియా దుహానా, ఆకాంక్ష, అధికారులు

సాక్షి, విశాఖపట్నం: ఒక్కొక్క రాష్ట్రంలోని ప్రత్యేకమైన హస్తకళల ఉత్పత్తులు, వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్, భౌగోళిక గుర్తింపు (జీఐ ఇండెక్స్) పొందిన ఉత్పత్తుల్ని దేశవ్యాప్తంగా ప్రోత్సహించడం, విక్రయించడమే లక్ష్యంగా యూనిటీ మాల్ నిర్మిస్తున్నట్లు ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధులు సోనియా దుహానా, ఆకాంక్ష తెలిపారు. ఇటీవల కేంద్ర బడ్జెట్-2023 సందర్భంగా ‘ది యూనిటీ మాల్’ అనే ప్రాజెక్టును కేంద్రం ప్రవేశపెట్టి ఆయా రాష్ట్రాల్లోని రాజధాని లేదా ఆర్థిక రాజధాని, లేదా ప్రసిద్ధమైన పర్యాటక ప్రాంతంలో యూనిటీమాల్ ఏర్పాటుకు స్థలాన్ని సిద్ధం చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ మాల్‌ని విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం బీచ్‌రోడ్డులోని రామానాయుడు స్టుడియో సమీపంలో ఉన్న 5 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలం యూనిటీ మాల్ నిర్మాణానికి అనువుగా ఉందా లేదా అనే అంశాల్ని పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం తరఫున ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధులు విశాఖలో శుక్రవారం పర్యటించారు. స్థలం సరిహద్దులు, ఇతర వివరాలను ఖాదీబోర్డు సీఈవో విజయరాఘవ నాయక్, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ డా.పద్మ, డీఐసీ జీఎం గణపతి, ఏపీహెచ్‌డీసీ ఈడీ విశ్వ, డీహెచ్‌టీవో మురళీ కృష్ణ వారికి వివరించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.172 కోట్ల రుణాన్ని మంజూరు చేస్తుందనీ.. 50 నెలల పాటు రుణంపై వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేకుండా అందించనుందని ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. త్వరలోనే డీపీఆర్ సిద్ధమైన వెంటనే టెండర్లు ఖరారు చేసి వీలైనంత త్వరగా యూనిటీ మాల్‌ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. మధురవాడ తహసీల్దార్ రమణయ్య పాల్గొన్నారు.

భూ రికార్డుల డిజిటలైజేషన్‌లో ఏపీ ఆదర్శం

జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ప్రశంసనీయం

- ఈ రీసర్వే వల్ల భవిష్యత్తులో బహుళ ప్రయోజనాలు
- కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అజయ్ టిర్కీ కితాబు


సదస్సును ప్రారంభిస్తున్న అజయ్ టిర్కీ, బోరా, సిద్ధార్థ జైన్ తదితరులు

సాక్షి, విశాఖపట్నం: భూ సంబంధిత వ్యవహారాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అద్భుతంగా ఉన్నాయని, ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అజయ్ టిర్కీ, సంయుక్త కార్యదర్శి సోన్మోని బోరా ప్రశంసించారు. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డుల మోడ్రనైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన విశాఖలోని ఓ హోటల్‌లో శుక్రవారం దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. దక్షిణాదిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలలో ప్రస్తుతం అమలు చేస్తున్న భూ విధానాలు, రికార్డుల నవీకరణ, ఇతర ప్రక్రియల గురించి ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులు వివరించారు. దేశమంతటికీ ఒకే వేదికగా మాతృభూమి పేరుతో పైలట్ జియో పోర్టల్‌ను ఆవిష్కరించారు. అజయ్ టిర్కీ మాట్లాడుతూ సాంకేతికత సహకారంతో భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అన్ని రాష్ట్రాలు భూ రికార్డులను నవీకరించి మాతృభూమి పోర్టల్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు ఉన్న అన్ని రకాల భూ రికార్డులను నవీకరించాలని, రాజ్యాంగంలో గుర్తించిన అన్ని భాషల్లోకి అనువదించాలని సూచించారు. ఇటీవల ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్‌తోపాటు అర్హత కలిగిన కొన్ని రాష్ట్రాలకు, జిల్లాలకు భూమి సమ్మాన్ ప్లాటినం సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తరఫున ప్రదర్శించిన ప్రజంటేషన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాలను పలుమార్లు ప్రశంసించారు. ప్రధానంగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేపడుతున్న రీ సర్వే వల్ల భవిష్యత్తులో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని టిర్కీ పేర్కొన్నారు. రీ సర్వే, ల్యాండ్ రికార్డుల నవీకరణ, మోడరన్ రికార్డు రూముల నిర్వహణ, భూ సంబంధిత రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచిందని ప్రకటించారు. సోన్మోని బోరా మాట్లాడుతూ డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్ ప్రాజెక్టుల్లో భాగంగా భూ సంవాద్-6 ప్రాజెక్టు విజయవంతమయ్యేలా అందరూ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న భూ సంబంధిత విధానాల గురించి ఏపీ సర్వే, ల్యాండ్ రికార్డ్స్ విభాగం కమిషనర్ సిద్ధార్థ జైన్, జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం గురించి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లఠ్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, ఎన్ఐసీ, ఐటీ టీం అధికారులు, విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రపై విషం చిమ్ముతున్నారు

- పురందేశ్వరి, పవన్ కళ్యాణ్, రామోజీరావు, రాధాకృష్ణ అంతా ఎన్ఆర్ఏలే
- రాష్ట్రంలో లోకల్, నాన్ లోకల్ మధ్య యుద్ధం జరుగుతోంది
- పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో లోకల్, నాన్ లోకల్ మధ్య యుద్ధం జరుగుతోందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, టీవీ5 నాయుడు ఆంధ్రప్రదేశ్‌కు నాన్ రెసిడెంట్స్ (ఎన్ఆర్ఏ) అని ఎద్దేవా చేశారు. వీరంతా పక్క రాష్ట్రంలో ఉంటూ ఏపీపై అనుక్షణం విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. విశాఖపట్నంలో శుక్రవారం మీడియా సమావేశంలో మంత్రి అమర్‌నాథ్ మాట్లాడారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేసే క్రమంలో ముఖ్యమంత్రితో సహా పలువురు అధికారులకు అవసరమైన నివాస గృహాలు సమకూర్చేందుకు ప్రభుత్వం కమిటీని నియమించిందన్నారు. అప్పటి నుంచి ఎల్లో మీడియా ఉత్తరాంధ్రపై విషం చిమ్ముతోందని ధ్వజమెత్తారు. ఈనాడు పత్రిక పుట్టింది విశాఖలోనేనని.. అయితే తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా రామోజీరావు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి జైలు మినహా గత నాలుగున్నరేళ్లలో చంద్రబాబు ఎప్పుడైనా ఈ రాష్ట్రంలో రెండు వారాలైనా ఉన్నారా అని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ వ్యవహార శైలి కూడా ఇదే మాదిరిగా ఉందన్నారు. గాజువాక నుంచి పోటీ చేసినప్పుడు తాను గెలిచినా ఓడినా ఇక్కడి ప్రజలతో ఉంటానని చెప్పారని.. మరి ఓడిపోయాక ఎన్నిసార్లు గాజువాక వచ్చారో చెప్పాలన్నారు. పురందేశ్వరి విశాఖ నుంచి అనేక రాజకీయ పదవులు అనుభవించి.. ఈ ప్రాంతం అభివృద్ధిని అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. టీడీపీ నేతలు గంటా శ్రీనివాసరావు, పయ్యావుల కేశవ్, గీతం యూనివర్సిటీ, తదితరులు పెద్ద ఎత్తున భూ దందాలకు పాల్పడితే అవి ఈ పచ్చ మీడియాకి కనిపించలేదా? అని నిలదీశారు. చంద్రబాబు జైల్లోకి వెళ్లే ముందు 66 కిలోల బరువు ఉంటే.. ఇప్పుడు 67 కిలోలకు పెరిగారన్నారు. ఆయనకు మొదటి నుంచి స్కిన్ ఎలర్జీ ఉందని గుర్తు చేశారు. చంద్రబాబుకు ప్రాణహాని ఉందని చేస్తున్న ప్రచారం నిజం కాదన్నారు. ఆమాటకొస్తే తమకు ఆయన కుటుంబ సభ్యులపైనే అనుమానం ఉందని చెప్పారు. అందువల్ల చంద్రబాబుకు పంపించే ఆహారం ముందుగా లోకేశ్ తిని ఆ తర్వాత బాబుకు పంపించాలన్నారు.

విశాఖలో 12 ఫ్లైఓవర్ల నిర్మాణంపై ఫోకస్

- నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు
- త్వరలో విశాఖ–భోగాపురం ఆరులేన్ల రోడ్డు పనులు
- సీఐఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి, చిత్రంలో మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అధికారులను కోరారు. విశాఖ ట్రాఫిక్ నియంత్రణ అంశంపై సీఐఐ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. సమావేశంలో, అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ నగరంలో విపరీతంగా పెరిగిన సరకు రవాణా, ప్రజారవాణా వాహనాల క్రమబద్ధీకరణపై దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని కోరారు. విశాఖపట్నం–భోగాపురం ఆరులేన్ల రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని, ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి కొంతమేర తగ్గుతుందని చెప్పారు. షీలానగర్–సబ్బవరం రోడ్డు పూర్తయితే నగరంపై ట్రాఫిక్ ప్రభావం తగ్గుతుందని చెప్పారు. విశాఖ నగరం మీదుగా వెళ్లే హైవే-16పై వివిధ ప్రాంతాల్లో 12 ఫ్లైఓవర్ల నిర్మాణంపై ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. ప్రధాన జంక్షన్లలో వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపి, జంక్షన్లను అభివృద్ధి చేయాలని కోరారు. అగనంపూడి టోల్‌గేట్ అంశంపై అవసరమైతే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో చర్చిస్తామన్నారు. ఎన్ఏడీ, హనుమంతవాక జంక్షన్ల విస్తరణకు, నగరంలో ట్రక్ పార్కింగ్‌తో పాటు బస్ పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ విశాఖ చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణానికి వీలుపడదని, అర్ధచంద్రాకారంలోనైనా రింగ్‌రోడ్డు నిర్మించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. నరసింహనగర్‌లో కొండ తొలిచి అక్కడినుంచి హెల్త్ సిటీలో ఉన్న బీఎస్సార్ బీఆర్‌టీఎస్ టన్నెల్ నిర్మించే అంశమూ పరిశీలనలో ఉందన్నారు. నగరంలో ట్రాక్టర్ టెర్మినల్స్ ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలొస్తాయన్నారు.

విశాఖ నుంచి పాలన కొద్దిగా ఆలస్యమయ్యే అవకాశం

దసరా నుంచి విశాఖ నుంచే పాలన సాగించాలని భావించామని, కానీ మరికొంత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయని వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. పరిపాలన రాజధాని వసతులపై సీఎం వైఎస్ జగన్ వేసిన కమిటీ డిపార్ట్‌మెంట్ భవనాలు ఫైనలైజ్ చేసేవరకు సీఎం రావడం ఆలస్యమవుతుందన్నారు. టీడీపీ నేతలు చెబుతున్నట్టుగా తాము దొడ్డిదారిన వైజాగ్ రావల్సిన అవసరం లేదన్నారు. రైట్‌గా, రాయల్‌గా విశాఖకు వచ్చి ఇక్కడినుంచే తమ నాయకుడు పరిపాలన అందిస్తారని తెలిపారు. సమావేశంలో మాజీమంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, పార్టీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోలా గురువులు, దామా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాబు అవినీతిలో మీ వాటా ఎంత?

- పురందేశ్వరికి విజయసాయిరెడ్డి ప్రశ్న
- మీ భర్తే చంద్రబాబు అవినీతిపై పుస్తకం రాశారు కదా..
- అలాంటిది మీరు ఆయన అవినీతిపరుడు కాదని స్పష్టత ఇవ్వగలరా?


మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి. చిత్రంలో పలువురు ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: చంద్రబాబు దోచుకున్న వాటాలో ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఎంత వాటా తీసుకుని బాబుకు మద్దతుగా మాట్లాడుతున్నారో చెప్పాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. నెల్లూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుకు పురందేశ్వరి రాజకీయంగా ఎంతకు అమ్ముడుపోయారో చెప్పాలన్నారు. బాబు తోడల్లుడు వెంకటేశ్వరరావు కూడా చంద్రబాబు అవినీతిపై గతంలో పెద్ద పుస్తకం రాశారని.. ఈ నేపథ్యంలో, తన మరిది అవినీతిపరుడు కాదని పురందేశ్వరి స్పష్టత ఇవ్వగలరా అని ఆయన ప్రశ్నించారు. మరోవైపు.. టీడీపీకి చెందిన ఈ-పేపర్‌లోనే చంద్రబాబు అరెస్టు అనేది కేంద్రం చేసిందని రాసుకొచ్చారని.. అంటే బీజేపీ చేసిందని టీడీపీ చెబుతున్నా పురందేశ్వరి ఎందుకు బాబు అవినీతిని వెనకేసుకు వస్తున్నారన్నారు. ఇక అమిత్ షానే తనకు అపాయింట్‌మెంటు ఇచ్చి మాట్లాడారని లోకేశ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు కన్నా శక్తిమంతుడు లేరని, యంగ్‌లాగా తిరుగుతున్నారని మొన్నటి వరకూ టీడీపీ నేతలు ఊదరగొట్టారని, కాని ఇప్పుడు మాత్రం ఆయన లేచే పరిస్థితి లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జైల్లో సౌకర్యాల్లేవని ఆరోపణలు చేయడం సిగ్గుచేటని చెప్పారు. చంద్రబాబు తరఫున వాదించే లాయర్లు ప్రభుత్వ న్యాయవాదులపై దాడులు చేసిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు జిల్లాలోని అన్ని స్థానాలు కైవసం చేసుకుంటామని విజయసాయిరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశాలు నిర్వహించామని, చిన్నచిన్న సమస్యలను పరిష్కరించుకుని వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రసన్నకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాటక సమాజాలకు ‘వైఎస్సార్ రంగస్థల పురస్కారం’

నాటక రంగంలో విశేష సేవలకుగాను రూ.5 లక్షల నగదు బహుమతి

- కళాకారులకు ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం కింద రూ.1.50 లక్షలు
- గుంటూరులో రంగస్థల నంది నాటక పోటీల తుది ఎంపికలు
- ఈ నెల 15 నుంచి వెబ్‌సైట్‌లో వివరాలు నమోదుకు అవకాశం
- ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి వెల్లడి



సాక్షి, అమరావతి: ఏపీలోని నాటక రంగం అభివృద్ధికి విశేష కృషి చేస్తోన్న రంగస్థల సమాజాలు, పరిషత్‌లకు ఈ ఏడాది నుంచి ‘వైఎస్సార్ రంగస్థల పురస్కారం’ అవార్డులను ప్రవేశపెడుతున్నట్లు ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎఫ్‌డీసీ) చైర్మన్ పోసాని కృష్ణమురళి అన్నారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌కే పరిమితమైన కళా ప్రదర్శనలను ఆడిటోరియంలు, కళా వేదికలు నిర్మించడం ద్వారా అన్ని ప్రాంతాలకు విస్తరించేలా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. కళాకారుల అభ్యున్నతిలో వైఎస్సార్ సేవలను స్మరించుకుంటూ రూ.5 లక్షల నగదు బహుమతితో ‘వైఎస్సార్ రంగస్థల పురస్కారం’ అందజేస్తామని చెప్పారు. దీనితో పాటు నాటక రంగంలో రాణిస్తోన్న కళాకారులకు ఇప్పటికే ఉన్న ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం కింద రూ.1.50 లక్షలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే పురస్కారాలకు ఎంపికలను ప్రారంభిస్తామన్నారు.

గుంటూరులో నంది అవార్డుల నాటక పోటీలు

రంగస్థల నంది నాటక అవార్డులకు తుది ఎంపిక పోటీలను నవంబర్ చివరి వారం/డిసెంబర్ మొదటి వారంలో గుంటూరులో నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే 115 నాటకాలు, నాటికల్లో ప్రాథమిక ఎంపిక పూర్తయిందని, న్యాయ నిర్ణేతలు పరిశీలన అనంతరం 38 నాటకాలు, నాటికలను తుది ప్రదర్శనకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని కళాకారులు, నటీనటులకు ఎటువంటి సభ్యత రుసుము లేకుండా ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో కళాకారులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా www.apsftvtdc.in పోర్టల్‌ను సిద్ధం చేశామని చెప్పారు. జూనియర్ ఆర్టిస్టులు, టెక్నీషియన్లు, దర్శక, నిర్మాతల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. అవసరమైతే కళాకారులకు బస్సు ప్రయాణంలో రాయితీ కల్పించేందుకుకృషి చేస్తామన్నారు.

చిత్ర పరిశ్రమను రావాలనే కోరారు..

రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి సీఎం జగన్ సుముఖంగా ఉన్నారని విలేకరుల ప్రశ్నలకు పోసాని బదులిచ్చారు. గతంలో చిత్ర పరిశ్రమలోనే ప్రముఖులతో సమావేశం ఏర్పాటు చేసి ఏపీలో ఏ ప్రాంతంలోనైనా స్టూడియోల నిర్మాణానికి ముందుకొస్తే ఎంతైనా స్థలం కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారని గుర్తు చేశారు. కళాకారులు ఇక్కడికే వచ్చి స్థిరపడితే వారికి ఇళ్ల స్థలాలతో పాటు ఇతర ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పారని వెల్లడించారు. తెలుగు సినీ పరిశ్రమ విశాఖకు వచ్చే అంశాన్ని పరిశీలించాలని మరోసారి కోరతామన్నారు. చెన్నై నుంచి హైదరాబాద్‌కు పెద్ద సమస్య లేకుండా సినీ పరిశ్రమ తరలివచ్చిందన్నారు. ఏపీ, తెలంగాణలు రెండూ తెలుగు ప్రాంతాలే కావడం..హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్తామంటే అక్కడి ప్రభుత్వం చిత్ర పరిశ్రమకు ఇచ్చిన స్థలాలను వెనక్కి ఇవ్వాలని కోరితే ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి తలెత్తుతుందన్నారు. దీనిపై సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే తరలింపుపై నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభుత్వంతో చర్చించి అవసరమైతే వచ్చే ఏడాది నుంచి ఎన్టీఆర్ రంగ స్థల పురస్కారం నగదు ప్రోత్సాహక పెంపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

బయట అల్లర్లకు చంద్రబాబు కుట్ర

- ప్రజలు తమ కోసం ప్రభుత్వంపై రాళ్లు వేయట్లేదనే భువనేశ్వరి ఏడుపు
- కులపిచ్చిని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలూ ఇందుకే
- పురందేశ్వరి సిద్ధాంతం, వ్యక్తిత్వం లేని నాయకురాలు
- ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి ధ్వజం

సాక్షి, అమరావతి: జైలులో ఉంటూ బయట అల్లర్లకు చంద్రబాబు కుట్ర పన్నారని రాష్ట్ర సినిమా అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) చైర్మన్ పోసాని కృష్ణమురళి ధ్వజమెత్తారు. తనను అరెస్టు చేయడంతో ప్రభుత్వంపై రాళ్లు వేసేవారు, సమాజంలో దాడులు చేసేవాళ్లు రాకపోవడంతో జైలులో చంద్రబాబు ఏడుపు డ్రామా మొదలెట్టారని మండిపడ్డారు. ప్రజలు తమకోసం ప్రభుత్వంపై రాళ్లు వేయట్లేదనే భువనేశ్వరి ఏడుపని దుయ్యబట్టారు. ఆమె నీతి వాక్యాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. కులపిచ్చిని రెచ్చగొట్టేలా ఆమె, బ్రాహ్మణి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సిద్ధాంతం, వ్యక్తిత్వం లేని నాయకురాలని నిప్పులు చెరిగారు. ఎన్టీఆర్ అత్యంత దారుణంగా వెన్నుపోటుకు గురై మరణించినప్పుడు భువనేశ్వరి, పురందేశ్వరి, బాలకృష్ణ అసలు బాధపడలేదన్నారు. ఇప్పుడు అవినీతి చేసి జైలులో ఉన్న చంద్రబాబును దోమలు కుడితేనే అల్లాడిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు పోసాని కృష్ణమురళి శుక్రవారం విజయవాడలో సాక్షితో మాట్లాడారు. ఈ సందర్భంగా పోసాని ఏమన్నారంటే..

మీ భర్తను చెప్పుతో కొట్టండి

తండ్రిని చంపి భర్త సీఎం కావాలని భువనేశ్వరి కోరుకున్నారు. అందుకే ఎన్టీఆర్ చేసిన పాపాలే ఆయనకు ఆ గతి పట్టించాయని ప్రచారం చేశారు. మరి ఎన్టీఆర్‌ను చెప్పులతో కొట్టించి, అన్యాయంగా బలితీసుకున్న పాపానికే తన భర్త జైలులో ఉన్నారని భువనేశ్వరి ఎందుకు చెప్పలేకపోతున్నారు? ఎన్టీఆర్‌కు విలువలు లేవని చంద్రబాబు చెప్పారు.. భువనేశ్వరి తన భర్త మాటకు కట్టుబడి ఉంటే.. విలువలు లేని ఆయన తండ్రి విగ్రహాలు పగలగొట్టాలి. ఎన్టీఆర్‌కు విలువలు ఉంటే.. ఆయన పరువును దిగజార్చిన చంద్రబాబును చెప్పుతో కొట్టాలి. స్వార్థం కోసం మళ్లీ కమ్మవాళ్లను అడ్డుపెట్టుకుని వాళ్ల జీవితాలను నాశనం చేయొద్దు. చంద్రబాబు న్యాయస్థానం ఆదేశాలతో జైలులో వందల మంది పోలీసుల రక్షణలో ఉన్నారు. ఇంక అన్యాయం ఎక్కడ? లోకేశ్ ఢిల్లీ వెళ్లి.. తన తండ్రిని అవినీతి కేసుల నుంచి బయటపడేయండి అంటూ ప్రాధేయపడుతున్నారు. ఇప్పుడు తనను బీజేపీ పిలిస్తేనే వెళ్లానని చెప్పడం చూస్తే.. చంద్రబాబు అడిగితేనే తాను కొడుగ్గా పుట్టానని చెప్పినా ఆశ్చర్యపడక్కర్లేదు. జైలుకు వెళ్తాననే భయంతోనే లోకేశ్ ఢిల్లీలో తిరుగుతున్నారు.

26 నుంచి ‘సామాజిక’ బస్సు యాత్ర

మూడు విడతలుగా రాష్ట్ర వ్యాప్తంగా సాగనున్న యాత్ర

- తొలివిడత ఇచ్ఛాపురంలో ప్రారంభం.. నవంబర్ 9న అనకాపల్లిలో ముగింపు
- నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తాం
- మీడియా సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి


మీడియాతో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని ‘సామాజిక బస్సు యాత్ర’ పేరిట ప్రజలకు వివరిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. శుక్రవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో మంత్రుల సామాజిక బస్సు యాత్ర ఉంటుందని, ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు ఉత్తరాంధ్రలో తొలివిడత ‘సామాజిక బస్సు యాత్ర’ నిర్వహించనున్నట్టు తెలిపారు. 26న మధ్యాహ్నం 3 గంటలకు ఇచ్ఛాపురంలో ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకు వరకూ తొలిరోజు యాత్ర జరుగుతుందన్నారు. 27న విజయనగరం జిల్లా గజపతినగరంలో, 28న భీమిలిలో, 30న పాడేరులో, 31న ఆమదాలవలస, నవంబర్ 1న పార్వతీపురం, 2న మాడుగుల, 3న నరసన్నపేట, 4న ఎస్.కోట, 6న గాజువాక, 7న రాజాం, 8న సాలూరు, 9న అనకాపల్లిలో బస్సు యాత్ర జరుగుతుందని వివరించారు. ఈ యాత్రకు ఉత్తరాంధ్ర మంత్రులతో పాటు పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

గంటాకు ఉత్తరాంధ్ర మనోభావాలు తెలియవు

ఉత్తరాంధ్ర వాసులకు విశాఖ రాజధాని ఇష్టం లేదని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలపై బొత్స మండిపడ్డారు. ఉత్తరాంధ్ర వాసి అయితే ఆ బాధ గంటాకు తెలుసుండేదని, ఈ ప్రాంత ప్రజల మనోభావాలు ఈ ప్రాంతవాసికాని ఆయనకేమి తెలుసన్నారు. ఇక్కడ పుట్టి పెరిగిన తమకు సెంటిమెంట్ ఉంటుందన్నారు. విశాఖ కేంద్రంగా పాలనను ఉత్తరాంధ్ర ప్రజలు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారన్నారు. చంద్రబాబు ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని మంత్రి బొత్స చెప్పారు. చంద్రబాబు బయట కన్నా.. జైల్లోనే ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. సామర్లకోట సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడినవన్నీ వాస్తవాలే అని, ఎవరిపైనా వ్యక్తిగత దూషణలు చేయలేదన్నారు. అవి నిజాలు కాదని ఎవరైనా చెప్పగలరా..? అని ప్రశ్నించారు. పురందేశ్వరి ద్వారా అమిత్‌షాను కాదు కదా.. అమెరికాలో ఉన్న జార్జ్‌బుష్‌ను.. అమితాబ్‌ను లోకేశ్ కలిసినా తమకు అభ్యంతరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాసు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, బొడ్డేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌కు ‘ఈఈఎస్ఎల్’ సహకారం

- డీ కార్బనైజేషన్ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం
- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో ఢిల్లీ అధికారుల భేటీ

సాక్షి, అమరావతి: పరిశ్రమలకు మరింత నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) తనవంతు సాయం అందించనున్నది. మెరుగైన, హెచ్చుతగ్గులు లేని విద్యుత్ సరఫరా కోసం అత్యాధునిక ఇంధన సామర్థ్య సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించనున్నది.

ఇంధనశాఖతో ‘ఈఈఎస్ఎల్’ భేటీ

దీనిపై చర్చించేందుకు రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే విజయానంద్‌తో ఢిల్లీకి చెందిన ఈఈఎస్ఎల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు అనిమేష్ మిశ్రా, సావిత్రి సింగ్, ఆదేశ్ సక్సేనా భేటీ అయ్యారు. అధునాతన గ్లోబల్ టెక్నాలజీని ఏపీలో అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. పునరుత్పాదక ఇంధన విషయంలో ఏపీ నిబద్ధతను తాము అర్థం చేసుకున్నామని, కేవలం పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడమే కాకుండా, ఇంధన పరికరాల తయారీకి కూడా సహకారం అందించడం అభినందనీయమని వారు కొనియాడారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ తీర్చేందుకు విద్యుత్ సంస్థలు నిరంతరం శ్రమిస్తున్నాయని విజయానంద్ వారికి వివరించారు. వేసవిలో అత్యధికంగా 262 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నా, కోతలు లేకుండా సరఫరా అందించగలిగామని వెల్లడించారు. కాగా, మరింత విద్యుత్ ఆదా, మెరుగైన సరఫరాకు అంతర్జాతీయ సాంకేతికతలను ఏపీకి సమకూరుస్తామని ఈఈఎస్ఎల్ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

ఏపీ కాంగ్రెస్‌కు జంబో టీం నియామకం

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి జంబో టీంను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో మొత్తం 29 మందికి ఉపాధ్యక్షులుగా, 64 మందికి ప్రధాన కార్యదర్శులుగా అవకాశం కల్పించింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు)గా శ్రీరామమూర్తిని ఖర్గే నియమించారు. అంతేగాక రాష్ట్రంలోని 33 జిల్లా, సిటీ కమిటీలకు నూతన అధ్యక్షులను నియమించారు. విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడిగా గంప గోవిందరాజులు, విజయవాడ సిటీ అధ్యక్షుడిగా నరహరశెట్టి నరసింహారావు, గుంటూరు సిటీకి మహ్మద్ ఉస్మాన్, కాకినాడ సిటీకి దాట్ల గంధిరాజు, రాజమండ్రి సిటీకి బాలపల్లి మురళీధర్ తదితరులు నియమితులయ్యారు.

అవినీతి నిరోధానికే బాబు అరెస్టు

కేంద్ర సహాయమంత్రి నారాయణస్వామి

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో అవినీతిని నిరోధించేందుకే సీఎం జగన్ ప్రభుత్వం చంద్రబాబును అరెస్ట్ చేసిందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత సహాయ మంత్రి నారా యణస్వామి అభిప్రాయం వ్య క్తం చేశారు. కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నంలో శుక్రవారం జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశాభివృద్ధే ధ్యేయంగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కేంద్రంలో పనిచేస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం అధికార దాహంతోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇస్తూ ఎన్నికలకు వెళుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు జనసేన, బీజేపీ రాజకీయ వ్యూహంతో ముందుకు వెళుతున్నాయని చెప్పారు.

ఆ 95 మంది ఎత్తు మళ్లీ కొలవండి

పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఎస్ఐ నియామకాల్లోని దేహ దారుఢ్య పరీక్షల్లో భాగమైన ఎత్తును ఈసారి మాన్యువల్‌గా కొలవాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఎత్తు పరీక్షలో 2018లో అర్హత సాధించి, 2023లో అనర్హులైన 95 మంది అభ్యర్థుల ఎత్తును తిరిగి కొలవాలని ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ మీటర్ సాయంతో కాకుండా పాతపద్ధతిలోనే ఎత్తు కొలవాలని సూచించింది. నిర్దిష్ట తేదీని ఖరారు చేసి, ఆ విషయాన్ని అర్హత ఉన్న ప్రతీ అభ్యర్థికి తెలిపాలని పేర్కొంది. అభ్యర్థుల ఎత్తును కొలిచే విషయంలో అవసరమైతే నిపుణుల సాయం తీసుకోవాలని, ఈ ప్రక్రియను మూడు రోజుల్లో పూర్తి చేయాలని బోర్డుకు తేల్చి చెప్పింది. ఈ తాజా పరీక్షలో అర్హత సాధించిన వారిని తదుపరి దశకు అనుమతించాలని అధికారులను ఆదేశించింది. అధికారులదే తుది నిర్ణయమని, ఈ అంశానికి సంబంధించి తదుపరి ఎలాంటి వివాదానికి తావు లేదని స్పష్టం చేసింది. షెడ్యూల్ ప్రకారమే 14, 15 తేదీల్లో ప్రధాన పరీక్షలు నిర్వహించేందుకు అధికారులకు అనుమతినిచ్చింది. తాజాగా చేపట్టే ఎత్తు కొలిచే ప్రక్రియలో అర్హత సాధించిన అభ్యర్థులతో సహా ఇప్పటికే అర్హత సాధించిన వారందరివీ కలిపి ఒకేసారి తుది ఫలితాలను వెల్లడించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐ నియామక ప్రక్రియలో భాగమైన దేహదారుఢ్య పరీక్ష సందర్భంగా అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలిచేందుకు డిజిటల్ మీటర్ ఉపయోగించడాన్ని సవాలు చేస్తూ గతంలో మాన్యువల్‌గా కొలిచినప్పుడు అర్హత సాధించిన పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సుజాత శుక్రవారం తన నిర్ణయాన్ని వెలువరించారు.

కుంతీకుమారా! ఇంద్రియాల ద్వారా కలిగే విషయ స్పర్శలే శీతోష్ణ, సుఖదుఃఖాలను కలిగిస్తాయి. అవి వస్తూ పోతుంటాయి. నిలకడలేనివి. వాటిని సహించాలి.

– భగవద్గీత

సాక్షి

శనివారం, 14 అక్టోబర్ 2023

ఆకలి సూచీలో అధోగతి!

ఎన్నో విజయాలు సాధిస్తున్నాం... అయిదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఎంతో దూరంలో లేదని చెప్పుకొంటూనే ఉన్నాం. కానీ ఆకలి భూతాన్ని అంతం చేయటంలో వెనకబడే ఉన్నామని ఏటా వెలువడుతున్న అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. గత నెలలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ప్రపంచ ఆహార కార్యక్రమం చీఫ్ సిండీ మెకెయిన్ మాటలు విన్నా, తాజాగా ప్రపంచ ఆకలి సూచీ (జీహెచ్ఐ)ని గమనించినా మన పరిస్థితి ఏమంత మెరుగ్గా లేదని అర్థమవుతుంది. జీహెచ్ఐ జాబితాలో మొత్తం 125 దేశాలు వుంటే, అందులో మన స్థానం 111. నిరుటికన్నా నాలుగు స్థానాలు కిందకు దిగజారామని ఆ నివేదిక చెబుతోంది. 2015 వరకూ ఎంతో పురోగతి సాధించిన భారత్ ఆ తర్వాత వరసగా నేల చూపులు చూస్తుందన్నది దాని సారాంశం. భారత్‌కు సంబంధించి నంతవరకూ ఇది వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించటం లేదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే చెబుతోంది. అసలు జీహెచ్ఐ కోసం నిర్దేశించిన ప్రమాణాలు, తీసుకుంటున్న నమూనాలు, మొత్తంగా ఆ ప్రక్రియ సక్రమంగా లేదని కేంద్రం ఆరోపణ. ప్రపంచంలో 2030 నాటికి ఆకలన్నదే ఉండరాదన్నది ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ఒకటి. కేవలం ఆహారం లభించటం ఒక్కటే ఆకలి లేదనటానికి గీటురాయి అనుకోవటానికి లేదనీ, ఆ లభిస్తున్న ఆహారంలో మనిషికి అవసరమైన కేలరీలు వుండాలనీ సమితి వివరించింది. మరో ఏడేళ్లకల్లా ప్రపంచ దేశాలన్నీ ఈ లక్ష్యాన్ని అందుకోవలసి వుండగా అనేక దేశాలు ఇంకా వెనకబడే ఉన్నాయని జీహెచ్ఐ అంటున్నది. జాబితా గమనిస్తే పాకిస్తాన్ 102తో మనకన్నా మెరుగ్గా వుండగా, బంగ్లాదేశ్ (81), నేపాల్ (69), శ్రీలంక (60) దాన్ని మించిన మెరుగుదలను చూపించాయి. 28.7 స్కోర్‌తో ఆకలి తీవ్రత భారత్‌లో చాలా ఎక్కువగా ఉందన్నది జీహెచ్ఐ అభియోగం. పౌష్టికాహార లోపంలోనూ 16.6 స్కోర్‌తో మనం చాలా కింది స్థాయిలో వున్నాం. అయిదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు 3.1గా ఉందని నివేదిక వివరిస్తోంది.

మొన్న ఫిబ్రవరి 1న వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ కరోనా మహమ్మారి విరుచుకుపడిన సమయంలో 80 కోట్లమందికి పైగా ప్రజానీకానికి ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) ఆహారధాన్యాలు అందించామనీ, కానీ 2022–23లో ఆహార సబ్సిడీల బిల్లు రూ. 2.87 లక్షల కోట్లకు చేరుకున్నందున అదనంగా ఇచ్చే ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ నిలిపేశామనీ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పౌష్టికాహారలోపం కేవలం ఆహారధాన్యాలు ఉచితంగా అందించటం వల్ల మాత్రమే తీరేది కాదు. అవసరమైన పోషకాహారాన్ని అందించటంతో పాటు మహిళా విద్య, శిశు సంరక్షణ, మెరుగైన పారిశుద్ధ్యం, సురక్షితమైన మంచినీరు లభించేలా చూడటం వంటివి ప్రధాన పాత్ర పోషిస్తాయి. కానీ ఈ రంగాలన్నిటా నిరుటితో పోలిస్తే ఈ ఏడాది బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు ఏపాటి? సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) పేరు మారి సక్షమ్ అంగన్‌వాడీ, పోషణ్ 2.0 అయింది. కానీ గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి ఒక శాతం తగ్గి 20,554 కోట్లకు పరిమితమైంది. ప్రధానమంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్ (మధ్యాహ్న భోజన పథకం)కు నిరుడు రూ. 12,800 కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో అది రూ. 11,600 కోట్లకు తగ్గింది. బాలికల విద్యకు నిరుటితో పోలిస్తే కేవలం 0.2 శాతం పెంచి రూ. 37,453 కోట్లకు సరిపెట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో బేటీ బచావో, బేటీ పఢావో, వన్ స్టాప్ సెంటర్ (ఓఎస్‌సీ) తదితర పథకాలతో కూడిన సంబాల్ స్కీమ్‌కైతే కేటాయించిన నిధులు మిగిలిపోయాయి. మహిళలకు అందించే ఇలాంటి పథకాలైనా, శిశువులకు ఉద్దేశించిన పథకాలైనా పరిస్థితిని మెరుగుపరచగలవు.

జీహెచ్ఐ సూచీ ప్రాతిపదికలు, మొత్తంగా అది రూపొందించే ప్రక్రియ లోపరహితమైనదని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను పూర్తిగా కొట్టిపారేయనవసరం లేదు. ఎందుకంటే ఇంత జనాభా గల దేశంలో పౌష్టికాహార లోపాన్ని గణించటానికి కేవలం 3,000 మంది వివరాలు మాత్రమే తీసుకుంటే అది సంపూర్ణ చిత్రాన్ని ఆవిష్కరించగలుగుతుందా? తీవ్రమైన పోషకాహారంతో పిల్లలు అతి బలహీనంగా వుండటం జీహెచ్ఐ సూచీ ప్రకారం 18.7 శాతం వుండగా, మన పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా ప్రతి నెలా సాగిస్తున్న పర్యవేక్షణలో అది కేవలం 7.2 శాతానికి పరిమితమైందని ప్రభుత్వం చెబుతోంది. అలాగే 80 కోట్లమందికి పైగా ప్రజానీకానికి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద 11 లక్షల 80 వేల టన్నుల ఆహారధాన్యాలను 28 నెలలపాటు అందించామని కూడా వివరించింది. అలాగే పోషకాహార లోప సవాల్‌ను ఎదుర్కొనడానికి వివిధ పథకాల కింద ఎంతో చేస్తున్నామంటున్నది. జీహెచ్ఐ సూచీకి తీసుకున్న నమూనాలు సక్రమంగా లేవనడం వరకూ ఏకీభవించొచ్చు. అయితే నివేదికే పక్షపాతంతో వున్నదనీ, భారత్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే దీని లక్ష్యమనీ అనడం సరికాదు. ఎందుకంటే ఇదే ప్రక్రియ సూచీలోని 125 దేశాల్లోనూ అమలు పరిచివుంటారు. దేశ జనాభాలో నిర్దిష్టంగా ఫలానా శాతం అని పెట్టుకుని దాని ప్రకారం నమూనాలు తీసుకుంటే ఈ సూచీ వెల్లడిస్తున్న అంశాలు వాస్తవానికి మరింత చేరువగా ఉండేవనటంలో సందేహం లేదు. ఒకపక్క బడ్జెట్ కేటాయింపుల్లో, కేటాయించిన నిధులు వ్యయం చేయటంలో మనం సక్రమంగా లేమని అర్థమవుతున్నప్పుడు ఆకలి సూచీ వంటివాటిపై ఆరోపణలు చేయటంవల్ల ఉపయోగం లేదు. పోషకాహారం విషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వ్యత్యాసం వుంది. రాష్ట్రాల్లో ప్రాంతాలవారీగా కూడా తేడాలున్నాయి. ఇవన్నీ సరిచేసుకుంటే నిస్సందేహంగా మెరుగుపడతాం. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు చేరవవుతాం. ఆ దిశగా ప్రభుత్వాలన్నీ దృష్టి పెట్టాలి.

పశ్చిమాసియా ప్రభావం పడనుందా?

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య మొదలైన యుద్ధ ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ఉండనుంది. ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే మందగమనంలో ఉండగా, ఈ పరిస్థితులను ఈ సంక్షోభం మరింత దిగజార్చనుంది. రానున్న రోజుల్లో ఈ అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ముడిచమురు ధరలు పైకి ఎగబాకడం మొదలైంది. సంక్షోభం తొందరగా ముగియకపోతే సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ అంశాలపై ప్రభావం తప్పదు. భారత్ విషయానికి వస్తే, భారతీయ మార్కెట్లు బాహ్య ఘటనల ఒత్తిడిని తట్టుకుని నిలిచాయని ప్రపంచబ్యాంకు లాంటివి ప్రశంసించాయి. కానీ, ఈ ధోరణి ఎంత కాలం కొనసాగుతుందనేది వేచి చూడాల్సిన అంశం.

ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయినా అమెరికాలో ద్రవ్యోల్బణ పరిస్థితి కొంచెం సర్దుకున్న నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్ ఈ మధ్యే వరుస వడ్డీ రేట్ల పెంపునకు బ్రేక్ వేసింది. ఈ పరిణామాల ప్రభావానికి భారత్ అతీతంగా ఉండే అవకాశం లేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత్ దాస్ గత వారమే ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు నెమ్మదించడాన్ని ప్రస్తావిస్తూ భౌగోళిక, రాజకీయ పరమైన ఉద్రిక్తతలు దేశీయ అంచనాలను తల్లకిందులు చేసే అవకాశం లేకపోలేదని హెచ్చరించారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న దహనకాండ ఈ ఏడాది అంచనాలను, వృద్ధిపై ఉన్న సానుకూల దృక్పథాన్ని కచ్చితంగా దెబ్బ తీయనుంది. అంతేకాదు... రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం పెద్దగా సోకని దేశంగా భారత్‌కు ఉన్న మంచిపేరు కూడా దెబ్బతినే అవకాశాలు లేకపోలేదు.

రెండవ అంతర్జాతీయ స్థాయి ఘర్షణ...

2023–24 సంవత్సరానికిగాను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్... భారత్‌పై ఎక్కువ అంచనాలే పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. ప్రపంచానికి గ్రోత్ ఇంజిన్‌గా భారత్‌ను అభివర్ణించారు ఆయన. అంతర్జాతీయ అంశాలను పరిగణనలోకి తీసుకున్నా, ఈ ఏడాది జీడీపీ వృద్ధి 6.5 శాతం ఉంటుందని పునరుద్ఘాటించారు. కానీ, అతితక్కువ కాలంలో ప్రపంచం రెండో యుద్ధాన్ని చూస్తోంది. ఈ ఘటన పర్యవసానాలు కచ్చితంగా ఎదుర్కోక తప్పదు. రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధం మొదలై రెండేళ్లు కావస్తోంది. ఎప్పుడు ముగుస్తుందో చెప్పలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికే ఉన్న పలు లోపాలు పరిస్థితిని అధ్వాన్నం చేయనున్నాయి. ఈ క్రమంలో మొదటగా మర్చండైజ్ (వస్తువులు) ఎగుమతులు తగ్గిపోనున్నాయి. తొమ్మిది నెలలుగా ఇవి దిగజారిపోతున్న విషయం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం.

ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో (ఏప్రిల్–ఆగస్టు) మర్చండైజ్ ఎగుమతుల విలువ 172.95 బిలియన్ డాలర్లు. గత ఏడాది ఇదే కాలానికి ఎగుమతుల విలువ 196.33 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. యూరప్, యూఎస్‌లలో మాంద్యపు ధోరణలు కనిపిస్తున్నాయనేందుకు మర్చండైజ్ ఎగుమతులు తగ్గిపోవడం ఒక నిదర్శనం. ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, వడ్డీ రేట్లు వేగంగా పెరగడం కూడా ఎగుమతుల మందగమనానికి కారణాలుగా చెబుతున్నారు.

మర్చండైజ్ ఎగుమతుల్లో జరిగిన నష్టాన్ని సేవల రంగం ఎగుమతులు కొంత వరకూ భర్తీ చేసినప్పటికీ ఇప్పుడు ఇవి కూడా తగ్గిపోతున్నాయి. గత ఏడాది 26.5 బిలియన్ డాలర్లుగా ఉన్న సర్వీసెస్ ఎగుమతులు ఈ ఏడాది ఆగస్టులో 26.3 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అమెరికా తదితర దేశాల్లోని అధిక వడ్డీల కారణంగా కంపెనీలు ఖర్చులు తగ్గించుకోవడం దీనికి కారణమని ఒక అంచనా.



కానీ, తాజాగా ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య మొదలైన ఘర్షణ పరిస్థితిని మరింత దిగజార్చడం ఖాయం.

భారత ఆర్థిక వ్యవస్థ మరో బలహీనత...

భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన మరో బలహీనత ముడిచమురు. దేశీయ అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతుల ద్వారానే పూరించుకుంటున్నాం. గత ఏడాది ఫిబ్రవరిలో యుద్ధం మొదలైనప్పటి నుంచి అంతర్జాతీయ ముడిచమురు మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. ముందుగా బాగా పైకి ఎగబాకిన ధరలు కొన్ని నెలల తరువాత స్థిమితపడ్డాయి. ఈ ఏడాది మొదట్లో తగ్గుముఖం పట్టే ధోరణి మొదలై జూన్ నెలలో బ్యారెల్‌కు 75 – 80 డాలర్ల స్థాయికి చేరింది. మన ఖజానా తట్టుకోగల స్థాయి ఇది. అయితే సౌదీ అరేబియా, రష్యా దేశాలు జూలైలో ముడిచమురు కార్టెల్ 'ఒపెక్+' (పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ)ను ఉత్పత్తిని మరింత తగ్గించాలని ఒత్తిడి చేశాయి. సెప్టెంబరు వరకూ ఈ కోత కొనసాగడంతో చమురు ధరలు పెరగడం మొదలైంది. గత వారం కొంచెం తగ్గినా పశ్చిమాసియా సంక్షోభం పుణ్యమా అని మళ్లీ ఇప్పుడు ఎక్కువ కావడం మొదలైంది.

జాగరూకత అవసరం...

ఒకవైపు ముడి చమురు ఎగుమతుల బిల్లులు పెరిగి పోతూండటం, ఇంకోవైపు ఎగుమతులు మందగిస్తున్న నేపథ్యంలో కరెంట్ అకౌంట్ లోటు మరింత పెరిగే అవకాశం ఉంది. కాబట్టి కొంచెం ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కరెంట్ అకౌంట్ లోటు 2022–23లో జీడీపీలో 2.1 శాతం వరకూ ఎగబాకినా... ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్ –జూన్) 1.1 శాతానికి పరిమితం కావడం కొంత ఊరటనిచ్చే అంశం. కానీ ముడిచమురు ధరలు నియంత్రణలో లేకపోయినా, ఎగుమతులు పుంజుకోకపోయినా లోటు మళ్లీ పెరగడం ఖాయం.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు ఎక్కువయ్యేందుకు ఉన్న మరో అవరోధం ద్రవ్యోల్బణం. ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం తొందరగా ముగియకపోతే సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ అంశాలపై ప్రభావం తప్పదు. ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో గత ఏడాది ఈ అంశాలు పారిశ్రామిక ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపిన సంగతి తెలిసిందే.

ఎల్పీజీ గ్యాస్ ధరలు తగ్గడం, కాయగూరల ధరలు కూడా సర్దుకుంటున్న నేపథ్యంలో సమీప కాలంలో ద్రవ్యోల్బణం కొంచెం నియంత్రణలోకి వస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చాలా ధీమాగా ఉంది. కానీ భవిష్యత్తు అంచనాల విషయానికి వస్తే మాత్రం పప్పుదినుసులు, కాయగూరలు, మసాలాలపై ఆర్‌బీఐ తన దృష్టిని కేంద్రీకరించింది. ఇదే సమయంలో ఎల్‌నినో పరిస్థితులపై ఆర్‌బీఐ కొంత ఆతురతను వ్యక్తం చేస్తోంది. అయితే, భౌగోళిక రాజకీయ సంక్షోభాలు ద్రవ్యోల్బణం విషయంలో ఊహించినదాని కన్నా ఎక్కువ ఒత్తిడి చూపే అవకాశం ఉంది.

ఎల్లప్పుడూ అంతర్జాతీయ సంక్షోభాలకు సున్నితంగా ఉండే దేశీయ స్టాక్ మార్కెట్ల మీద పశ్చిమాసియా ఘర్షణ తక్షణ ప్రభావం చూపింది. కాకపోతే వర్షాకాలం నిలకడగా లేకపోయినా, అంతర్గత డిమాండ్లు పెరిగితే ఈ మార్కెట్లు కోలుకోగలవు. ప్రస్తుతం భారతీయ పరిశ్రమ పండగ సీజన్ పైనే ఆశలన్నీ పెట్టుకుంది. కార్లు, ఎఫ్ఎంసీజీ(వేగంగా అమ్ముడుపోయే వినియోగ వస్తువులు) రంగాల్లో అమ్మకాలు ఇప్పటికే వారికి శుభ సూచనలు అందిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇటీవలి కాలంలో ప్రపంచ మార్కెట్లు డీలా పడిపోతూంటే... దేశీ మార్కెట్లు మాత్రం హడావుడిగా ఉండటం ఒక ధోరణిగా మారింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ చాలా ఏళ్లుగా ఒడిదుడుకులకు లోనవుతూండగా కోవిడ్, ఉక్రెయిన్ యుద్ధాలు వాటిని తీవ్రతరం చేశాయి. అంతర్జాతీయ ద్రవ్య సంస్థ(ఐఎంఎఫ్) ఇప్పటికే ప్రపంచ వృద్ధి రేటును తగ్గించేసింది. 2022లో ఇది 3.5 శాతంగా ఉంటే, ఈ ఏడాది 3 శాతానికి పరిమితం కావచ్చునని అంటోంది. 2024లో ఇది మరి కొంచెం తగ్గి 2.9 శాతానికి చేరుతుందని చెబుతోంది.

భారత్ విషయానికి వస్తే ప్రపంచబ్యాంకు లాంటివి భారతీయ మార్కెట్లు బాహ్య ఘటనల ఒత్తిడిని తట్టుకుని నిలిచాయని ప్రశంసించాయి. కానీ, ఈ ధోరణి ఎంత కాలం కొనసాగుతుందనేది వేచి చూడాల్సిన అంశం. ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం తొందరగా ముగుస్తుందా? లేక మరింత వ్యాపిస్తుందా? అన్న ప్రశ్నలకు సమాధానాల్లో భారతీయ మార్కెట్ల నిలకడతనం పరీక్ష కూడా ఉందని చెప్పాలి.

వ్యాసకర్త సీనియర్ ఫైనాన్షియల్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఏమైనా 'బ్యాగు'ందా?



గత వారం ఒక క్లినిక్‌లో మరిచిపోయిన బ్యాగును తీసుకోవడానికి ఈ ఉదయం వెళ్లాను. తీసుకున్నాక, దగ్గరి కాఫీ షాపులో కాఫీ తాగుదామనిపించింది. తాగి, అక్కడి నుంచి బయటి కొచ్చాను, చేతిలో బ్యాగు లేకుండా. ఇప్పుడు బ్యాగు కోసం మళ్లీ వెళ్లాలి.

– రుచి కుమార్, పాత్రికేయురాలు

రెండు దేశాలే



ఇజ్రాయెల్–పాలస్తీనా ఘర్షణకు పరిష్కారం 'రెండు దేశాల' విధానమేనన్నది దీర్ఘకాలంగా భారత వైఖరి. (అమెరికా విదేశాంగ మంత్రి) బ్లింకెన్ కూడా, 'ఉత్తమ మార్గం... రెండు దేశాల పరిష్కారం' అన్నారు. ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలు పాలస్తీనా దేశపు కలలను అణచకూడదు

– బ్రహ్మ చెల్లానీ, విశ్లేషకుడు

ఖండించాల్సిన విషయం



ఒక చైనా మీడియా మనిషిగా, చైనా నేల మీద ఇజ్రాయెల్ దౌత్యవేత్త మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. దాడికి పాల్పడ్డ మనిషిని చైనా చట్టం కఠినంగా శిక్షిస్తుందని నమ్ముతున్నాను. (శుక్రవారాన్ని 'క్రోధపు దినం'గా జరపాలని హమాస్ పిలుపునిచ్చింది.)

– హు షిజిన్, సంపాదకుడు

పట్టించుకోవాలి!



తుర్కియేలో భూకంపం వచ్చినప్పుడు, మొరాకోలో భూకంపం వచ్చినప్పుడు మొత్తం ప్రపంచం సాయం చేసింది. కానీ అఫ్గానిస్తాన్ భూకంపంలో అఫ్గాన్లను ఒంటరిగా వదిలేశారు. భూకంప బాధితులను ఆదుకోవాలి.

– ఖాలిద్ అమీరీ, జర్నలిస్ట్

అందరి కోసం



ప్రతి మనిషి జీవితమూ సమానంగా మాన్యత కలిగినదే. ఇదే సూత్రాన్ని విశ్వవ్యాప్తంగా గుర్తించాలి. కేవలం తమ సమాజం కోసం మాట్లాడుతూ, ఇంకో సమాజం విషయంలో మౌనంగా ఉండటం ద్వంద్వ ప్రమాణాల కిందికి వస్తుంది. ఇదే మన పట్ల ఇతరుల కోపానికి కారణమైంది.

– తాహీర్ అన్వర్, ముస్లిం హేతువాది

బహుముఖ ప్రజ్ఞాశాలి

తొలి తెలుగు ముస్లిం కథకుడు షేక్ హుసేన్ సత్యాగ్ని. 1989లో 'పాచికలు' అనే ముస్లిం కథల సంకలనం వేయకముందే నికార్సయిన పీడిత, తాడిత ప్రజల గొంతును తన కథల్లో వినిపించారు. ఆయన మొదటి కథ 'నూరు రూపాయలు'. 'అగ్ని సరస్సు' ఆయన తొలి కథా సంకలనం. దీనిలో మొత్తం ఆరు కథలు ఉన్నాయి. వీటిల్లో 'వినిపించని ఏడుపులు' కథలో పరోక్షంగా ముస్లిం జీవితం ఉంటుంది. బహుశా దాన్ని చూసేనేమో వల్లంపాటి వెంకట సుబ్బయ్య 'సత్యాగ్నీ.. నువ్వు ముస్లిం జీవితాలను కూడా కథలుగా రాయగలవు, రాయాలి' అని అన్నారంట. ఆ మాట పట్టుకుని సత్యాగ్ని ఏడాది తిరగకుండానే ఏడు ముస్లిం జీవిత కథలతో 'పాచికలు' పుస్తకం వేశారు.

సత్యాగ్ని స్వతహాగా స్త్రీ పక్షపాతి. స్త్రీ అణచివేత కేంద్రంగా కథలు రాశారు. కడప బుగ్గవంక ఒడ్డున ఏపుగా పెరిగిన చీకి కంప చెట్లే స్థావరంగా చేసుకుని చవగ్గా శరీరాన్ని అమ్ముకుంటున్న ఓ అభాగ్యురాలి దీన గాథను ఆయన తొలికథ 'నూరు రూపాయలు'లో వివరిస్తే, తలాఖ్ సంప్రదాయాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్న ముస్లిం పురుషుల వల్ల స్త్రీలు ఎదుర్కొంటున్న బాధల్ని తొలి ముస్లిం కథ 'పాచికలు'లో వివరించారు. సత్యాగ్ని అసలు పేరు కేవలం షేక్ హుసేన్ మాత్రమే. 'సత్యాగ్ని' అనేది ఆయన కలం పేరు. సరస్వతీ పుత్ర పుట్టపర్తి నారాయణ చార్యుల వారి శిష్యుల్లో షేక్ హుసేన్ ఒకరు. సంప్రదాయ సాహిత్యాన్ని ఎంతో ఇష్టపడే హుసేన్ మొదటగా ముత్యాల సరాలు ఛందస్సులో 'భగ్న వీణ' గేయ కావ్యం రాశారు. అయితే ముస్లిం పేరైనందువల్ల సాహిత్యరంగంలో ఆదరణ తక్కువ ఉంటుందేమో అని పుట్టపర్తి వారే స్వయంగా 'సత్యాగ్ని' అని కలం పేరు సూచించినట్టు హుసేన్ చెబుతారు.



షేక్ హుసేన్ సత్యాగ్ని

షేక్ హుసేన్ చాలాకాలం పాటు విద్యార్థి నాయకుడిగా, కార్మిక నాయకుడిగా, రాజకీయనాయకుడిగా ఉండటం వల్ల వ్యవస్థలోని అనేక లోపాలను బాగా పట్టుకోగలిగారు. ఏం రాసినా తన జీవితంలో లేనిదీ, తాను చూడనిదీ రాయలేదు. రాయలసీమ కథల మాష్టారు కేతు విశ్వనాథరెడ్డి ఈయన గురించి చెబుతూ 'అల వోకగా కథానికా తత్వం అలవర్చుకున్నవాడు' అన్నారు.

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితులుగా మెలిగారు. రెండు మార్లు ఎమ్మెల్సీగా పనిచేసి రిటైర్ అయ్యారు. కడప దగ్గర్లోని రాయలపంతులపల్లెలో 1943లో పుట్టిన షేక్ హుసేన్ సత్యాగ్నికి ఇప్పుడు 81 సంవత్సరాలు. ఈ వయసులోనూ ఆయన అలుపెరుగక అక్షర సేద్యం చేస్తున్నారు. అందుకు మలి దశలో ఆయన వెలువర్చిన 'సత్యాగ్ని కథలు (2015)', 'దివార్ (2022)' కథా సంకలనాలే సాక్ష్యం. ఆయనను 'డా॥ కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ' జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించనుండటం ముదావహం.

– డా॥ వేంపల్లె షరీఫ్, కథా రచయిత
(షేక్ హుసేన్ సత్యాగ్నికి రేపు కడపలో జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం)

ఈ స్ఫూర్తి నిలిచి వెలగాలి!

సందర్భం



బి.టి. గోవిందరెడ్డి

'అబ్ కీ బార్... సౌపార్' – చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన ఆసియా క్రీడల సందర్భంగా మన దేశంలో హోరెత్తిన నినాదమిది. ఈసారి కొడితే వంద కొట్టాలన్నది దీని సారాంశం. భారతీయ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ), కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ నినాదాన్ని చాలామంది తేలిగ్గా తీసుకున్నారు. జకార్తాలో 2018లో కేవలం 70 మెడల్స్ కొట్టుకొచ్చిన జట్లు ఈసారి అంతకుమించి ఏదో సాధిస్తాయని ఎవ్వరూ అనుకోలేదు. కానీ అందరి అంచనాలనూ మన ఆటగాళ్లు తలకిందులు చేశారు. 107 మెడల్స్ సాధించి ఔరా అనిపించుకున్నారు. ఈ మెరుపులు ఏవో యాదృచ్ఛికమైనవి కాదు. మన క్రీడాకారులు ఎదురొడ్డి నిలిచిన ఆటగాళ్లు సామాన్యులు కాదు.

ఉదాహరణకు సుతీర్థ ముఖర్జీ, ఐహిక ముఖర్జీ జంట టేబుల్ టెన్నిస్‌లో మెరికల్లాంటి చైనా జంటను సునాయాసంగా మట్టికరిపించి క్రీడా ప్రపంచాన్ని అబ్బురపరిచింది. షూటింగ్‌లో ఈషా సింగ్, ఈశ్వరితో మార్‌లు అయితేనేమి (ఒక్కొక్కరు నాలుగు పతకాలు), ఆర్చరీలో సురేఖ, ఓజస్‌లు అయితేనేమి (చెరో మూడు పతకాలు) తమ క్రీడా విన్యాసాలతో చూపరులను ఆకట్టుకున్నారు. మొత్తానికి అందరూ కలిసి 28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్య పతకాలు చేజిక్కించుకుని వచ్చే ఏడాది పారిస్‌లో జరగబోయే ఒలింపిక్స్‌కూ, జపాన్‌లో 2026లో జరగబోయే ఏసియాడ్‌కూ ఆశాకిరణాల్లా నిలిచారు.

దశాబ్దాలుగా అనేక సమస్యలతో కునారిల్లుతున్న భారత క్రీడా రంగం గత నాలుగైదేళ్లుగా మెరుగుపడుతోంది. సత్తా చూపించే ఆటగాళ్లు కోరిన మరుక్షణమే అడిగింది ఏదైనా అందించే వ్యవస్థ అందుబాటులో కొచ్చింది. గెలిచిన ఒకరిద్దరికి నజరానాలు కాదు.. క్రీడలకు కేటాయించే నిధులు పెంచాలన్న స్పృహ పెరుగుతోంది. ఆటగాళ్లకు ఏ శిక్షణ కావాలో, తాము ఎవరితో శిక్షణ తీసుకోదలచుకున్నారో ఆడ, మగ క్రీడాకారులే నిర్ణయించుకునే స్వేచ్ఛనిచ్చారు. అది ఇక్కడనా, వేరే దేశంలోనా అనేది కూడా ఆటగాళ్ల విచక్షణకే వదిలారు. అదే సమయంలో వారు పొందుతున్న శిక్షణ, అందులో సాధిస్తున్న పురోగతి ఎప్పటికప్పుడు తెలుసుకుని అంచనా వేసే వారూ రంగంలో వున్నారు. 'ఖేలో ఇండియా', 'టార్గెట్ ఒలింపిక్ పోడియమ్ స్కీమ్' (టాప్స్) వంటి పథకాల కింద ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే వ్యవస్థ ఆవిర్భావమే దీనంతకూ కారణం. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా రంగంలోకి దిగి మెరికల్లాంటి క్రీడాకారుల్ని ఎంపిక చేసుకుని వారి శిక్షణ కయ్యే వ్యయాన్ని భరించడానికి ముందు కొచ్చాయి. ఈసారి రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లతో శిక్షణ పొందిన క్రీడాకారులు 12 పతకాలు సాధించారు. ఇంకా అదానీ గ్రూప్, జేఎస్‌డబ్ల్యూ, టాటా వంటి సంస్థలు సైతం క్రీడాకారులను తీర్చిదిద్దటంలో కీలకపాత్ర పోషించాయి.



ఈసారి చెప్పుకోదగ్గ మరో అంశం ఉంది. క్రీడాకారుల్లో ఆడ, మగ కూడా సమంగా తమ సత్తా చాటారు. పురుషులు 52 పతకాలు గెల్చుకోగా, మహిళా క్రీడాకారులు 46 సాధించారు. మరో తొమ్మిది మిక్స్‌డ్ డబుల్స్, ఓపెన్ ఈవెంట్లలో వచ్చాయి. మొత్తంగా షూటింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీలో మనవాళ్లు 60 పతకాలు సొంతం చేసుకున్నారు. ఇందులో 18 స్వర్ణాలు. ఈ మూడు ఈవెంట్లపైనా మరింతగా కేంద్రీకరిస్తే 25 రజతాల్లో కనీసం సగమైనా స్వర్ణాలు కావటం కష్టం కాదు. చైనాది ఎప్పుడూ అగ్రశ్రేణే. మనం ఎప్పుడూ అట్టడుగునే. కానీ ఈసారి అదంతా మారింది. చైనా, జపాన్, దక్షిణ కొరియాల తర్వాత స్థానం మనదే. ఈ ఉత్సాహం కొడిగట్టకూడదు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండంకెల సంఖ్యలో పతకాలు గెలిచి తీరాలన్న ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష సంకల్పం నెరవేరాలి.

మన దేశంలో తల్లిదండ్రులు ఎంతసేపూ తమ పిల్లలు చదువుపైనే శ్రద్ధ పెట్టాలని కోరుకుంటారు. ఆటలాడితే ఆగ్రహిస్తారు. దీనికి తోడు ప్రభుత్వాలు సైతం విద్యాసంస్థల్లో క్రీడాంశాలను పట్టించుకోవటం లేదు. ఈ ధోరణి మారాలి. హైస్కూల్లో చేరే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఏదో ఒక క్రీడను ఎంచుకొనేలా, అందులో వారి ప్రతిభాపాటవాలను కొలిచేలా ఒక విధానం రూపొందించాలి.

దేశంలో అక్కడక్కడా అంతర్జాతీయ ప్రమాణాలతో అకాడమీలు ఉన్నాయి. అవి అందరికీ అందుబాటులో ఉండవు. కనుక ఆటలు కూడా చదువులో భాగం కావాలి. క్రీడల్లో ఎప్పుడూ అగ్రశ్రేణిలో ఉండే చైనా, రష్యా... ఆఖరికి క్యూబా, బెలారస్, ఇథియోపియా వంటి చిన్న దేశాలు సైతం హైస్కూల్ స్థాయిలోనే పిల్లల్లో క్రీడానైపుణ్యాలను పసిగడతాయి. వారిని ఒక క్రమపద్ధతిలో తీర్చి దిద్దుతాయి. మనం కూడా ఆ దారిని ఎంచుకోవాలి. ఈవెంట్ ఏదైనా విజయం మనదే కావాలి. ఎప్పుడూ అగ్రభాగాన నిలవాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మహాలయ అమావాస్య

భాద్రపద మాసం కృష్ణపక్షాన్ని భారతీయ సంప్రదాయం 'పితృ పక్షం'గా పరిగణిస్తుంది. ఈ పక్షమంతా గతించిపోయిన పితృ దేవతలకూ, పూర్వీకులకూ సమర్పితమైన పక్షం. శిష్టాచార పరులు ఈ పక్షాన్ని ముఖ్యంగా శ్రాద్ధ విధులకూ, పితృ తర్పణ విధులకూ, పిండ ప్రదానాలకూ కేటాయిస్తారు. ఈ పక్షంలో జరిపిన పితృకార్యాల వల్ల ఫలం అధికమని విశ్వసిస్తారు. ఈ పక్షాన్ని 'మహాలయ' పక్షం అంటారు.

'మహా ఆలయం' అంటే బ్రహ్మ లోకం. సర్వ వ్యాపి అయిన పరమాత్మ స్థావరం. 'ఎవ్వనిచే జనించు జగము..' అన్నారో ఆ పరమేశ్వరుడే విశ్వమంతటినీ తన లోపల ఇముడ్చుకోగల 'మహా ఆలయుడు'. సృష్టి సమయంలో తన నుంచే సర్వాన్నీ సృష్టించి, మళ్ళీ సృష్టి అంతంలో ఆ సర్వాన్నీ ఉపసంహరించి, తనలోనే లయం చేసుకొంటాడు కనక ఆయన మహా 'లయుడు' కూడా. ఆ పరమాత్మ గురించిన ధ్యానం వైపు మనసు మళ్లించేది మహాలయ పక్షం. ఇది 'మహాలయ అమావాస్య'తో ముగుస్తుంది.



జగత్ సృష్టి, స్థితి, లయం అనే ప్రక్రియలు చక్ర భ్రమణంలాగా సాగేవి. ఒక రకంగా, మహాలయ అమావాస్యను లయానికీ, పునః సృష్టికీ మధ్య సంధి సమయానికి ప్రతీకగా భావించచ్చు. ఈ అమావాస్యకు ఒక వైపు, గతించి ఈశ్వరుడిలో లయమైన పితృదేవతల పక్షం... పితృపక్షం. మరొక వైపు దేవీ నవరాత్రుల శుభ సమయమైన 'దేవీ పక్షం'. దేవి అంటే పరమ పురుషుడి సృజన శక్తి. మహా మాయా శక్తి. సృష్టి ఆరంభ సమయంలో ఈ మాయా ప్రకృతి, సకల చరాచరాల పుట్టుకకూ కారణమవుతుంది. సర్వ భూతాల లోనూ విష్ణు మాయగానూ, చైతన్య రూపంగానూ, బుద్ధి రూపంగానూ, నిద్రా– క్షుత్– పిపాసల రూపం గానూ, శక్తి– క్షాంతి– కాంతి– శ్రద్ధా– లక్ష్మి– స్మృతి– దయ– తుష్టి ఇత్యాది రూపాలలోనూ నిలిచి ఉంటుంది (యా దేవీ సర్వ భూతేషు... సంస్థితా). సృష్టి ఉపసంహరణ కార్యమూ ఆ శక్తిదే.

సృష్టి చక్రంలో గతించి లయమైపోయిన పూర్వీకులను సభక్తికంగా స్మరించుకోవడం పితృపక్షంలో కర్తవ్యమైతే, భవిష్యత్తులో సాధించగోరే ధర్మ, అర్థ, కామ, మోక్ష పురుషార్థాల సిద్ధి కోసం దేవీ అనుగ్రహం సమకూర్చుకొనే శుభ సమయం దేవీ నవరాత్రుల దేవీ పక్షం. ఈ ఘట్టానికీ ఆ ఘట్టానికీ మధ్య వారధి మహాలయ అమావాస్య. గతానికి భరత వాక్యం. నూతనారంభాలకు నాంది. అందుకే ఈ అమావాస్య పితృపక్షంలో భాగం అయినా, వంగ దేశంలో ఆబాల గోపాలం అందరూ, పరస్పరం 'షుభో మహాలయో' అని శుభాకాంక్షలు తెలుపుకొంటారు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** అమావాస్య రా.10.29 వరకు, తదుపరి ఆశ్వయుజ శుక్ల పాడ్యమి, **నక్షత్రం:** హస్త సా.4.42 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.1.15 నుండి 2.58 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.57 నుండి 7.30 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.09 నుండి 11.54 వరకు, మహాలయ అమావాస్య ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.38.

9వ తరగతి విద్యార్థులకు ప్రతి సోమవారం 'ట్యాబ్ డే'



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని 9వ తరగతి విద్యార్థులకు ప్రతి సోమవారం ట్యాబ్ డేగా నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను ఆదేశించారు. ఇటీవల పలు పాఠశాలలను సందర్శించిన సందర్భంలో విద్యార్థులు బైజూస్ యాప్, ట్యాబ్‌లను తక్కువగా వినియోగిస్తున్నట్టు గుర్తించినట్టు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో సైన్స్, మ్యాథ్స్, సోషల్ సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రతి వారాంతంలో హోంవర్క్ ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రతి సోమవారం పాఠశాల ప్రారంభమైన మొదటి 15 నిమిషాల్లో ఎంతమంది విద్యార్థులు ఇచ్చిన హోం వర్క్ చేశారో విశ్లేషించాలన్నారు. చిత్తూరు జిల్లాలోని మాపాక్షి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3, 4, 5వ తరగతి విద్యార్థులకు పర్యావరణ సబ్జెక్టును ఇంగ్లిష్ మీడియంలోనే బోధిస్తున్నారని..కానీ 6వ తరగతిలో తెలుగులో చెప్పడంతో గడిచిన తరగతుల్లో నేర్చుకున్న విషయాలు మరిచిపోతారనే విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. ఇలాంటి పాఠశాలల్లో బోధనా తీరును డీఈవోలు వెంటనే సరిదిద్దాలన్నారు.

మానసిక వ్యాధులను తొలిదశలోనే గుర్తించాలి

సీనియర్ మానసిక వైద్యుడు డాక్టర్ ఎస్వీ రమణారావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ ఎస్.వి.రమణారావు, వైద్యులు

గుంటూరు మెడికల్: వివిధ కారణాలతో సమాజంలో మానసిక వ్యాధులు విపరీతంగా పెరిగిపోతున్నాయని సీనియర్ మానసిక వైద్యుడు డాక్టర్ ఎస్వీ రమణారావు ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో ఇండియన్ సైకియాట్రీ సొసైటీ సౌత్ జోన్ శుక్రవారం నిర్వహించిన తొలిరోజు నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని (సీఎంఈ) డాక్టర్ రమణారావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఐపీఎస్ సౌత్ జోన్ అధ్యక్షుడు డాక్టర్ కే ఉదయ్‌కుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. నేటి సమాజంలో వచ్చిన శాస్త్ర, సాంకేతిక, జీవన మార్పులు యువత మానసిక స్థితిపై విపరీతమైన ప్రభావం చూపుతున్నాయని డాక్టర్ రమణారావు తెలిపారు. పాఠశాలలు, తల్లిదండ్రుల వైపు నుంచి వచ్చే ఒత్తిడి కారణంగా పిల్లల్లో సైతం మానసిక రుగ్మతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తొలిదశలోనే ఈ మానసిక రుగ్మతలను గుర్తిస్తే అడ్డుకట్ట వేయవచ్చునని తెలిపారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ సౌత్‌జోన్ అధ్యక్షుడు డాక్టర్ కే ఉదయ్‌కుమార్, సౌత్ జోన్ కాన్ఫరెన్స్ చైర్మన్ డాక్టర్ ఐవీఎల్ నరసింహారావు, సైకియాట్రిస్టులు డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ ఫణిభూషణ్, డాక్టర్ ఉమాజ్యోతి, డాక్టర్ శ్రీరమ్య, గుంటూరు, విజయవాడ జిల్లాల సైకియాట్రిస్టులు ప్రసంగించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి సైకియాట్రిస్టులు, సైకియాట్రిక్ పోస్ట్ గ్రాడ్యుయేట్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మార్గదర్శకంగా సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళిక

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సీబీఎస్ఈ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా ఉండేలా పాఠ్యప్రణాళికను తయారు చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ సూచించారు. శుక్రవారం సీబీఎస్ ఈ పాఠశాలల ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీం పాలసీస్, అజీమ్ ప్రేమ్‌జీ వర్సిటీ అధ్యాపకుల పర్యవేక్షణలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సీబీఎస్ఈ పాఠ్యప్రణాళికలు నిర్మాణాత్మకంగా, ప్రభావవంతంగా ఉండాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సీబీఎస్ఈ అమలు తీరుపై జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయ, ఏకలవ్య మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో చర్చించిన అనంతరం ఏపీ ప్రభుత్వ పాఠశాలలను కూడా సంపూర్ణంగా సీబీఎస్ఈకి అనుకూలంగా తీర్చిదిద్దుతామన్నారు. సీబీఎస్ఈ జేడీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యా ప్రపంచంలో సంచలనం 'విస్టా'

సాక్షి, హైదరాబాద్: విద్యారంగంలో దూసుకెళ్తున్న ఇన్ఫినిటీ లెర్న్ బై శ్రీచైతన్య విస్టా (వర్చువల్ ఇంటెలిజెంట్ సిస్టమ్ ఫర్ టైలర్డ్ అకడమిక్స్‌ను ప్రారంభించింది. విస్టా అనేది విద్యా ప్రపంచంలో ఒక సంచలనాత్మక సాంకేతిక కార్యక్రమమని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, అధ్యాపకులు, అభ్యాసకులు ఎదుర్కొంటున్న సవాళ్లను ఇది పరిష్కరిస్తుందని ఆమె పేర్కొన్నారు. మొబైల్, వెబ్ అప్లికేషన్ల ద్వారా విద్యార్థులు దీన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. 'నేను నా విద్యా ప్రయాణాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఉత్తమ అభ్యాస అనుభవాలను మెరుగుపరచడం, అందించడం లక్ష్యంగా పెట్టుకున్న. విస్టా ద్వారా ఎంతో మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారు. ఇన్ఫినిటీ లెర్న్ బై శ్రీచైతన్య రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది' అని వివరించారు.

హరిత హోటళ్ల అప్‌గ్రేడ్‌కు గ్రీన్‌సిగ్నల్

- పర్యాటకాభివృద్ధి సంస్థ పాలక మండలి నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో సమగ్ర మౌలిక వసతుల కల్పన, ప్రాధాన్యత క్రమంలో హరిత హోటళ్ల అప్‌గ్రేడ్‌కు పర్యాటకాభివృద్ధి సంస్థ పాలక మండలి శుక్రవారం ఆమోదం తెలిపింది. పర్యాటక శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ అధ్యక్షతన బోర్డు సమావేశం నిర్వహించారు. 2020–21, 2021–22, 2022–23 సంవత్సరాలకు గాను తాత్కాలిక ఆర్థికాంశాలతో పాటు పర్యాటక ఆస్తులను కార్పొరేట్ హోటళ్లకు దీటుగా మెరుగుపరిచేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏపీటీడీసీ ఎండీ కన్నబాబు, ఈడీ మల్‌రెడ్డి, బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

డబ్బుంటేనే పదవులు ఇస్తారా..?

- అన్నమయ్య జిల్లాలో ఏకపక్ష నిర్ణయాలతో కమిటీ
- బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ అంజనా చౌదరి ధ్వజం

మదనపల్లె: పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే అవమానాలే మిగిలాయని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) స్టేట్ కౌన్సిల్ మెంబర్ అంజనా చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం డబ్బున్న వారికే పదవులు లభిస్తాయని ఆరోపించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ పార్టీని నిర్వీర్యం చేసేందుకు కోవర్టుగా మారారని, ఆయన సామాజిక వర్గానికే జిల్లా కమిటీలో అధిక ప్రాధాన్యత ఇచ్చి, పదవులు కేటాయిస్తున్నారని అంజనా చౌదరి తీవ్రంగా విమర్శించారు. మోదీ పాలన మెచ్చి మహిళలు స్వచ్ఛందంగా పార్టీలోకి చేరుతుంటే, వారిని ఇబ్బందులకు గురిచేసేవారు పార్టీలో ఎక్కువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ఉదాహరణగా కర్నూలు ఘటనను పేర్కొన్నారు. ఓ మహిళా నాయకురాలు తనకు జరిగిన అవమానాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి చెబితే... ఇవన్నీ కామన్ అంటూ కొట్టిపడేశారన్నారు. గతంలో తనకు జరిగిన అవమానాలను అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు దృష్టికి తీసుకెళితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని, వారిని పదవుల నుంచి తొలగించి, క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారని అంజనా చౌదరి గుర్తు చేశారు. మహిళలకు జరుగుతున్న అన్యాయంపై ప్రస్తుత అధ్యక్షురాలు పురందేశ్వరికి ఫిర్యాదు చేస్తే ఏమాత్రం చర్యలు తీసుకోకపోగా, వేధింపులకు గురిచేసిన వారికే జిల్లా కమిటీలో పదవులు కట్టబెట్టారని వాపోయారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీలో ఇదే పరిస్థితి ఉందని, ఇలాగే కొనసాగితే ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర నాయకత్వం క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకుని, పార్టీ కోసం సర్వస్వం వదులుకుని 40 ఏళ్లకు పైగా కష్టపడుతున్న కార్యకర్తలను గుర్తించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే జిల్లా కమిటీలో, కార్యదర్శి పదవుల్లో నియమించిన వారిని తొలగించి నూతన కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి స్వప్న, పట్టణ మహిళా మోర్చా నాయకురాలు రమణమ్మ, ప్రధాన కార్యదర్శి మీనా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాకారం

వైద్య, ఆరోగ్య రంగాల్లో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు

- దేశంలో అత్యధిక ఆస్పత్రులు ఏపీలోనే
- బెడ్ల సంఖ్యలో రాష్ట్రం రెండో స్థానం
- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజల ఇళ్ల వద్దకే వైద్య సేవలు
- ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్
- 'నాడు–నేడు ఆంధ్రప్రదేశ్‌లో వైద్యం, ఆరోగ్యం'పై సదస్సులో పలువురు వైద్యులు, నిపుణులు



మాట్లాడుతున్న నవరత్న పథకాల వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి. చిత్రంలో వివిధ రంగాల ప్రముఖులు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): దేశంలో ఎక్కడా లేని పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్నాయని పలువురు వైద్యులు, వివిధ రంగాల నిపుణులు కొనియాడారు. ముఖ్యంగా వైద్య, ఆరోగ్య రంగాల్లో సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంస్కరణలతో ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దే వైద్యం అందుతోందని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశంలో ఎక్కడా లేదన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరుదైన ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్, బెటర్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరులో శుక్రవారం 'నాడు–నేడు ఆంధ్రప్రదేశ్‌లో వైద్యం, ఆరోగ్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వివిధ రంగాల నిపుణులు మాట్లాడారు. బెటర్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించిన సమావేశంలో ఎవరేమన్నారంటే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరుదైన ఆపరేషన్లు

రాష్ట్రంలో వైద్య సేవలను నీతి ఆయోగ్ సైతం ప్రశంసించడం అభినందించదగ్గ విషయం. వైద్య రంగంలో ఇతర రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నాయి. దేశంలోనే అత్యధిక ఆస్పత్రులతో ఏపీ అగ్రస్థానంలో ఉంది. అలాగే అత్యధిక బెడ్లు కలిగిన రాష్ట్రాల జాబితాలో రెండో స్థానంలో నిలవడం గర్వకారణం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరుదైన ఆపరేషన్లు జరుగుతున్నాయి. ఆరోగ్య రంగంలో ఏపీకి 8 జాతీయ అవార్డులు, రెండు అంతర్జాతీయ అవార్డులు రావడం హర్షించదగ్గ విషయం.

– వీవీఆర్ కృష్ణంరాజు, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్

కొత్త వైద్య కళాశాలలతో వైద్య రంగం బలోపేతం

గతంలో ఆస్పత్రుల్లో మందులు, వైద్యులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ప్రజల ఇళ్లకే వెళ్లి వైద్యులు పరీక్షలు నిర్వహించే స్థాయికి పరిస్థితి మారింది. కొత్త వైద్య కళాశాలలను ప్రారంభించి వైద్య రంగాన్ని ప్రభుత్వం మరింత బలోపేతం చేసింది.

– మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు, బెటర్ ఆంధ్రప్రదేశ్

నాడు నేడు కార్యక్రమం ద్వారా ఎన్నో సంస్కరణలు

నాడు–నేడు కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైద్య, విద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నారు. పేదవారికి సైతం ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఎవరు మంచి చేశారో వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలదే.

–బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, సాయి భాస్కర్ ఆస్పత్రుల అధినేత


నేడు, రేపు ఎస్ఐ పోస్టులకు మెయిన్ పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్ఐ పోస్టుల భర్తీకోసం మెయిన్ పరీక్షలను శని, ఆదివారాల్లో నిర్వహించేందుకు పోలీసు నియామక మండలి ఏర్పాట్లు చేసింది. అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల నిర్వహణపై న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఈ మెయిన్ పరీక్షల నిర్వహణపై ప్రభావం చూపదని పోలీసు నియామక మండలి తెలిపింది. ఈ మేరకు వెబ్‌సైట్‌లో కూడా ప్రకటించింది. న్యాయస్థానం తీర్పు నేపథ్యంలో ఇప్పటికే నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలపై నిర్ణయాన్ని తరువాత ప్రకటించనుంది. రాష్ట్రంలోని నాలుగు కేంద్రాల్లో.. విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలులో శని, ఆదివారాల్లో మెయిన్ పరీక్షలు నిర్వహించనుంది. ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లు, డిస్క్రిప్టివ్ విధానంలో రెండు పేపర్లు చొప్పున మొత్తం నాలుగు పేపర్లుగా ఈ పరీక్షలను నిర్వహిస్తోంది. మెయిన్ పరీక్షలకు మొత్తం 31,193 మంది అర్హత సాధించారు. వారిలో పురుషులు 27,590, మహిళలు 3,603. పరీక్షలకు సంబంధించి సందేహాలుంటే హెల్ప్‌లైన్ నంబర్లు 9441450639, 9100203323కు ఫోన్ చేయవచ్చని, ఈమెయిల్: mail-slprb@ap.gov.inలో సంప్రదించవచ్చని సూచించింది.

ఈ పరీక్షల వివరాలు..

- **అక్టోబరు 14:** పేపర్–1 (డిస్క్రిప్టివ్) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు
  పేపర్–2 (డిస్క్రిప్టివ్) మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు
- **అక్టోబరు 15:** పేపర్–3 (ఆబ్జెక్టివ్) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు
  పేపర్–4 (ఆబ్జెక్టివ్) మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు

నేడు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



తిరుమల: అక్టోబర్ 15–23వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు శనివారం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శ్రీవారి తరఫున సేనాధిపతి అయిన విష్వక్సేనులవారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. ఈ ఘట్టం తరువాత రంగనాయకుల మండపంలో ఆస్థానం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం, రాత్రి వాహన సేవలు జరుగుతాయి. బ్రహ్మోత్సవాల తొలిరోజు అక్టోబర్ 15న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు బంగారు తిరుచ్చి ఉత్సవం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు పెద్దశేష వాహనసేవ నిర్వహిస్తారు. మరోవైపు నవరాత్రి బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబైంది. తిరుపతి/తిరుమలలో ఎటు చూసినా నవరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్లను అతికించారు. వైభవం మండపం వద్ద టీటీడీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పూల మొక్కల నడుమ అనంతపద్మనాభ స్వామి నమూనా ఆలయం ఆకట్టుకుంటున్నాయి. రామాయణం గుర్తు చేసే విధంగా రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను దశరథుడు ఉయ్యాలలో ఊపే ఊహా చిత్రాన్ని సుందరంగా చిత్రీకరించారు. విద్యుత్ వెలుగులతో తిరుమలగిరి, ఆలయ మహా గోపురాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

శ్రీవారి సేవలో ప్రముఖులు

శ్రీవారిని శుక్రవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్, అపోలో చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

బాబూ.. ఇదేమి 'జైలు' రాజకీయం



1,111వ రోజు రిలే దీక్షలో బహుజన నేతల ధ్వజం

తాడికొండ: తన హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడి అరెస్టయిన టీడీపీ అధినేత చంద్రబాబు జైలు జీవితంపై దిక్కుమాలిన రాజకీయాలకు దిగడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 1,111వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ.. రూ.లక్షల కోట్లు దోచుకున్న దోపిడీ దొంగ బాబును జైల్లో పెడితే.. ఆయన ఆరోగ్యం దెబ్బతిందని కుటుంబసభ్యులు, పచ్చ నేతలు ఎల్లో మీడియాతో కలిసి గోబెల్స్ ప్రచారానికి దిగడం దేనికి సంకేతమో చెప్పాలని ప్రశ్నించారు. పేదల హక్కులను తుంగలో తొక్కిన చంద్రబాబు హైటెక్ అభివృద్ధి పేరుతో గ్రాఫిక్స్ మాయాజాలం చూపించి 29 గ్రామాల్లో ప్రజలను బకరాలను చేసి దుర్మార్గంగా వ్యవహరించినందునే ఉసురు తగిలి జైలు పాలయ్యాడని చెప్పారు. చంద్రబాబు చేసిన అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ చేసినపుడే నిజాలు బయటకు వస్తాయని, రూ. కోట్ల రూపాయలు వెచ్చించి లాయర్లను రంగంలోకి దించినా న్యాయం పేదల పక్షాన్నే నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థలో పెద్దలకో న్యాయం, పేదలకో న్యాయం ఉండదని కులవాదులు తెలుసుకొని మసలుకుంటే మంచిదన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకుంటున్న చర్యలు దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాయనేందుకు ఊళ్లకు ఊళ్లుగా నిర్మితమవుతున్న జగనన్న కాలనీలే నిదర్శనమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, పల్లె బాబు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

'స్కిల్' కేసులో కిలారి రాజేష్ పిటిషన్ మూసివేత

సాక్షి, అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడైన కిలారి రాజేష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి విచారణ జరిపారు. ఈ సందర్భంగా సీఐడీ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. స్కిల్ కుంభకోణంలో కిలారి రాజేష్‌ను ఇప్పటి వరకు నిందితుడిగా చేర్చలేదన్నారు. ఒకవేళ నిందితుడిగా చేరిస్తే.. అతనికి చట్ట ప్రకారం సెక్షన్ 41ఏ నోటీసు జారీ చేస్తామని నివేదించారు. ఈ వివరాలను నమోదు చేసిన హైకోర్టు.. రాజేష్ పిటిషన్‌లో తదుపరి ఎలాంటి విచారణ అవసరం లేదంటూ.. ఆ పిటిషన్‌ను మూసివేసింది. ఈ మేరకు జస్టిస్ సురేష్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు. అంతకు ముందు రాజేష్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో పిటిషనర్‌ను సాక్షిగా విచారించేందుకు సీఐడీ నోటీసులిచ్చిందన్నారు. విచారణ సందర్భంగా పిటిషనర్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, ఆ ఆందోళనతోనే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్టు చెప్పారు.

ఆన్‌లైన్‌లో పద్మావతి అమ్మవారి దర్శన టికెట్లు

చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో రూ.200 ప్రత్యేక దర్శన టికెట్లను భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో ఉంచినట్లు టీటీడీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్లాట్ల వారీగా గంటకు 200 టికెట్ల వరకు బుక్ చేసుకోవచ్చునని పేర్కొంది. ఈ టికెట్లు కలిగిన భక్తులను సుపథం ప్రవేశ మార్గంలో దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపింది. అలాగే వీరికి ఒక లడ్డూను ఉచితంగా అందజేస్తామని పేర్కొంది. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో దర్శన టికెట్లను బుక్ చేసుకోవచ్చునని తెలిపింది.

స్పెషల్ పీపీపై దాడికి యత్నం.. జీపీలు, ఏజీపీల నిరసన

బాధ్యులపై చర్యలకు డిమాండ్

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి సీఐడీ తరఫున వాదనలు వినిపిస్తున్న స్పెషల్ పీపీ యడవల్లి నాగవివేకానందపై చంద్రబాబు న్యాయవాదులు దాడికి ప్రయత్నించడంపై హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదులు శుక్రవారం నిరసనకు దిగారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రభుత్వ న్యాయవాదులు (జీపీలు), సహాయ ప్రభుత్వ న్యాయవాదులు (ఏజీపీలు) హైకోర్టు ప్రాంగణంలోని జాతీయజెండా వద్దకు చేరుకున్నారు. వివేకానందపై జరిగిన దాడియత్నాన్ని ఖండించారు. చంద్రబాబు న్యాయవాదుల తీరును ఖండిస్తున్నట్లు నినాదాలు చేశారు. స్పెషల్ పీపీపై దాడికి ప్రయత్నించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలంటూ నినదించారు. వారంతా వివేకానందకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు కూడా పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనంలో సామాన్యులకే ప్రాధాన్యం

- 15–23 వరకు ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రులు
- 10 లక్షల మందికిపైగా భక్తులు రానున్నట్లు అంచనా



సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అక్టోబర్ 15–23 వరకు జరిగే ఈ ఉత్సవాల్లో అమ్మవారు పలు అలంకారాల్లో దర్శనమివ్వనున్నారు. ఈ ఏడాది 10 లక్షల మందికిపైగా భక్తులు ఉత్సవాలకు హాజరుకానున్నట్లు అధికారుల అంచనా. దసరా ఉత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సంతృప్తికర దర్శనం కల్పించే విధంగా ఏర్పాట్లు చేశారు. మూలానక్షత్రం రోజున సీఎం జగన్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఇప్పటికే ఉత్సవాల నిర్వహణలో పాల్గొనే దేవదాయ, రెవెన్యూ, పోలీసు, జలవనరులు, అగ్నిమాపక, మత్స్య, రోడ్లు భవనాలు, సమాచార శాఖల అధికారులతో దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, హోంమంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాశ్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్షించారు. మొత్తం 5 క్యూలైన్‌ల ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. వీఐపీలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. దర్శనానంతరం భక్తులు శివాలయం మెట్ల మార్గం ద్వారా కిందకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. క్యూలైన్‌లో భక్తులకు వాటర్ ప్యాకెట్లతో పాటు, చిన్న పిల్లలకు పాలు, బిస్కెట్లు ఇవ్వనున్నారు. భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

అక్కచెల్లెమ్మలందరికి పక్కా గృహాల ఏర్పాటే సీఎం జగన్ లక్ష్యం

- చంద్రబాబు ఒక్క ఇల్లయినా నిర్మించారా?
- పుంగనూరులో జగనన్న ఇళ్లను ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి



పుంగనూరు జగనన్న కాలనీలో ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, కలెక్టర్ షణ్మోహన్, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పుంగనూరు(చిత్తూరు జిల్లా): రాష్ట్ర చరిత్రలో ఎన్నడులేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరికీ 30.75 లక్షల ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, పక్కా గృహాలు నిర్మించి, గృహ ప్రవేశాలు చేయించడమే ఆయన లక్ష్యమని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి శుక్రవారం పుంగనూరులోని గూడూరుపల్లె వద్ద నిర్మించిన 1,536 ఇళ్లను మంత్రి ప్రారంభించారు. అలాగే జగనన్న కాలనీలో పలు ప్రారంభోత్సవాలు చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో 73,584 గృహాలు మంజూరు కాగా అందులో 43 వేల గృహాలు పూర్తయ్యాయని తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో 16 వేల మందికి పట్టాలు మంజూరు చేసి, గృహ నిర్మాణాలు చేపట్టామన్నారు. పుంగనూరులో టిడ్కో గృహాల్లో సుమారు రూ.10 లక్షలు విలువ చేసే స్థలంలో రూ.6 లక్షలు ఖర్చు చేసి అత్యంత సుందరంగా మౌలిక వసతులు ఏర్పాటు చేసి గృహ ప్రవేశాలు చేపట్టినట్టు చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు ఏనాడైనా భూములు కొనుగోలు చేసి ఒక్క ఇల్లు నిర్మించారా? అని మంత్రి ప్రశ్నించారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కోరుతూ రాష్ట్రం దశాదిశ మార్చుతున్న సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు ఆశీర్వదించాలన్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, టీటీడీ బోర్డు మాజీ మెంబరు పోకల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు నేస్తం పురస్కారాల ప్రదానం

సాక్షి, అమరావతి: రైతు నేస్తం 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వారికి ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఐవీ సుబ్బారావు పేరిట రైతు నేస్తం పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు రైతు నేస్తం వ్యవస్థాపక చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. రైతు నేస్తం, ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగే ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి జీవిత సాఫల్య పురస్కారం తెలంగాణ రాష్ట్రం జహీరాబాద్ సమీపంలోని బస్వాపూర్‌కు చెందిన డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్)కి ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే మధ్యప్రదేశ్ రాష్ట్రం సాగర్‌కు చెందిన బహుళ అంచెల సాగు నిపుణుడు ఆకాష్ చౌరాసియాను కృషి రత్న బిరుదుతో సత్కరించనున్నట్లు చెప్పారు.

15మంది 'ఎర్ర' స్మగ్లర్లు అరెస్ట్

- 40 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి మంగళం: శేషాచల అడవుల్లో నుంచి అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న 15మంది ఎర్ర స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి నుంచి 40 దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు వివరాలు వెల్లడించారు. రేణిగుంట ఆంజనేయపురం చెక్ పోస్టు, బాకరాపేట, రైల్వే కోడూరు పరిధిల్లోని మూడు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ బలగాలతో గురువారం రాత్రి విస్తృతంగా కూంబింగ్ చేపట్టారు. తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 40 ఎర్రచందనం దుంగలు, ఒక బొలెరో లగేజీ వాహనం, రెండు కార్లు, రెండు మోటారు సైకిళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 15మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. రంగంపేట నాగపట్ల సెక్షన్ భాకరాపేట రేంజిలో కల్యాణి డ్యామ్ వద్ద ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి 23 ఎర్రచందనం దుంగలు, రెండు ద్విచక్రవాహనాలు, బొలెరో లగేజీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే రేణిగుంట సమీపంలోని మామండూరు సెక్షన్ ఆంజనేయపురం చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని 5 ఎర్రచందనం దుంగలను, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు పరిధిలో కేవీ బావి పల్లి దగ్గర ఒకరిని అరెస్టు చేసి 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహనాలతో కలిపి ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.కోటి ఉండవచ్చునని అంచనా వేశారు.

వృద్ధురాలి ప్రాణం నిలిపిన 'ఆరోగ్య సురక్ష'



సదుం (చిత్తూరు జిల్లా): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చిన ఓ వృద్ధురాలు ఉన్నపళాన తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలింది. ప్రథమ చికిత్స చేసిన అక్కడి వైద్యులు హుటాహుటిన 108లో సీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయడంతో ఆమె కోలుకుంది. వివరాల్లోకి వెళితే... చిత్తూరు జిల్లా సదుం మండలంలోని బందార్లవారిపల్లెకు చెందిన రాజమ్మ(72) శుక్రవారం పాట్టెంవారిపల్లెలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరైంది. కొంతసేపటికే ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో వెంటనే ఆమెను వైద్యులు పరీక్షించారు. షుగర్ లెవల్ 624గా ఉన్నట్టు నిర్ధారణ కావడంతో ప్రథమ చికిత్స చేసి, సదుం సీహెచ్‌సీకి హుటాహుటిన 108 అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు 20 యూనిట్ల ఇన్సులిన్ ఇంజెక్షన్లు వేసి, సెలైన్ పెట్టారు. సాయంత్రం వరకు పర్యవేక్షించారు. చికిత్సతో షుగర్ లెవల్ 380కి చేరుకుంది. చికిత్స పొందడం ఆలస్యమై ఉంటే రాజమ్మ కోమాలోకి వెళ్లేదని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని మెడికల్ ఆఫీసర్ పుష్పకుమారి తెలిపారు. శనివారం కూడా ఆమెకు వైద్య పరీక్షలు చేస్తామని చెప్పారు. మధుమేహ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలని, ఆహార నియమాలు పాటించాలని, లేనిపక్షంలో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు.


శుక్రవారం వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ బలగాలతో తలపడుతున్న పాలస్తీనియన్లు


శుక్రవారం పాలస్తీనాకు మద్దతుగా ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో భారీ ర్యాలీ

ఉత్తర గాజాను ఖాళీ చేయండి

పాలస్తీనియన్లకు ఇజ్రాయెల్ సైన్యం ఆదేశాలు

- ఉత్తర గాజాలోని హమాస్ స్థావరాలపై భూతల దాడులకు సన్నాహాలు
- అడుగడుగూ జల్లెడ పడుతూ మిలిటెంట్ల ఏరివేతకు ఏర్పాట్లు
- జనాన్ని తరలించడం మానవ విపత్తు అవుతుందని ఐరాస ఆందోళన
- ఇజ్రాయెల్ 'మానసిక యుద్ధాన్ని' పట్టించుకోవద్దని హమాస్ పిలుపు
- ఇజ్రాయెల్–హమాస్ రణంలో 2,800కు చేరిన మృతుల సంఖ్య
- బందీల్లో 13 మంది ఇజ్రాయెల్ దాడుల్లో చనిపోయారని హమాస్ వెల్లడి

జెరూసలేం: హమాస్ మిలిటెంట్లకు కంచుకోట అయిన గాజాపై పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ సైన్యం సన్నాహాలు చేస్తోంది. ఉత్తర గాజాను తక్షణమే ఖాళీ చేయాలని, దక్షిణ ప్రాంతానికి తరలి వెళ్లాలని శుక్రవారం అసాధారణ ఆదేశాలు జారీ చేసింది. ప్రజల రక్షణ కోసమే ఈ ఆదేశాలిచ్చామని తెలియజేసింది. ఉత్తర గాజాలో 10 లక్షల మంది నివాసం ఉంటున్నారు. ఇజ్రాయెల్ ఆదేశాల మేరకు జనం దక్షిణ గాజాకు పయనమవుతున్నారు. గాజా మొత్తం జనాభా 20 లక్షలు. అంటే దాదాపు సగం మంది ఇళ్లు విడిచివెళ్లిపోవాల్సి ఉంటుంది. ఇప్పటికే జనంతో కిక్కిరిసిపోయిన దక్షిణ గాజాపై మరింత ఒత్తిడి పెరగనుంది. గత ఏడు రోజులుగా గాజాలోని హమాస్ స్థావరాలపై వైమానిక దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ సేనలు భూభాగ దాడులకు సన్నద్ధమవుతున్నాయి. పదాతి దళాలు ఆయుధాలు చేబూని అడుగు ముందుకు వేయబోతున్నాయి. హమాస్‌పై భూతల దాడుల కోసం 3 లక్షలకు పైగా రిజర్వ్ సైనికులు సిద్ధంగా ఉన్నారని ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. గాజా వీధుల్లో మిలిటెంట్ల వేటకు ఏర్పాట్లు పూర్తయ్యాయని అనధికారికంగా చెబుతున్నారు. అడుగడుగూ జల్లెడ పడుతూ మిలిటెంట్లను సజీవంగా బంధించడమో లేక అంతం చేయడమో జరుగుతుందని అంటున్నారు. ఉత్తర గాజా ఇప్పుడు 'యుద్ధభూమి' కాబట్టి, అక్కడ ప్రజలెవరూ ఉండొద్దని సూచించారు.

యుద్ధం ముగిశాక తిరిగి రావొచ్చు

ఉత్తర గాజాపై హమాస్‌కు గట్టి పట్టుంది. అగ్ర నాయకులంతా అక్కడే మకాం వేశారు. అందుకే తొలి టార్గెట్‌గా అదే ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. సాధారణ ప్రజలను దక్షిణ గాజాకు పంపించి, ఉత్తర గాజాలో మిలిటెంట్ల ఏరివేత ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టనున్నారు. హమాస్ స్థావరాలను, సైనిక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే లక్ష్యమని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. సామాన్య ప్రజలకు నష్టం కలిగించే ఉద్దేశం లేదని, యుద్ధం ముగిసిన తర్వాత వారంతా తిరిగి రావొచ్చని సూచించింది. హమాస్ మిలిటెంట్లు జనావాస ప్రాంతాల్లో మకాం వేసి, కార్యకలాపాలు సాగిస్తున్నారు. సాధారణ ప్రజలను కవచంగా వాడుకుంటూ ఇజ్రాయెల్‌పై రాకెట్లు ప్రయోగిస్తున్నారు. ప్రజలను అక్కడి తరలిస్తే మిలిటెంట్ల ముసుగు తొలగిపోతుందని ఇజ్రాయెల్ చెబుతోంది. ఉత్తర గాజాలో లక్షల మంది పాలస్తీనియన్లను నివాసం ఉంటున్నారు. కీలకమైన గాజా సిటీ ఇక్కడే ఉంది. వెంటనే వెళ్లిపోవాలంటూ ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించడంతో పాలస్తీనియన్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆహారం, నీరు, విద్యుత్ వంటి సదుపాయాల గురించి మర్చిపోయామని, ప్రాణాలు కాపాడుకుంటే చాలని భావిస్తున్నామని పాలస్తీనా రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధి నెబాల్ ఫర్సాఖ్ వ్యాఖ్యానించారు.

ఖాళీ చేయించే ఆలోచన మానుకోండి: ఐరాస

ఉత్తర గాజాను ఖాళీ చేయాలంటూ ఇజ్రాయెల్ సైన్యం జారీ చేసిన ఉత్తర్వులపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. లక్షలాది మందిని బలవంతంగా తరలించడం మానవ విపత్తు అవుతుందని పేర్కొంది. సామూహికంగా జనమంతా ఒకేసారి తరలివెళ్లడం సంక్షోభానికి దారితీస్తుందని స్పష్టం చేసింది. జనాన్ని ఖాళీ చేయించే ఆలోచన మానుకోవాలని ఐక్యరాజ్యసమితి ప్రతినిధి స్టెఫానీ డుజారిక్ ఇజ్రాయెల్‌కు సూచించారు. మరోవైపు హమాస్ సైతం స్పందించింది. ఉత్తర గాజా నుంచి జనాన్ని తరలించడం వెనుక కుట్రదాగి ఉందని ఆరోపించింది. ప్రజలెవరూ ఎక్కడికీ వెళ్లొద్దని, ఇళ్లల్లోనే ఉండాలని విజ్ఞప్తి చేసింది. ఇజ్రాయెల్ సాగిస్తున్న 'మానసిక యుద్ధాన్ని' పట్టించుకోవద్దని సూచించింది. వేలాది మంది క్షతగాత్రులు ఇప్పటికే ఆసుపత్రుల్లో ఉన్నారని, వారిని తరలించడం సాధ్యం కాదని గాజా ఆరోగ్య శాఖ తేల్చిచెప్పింది. ఉత్తర గాజాలో పాఠశాల్లో ఏర్పాటు చేసిన ఐక్యరాజ్యసమితి శిబిరాల్లో లక్ష మందికిపైగా ఆశ్రయం పొందుతున్నారు. వారిని దక్షిణ గాజాకు తరలించలేమని ఐక్యరాజ్యసమితి స్పష్టం చేసింది.


గాజా స్ట్రిప్ సరిహద్దుల దిశగా వెళ్తున్న ఇజ్రాయెల్ ట్యాంకులు

మధ్యప్రాచ్యంలో నిరసనలు

గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఖండిస్తూ మధ్యప్రాచ్యంలో ముస్లింలు శుక్రవారం ప్రార్థనల అనంతరం నిరసన ప్రదర్శనలు చేపట్టారు. జోర్డాన్, యెమెన్‌లో ప్రదర్శనలు జరిగాయి. జెరూసలేం ఓల్డ్ సిటీలోనూ నిరసనలు వెల్లువెత్తాయి. జెరూసలేంలోని అల్–అక్సా మసీదులో ప్రార్థనలు చేసుకునేందుకు 50 ఏళ్ల వయసు దాటినవారిని మాత్రమే ఇజ్రాయెల్ పోలీసులు అనుమతించారు. మసీదు బయట పెద్ద సంఖ్యలో గుమికూడిన పాలస్తీనియన్లపైకి భద్రతా బలగాలు టియర్ గ్యాస్ ప్రయోగించాయి. లాఠీచార్జి జరిపాయి. ఈ ఘటనలో కనీసం ఆరుగురు గాయపడ్డారు. లెబనాన్ రాజధాని బీరూట్‌లో హెజ్బొల్లా మద్దతుదారులు ర్యాలీ చేపట్టారు. ఇజ్రాయెల్ నశించాలంటూ నినాదాలు చేశారు. ఇరాన్ మద్దతున్న హెజ్బొల్లా మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై హమాస్‌తోపాటు దాడులు జరిపారు. మధ్యధరా సముద్ర జలాల్లోని అమెరికా, బ్రిటిష్ యుద్ధ నౌకలపై కన్నేసి ఉంచుతామని హెజ్బొల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ నయీమ్ కాశీం హెచ్చరించారు. తాము పూర్తి సన్నద్ధతతో ఉన్నామని, సరైన సమయంలో రంగంలోకి దిగుతామని తెలిపారు. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోనూ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఇరాన్, పాకిస్తాన్‌లో హమాస్‌కు మద్దతుగా జనం ర్యాలీలు నిర్వహించారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 13 మంది బందీలు మృతి!

ఇజ్రాయెల్–హమాస్ మధ్య శుక్రవారం కూడా పరస్పరం దాడులు జరిగాయి. ఏడు రోజులుగా కొనసాగుతున్న ఈ యుద్ధంలో మృతుల సంఖ్య చేరుకుంది. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,300 మందికిపైగా చనిపోయారు. వీరిలో 247 మంది సైనికులు ఉన్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 1,530 మంది ప్రాణాలు కోల్పోయారు. హమాస్ చేతిలో బందీలుగా ఉన్న 150 మంది పరిస్థితి ఏమిటన్నది తెలియరావడం లేదు. గత 24 గంటల్లో ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో బందీల్లో 13 మంది మృతిచెందారని హమాస్ శుక్రవారం ప్రకటించింది. మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నారని స్పష్టంచేసింది. అయితే, వారు ఏ దేశానికి చెందినవారన్న సంగతి బయటపెట్టలేదు. వైమానిక దాడుల్లో 13 మంది బందీలు చనిపోయారంటూ హమాస్ చేసిన ప్రకటనను ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి డేనియల్ హగారీ ఖండించారు. తమకు స్పష్టమైన సమాచారం ఉందని, ఎవరూ మృతి చెందలేదని అన్నారు.

ఇజ్రాయెల్‌కు అమెరికా రక్షణ మంత్రి


అమెరికా రక్షణ శాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ శుక్రవారం ఇజ్రాయెల్ చేరుకున్నారు. ఇజ్రాయెల్‌కు అండగా నిలుస్తామని అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్‌లో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ పర్యటించిన మరుసటి రోజే లాయిన్ ఆస్టిన్ సైతం రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆస్టిన్ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో సమావేశమయ్యారు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గల్లాంట్‌తోనూ భేటీ అయ్యారు. హమాస్‌పై యుద్ధానికి అమెరికా అందించనున్న సైనిక సాయంపై ఆయన చర్చించినట్లు సమాచారం.

అమేయ సైనిక శక్తి

అతి శక్తిమంతమైన సైన్యం ఇజ్రాయెల్ సొంతం | **అమెరికా నుంచి ఏటా 3 బిలియన్ డాలర్ల సైనిక సాయం**

అతి శక్తిమంతమైన ఆయుధాలు. అంతకు మించిన నిఘా సంపత్తి. అవడానికి చిన్న దేశమే అయినా సైనిక సంపత్తిలో మాత్రం ఇజ్రాయెల్ అక్షరాలా అమేయ శక్తే. హమాస్ పని పట్టేందుకు గాజా స్ట్రిప్ వద్దే ప్రస్తుతం ఏకంగా 3 లక్షల మంది సైనికులను మోహరించింది! గాజాపై భూతల దాడికి ఇజ్రాయెల్ సన్నద్ధమవుతోందనేందుకు ఇది కచ్చితమైన సంకేతమేనని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రధానంగా అమెరికా నుంచి అన్నివిధాలా అందుతున్న సాయంతో ఇజ్రాయెల్ సైనికంగా తేరిపార చూడలేనంతగా బలోపేతమైంది. మధ్యప్రాచ్యంలో తన వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఆ దేశం పూర్తిగా సహకరిస్తుందని అమెరికా భావించడమే ఇందుకు కారణం...

సైనిక శక్తియుక్తులను ఎప్పటికప్పుడు పెంచుకునేందుకు, నిరంతరం అప్రమత్తంగా ఉండేందుకు ఇజ్రాయెల్ అత్యంత ప్రాధాన్యమిస్తుంది. ఆ దేశంలో 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ విధిగా సైన్యంలో చేరాల్సిందే. పురుషులు కనీసం 32 నెలల పాటు, మహిళలు రెండేళ్ల పాటు సైన్యంలో పని చేయాలి. ఇవిగాక అణు సామర్థ్యం కూడా ఇజ్రాయెల్ సొంతమని చెబుతారు. అణు వార్ హెడ్లను మోసుకెళ్లగల జెరిషో మిసైళ్లు, విమానాలు ఆ దేశం వద్ద ఉన్నాయి.



అతి పెద్ద ఆయుధ ఎగుమతిదారు

తొలినాళ్లలో సైనిక అవసరాలకు ప్రధానంగా దిగుమతుల మీదే ఆధారపడ్డ ఇజ్రాయెల్, చూస్తుండగానే సంపన్న దేశాలకు కూడా అత్యాధునిక ఆయుధాలు, ఆయుధ, నిఘా వ్యవస్థలు తదితరాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది!

- 2018–22 మధ్య కనీసం 35 దేశాలు ఇజ్రాయెల్ నుంచి 320 కోట్ల డాలర్ల పై చిలుకు విలువైన ఆయుధాలను దిగుమతి చేసుకున్నాయి.
- వీటిలో ఏకంగా మూడో వంతు, అంటే 120 కోట్ల డాలర్ల మేరకు ఆయుధాలను భారతే దిగుమతి చేసుకుంది.
- ఆ ఐదేళ్ల కాలంలో ఇజ్రాయెల్ ఆయుధ దిగుమతులు 270 కోట్ల డాలర్లకు చేరాయి. ఇవన్నీ కేవలం అమెరికా, జర్మనీ నుంచే కావడం విశేషం! అందులోనూ 210 కోట్ల డాలర్ల దిగుమతులు ఒక్క అమెరికా నుంచే జరిగాయి!

ఇంజనీరింగ్ అద్భుతం.. ఐరన్‌డోమ్

ఐరన్ డోమ్. ఇజ్రాయెల్ ఏళ్ల తరబడి శ్రమించి రూపొందించిన మొబైల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ. స్వల్పశ్రేణి రాకెట్లను రాడార్ టెక్నాలజీ సాయంతో అడ్డగించి తుత్తునియలు చేయగల సామర్థ్యం దీని సొంతం...

- హెజ్బొల్లా తొలిసారి ఇజ్రాయెల్‌పై ఏకకాలంలో వేలకొద్దీ రాకెట్లతో దాడి చేసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని 2006లో ఐరన్ డోమ్ నిర్మాణానికి ఆ దేశం తెర తీసింది.
- ఇది 2011లో వాడకంలోకి వచ్చింది.
- 2021 మొత్తంలో హమాస్, ఇతర పాలస్తీనా మిలిటెంట్ గ్రూపులు ప్రయోగించిన రాకెట్లలో 90 శాతానికి పైగా ఐరన్‌డోమ్ నిర్వీర్యం చేసి సత్తా చాటింది.
- డోమ్ నిర్మాణానికి అమెరికా ఎంతగానో సాయం చేసింది.
- 1946–2023 మధ్య ఏకంగా 12,400 కోట్ల డాలర్ల విలువైన సైనిక, రక్షణపరమైన సాయాన్ని అమెరికా నుంచి ఇజ్రాయెల్ అందుకుంది!!
- అమెరికా తన 2022 బడ్జెట్‌లో కేవలం ఇజ్రాయెల్‌కు మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ నిమిత్తమే ఏకంగా 150 కోట్ల డాలర్లు కేటాయించింది! – పదేళ్లలో ఇజ్రాయెల్‌కు ఏకంగా 3,800 కోట్ల డాలర్ల మేరకు సైనికపరంగా నిధులు అందించేందుకు 2016లో అమెరికా ఒప్పందం కుదుర్చుకుంది!
- పదేళ్లలో ఇజ్రాయెల్‌కు ఏకంగా 3,800 కోట్ల డాలర్ల మేరకు సైనికపరంగా నిధులు అందించేందుకు 2016లో అమెరికా ఒప్పందం కుదుర్చుకుంది!

రక్షణపై భారీ వ్యయం

చుట్టూ శత్రు సమూహమే ఉన్న నేపథ్యంలో రక్షణపై ఇజ్రాయెల్ భారీగా ఖర్చు చేస్తుంది. 2022లో సైనిక అవసరాలకు ఏకంగా 2,340 కోట్ల డాలర్లు వెచ్చించింది.

- దేశ జనాభాపరంగా చూసుకుంటే ఇజ్రాయెల్ తలసరి సైనిక వ్యయం ఏకంగా 2,535 డాలర్లు. ఖతర్ తర్వాత ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది!

– సాక్షి, నేషనల్ డెస్క్

212 మంది భారతీయుల తరలింపు

ఇజ్రాయెల్ నుంచి ఢిల్లీ చేరుకున్న మొదటి విమానం

న్యూఢిల్లీ: హమాస్ మిలిటెంట్ల దాడులతో రణరంగంగా మారిన ఇజ్రాయెల్ నుంచి భారతీయుల తరలింపు కొనసాగుతోంది. దాదాపు 212 మందితో టెల్ అవివ్ నుంచి బయలుదేరిన మొదటి విమానం శుక్రవారం ఢిల్లీకి చేరుకుంది. వీరిలో చాలామంది విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నారు. విమానంలో వచ్చిన భారతీయులకు ఎయిర్‌పోర్టులో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వారికి స్వాగతం పలికారు. కరచాలనం చేశారు. ఇజ్రాయెల్‌లో తమకు ఎదురైన భయానక అనుభవాలను భారతీయులు పంచుకున్నారు. సైరన్ల మోతతో నిద్రలేచేవాళ్లమని, ఎప్పుడేం జరుగుతుందో తెలియక ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ గడిపామని, షెల్టర్లలో తలదాచుకున్నామని శశ్వంత్ సింగ్ అనే వ్యక్తి చెప్పాడు. ఆయన తన భార్యతో కలిసి ఢిల్లీకి చేరుకున్నాడు. తమను క్షేమంగా స్వదేశానికి చేర్చిన భారత ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేశాడు. ఇజ్రాయెల్ నుంచి భారతీయులను వెనక్కి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ అజయ్' ప్రారంభించింది.


ఆపరేషన్ అజయ్‌లో భాగంగా ఇజ్రాయెల్ నుంచి ఢిల్లీకి చేరుకున్న భారతీయులు

ఇజ్రాయెల్‌లో ప్రస్తుతం 18,000 మంది భారతీయులు ఉన్నట్లు అంచనా. వెస్ట్‌బ్యాంకు, గాజాలోనూ కొందరు భారతీయులు నివసిస్తున్నారు. 'ఆపరేషన్ అజయ్'లో భాగంగా రెండో విమానం శుక్రవారం సాయంత్రం టెల్ అవివ్ నుంచి బయలుదేరింది. శనివారం భారత్‌కు చేరుకోనుంది.

కల్లోలాలు మంచివి కావు

- ఉగ్రవాదమూ అంతే: మోదీ
- ఎవరికీ మేలు చేయవని వ్యాఖ్య
- జీ 20 పార్లమెంటరీ స్పీకర్ల సదస్సులో ప్రసంగం



న్యూఢిల్లీ: ఘర్షణలు, కల్లోలాలు ఏ పక్షానికీ మంచి చేయబోవని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యలకు విచ్ఛిన్న ప్రపంచం పరిష్కారాలు చూపజాలదన్నారు. ఇది శాంతి, సౌభ్రాతృత్వాలు నెలకొనాల్సిన సమయమని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య పోరు నానాటికీ తీవ్రతరమవుతున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. శుక్రవారం ఇక్కడ మొదలైన జీ20 పార్లమెంటరీ స్పీకర్ల 9వ సదస్సు ప్రారంభ సెషన్‌ను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ''ప్రపంచంలో పలు చోట్ల ప్రస్తుతం ఏం జరుగుతోందో మనందరికీ తెలుసు. కలసికట్టుగా ముందుకు సాగాల్సిన సమయమిది'' అని పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్, హమాస్ పోరుకు తక్షణం తెరపడాల్సిన అవసరం చాలా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పరస్పర విశ్వాసంతో మానవ విలువలకు పెద్ద పీట వేయడమే ఇందుకు మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదమే మార్గం

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఉగ్రవాద భూతంపై అంతర్జాతీయ సమాజం ఉక్కుపాదం మోపడమే ఏకైక మార్గమని మోదీ అభిప్రాయపడ్డారు. ''భారత్ దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటోంది. మా దేశంలో వేలాదిగా అమాయకులను బలి తీసుకుంది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సరే మానవత్వానికి మాయని మచ్చ' అని పునరుద్ఘాటించారు. ఇంత జరిగినా ఉగ్రవాదాన్ని నిర్వచించే అంశం మీద కూడా ఇప్పటికీ అంతర్జాతీయ సమాజం ఏకాభిప్రాయానికి రాలేకపోవడం శోచనీయమన్నారు.

మహిళా భాగస్వామ్యానికి ప్రోత్సాహం

భారత్‌లో ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యానికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు మోదీ తెలిపారు. స్థానిక స్వపరిపాలన సంస్థల్లో సగం మేరకు వాళ్లే ఉన్నట్టు పార్లమెంటుల స్పీకర్లకు వివరించారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ ఇటీవలే పార్లమెంటులో చట్టం కూడా చేసినట్టు చెప్పారు. 'నేడు భారత్ ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యంతో కళకళలాడుతోంది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో మహిళల చురుకైన పాత్ర దేశ ప్రగతికి చాలా కీలకం' అని అన్నారు. భారత్‌లో 28 భాషల్లో ఏకంగా 900కు పైగా టీవీ చానళ్లు, దాదాపు 200 భాషల్లో 33 వేలకు పైగా వార్తా పత్రికలు ఉన్నాయని వారికి వివరించారు. ప్రపంచమంతటా దేశాల నాయకత్వ స్థానంలో మహిళలు ఎక్కువగా ఉంటే బహుశా ఇన్ని యుద్ధాలు జరిగేవి కావని ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ ప్రెసిడెంట్ దుతర్తే పచెకో అభిప్రాయపడ్డారు.

మా ఆదేశాలే అపహాస్యమా?

- మహారాష్ట్ర స్పీకర్‌పై సుప్రీం ఆగ్రహం
- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై నిర్ణయం ఇంకెప్పుడు?
- అసెంబ్లీ ఎన్నికల దాకా కాలయాపన చేయదలచారా?
- తీవ్రస్థాయిలో మండిపడ్డ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్, వారి వర్గం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో అసెంబ్లీ స్పీకర్ చేస్తున్న జాప్యంపై సుప్రీంకోర్టు మండిపడింది. దీనిపై నిర్ణయాన్ని ఆయన నిరవధికంగా వాయిదా వేస్తూ పోజాలరని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. ''స్పీకర్ కాస్త విచక్షణతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటారని మేం భావించాం. నిర్దిష్ట కాలావధిలోగా ఈ అంశాన్ని పరిష్కరించాల్సిందిగా గత విచారణ సమయంలోనే ఆయనకు మేం స్పష్టంగా నిర్దేశించాం. ఇందుకు కాలావధి కూడా పెట్టుకోవాల్సిందిగా సూచించాం. ఆయన దీన్ని సీరియస్‌గా తీసుకుంటున్నట్టు కన్పించాలి. కానీ ఈ అంశంపై అసలు విచారణే జరపడం లేదు'' అంటూ స్పీకర్ రాహుల్ నర్వేకర్‌కు తలంటిపోశారు. ''గత జూన్ నుంచీ ఈ విషయం అంగుళం కూడా ముందుకు కదలడం లేదు. మేమంతా గమనిస్తూనే ఉన్నాం. అసలు స్పీకర్ ఏమనుకుంటున్నారు? మా ఆదేశాలనే అపహాస్యం చేస్తారా? ఇదేమైనా ఆషామాషీ విషయమని అనుకుంటున్నారా?'' అంటూ ఆగ్రహించారు. ''ఈ విషయంలో స్పీకర్‌కు కచ్చితంగా 'సలహా' అవసరం. వెంటనే ఎవరైనా ఆ పని చేయడం మేలు'' అని స్పీకర్ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సీజేఐ సూచించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోపు అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోకపోతే ఈ మొత్తం ప్రక్రియకు అర్థమే లేకుండా పోతుందన్నారు. ఈ అంశాన్ని ఎప్పట్లోగా తేలుస్తారో స్పష్టంగా పేర్కొంటూ మంగళవారం నాటికి తమకు టైమ్‌లైన్‌ను సమర్పించాలని ఆదేశించారు. లేదంటే ఈ విషయమై తామే నేరుగా ఆదేశాలిస్తామని స్పష్టం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీకి మరో ఏడాదిలో ఎన్నికలు జరగనున్నాయి.

స్పీకర్‌ను బాధ్యున్ని చేయాల్సి వస్తుంది!

మహారాష్ట్రలో పలువురు ఎమ్మెల్యేల శాసనసభ్యత్వాలు రద్దు చేయాలంటూ శివసేన (ఉద్ధవ్ వర్గం) నేత ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ దాఖలు చేసిన పిటిషన్లపై ధర్మాసనం ముందు శుక్రవారం విచారణ కొనసాగింది. ఠాక్రే వర్గం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు కొనసాగించారు. దీనిపై జూలై 14న స్పీకర్‌కు ధర్మాసనం నోటీసులు జారీ చేసినా ఇప్పటికీ ఏమీ జరగలేదని సీజేఐ దృష్టికి తెచ్చారు. దాంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎదుటి పక్షం వారి వాదనలను పరిగణనలోకి తీసుకోవడం, ఇందులో పలు అంశాలను స్పీకర్ ముందుగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్న సొలిసిటర్ జనరల్ మెహతా వివరణతో సంతృప్తి చెందలేదు. ''ఈ విషయమై మేం జూలై 14న స్పష్టమైన సూచనలు జారీ చేశాం. సెప్టెంబర్ 18న ఆదేశాలు కూడా వెలువరించాం. అయినా స్పీకర్ చేసిందేమీ లేదు. కనుక రెండు నెలల్లోగా దీనిపై ఆయన నిర్ణయం తీసుకోవాలని మేం ఆదేశించక తప్పడం లేదు'' అన్నారు. ''స్పీకర్ పదవికున్న హుందాతనం దృష్ట్యా తొలుత మేం టైంలైన్ విధించలేదు. కానీ ఆయన తన బాధ్యతలను నెరవేర్చకపోతే అందుకు బాధ్యున్ని చేయక తప్పదు'' అని అన్నారు.

ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కార్డులు

నాన్–ఇమిగ్రేషన్ కేటగిరీల్లో పంపిణీ: అమెరికా

వాషింగ్టన్: అమెరికాలో నివసిస్తున్న విదేశీయులకు యూఎస్ సిటిజెన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) తీపి కబురు అందించింది. గ్రీన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నవారితోపాటు కొన్ని నాన్–ఇమిగ్రేషన్ కేటగిరీల్లో ఉన్నవారికి ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కార్డులు(ఈఏడీ) అందజేయనున్నట్లు ప్రకటించింది. ఈ కార్డులు ఐదేళ్లపాటు చెల్లుబాటు అవుతాయని వెల్లడించింది. ఈఏడీలతో అమెరికాలో వేలాది మంది భారతీయులకు లబ్ధి చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ కార్డులతో వారికి అక్కడ ఉద్యోగాలు చేసుకోవడానికి సులభంగా అనుమతి లభిస్తుందని పేర్కొంటున్నారు. అమెరికాలో 10.5 లక్షల మందికిపైగా భారతీయులు ఎంప్లాయ్‌మెంట్ ఆధారిత గ్రీన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. నిబంధనల ప్రకారం వీరందరికీ గ్రీన్‌కార్డులు రావాలంటే 50 ఏళ్లు పడుతుందని సమాచారం.

పిండం ఎదుగుదల ఎలా ఉంది?

వైద్య పరీక్షలు చేసి నివేదించాలని ఎయిమ్స్ మెడికల్ బోర్డుకి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ: వివాహిత 26 వారాల గర్భవిచ్ఛిత్తి కేసులో ఆమె గర్భంలో ఉన్న పిండం ఎదుగుదల ఎలా ఉందో నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు ఎయిమ్స్ వైద్యులను ఆదేశించింది. గత ఏడాది అక్టోబర్ నుంచి ఆ మహిళ ప్రసవానంతర మానసిక సమస్యలకు చికిత్స తీసుకుంటోందని గర్భాన్ని మోయడానికి ఆమె సిద్ధంగా లేదంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనల్ని పరిగణనలోకి తీసుకుంది. మానసిక సమస్యలకు ఆ మహిళ తీసుకుంటున్న మందులు ఆమె గర్భంలో పెరుగుతున్న శిశువు ఆరోగ్యానికి ఏమైనా హాని చేస్తాయో పూర్తిగా పరీక్షలు చేసి వివరంగా కోర్టుకు నివేదించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ జె.బి. పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఆ మహిళ శారీరక, మానసిక స్థితి ఎలా ఉందో పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని పేర్కొంది. ''ఇప్పటికే ఇద్దరు పిల్లల తల్లయిన ఆ మహిళ ప్రసవానంతరం వచ్చే మానసిక సమస్యలతో బాధపడుతోందని పరీక్షల్లో తేలితే ప్రత్యామ్నాయంగా మరేదైనా మందులు ఇవ్వొచ్చా పరిశీలించాలి'' అని సుప్రీం బెంచ్ స్పష్టం చేసింది. ఎయిమ్స్ వైద్యులకి పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
శనివారం : 14 : అక్టోబర్ : 2023


దసరా సందర్భంగా దుర్గామాత, చాముండి అమ్మవారి విగ్రహాల వ్యాపారం జోరందుకుంది. శుక్రవారం బెంగళూరు వీవీ పురంలో దుర్గామాత విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం

న్యూస్‌రీల్

ఇజ్రాయెల్ నుంచి వచ్చిన కన్నడిగులు


కేఐఏలో దిగిన కన్నడిగులు

దొడ్డబళ్లాపురం: ఆపరేషన్ అజయ్ ద్వారా యుద్ధభూమిగా మారిన ఇజ్రాయిల్ నుంచి ఐదుగురు కన్నడిగులు క్షేమంగా తిరిగి వచ్చారు. మొదటి బ్యాచ్‌లో శుక్రవారం జయేశ్ తాకర్సీ, అశ్వినికృష్ణ, కల్పనా, గోపాల్, ప్రీతి రాజమన్నార్ కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో దిగారు. తిరిగి వచ్చిన ప్రయాణికుల కుటుంబ సభ్యులు, బంధువులు వారిని ఆప్యాయంగా గుండెలకు హత్తుకుని ఆనందం వ్యక్తం చేశారు.

హుబ్బళ్లిలో దట్టమైన మంచు

- వెనుతిరిగిన విమానం

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ ఎయిర్‌పోర్టు నుంచి హుబ్బళ్లికి బయలుదేరిన ఇండిగో విమానం ప్రతికూల వాతావరణం కారణంగా బెంగళూరుకు తిరిగి వెనక్కి వచ్చిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున 5:50కి కెంపేగౌడ ఎయిర్‌పోర్టు నుంచి 6ఈ7227 ఇండిగో విమానం బయలుదేరింది. అయితే హుబ్బళ్లిలో దట్టమైన మంచు ఏర్పడి ల్యాండింగ్‌కు ప్రతికూల వాతావరణం ఉండటంతో కేఐఏకి వెనుదిరిగింది. బెంగళూరు నుంచి బయలుదేరిన విమానం 7 గంటలకు హుబ్బళ్లిలో ల్యాండింగ్ కావాల్సి ఉంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొందరు ప్రయాణికులు బెంగళూరుకు వెనుదిరిగి వెళ్లిపోగా మరికొందరు బెళగావికి మరో విమానంలో వెళ్లిపోయారు.

నయవంచక వైద్యుడిపై కొరడా


డాక్టర్ విజయ్ కుమార్(ఫైల్)

సాక్షి,బళ్లారి: నర్సును ప్రేమ పేరుతో నమ్మించిన ఓ డాక్టర్ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా అనుభవించిన తర్వాత మోసం చేసిన వైనం వెలుగులోకి వచ్చింది. హావేరి జిల్లా రాణిబెన్నూరు నగరంలో ప్రతిష్టాత్మకమైన హిత్తలమనె డెంటల్ కళాశాలలో పని చేస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్ అదే కళాశాలలో నర్సుగా పని చేస్తున్న రేఖాను ప్రేమించి మోసం చేసి గర్భవతి అయిన తర్వాత తనకు ఆమెతో ఎలాంటి సంబంధం లేదని బుకాయించడం చర్చనీయాంశంగా మారింది. తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయగా సదరు డాక్టర్ తిరగబడటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనను గతంలో మూడుసార్లు గర్భవతిని చేశాడని ఆమె ఆరోపించింది. ఈ నేపథ్యంలో పోలీసులు డాక్టర్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు.

జేపీ నడ్డాపై కేసులో మధ్యంతర స్టే

హుబ్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు వ్యతిరేకంగా దాఖలైన ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులో ధార్వాడ హైకోర్టు పీఠం మధ్యంతర నిలుపుదల ఆదేశాలను ఇస్తూ విచారణను వాయిదా వేసింది. వివరాలు..కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో 2023 మే 1న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాపై హావేరి జిల్లా శిగ్గాంవిలో జరిగిన ప్రచార సభలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఓటర్లను ప్రలోభ పెట్టారంటూ ఎన్నికల అధికారి లక్ష్మణ్ నంది శిగ్గాంవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును రద్దు చేయాలని జేపీ నడ్డా హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. అయితే విచారణ జరిపిన హైకోర్టు ఏకసభ్య పీఠం...ఈ కేసును మరింత లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌పై మధ్యంతర స్టేను ఇస్తూ కేసు విచారణను వాయిదా వేసింది.

ఐటీ అధికారి అరెస్ట్


ఐటీ అధికారిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

యశవంతపుర: బంగారు వ్యాపారి నుంచి లంచం తీసుకుంటూ ఆదాయ పన్నుల శాఖ అధికారి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా అంకలిలో జరిగింది. బంకాపురకు చెందిన బంగారు వ్యాపారి పరశురామ్‌ను ఐటీ అధికారి అవినాశ్ రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. సమీపంలోని కేఎల్ఈ డెంటల్ కళాశాల మైదానం వద్దకు డబ్బులు తీసుకు రావాలని సూచించాడు. బంగారు నగల వ్యాపారి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకుని కాపుగాశారు. నగల వ్యాపారి నుంచి డబ్బులు తీసుకుంటుండగా బెళగావి పోలీసులు అవినాశ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

ముద్ర వేస్తే ముప్పే





- సైబర్ కేటుగాళ్లకు వరంగా మారిన ఏఈపీఎస్ విధానం
- సిమ్, వాహనాల కొనుగోలు, రిజిస్ట్రేషన్ల, కేవైసీ సమయంలో బయోమెట్రిక్ తస్కరణ
- అనంతరం అకౌంట్ల నుంచి నగదు చోరీ

బనశంకరి: దగ్గరలో బ్యాంకులు లేని ప్రజలు బ్యాంకు లావాదేవీలు నిర్వహించుకునేలా కేంద్రం ఎంతో మంచి ఉద్దేశంతో ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్(ఏఈపీఎస్)ను ప్రవేశపెట్టగా సైబర్ కేటుగాళ్లు దానిని దుర్వినియోగం చేసి గ్రామీణ ప్రజల బ్యాంకు ఖాతాలపై కన్నువేశారు. వేలిముద్రలు సేకరించి నగదును కొల్లగొడుతున్నారు. గ్రామీణ ప్రజల బ్యాంకు అవసరాలను తీర్చేందుకు బ్యాంకులు, తపాలాకార్యాలయాలు కొంతమంది ప్రతినిధులను ఎంపిక చేసి ఏఈపీఎస్ మెషిన్లు అందజేసింది. బ్యాంకు ఖాతాదారులు వారిని సంప్రదిస్తే ఏఈపీఎస్ మెషిన్‌లో థంబ్ వేసి నగదు తీసుకొచ్చు. నగదు డ్రాచేయడం లేదా బదిలీచేయడానికి వన్‌టైమ్‌పవర్డ్(ఓటీపీ) బ్యాంక్ అకౌంట్ వివరాలు, డెబిట్‌కార్డు తదితర రహస్య సమాచారం అవసరం ఉండదు. కేవలం అకౌంట్‌దారుల బయోమెట్రిక్ సమాచారం ఉంటే చాలు నగదు డ్రాచేయవచ్చు. ఇదే సైబర్ కేటుగాళ్లకు వరంగా మారింది. ఖాతాదారుల వేలిముద్రలు తీసుకుని వారి బ్యాంకు అకౌంట్లనుంచి నగదును బదిలీ చేసుకుంటున్నారు. ఒకసారి కనీసం రూ.100 నుంచి రూ.10 వేల వరకు డ్రాచేయడానికి అవకాశం ఉంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ పథకాల కోసం బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అవసరమైంది. లక్షలాది మంది ప్రజలు కేవైసీ చేశారు. ఈ తరుణంలో సైబర్ వంచకులు ప్రజలు బయోమెట్రిక్ డేటా, వేలిముద్రల సమాచారం దొంగలించి దాని ద్వారా ఏఈపీఎస్ మార్గంగా బ్యాంక్ అకౌంట్‌కు కన్నం వేస్తున్నారు. బెంగళూరు నగర, మంగళూరు, చెన్నరాయపట్టణ తాలూకాల్లో ఇలాంటి వంచన కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయి. కొత్త కారు, సిమ్ కార్డుల కొనుగోలు, గుర్తుతెలియని వెబ్‌సైట్లతో బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింక్ చేయడం ద్వారా ప్రజలు బయోమెట్రిక్ సమాచారం లీక్ అవుతున్నట్లు తెలిసింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజులు రిజిస్ట్రేషన్‌కు వేసిన వేలిముద్రలను కూడా కేటుగాళ్లు తస్కరించి బ్యాంక్ అకౌంట్‌కు కన్నం వేస్తున్నట్లు తేలింది.

రెండు పర్యాయాలు నగదు గల్లంతు

'ఆస్తి విక్రయానికి సంబంధించి దావణగెరె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వేలిముద్రలు వేశా. అనంతరం రెండుసార్లు ఏఈపీఎస్‌లో రూ.10 వేలు విత్‌డ్రా అయింది' అని ఒక బాధితురాలు హైగ్రౌండ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఒకే కుటుంబంలోని ఆరుగురి నగదు డ్రా

చెన్నరాయపట్టణ తాలూకా నుగ్గేహళ్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకే కుటుంబానికి చెందిన 6మంది గతనెల 29 తేదీన విభాగ పత్రం కోసం వేలిముద్రలు వేశారు. కేవలం కొద్ది గంటల్లోనే వీరి బ్యాంకు అకౌంట్లనుంచి నగదు డ్రా అయింది. బ్యాంకులో విచారించగా ఏఈపీఎస్ ద్వారా నగదు డ్రాఅయినట్లు స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీంతో నుగ్గేహళ్లి పోలీస్‌స్టేషన్‌లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

ముందుజాగ్రత్తలు

- ఆధార్ నెంబరును అనవసరంగా ఇతరులకు తెలియజేయరాదు
- ఆధార్ వెబ్‌సైట్, యాప్‌లో బయోమెట్రిక్ లాక్‌చేయాలి
- గుర్తుతెలియని లింక్‌లపై క్లిక్‌చేసి సమాచారం ఇవ్వరాదు
- బయోమెట్రిక్ వివరాలను తెలిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి
- బ్యాంకులకు ఆధార్ లింక్‌నెపంతో వచ్చే మెసేజ్ లింక్ పట్ల జాగ్రత్తగా ఉండాలి.
- మొబైల్ సిమ్‌కార్డు కొనుగోలు చేసేటప్పుడు అధికారిక దుకాణాలకు వెళ్లాలి

అప్రమత్తమైన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తీసుకుంటున్న వేలిముద్రలను కేటుగాళ్లు తస్కరిస్తున్నట్లు సమాచారంతో రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ అప్రమత్తమైంది. రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్, బయోమెట్రిక్ సమాచారం రహస్యంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టింది మేము కాదు

- ఇంధన శాఖ మంత్రి కే.జే.జార్జ్

శివాజీనగర: బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రాష్ట్ర ప్రజలు, రైతులు ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారని ఇంధనశాఖ మంత్రి కేజే జార్జ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ...జలాశయాల్లో నీటి కొరత కారణంగా విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని, విండ్ ఎనర్జీ కూడా తక్కువైందన్నారు. 1600 మెగా వ్యాట్ల కొరత ఉందన్నారు. డిమాండ్‌కు తగ్గట్టు ఇతర రాష్ట్రాలతో విద్యుత్‌ను కొనుగోలు చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ భూముల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. బీజేపీ నేతలు అనవసర ఆరోపణలు చేసి కాలం వెళ్లదీస్తున్నారని, ప్రజల తిరస్కరణకు గురైన వారు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో విద్యుత్ సమస్య మెరుగుపడుతుందన్నారు.

నగల దుకాణంలో చోరీ

తుమకూరు: దుండగులు బంగారు నగల దుకాణంలోకి చొరబడి నగలు,నగదు చోరీ చేసి ఉడాయించారు. ఈఘటన గుబ్బి తాలూకా కేజీ టెంపుల్ గ్రామంలో జరిగింది. గ్రామంలో మోహన్ లాల్ అనే వ్యక్తి బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి దుండగులు దుకాణం వెనుక గోడను గ్యాస్ కట్టర్‌తో తొలగించి లోపలకు చొరబడ్డారు. అలారం మోగకుండా వైర్లు తెగ్గోశారు. 6 కిలోల వెండి వస్తువులతో ఉడాయించారు. మోహన్‌లాల్ శుక్రవారం ఉదయం వచ్చి చూడగా చోరీ ఘటన వెలుగు చూసింది. ఘటనపై సీఎస్‌పుర పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

గజరాజులకు బలవర్ధకమైన ఆహారం

మైసూరు: విశ్వ విఖ్యాత మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన గజరాజులకు తాలీము ప్రారంభించారు. కెప్టెన్ అభిమన్యు ఆధ్వర్యంలో గజరాజులకు బరువు తూచే కార్యక్రమం నిర్వహించారు. మరోవైపు ఏనుగులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నారు. మైసూరు ప్యాలెస్‌లో అవి ఇష్టమైన ఆహారం తీసుకుంటూ సేద తీరుతున్నాయి. పెసరలు, కుసబ బియ్యం, మినప పప్పు, ఉల్లిగడ్డలు, గోధుమలు, అవలక్కి, కూరగాయలు, మిశ్రమంతో కూడిన ఆహారం అందిస్తున్నారు. ప్రతిరోజు తెల్లవారుజామున 5.30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఉల్లిపాయలు ఉడకబెట్టి, బీట్‌రూట్, క్యారెట్, ముల్లంగి, తదితర కూరగాయలను మిశ్రమం చేసి వాటికి తినిపిస్తున్నారు.


బెంగళూరులో శుక్రవారం ఇండియన్ క్రాఫ్ట్ మేళాను ప్రారంభించి నగలను ప్రదర్శిస్తున్న నటి ప్రియాంక అరోరా.

మరో 21 కరువు పీడిత తాలూకాలు

- 215కి పెరిగిన సంఖ్య

శివాజీనగర: దుర్భిక్ష పరిస్థితుల నేపథ్యంలో గతంలో ప్రభుత్వం 195 కరువు తాలూకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా మరో 21 తాలూకాల పేర్లను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలో కరువు పీడిత తాలూకాల సంఖ్య 215కు పెరిగింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. పంట సర్వేపై జిల్లాధికారులనుంచి వచ్చిన నివేదికను పరిశీలించి అదనంగా కరువు పీడిత తాలూకాలను జాబితాలో చేర్చారు. తాజాగా చేర్చిన 21 తాలూకాల జాబితాలో 10 కరువు తీవ్రంగా ఉన్నట్లు నిర్ధారించారు.

తీవ్ర కరువు పీడిత తాలూకాలు

1. బెళగావి-బెళగావి, ఖానాపుర
2.చామరాజనగర-చామరాజనగర
3. ధారవాడ-అళ్నావర, అణ్ణిగేరి, కలఘటిగి
4. గదగ-ముండరగి
5. హాసన-ఆలూరు, అరసీకెరె, హాసన
6.హావేరి-బ్యాడగి, హానగల్, శిగ్గాంవ్
7.కొడుగు-పొన్నంపేట
8.మైసూరు-కే.ఆర్.నగర
9.ఉడుపి-హెబ్రి
10. ఉత్తర కన్నడ-దాండేలి

సాధారణ కరువు పీడిత తాలూకాలు

1.చామరాజనగర-యళందూరు
2. చిక్కమగళూరు-మూడిగెరె, తరీకెరె
3.ఉత్తర కన్నడ-సిద్ధాపుర

రోజూ 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయండి

- కావేరి నీటి నియంత్రణ మండలి ఆదేశాలు

బనశంకరి: కావేరి జలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి మరోమారు చుక్కెదురైంది. తమిళనాడుకు ఈనెల 16 తేదీ నుంచి ఈనెల 31వరకు నిత్యం 3 వేల క్యూసెక్కుల కావేరి జలాలు విడుదల చేయాలని కావేరి నీటి నియంత్రణ మండలి ఆదేశాలు జారీచేసింది. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన సమావేశం అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి రాకేశ్‌సింగ్ మాట్లాడుతూ బ్యాక్‌లాక్‌నీరు విడుదలచేయాలని తమిళనాడు ప్రభుత్వం వాదనలు వినిపించిందన్నారు. అయితే రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉన్నందున డ్యాంనుంచి నీటి విడుదల సాధ్యం కాదని, వర్షాలు వస్తే నీటిని విడుదల చేస్తామని తెలిపామన్నారు. అయినప్పటికీ 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని కావేరి నీటి నియంత్రణ మండలి ఆదేశించిందన్నారు. మళ్లీ పునఃపరిశీలనా పిటిషన్ వేస్తామన్నారు.

నిరసన వెల్లువ: తమిళనాడుకు కావేరి నీటిని విడుదల చేయాలనే కావేరి నీటి నియంత్రణ మండలి ఆదేశాలను నిరసిస్తూ కర్ణాటక జలసంరక్షణ సమితి ఉద్యమించింది. శుక్రవారం బెంగళూరులోని ఫ్రీడం పార్కులో కరబూరు శాంతకుమార, నాయకులు పొర్లు దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు.


పొర్లు దండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న కరబూరు శాంతకుమార్ తదితరులు




దసరా ఉత్సవాల్లో పేలుళ్ల కోసం పురాతన ఫిరంగులను శుభ్రం చేసి వాటిలో మందుగుండు పెట్టి గజరాజుల సమక్షంలో పేల్చారు. శబ్దానికి ఏనుగులు బెదిరిపోకుండా వాటికి శిక్షణ ఇచ్చే ప్రక్రియ ప్రారంభించారు

పోలీస్ బందోబస్తు మధ్య మహిష దసరా

- టౌన్ హాల్‌లో వేడుకల నిర్వహణ
- కొండపై ఉత్సవానికి అనుమతి నిరాకరించిన పోలీసులు


చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం


పోలీసు బందోబస్తు దృశ్యం

మైసూరు: మైసూరు నగరంలో శుక్రవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య మహిష దసరా వేడుకలు నిర్వహించారు. టౌన్‌హాల్‌లో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి క్రాంతి గీతాలను ఆలపించారు. అనంతరం మహిష ఉత్సవ వేదిక ఆధ్వర్యంలో మహిష చిత్రపటం ఏర్పాటు చేసి అంబేడ్కర్, బుద్ధుడి విగ్రహాలను ఉంచి చిన్నపాటి మహిష కంచు విగ్రహం ఉంచి పూజలు చేశారు. కాగా మహిష వేడుకలను అడ్డుకుంటామని బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా హెచ్చరించడంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చాముండి కొండపై మహిష దసరా నిర్వహించేందుకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో ఉత్సవ సమితి టౌన్ హాల్‌లోనే ఈ కార్యక్రమం నిర్వహించింది.

కిత్తూరు చెన్నమ్మ, టిప్పు పోరాటం స్ఫూర్తిదాయకం

- ముఖ్యమంత్రి సిద్దరామయ్య


కిత్తూరు చెన్నమ్మ విజయ జ్యోతిని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

శివాజీనగర: కిత్తూరు రాణి చెన్నమ్మ, టిప్పు సుల్తాన్ ఆత్మాభిమానపు పోరాటానికి స్ఫూర్తి అయ్యారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. బెళగావి జిల్లా యంత్రాంగం, కన్నడ సంస్కృతి శాఖ విధానసౌధ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కిత్తూరు రాణి చెన్నమ్మ ఉత్సవం-2023ను ఏర్పాటు చేయగా సీఎం పాల్గొని కిత్తూరు చెన్నమ్మ వీర విజయ జ్యోతిని సిద్దరామయ్య ప్రారంభించారు. కిత్తూరు చెన్నమ్మ తన చిన్న సైన్యంతో బ్రిటీష్ సైన్యానికి ఎదురొడ్డిన ధీమంత వనిత అని అన్నారు. యువత ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రజా పనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి, కిత్తూరు ఎమ్మెల్యే బాబా సాహెబ్ పాటిల్, ధార్వాడ గ్రామీణ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి, బైలహొంగల ఎమ్మెల్యే మహంతేశ్ కౌజలగి, సీఎం రాజకీయ కార్యదర్శి గోవిందరాజు పాల్గొన్నారు.

బొమ్మల కొలువు..సంప్రదాయాలకు నెలవు

- దసరాకు ప్రత్యేక ఆకర్షణ
- పది తరాలుగా ఆచరిస్తున్న రిగ్రేట్‌అయ్యర్ కుటుంబం
- కొలువైన వివిధ దేవతా మూర్తులు
- ప్రత్యేక ఆకర్షణగా వేంకటేశ్వరస్వామి మూర్తి

బనశంకరి: దసరా పండుగ వచ్చిందంటే చాలు దసరా బొమ్మలు కొలువు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. బెంగళూరు నగరంలోని త్యాగరాజనగర నివాసులైన రిగ్రేట్‌అయ్యర్ కుటుంబం 363 ఏళ్లుగా బొమ్మలు కొలువు ఏర్పాటుచేస్తూ అనవాయితీ కొనసాగిస్తుంది. తాజాగా దసరా పండుగ సందర్భంగా రిగ్రేట్‌అయ్యర్, విజయలక్ష్మీ అయ్యర్ దంపతులు 36వ దసరా బొమ్మల కొలువును విభిన్నంగా ఏర్పాటుచేశారు. 6 అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పుతో ఉన్న వేంకటేశ్వరస్వామి మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి బొమ్మల కొలువులో ఉంచారు. వజ్రాంగి అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి, అమ్మవారు. విజయనగర అరసులైన శ్రీకృష్ణదేవరాయలు వారి కుటుంబం, దాదాపు 250 ఏళ్ల నాటి 80 రకాల బొమ్మలను పొందుపరిచారు. అదేవిధంగా 25 దేవతామూర్తుల విగ్రహాలు కొలువుదీర్చారు. గరుడోత్సవ, శివపార్వతి, ఆర్ముగ, అష్టలక్ష్మీ , దశావతార, మట్టి విగ్రహాలు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా సాక్షితో విజయలక్ష్మీరిగ్రేట్ అయ్యర్ మాట్లాడుతూ పది తరాలుగా (1700) నుంచి దసరా బొమ్మలకొలువు వంశపారంపర్యంగా నిర్వహిస్తూ కొనసాగిస్తున్నామని, భారతీయ సంస్కృతి సంప్రదాయాలు కొనసాగించడం తమ కర్తవ్యమని తెలిపారు. దసరా బొమ్మలు కొలువుకు భర్త రిగ్రేట్‌అయ్యర్, కుమారుడు శ్రావణకుమార్, కుమార్తె శృతిఅయ్యర్ సహకారం అందిస్తున్నారని తెలిపారు.


విజయలక్ష్మీరిగ్రేట్ అయ్యర్ ఇంటిలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు


వేంకటేశ్వరస్వామి విగ్రహం


బొమ్మల కొలువులో చంద్రయాన్ శాటిలైట్ నమూనా

రైలు నిలయం..అసౌకర్యాలమయం

- కంటోన్మెంట్‌లో కూర్చోడానికి ఆసనాలు లేవు
- స్టేషన్‌లోని కొళాయిల్లో సరఫరా కాని మంచినీరు
- ప్రయాణికుల పాట్లు పట్టించుకోని అధికారులు


కంటోన్మెంట్ రైల్వేస్టేషన్‌లో ఆసనాలు లేక కింద కూర్చొన్న ప్రయాణికులు


నిరుపయోగంగా ఉన్న మంచినీటి కొళాయిల సదుపాయం

సాక్షి బళ్లారి: నగరంలోని కంటోన్మెంట్ రైల్వేస్టేషన్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. నగరంలో ప్రధాన జంక్షన్ రైల్వే స్టేషన్‌తో పాటు కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ కూడా ఉంది. జిల్లాధికారి కార్యాలయం ఎదురుగా ప్రధాన రైల్వే స్టేషన్ ఉండగా, హొసపేటె రోడ్డులో ఉన్న కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ నుంచి కూడా ఇటీవల పలు రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి. మరమ్మతు పనుల అంతరాయం వల్ల ప్రధాన రైల్వేస్టేషన్‌కు వెళ్లకుండా పలు రైళ్లు కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ మీదుగానే బెంగళూరు, హొసపేటె, హుబ్లీ తదితర నగరాలకు నేరుగా రైళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. వీటితో పాటు హుబ్లీ మీదుగా బళ్లారి వచ్చే ప్రతి రైలు కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ మీదుగానే రాకపోకలు సాగించడం సర్వసాధారణం. నిత్యం పెద్ద సంఖ్యలో రైళ్ల రాకపోకలు సాగించే ఈ స్టేషన్‌లో దిగేవారు, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు రైల్వే ప్లాట్‌ఫాం మీద కూర్చోవడానికి ఆసనాలు కూడా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైల్వే స్టేషన్‌లో మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేశారే కానీ అందులో నీరు మాత్రం రాకపోవడంతో ప్రయాణికులు యాతన పడుతున్నారు. ఘన చరిత్ర కలిగిన కంటోన్మెంట్ రైల్వేస్టేషన్‌లో కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇక నగరంలోని ప్రధాన జంక్షన్ రైల్వే స్టేషన్‌లో కూడా లిఫ్ట్ సమస్య ఉందని నగరవాసి ఎర్రిస్వామి పేర్కొన్నారు. లిఫ్ట్ ఉన్నఫళంగా మధ్యలోనే ఆగిపోతోందని, తాను దాదాపు అర్ధగంట పాటు లిఫ్ట్‌లో ఇరుక్కొని ఇబ్బంది పడ్డానని వాపోయారు. ఈనేపథ్యంలో నగర రైల్వేస్టేషన్లలోని సమస్యలపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లో సరిగా పని చేయని లిఫ్ట్

క్లుప్తంగా

అతిథి ఉపాధ్యాయుడి ఆత్మహత్య


శివపుత్రప్ప(ఫైల్)

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరులో అతిథి ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. మృతుడిని నగరంలోని 17వ వార్డులో నివాసమున్న శివపుత్రప్ప(47)గా గుర్తించినట్లు సీఐ దురుగప్ప వెల్లడించారు. మానసికంగా అస్వస్థతకు గురైన శివపుత్రప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని సింధనూరు తాలూకా ఆస్పత్రికి తరలించి భార్య శశికళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర

కంప్లి: ఇటీవల ఆడపిల్లలు కనిపించకుండా పోతున్నారనే కేసులు అధికం అయ్యాయని, మానవ దొంగ రవాణాకు లోనవుతున్న అంశాలు నిత్యం పత్రికల్లో గణాంకాలతో ప్రకటిస్తున్నారని కర్ణాటక రాష్ట్ర హక్కుల నిఘా కేంద్రం సభ్యులు హెచ్‌సీ.రాఘవేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేవలాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. బాలికల రక్షణ, ఆరోగ్యం, విద్య, కుటుంబం, పాఠశాలల్లో బాలికలపై వివక్ష నుంచి విముక్తి లభించాల్సి ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శి హెచ్.హులుగప్ప బాలికల రక్షణపై వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ ట్రస్ట్ బెంగళూరు యోజన సహాయకులు కౌశిక్, హరగి, పంచాయతీ అధ్యక్షులు, సభ్యులు అంగన్‌వాడీ, స్వసహాయ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డీసీఎంను కలిసిన ఫిలిం చాంబర్ నేతలు

యశవంతపుర: కర్ణాటక చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు ఎస్‌ఎం సురేశ్ నేతృత్వంలోని బృందం శుక్రవారం డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కలిసింది. సినిమా రంగంపై వ్యాట్‌తో పాటు చిత్రమందిరాలపై విధిస్తున్న ట్యాక్స్‌పై డీసీఎంతో చర్చించారు. పాత ట్యాక్స్‌లు కట్టాలని కొందరూ నిర్మాతలకు పన్నుల అధికారులు నోటీసులిస్తున్నట్లు డీసీఎం దృష్టికి తెచ్చారు. సినిమా రంగం సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానాని హామీ ఇచ్చినట్లు ఫిలిం చాంబర్ అధ్యక్షుడు ఎస్‌ఎం సురేశ్ అనంతరం విలేకర్లకు తెలిపారు.

పశు వైద్యుల సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్రంలో పశువైద్యశాలలు, పశు వైద్యుల సంఖ్యను మరింత పెంచి, వారి సమస్యలను పరిష్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. శుక్రవారం బెంగళూరు హెబ్బాళలో పశువైద్య పరిషత్‌లో జరిగిన విశ్వ కోడిగుడ్ల దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. పౌల్ట్రీ పరిశ్రమ కష్టాల్లో ఉందని దీంతో గుడ్లు, కోడి మాంసం ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ రైతులు పలు సమస్యలు డీసీఎం దృష్టికి తెచ్చారు.

షామియానాకు నిప్పు పెట్టిన వ్యక్తి అరెస్ట్

మైసూరు: మంత్రి కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన షామియానకు నిప్పు పెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మైసూరు జిల్లా పిరియాపట్టణం తాలూకా నెరళకుప్పె గ్రామంలో కొన్ని రోజుల క్రితం పశు సంవర్ధక శాఖ మంత్రి కే.వెంకటేష్ అధ్యక్షతన స్పందన కార్యక్రమం ఏర్పాటుకు వేదిక ఏర్పాటు చేశారు. అయితే షామియానాకు నిప్పంటుకుంది. దీనిపై పీడీఓ అనివాష్ బైలకొప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టి గ్రామానికి చెందిన మణి అనే వ్యక్తి ఈ అకృత్యానికి పాల్పడినట్లు నిర్ధారించి శుక్రవారం అరెస్ట్ చేశారు.

పథకాలపై అవగాహన అవసరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని విజ్ఞాన భవన్‌లో పాత్రికేయులకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రధానమంత్రి ఫసల్ బీమా, ప్రధానమంత్రి సురక్ష పథకం, ప్రధానమంత్రి గ్రామ సడక్, జల జీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ పథకం, ప్రధానమంత్రి జన్‌ధన్, ముద్రా పథకాలపై ప్రజలకు వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వార్తా శాఖాధికారి గవిసిద్దేశ్వరప్ప, చెన్నబసవ, దేవిక, ప్రకాష్, మేనకా పాటిల్, లోకేష్, రవి, దేవరాజ్‌లున్నారు.

విద్యుత్ కొనుగోలు చేసేందుకు యోచిస్తున్నాం

శివాజీనగర: వర్షాభావానికి తోడు రాష్ట్రంలో ఎండా కాలం నాటి వాతావరణం నెలకొని విద్యుత్ సరఫరాకు డిమాండ్ పెరిగందని మరో వైపు విద్యుత్ ఉత్పత్తి తక్కువవుతోందని సీఎం సిద్దరామయ్య అన్నారు. శుక్రవారం ఆయన విధానసౌధలో విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం ఇదే సమయానికి 900 మెగా వ్యాట్ల డిమాండ్ ఉండగా ఈసారి 16 వందల మెగా వ్యాట్లకు పెరిగిందన్నారు. విద్యుత్‌ను బయటి నుంచి కొనగోలు చేయాలని చర్చిస్తున్నామని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తిచేసేవారు ప్రభుత్వానికి విక్రయించాలని, మరోచోటికి విక్రయించరాదని గురువారమే ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ముందు జాగ్రత్తలు తీసుకోలేదని బీజేపీ ఆరోపించటంపై స్పందించిన సీఎం... బీజేపీ రాజకీయ లబ్ధి కోసం చేసే ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు సాధ్యం కాదన్నారు. వాస్తవస్థితి గురించి వారికి తెలుసా? అని ప్రశ్నించారు. వర్షం లేక కరువు వచ్చి ఇబ్బంది నెలకొందని, అయినా వ్యవసాయ పంప్‌సెట్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ దీపాలంకరణ కమానును ఢీకొన్న బస్సు

- 15 మందికిపైగా గాయాలు

మైసూరు : విద్యుత్ అలంకరణ దీపాల కోసం ఏర్పాటు చేసిన కమానును బస్సు ఢీకొని 15 మందికిగా ప్రయాణికులు గాయపడ్డారు. ఈఘటన మైసూరులో జరిగింది. దసరా మహోత్సవం సందర్భంగా మైసూరు నగరం మొత్తాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఈక్రమంలో జాతీయ రహదారిలో ఇనుప స్తంభాలతో కమాను ఏర్పాటు చేశారు. మణిపాల్ అస్పత్రి సర్కిల్ వద్ద ప్రైవేటు బస్సు వేగంగా వచ్చి కేఎస్ ఆర్టీసీ బస్సును ఢీకొనగా అది వెళ్లి కారును ఢీకొంది. ఈక్రమంలో ప్రైవేటు బస్సు అదుపు తప్పి కమాన్‌ను ఢీకొంది. కమాను కూలిపోవడంతో బస్సులోని 15 మందికిపైగా ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

రాఘవేంద్ర మఠంలో ప్రత్యేక పూజలు


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బనశంకరి: జయనగర ఐదోబ్లాక్‌లో వెలసిన నంజనగూడు శ్రీ గురురాఘవేంద్రస్వామి మఠంలో వాదీంద్రాచార్య నేతృత్వంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గురురాఘవేంద్రస్వామికి కనకాభిషేకం, ప్రత్యేక అలంకరణ, అన్నదానంసేవ అనంతరం మహామంగళహారతి, ప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం 5.30 గంటలకు రథోత్సవం, గజవాహనోత్సవం, తొట్టిలుసేవ, మహామంగళహారతి చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శృతి కల్కుంటి బృందంచే దాసవాణి కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు.

కౌన్సిలర్‌పై హత్యాయత్నం


కౌన్సిలర్ మురళికి ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యులు


తలకు కట్టు కట్టిన దృశ్యం

చింతామణి: గుర్తు తెలియని వ్యక్తులు కౌన్సిలర్‌పై మారాణాయుధాలతో దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి పట్టణంలోలో చోటుచేసుకుంది. 25 వార్డు జేడీఎస్ కౌన్సిలర్ మురళి ఓ సమావేశానికి వెళ్లి రాత్రి 7.30గంటల సమయంలో కాలి నడకన ఇంటికి వస్తుండగా గజానన్న సర్కిల్‌లో దుండగులు దాడి చేశారు. కత్తులతో తల, కడుపులో పొడిచేందుకు యత్నించగా మురళి చేతులు అడ్డంపెట్టాడు. దీంతో చేతులకు బలమైన గాయాలు కావడంతో రక్తం మడుగులో కుప్పకూలాడు. స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. హత్యాయత్నం విషయం తెలియడంతో జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్లపైకి రావడంతో ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ మురళీధర్ పరిశీలించారు. ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాతకక్షలతో ఈ ఘటన జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు.

పథకాలను వినియోగించుకోండి


రుణ మంజూరు పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే మంజులాఅరవిందలింబావలి సూచించారు. మహదేవపుర నియోజకవర్గం దొడ్డబనహళ్లిలో శుక్రవారం జరిగిన గ్రామ పంచాయతీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి కిసాన్ పథకం, మహిళా సంఘాలకు సంజీవిని పథకం, ఆశ్రయ పథకంపై అవగాహన కల్పించారు. అర్హులైన వారు పథకాలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం రుణాల మంజూరు పత్రాలు అందజేశారు.

విచిత్ర వివాహం

- రెండు మృతుల జంటల ఫొటోలకు పెళ్లి

యశవంతపుర: వయసు వచ్చినా యువకుడికి పెళ్లి సంబంధం కుదరకపోవడంతో జ్యోతిష్యుల సూచన మేరకు కుటుంబ పెద్దలు తమ దివంగత కుమారులకు దివంగతులైన అమ్మాయిలకు సంబంధించిన ఫొటోలకు వివాహం జరిపించారు. ఇలా చేస్తే దోషం తొలగి తమ మూడవ సంతానమైన కుమారుడికి వివాహం అవుతుందనేది వారి నమ్మకం. ఫొటోలకు జరిగిన విచిత్ర వివాహానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దక్షిణ కన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకాలోని నడ గ్రామంలోని పాదె ఇంటిలో ఇద్దరు చిన్నారులు పదేళ్ల వయసులోపే మరణించారు. తర్వాత ఆ ఇంటో మూడో సంతానంగా మరోమారు కుమారుడు జన్మించాడు. ఇప్పుడతడికి పెళ్లీడు వచ్చింది. అయితే ఎన్ని సంబంధాలు చూసినా కుదరలేదు. ఎందుకు కావడం లేదని తల్లిదండ్రులు జ్యోతిష్యుడిని సంప్రదిస్తే.. పెళ్లీడుకు రాకనే ఇద్దరు కుమారులు చనిపోవడం వల్ల అని చెప్పారు. ఇక్కడ అన్నదమ్ములు ఎలా మరణించారో.. అలాగే ఇద్దరు అక్కాచెల్లెల్లు ఎక్కడైతే మరణించారో అటువంటి వారిని అన్వేషించి.. ఈ నలుగురి చిత్రపటాలను ఉంచి వివాహాలు చేస్తే దోషం వెళ్లిపోతుందని చెప్పారు. అందుకు అనుగుణంగా సదరు తల్లిదండ్రులు శీర్లలో ఇద్దరు అమ్మాయిలు పెళ్లి కాకుండానే మరణించారని, మూడో సంతానమైన అమ్మాయికి పెళ్లి సంబంధం కుదరడం లేదని తెలుసుకున్నారు. ఇరు కుటుంబాల వారూ జ్యోతిష్యుని సూచన మేరకు నడ గ్రామంలో ఇద్దరు అమ్మాయిలు.. ఇద్దరు అబ్బాయిల ఫొటోలను శుక్రవారం ఉంచి వివాహాల తంతు ముగించారు. ఇరువైపుల బంధు మిత్రులు ఈ వేడుకలకు హాజరయ్యారు.

కోలారమ్మ చెరువులో నురగ కలకలం


చెరువు నుంచి నురగతో మరువ పారుతున్న దృశ్యం

కోలారు: నగర సమీపంలోని కోలారమ్మ చెరువులోకి నురగతో కూడిన నీరు చేరుతుండడంపై నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా నగరంలో కురుస్తున్న వానలకు చెరువు మరువ పారుతోంది. కోలారమ్మ చెరువుకు చాలా ఏళ్లుగా కేసీ వ్యాలీ నీరు చేరుతోంది. వాన నీరు కూడా చెరువులోకి చేరుతూండడంతో కేసీ వ్యాలీ నీరు చెరువు నీటితో కలుషితం అవుతోంది. అందుకే నురగతో కూడిన నీరు మరువ పోతోందని నగర ప్రజలు అంటున్నారు. అంతరగంగ కొండ నుంచి ప్రవహిస్తున్న వాననీటితో నగరంలో మురుగు నీరు కూడా రాజకాలువల ద్వారా కోలారమ్మ చెరువుకు చేరుతోంది. జిల్లా యంత్రాంగం కోలారమ్మ చెరువును అభివృద్ధి చేయడం కోసం సీఎస్ఆర్ నిధులతో పనులను చేపడుతోంది. కేసీ వ్యాలీ నీటిని కేవలం రెండు దశల్లో శుద్ధీకరించి చెరువులకు అందిస్తున్నారు. దీనికి తోడు నగరంలో మురుగు నీరు కూడా రాజకాలువల ద్వారా కోలారమ్మ చెరువుకు చేరుతోంది.

చెరువు మనుగడకు నిర్లక్ష్యమే శాపం

ప్రభుత్వం, స్థానిక సంస్థల నిర్లక్ష్యంతో చెరువు పాడవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే కోలారమ్మ చెరువు నుంచి వస్తున్న నురగకు కారణం కేసీ వ్యాలీ నీరు కాదని అధికారులు వాదిస్తున్నారు. కోలారమ్మ చెరువులో గత నాలుగైదు నెలలుగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుండడం వల్ల చెరువుకు కేసీ వ్యాలీ నీటిని అందించడం లేదని, అందువల్ల నురగకు కేసీ వ్యాలీ నీరు ఎంతమాత్రం కారణం కాదని అధికారులు వాదిస్తున్నారు. కోలారమ్మ చెరువుకు మురుగు నీరు చేరుతున్న ఐదు చోట్ల నుంచి దానిని వేరు చేయడానికి పలు చోట్ల బండ్‌లను నిర్మిస్తున్నట్లు అధికారులు అన్నారు. వాన నీరు వేగంగా వచ్చి చేరుతున్నందున చెరువులో ఇప్పటికే అభివృద్ధి పనులు జరుగుతుండడం వల్ల మట్టినీటితో కలిసి నురగ ఏర్పడుతోందని వారంటున్నారు.

కోలారు వార్తలు...

పథకాలు ప్రతిఒక్కరి దరిచేరాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి కె వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: ప్రభుత్వ పథకాలను సమాజంలోని చిట్టచివరి వ్యక్తికీ స్థానిక సంస్థల అధికారులు అందించాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. శుక్రవారం పురసభ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి ఆయన మాట్లాడారు. పురసభతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు పనులను సకాలంలో చేయకుంటే తన దృష్టికి తేవాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోను రహదారుల అభివృద్ధి, తాగునీరు, వీధిదీపాలు, స్వచ్ఛతకు, సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదులతో వచ్చిన ప్రజల సమస్యల్లో కొన్నింటిని అధికారులతో చర్చించి అక్కడికక్కడే పరిష్కరించారు. జెడ్పీ అధ్యక్షుడు తూపల్లి నారాయణస్వామి, పురసభ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో రైతన్న విలవిల


రైతు పొలంలో పంటను పరిశీలిస్తున్న సంఘం పదాధికారులు

కోలారు: జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాలు, మందులతో పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ.2 లక్షల పరిహారం అందించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ డిమాండ్ చేశారు. శుక్రవారం ముళబాగిలు తాలూకాలోని శీగేహళ్లి చుట్టు పక్కల గ్రామాల్లో బంగాళాదుంప పంట నష్టమైన రైతుల పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా దుకాణాల్లో నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తుండడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నకిలీ విత్తనాలు, మందులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు. ఈ సందర్భంగా సంఘం పదాధికారులు సుబ్రమణి, చెన్నప్పయ్య, హరినాథ్, అమరప్ప మణి, శీనప్ప, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కరపత్రాల పంపిణీ


కరపత్రాలను అందిస్తున్న సీఈఓ పద్మ బసవంతప్ప

కోలారు: తాలూకాలోని దొడ్డవల్లబ్బి గ్రామంలో ఉపాధి హామీ పథకంపై విశేష అభియాన్‌ను ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచడం ద్వారా శుక్రవారం జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఉపాధిహామి కరపత్రాలను పంచి పథకం ద్వారా గ్రామీణ ప్రాంత రైతులకు కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు. జాబ్ కార్డులను మహిళలు ఎక్కువగా పొందాలన్నారు. అనంతరం పలువురు మహిళలకు సీఈఓ స్థలంలోనే జాబ్ కార్డులను అందించారు. పశువుల షెడ్లు, గొర్రెలు, మేకలు, పట్టు పురుగుల పెంపకానికి షెడ్‌లను ఉపాధిహామి పథకం ద్వారా నిర్మించుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంత రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు మహేష్‌బాబు, చౌడదేనహళ్లి పీడీఓ వత్సల తదితరులు పాల్గొన్నారు.

రాజ్యోత్సవ నిర్వహణపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాధికారి అక్రంపాషా

కోలారు: సువర్ణ కన్నడ రాజ్యోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించాలని జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రాజ్యోత్సవ వేడుకల నిర్వహణపై సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్నడ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలన్నారు. ఈసారి రాజ్యోత్సవ వేడుకలను ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తారన్నారు. ఆరోజు ఉదయం నగరంలో ఘనంగా పల్లకీల ఊరేగింపు జరుగుతుందన్నారు. ఊరేగింపు వెళ్లే మార్గంపై పోలీస్ అధికారులతో చర్చించి తీర్మానిస్తామన్నారు. జిల్లాలోని అన్ని కార్యాలయాల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. వేడుకల సందర్భంగా పాఠశాల, కళాశాల స్థాయిలో వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ శంకర్ వణిక్యాల్, డీఎస్పీ భాస్కర్, కన్నడ సంస్కృతి శాఖాధికారిణి గీతా, కన్నడ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటకాలతో భాషాభిమానం వృద్ధి

శ్రీనివాసపురం: కన్నడ పౌరాణిక నాటకాల ప్రదర్శనతో సరిహద్దుల్లో భాషాభిమానం వృద్ధి చెందుతుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ అరివు శివప్ప తెలిపారు. శుక్రవారం ముళబాగిలు తాలూకా ముదుగెరెలో నిర్వహించిన గడినాడు జనపర ఉత్సవంలో ఆయన మాట్లాడారు. కళాకారులను ఇలాంటి కార్యక్రమాలను విరివిగా నిర్వహించడం ద్వారా ఆదుకోవచ్చన్నారు. తద్వారా కన్నడిగులకు కూడా భాషాభిమానం పెరుగుతుందన్నారు. పీడీఓల క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు అశ్వర్థ నారాయణ, జానపద కళాకారుడు వెంకటాచలపతి, జీపీ ఉపాధ్యక్షురాలు వసంతమ్మ, సభ్యులు ఆర్.సంపత్, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో రాణించండి

కోలారు: జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న ఉద్యోగ క్రీడాకారులు పోటీల్లో రాణించి రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తేవాలని జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. ఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో ఈ నెల 16 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న అఖిల భారత పౌరసేవా కుస్తీ, కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి వెళుతున్న కల్పన లమాణి, అంబిక, అరుణ్‌లను ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించి వీడ్కోలు పలికి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. సదా ఒత్తిడి మధ్య విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఒత్తిడి నుంచి దూరం కావాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన నిర్వహించి జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ శంకర్ వణిక్యాల్, సంఘం అధ్యక్షుడు జి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సూలిబెలెపై కేసు నమోదు

యశవంతపుర: ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై అవహేళనంగా మాట్లాడి నందుకు యువ బ్రిగేడ్ సంస్థాపక చక్రవర్తి సులిబెలెపై కేసు నమోదైంది. ఇటీవల జనగణమన అభియానలో భాగంగా ఉత్తర కన్నడ జిల్లా కార్వార కడవాడ బోవివాడలోని శ్రీ ఆది ఆలయానికి వెళ్లిన చక్రవర్తి సూలిబెలె సీఎం సిద్ధరామయ్యను అవహేళనగా మాట్లాడారు. దీంతో కార్వార గ్రామీణ పోలీసులు సులిబెలెపై సుమోటో కేసుగా నమోదు చేశారు.

అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలోని శ్రీ విజయ విశ్వకర్మ ఇండస్ట్రియల్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంఘం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా సుదర్శన్‌బాబు, ఉపాధ్యక్షురాలిగా అరుణ రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సభ్యులు అభినందించారు.

మానసిక రోగులతో ఆప్యాయంగా మాట్లాడాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి నేరళె వీరభద్రయ్య భవాని

చిక్కబళ్లాపురం: మానసిక రోగుల పరిస్థితిని అర్థం చేసుకుని వారితో ప్రేమగా నడుచుకోవాలని జిల్లా జడ్జి నేరళె వీరభద్రయ్య భవాని తెలిపారు. శుక్రవారం విశ్వ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మానసిక రోగులను ఒంటరిగా ఉంచకూడదన్నారు. వారితో తరచూ మాట్లాడాలన్నారు. డీహెచ్‌ఓ మహేశ్ కుమార్ మాట్లాడుతూ...ప్రభుత్వ ఆస్పత్రుల్లో మానసిక రోగులకు ఉత్తమ చికిత్స ఉందని, వారిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సివిల్ న్యాయమూర్తి అరుణకుమారి, జిల్లా లాయర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, తాలూకా వైద్యాధికారి మంజుల, మనో వైద్యులు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ టపాసుల విక్రయం ..ముగ్గురి అరెస్ట్

- రూ.24 లక్షల విలువ చేసే బాణసంచా సీజ్

రాయచూరు రూరల్: జిల్లాలో అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నిఖిల్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింధనూరు తాలూకా గుంజళ్లి క్యాంప్‌లో సత్యనారాయణశెట్టి ఇంటిని నాగరాజ్ అద్దెకు తీసుకొని అందులో అక్రమంగా టపాసులను నిల్వ ఉంచి విక్రయాలకు సిద్ధమైనట్లు సమాచారం అందుకున్న తుర్విహాళ్ పోలీసులు దాడులు జరిపారు. నగరంలోని గీతా మందిర్ వద్ద రమేష్ ఇంటిపై దాడులు జరిపి ఇద్దరి నుంచి రూ.24 లక్షలు విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

పౌర కార్మికులతో కలిసి ఎమ్మెల్యే డ్యాన్స్


డ్యాన్స్ చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

దొడ్డబళ్లాపురం: రామనగర తాలూకా బిడదిలోని ఈగల్‌టన్ రిసార్ట్‌లో శుక్రవారం జరిగిన పౌర కార్మికుల దినోత్సవం కార్యక్రమంలో మాగడి ఎమ్మెల్యే బాలకృష్ణ పౌర కార్మికులతో కలిసి డ్యాన్స్ చేసారు. వైట్ షర్టు, వైట్ పంచె ధరించిన ఎమ్మెల్యే తలపాగా కట్టి కూలింగ్ గ్లాస్ పెట్టుకుని డ్యాన్స్ చేయడం పౌర కార్మికుల్లో ఉత్సాహాన్ని నింపింది. డాక్టర్ రాజ్‌కుమార్ నటించిన సత్యహరిశ్చంద్ర అనే పాత కన్నడ సినిమాలోని కులదల్లి మేల్యావుదో హచ్చప్ప అనే పాటకు డ్యాన్స్ చేశారు.

ఇజ్రాయెల్ మృతులకు కొవ్వొత్తుల నివాళి

మైసూరు: ఇజ్రాయెల్‌లో హమాస్ ఉగ్రవాదుల చేతుల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన వారికి మైసూరులో నివాళి అర్పించారు. నగరంలోని వీర సావర్కర్ యువకుల సంఘం ఆధ్వర్యంలో ఫీల్డ్ మార్షల్ కారియప్ప సర్కిల్‌కు చేరుకున్న కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాకేష్ భట్, ఉపాధ్యక్షుడు సందేష్ పవార్, విక్రమ్ అయ్యంగార్, అజయ్ శాస్త్రి, ప్రమోద్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిని అప్‌గ్రేడ్ చేయండి


డీజీ రవిప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ మంత్రి శివశంకరరెడ్డి

గౌరిబిదనూరు: యలహంక, హిందూపురం మధ్య వాహనాల రద్దీ పెరుగుతున్నందున ఈ జాతీయ రహదారి 44ను అప్‌గ్రేడ్ చేయడానికి చర్యలు చేపట్టాలని ఢిల్లీలో మాజీ మంత్రి శివశంకర్‌రెడ్డి సంబంధిత రహదారుల శాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఫోన్‌లో వివరాలు తెలిపారు. జాతీయ రహదారుల కార్యాలయంలో డైరెక్టర్ జనరల్ రవిప్రసాద్‌ను కలిసి విన్నవించినట్లు శివశంకర రెడ్డి తెలిపారు. ఈ రోడ్డు అప్‌గ్రేడ్ చేయడం వల్ల యలహంక-సోమందేపల్లి మధ్య వాహనాల సంచారానికి ప్రయోజనం కలుగుతుందని, ప్రజలకు అనువుగా వుంటుందని తెలిపారు.

డీకేశి కనిపించలేదని పోస్టర్

శివాజీనగర: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కనిపించలేదని, ఆయన ఆచూకీ తెలియజేయాలని రాష్ట్ర బీజేపీ శాఖ ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. ఎక్స్‌లో పోస్టర్ విడుదల చేసిన బీజేపీ, కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి పెద్ద స్థాయిలో సహకరించి రుణాన్ని తీర్చుకునేందుకు, లోక్‌సభ ఎన్నికల తరువాత సీఎం కుర్చీకి లాబీయింగ్ చేసేందుకు కావేరిని స్టాలిన్ రాష్ట్రానికి విచ్చలవిడిగా విడిచిపెట్టిన డీసీఎం డీ.కే.శివకుమార్ కనిపించటం లేదు. దయచేసి ఆయన ఆచూకీ చెప్పాలని పోస్టర్‌ను విడుదల చేసింది.

జరిమానా తప్పించుకోవడానికి..

బనశంకరి: జరిమానా తప్పించుకోవడానికి బైకు నెంబరుప్లేట్‌కు ఫేస్‌మాస్క్‌ను అంటించిన ఓ యువకుడి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిబంధనలు ఉల్లంఘించినందుకు ఇతనికి ట్రాఫిక్ పోలీసులు రూ. 13 వేలు జరిమానా విధించారు. దీంతో ఇతను జరిమానా తప్పించుకోవడానికి నెంబర్ ప్లేట్‌ను ఫేస్‌మాస్క్‌తో మూసేశాడు. ఈ క్రమంలో థర్డ్ ఐ, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై సాధారణంగా షేర్ చేస్తున్న సోషల్ మీడియా నగర పోలీసులు చర్యలు తీసుకోవాలని బైక్ ఫొటోలు పోస్టు చేశారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వెనుక నుంచి లారీని ఢీకొన్న బస్సు

● డ్రైవర్ దుర్మరణం


నుజ్జునుజ్జయిన బస్సు

దొడ్డబళ్లాపురం: పదిచక్రాల లారీని బస్సు వెనుక నుండి వేగంగా ఢీకొన్న ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతి చెందిన సంఘటన నెలమంగల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీబాలాజీ ట్రావెల్స్ బస్సు యజమానికం డ్రైవర్ నాగేశ్ (52) మృతి చెందిన వ్యక్తి. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో నాగేశ్ 4వ జాతీయ రహదారిపై టీసీఐ వద్ద బెంగళూరు వైపు బస్సులో వస్తుండగా అదుపుతప్పి ముందు వెళ్తున్న పది చక్రాల లారీని వేగంగా ఢీకొన్నాడు. తీవ్రతకు నాగేశ్ ముందు గ్లాసును పగలగొట్టుకుని ఎదురుగా వచ్చిన లారీ చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నెలమంగల ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


జాతీయ సమైక్యతను చాటుతూ అభినయం


కన్నడ సంస్కృతిని ప్రతిబింబిస్తూ నాట్యం


విద్యార్థినుల జానపద నృత్యం

నేత్రపర్వం.. యువ సౌరభం




పురాణ కథలను నాటిక ద్వారా వివరిస్తున్న యువత


శరణు.. శరణు నరసింహా.. నరసింహ అవతారాన్ని తెలియజేసే సన్నివేశం

● నాడహబ్బ ఉత్సవాల్లో అలరించిన నారీశక్తి సంభ్రమం

మైసూరు: మానసగంగోత్రి బయలు రంగమందిరంలో నాడహబ్బ మైసూరు దసరా మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న యువ సంభ్రమ కార్యక్రమాలు ఆనందోత్సవాలతో సాగుతున్నాయి. గురువారం రాత్రి నారీశక్తిపై విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. తాము పురుషుల కంటే తక్కువమేమి కాదని, వారితో సమానంగా పోటీ పడుతున్నామని ఈ సందర్భంగా నిరూపించారు.

● బన్నూరిలోని బాలికల ప్రభుత్వ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థినులు సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాధలను నృత్యం ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు.

● ఇక మైసూరు మహారాణి మహిళ వాణిజ్య కళాశాల విద్యార్థినులు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన సంస్కృతి, సాంప్రదాయాలకు చెందిన నృత్యాలు చేసి అలరించారు.

● కొళ్ళేగాలలోని జేఎంఎస్ మహిళ కళాశాల విద్యార్థుల బృందం జానపద సంస్కృతి సాంప్రదాయలను ప్రతిబింబించెలా జోగి సినిమా నృత్యంతో పాటు మైలారి, కుంతానె మాదేవ తదితర జానపద గీతాలతో అలరించారు.

ఆహ్లాదం పంచని ఉద్యానవనం


పనికిరాకుండా పోయిన ఆటల పరికరాలు


మహాత్మాగాంధీ ఉద్యానవనం

● కొరవడిన నిర్వహణ
● పనిచేయని ఆటల పరికరాలు
● ముందుకు కదలని చిన్నారుల రైలు

శివమొగ్గ: అలసిన మనస్సులకు ఆహ్లాదాన్ని అందించాల్సిన ఉద్యానవనాలు బోసిపోయాయి. పచ్చదనం ఎండమావిలా మారింది. నిర్వహణ అధ్వానంగా మారడంతో ప్రజలు పార్కుల వైపు కన్నెత్తి చూడటం లేదు. కోట్ల రూపాలతో ఏర్పాటు చేసిన పరికరాలు నిరుపయోగంగా మారాయి. శివమొగ్గ నగరంలోని హృదయ భాగంలోని మహాత్మాగాంధీ ఉద్యానవనం దుస్థితి ఇది. మాజీ సీఎం యడియూరప్ప హయాంలో వ్యయం చేసిన నిధులు రూ.10 కోట్లు వృథా అయ్యాయి. చిన్నారులు ఆడుకునేందుకు లక్షల రుపాయల ఖర్చు చేసిన ఏర్పాటు చేసిన ఆటల వస్తువులు పనికి రాకుండా పోయాయి. చిన్నారుల రైలు కూత వేయడం లేదు. చిన్నపాటి రిపేరి కావడంతో దానానిని మూలకు వేశారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈత కొలను నీటిని తరచూ మార్చకపోవడంతో పాచిపట్టిపోయింది.పైగా నీరంతా దుర్వాసన వస్తోంది. జల్లులు కురిపించే ఫౌంటేన్ పనిచేయడం లేదు.

క్యాబ్ క్యాన్సిల్ చేశారని మహిళపై దుర్భాషలు

● క్యాబ్ డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

బనశంకరి: మహిళను దూషించి అశ్లీల మెసేజ్‌చేసిన హోసూరుకు చెందిన దినేశ్ అనే ఓలా క్యాబ్‌డ్రైవర్‌ను ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు.' తన కుమారుడిని స్కూల్ నుంచి ఇంటికి తీసుకొచ్చేందుకు గురువారం సాయంత్రం ఓ మహిళ ఓలా యాప్ ద్వారా క్యాబ్ బుక్‌చేసింది. అరగంట గడిచినా క్యాబ్ రాకపోవడంతో బుకింగ్ క్యాన్సిల్ చేసి ఆటో తీసుకుని ఇంటికి చేరుకుంది. కొద్దిసేపటి అనంతరం క్యాబ్ డ్రైవరు ఫోన్ చేశాడు. క్యాబ్ బుకింగ్ క్యాన్సిల్ చేసినందుకు తనకు నష్టం జరిగిందని చెప్పగా సమయం మీరు రాక పోవడంతో బుకింగ్ క్యాన్సిల్ చేశానని ఆమె సమాధానం ఇచ్చింది. అయితే క్యాబ్ డ్రైవర్ పలుమార్లు ఫోన్ చేసి వేధించడంతోపాటు అశ్లీలంగా మెసేజ్‌లు పెట్టి తనకు డబ్బు వాపస్ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నెల రోజుల్లోగా బకాయిలు చెల్లించాలి

శివాజీనగర: ప్రభుత్వం నెలలోగా అన్ని శాఖల్లో కనీసం 50 శాతం బకాయిలు విడుదల చేయాలని, లేని పక్షంలో బెంగళూరుతో పాటుగా రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపడుతామని కర్ణాటక కాంట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు డీ.కెంపణ్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం నగరంలో చామరాజపేట కాంట్రాక్టర్ల సంఘం ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, బకాయిలు విడుదల చేసేందుకు ఎలాంటి సాకులు చెప్పకూడదని, కమీషన్ల పేరుతో వాయిదా వేయకూడదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించకుండా కొంత సమస్యలు నెలకొన్నాయన్నారు.

ధార్మిక పరిషత్ సభ్యుడిగా రాధాకృష్ణరాజు


రాధాకృష్ణరాజును సత్కరిస్తున్న మంత్రి

శివాజీనగర: కర్ణాటక ధార్మిక పరిషత్ సభ్యుడిగా ఎంపికైన తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు డాక్టర్ ఏ.రాధాకృష్ణరాజు శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ధార్మిక పరిషత్ ప్రథమ సమావేశంలో పదవీ స్వీకారం చేసిన రాధాకృష్ణరాజును రాష్ట్ర రవాణా, దేవాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి శాలువా కప్పి సత్కరించారు. ధార్మిక పరిషత్ సభ్యుడిగా తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా రాధాకృష్ణరాజు తెలిపారు.

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

మండ్య: మండ్య జిల్లాలో టపాసుల దుకాణాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని జిల్లా అధికారి డాక్టర్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండ్య నగరంలోని జిల్లా అధికారి కార్యాలయంలో ఆయన టపాసుల దుకాణాల యజమానులతో ముందస్తు సమావేశం నిర్వహించి మాట్లాడుతూ... నవంబర్ 11 నుంచి 14 వరకు తాత్కాలిక టపాసుల దుకాణాలకు అనుమతి ఇవ్వడానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని, నిబంధనలు పాటించిన వారి దుకాణాలకు అనుమతులు ఇస్తామన్నారు.

లోకాయుక్తకు చిక్కిన అధికారి

శివమొగ్గ: కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటూ సంక్షేమ శాఖ అధికారి లోకాయుక్తకు చిక్కిన సంఘటన శివమొగ్గ తాలూకా బుక్కపుర గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. శివమొగ్గ తాలూకా సంక్షేమ శాఖ సహాయక డైరెక్టర్ గోపీనాథ్ పట్టుబడిన అధికారి. బుక్కాపురం స్మశానం అభివృద్ధి కోసం సంక్షేమ శాఖ రూ.10 లక్షలు మంజూరు చేసింది. దీంతో స్థల పరిశీలన చేసిన అధికారి గోపీనాథ్ రూ. 15 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో సదరు కాంట్రాక్టర్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. లోకాయుక్త ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఉమేశ్, సీఐ సురేశ్ సిబ్బందితో కాపుగాచి కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటుండగా దాడి చేసి అధికారి గోపీనాథ్‌ను పట్టుకుని అరెస్ట్ చేశారు.

జీపీ అధ్యక్షుడి దారుణ హత్య


గౌడప్పగౌడ (ఫైల్)

యశవంతపుర: పట్టపగలే గ్రామ పంచాయతీ అధ్యక్షుడిని దారుణంగా హత్య చేసిన ఘటన శుక్రవారం కలబురగి జిల్లా అఫజలపుర తాలూకా చౌడాపూరలో జరిగింది. చౌడాపూర మదరా బి గ్రామ పంచాయతీ అధ్యక్షుడు గౌడప్పగౌడ పాటీల్ (50)ను గుర్తు తెలియని దుండగులు మారణాయుధాలతో నరికి చంపారు. పాతకక్షలు కారణంగా హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఘనంగా మహిషాసుర ఉత్సవం


మహిషాసుర విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

మండ్య: మహిషాసుర ఉత్సవాన్ని మండ్య తాలూకాలోని మంగళ గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీచాముండేశ్వరి దేవాలయం ఆవరణంలో ఉన్న మహిషాసుర విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిషసుర ఉత్సవం నిర్వహించారు.

చాముండి బెట్టలో పోలీసు పహారా

మైసూరు: మైసూరు నగరంలోని చాముండి కొండపై మహిష దసరా ఉత్సవాలను అడ్డుకుంటామని బీజేపీ హెచ్చరికల నేపథ్యంలో కొండపై పోలీసులు భారీగా మోహరించారు. 144 సెక్షన్ అమలు చేశారు. దీంతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొండకు వెళ్లే నాలుగు మార్గాల్లో పోలీసులు బ్యారికేడ్లను ఏర్పాటు చేసి బందోబస్తు కల్పించారు. దీంతో దూరం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని వెళ్తున్నారు.

సీనియర్ పాత్రికేయుడు మృతి

బనశంకరి: సీనియర్ పాత్రికేయుడు కేఎస్.సచ్చిదానందమూర్తి (75) శుక్రవారం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సచ్చిదానందమూర్తి గత కొద్దిరోజులుగా శ్వాసకోస సమస్యతో బాధపడుతుండగా శేషాద్రిపురంలో ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. జయనగర టీ.బ్లాక్‌లో ఆయన స్వగృహంలో పార్థివ దేహం ఉంచి అంతిమ దర్శనానికి అవకాశం కల్పించారు. సాయంత్రం 6 గంటలకు బనశంకరి శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కోలారుకు చెందిన సచ్చిదానందమూర్తి 1982లో ది వీక్ పత్రికలో చేరారు. మళయాళ మనోరమా పత్రికా సంపాదకుడిగా పనిచేశారు. ఢిల్లీలో నాలుగు దశాబ్దాలుపాటు ఎడిటర్ గిల్డ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సచ్చిదానందమూర్తి మృతికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య, మాజీ సీఎం యడియూరప్ప సంతాపం వ్యక్తం చేశారు.

స్కూల్ బస్సు దూసుకెళ్లి వృద్ధుడి...

శివాజీనగర: మద్యం మత్తులో స్కూల్ బస్సును నడిపిన డ్రైవర్ ఒకరు ప్రాణాలు బలిగొన్నాడు. ఈఘటన దొడ్డ బాణసవాడి వద్ద జరిగింది. ప్రైవేట్ పాఠశాల పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న డ్రైవర్ సుభాష్ అప్పటికే మద్యం తాగాడు. ఇష్టానుసారంగా బస్సును నడుపుతూ వెళ్లాడు. మార్గం మధ్యలో ఒక మహిళను, మెడికల్ దుకాణం నుంచి ఇంటికి వెళ్తున్న ఆంజినప్ప (65)ను ఢీకొన్నాడు. అంజినప్ప తీవ్ర గాయాలతో ఘటన స్థలంలోనే మృతిచెందగా మహిళ ప్రాణపాయం నుండి బయట పడింది. ఘటనపై బాణసవాడి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ధర్మస్థల సంస్థ పథకాలు అభినందనీయం



తుమకూరు: శ్రీక్షేత్ర ధర్మస్థల సంస్థ గ్రామీణాభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమని సిద్దగంగ మఠాధ్యక్షుడు సిద్దలింగస్వామీజీ అన్నారు. ఈ సందర్భంగా తుమకూరు గ్రామీణ తాలూకాలో జన జాగృతి వేదిక సహకారంతో గాంధీ జయంతిని పురస్కరించుకుని మద్యానికి దూరంగా ఉండాలని జాగృతి కార్యక్రమాన్ని స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

ఆశ్రమంలో దసరా ఉత్సవాలు


మరకత శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

బనశంకరి: దసరా నవరాత్రులు సందర్భంగా ఈనెల 15వ తేదీ ఆదివారం నుంచి 24 తేదీ వరకు జేపీ.నగర మూడోఫేజ్‌లోని శ్రీ శివబాలయోగి మహరాజ్‌ట్రస్ట్ ఆశ్రమంలో త్రిమూర్తి దేవస్థానంలో ప్రత్యేక అలంకరణ, అభిషేక పూజలు నిర్వహిస్తామని శివబాలయోగి ట్రస్ట్ కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలను వెల్లడించారు. 15 తేదీ ఆదివారం పసుపు-కుంకుమ అలంకరణ, 16 సోమవారం అక్షత అలంకరణ, 17 మంగళవారం విభూతి అలంకరణ, 18 బుధవారం పుష్ప అలంకరణ, 19 గురువారం గంధ అలంకరణ, 20 శుక్రవారం వెన్న అలంకరణ, 21 శనివారం శాకాంబరి అలంకరణ, 22 ఆదివారం కేసరి అలంకరణ, 23 సోమవారం వర్ణాలంకరణ, 24 మంగళవారం మహిషాసురమర్దిని అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 24 తేదీ మంగళవారం సాయంత్రం విదుషి మమత భరతనాట్యం. 8 గంటల నుంచి 10 గంటల వరకు చిగురు చేతన కళాసంఘం బృందంచే మోహిని భస్మాసుర రంగ రూపకం ప్రదర్శిస్తారని రాంబాబు తెలిపారు.

నగల షాప్ లూటీ కేసులో ఒకరి అరెస్ట్


అరెస్టయిన హుసేన్

యశవంతపుర: బెంగళూరు నగరంలో పట్టపగలు నగల దుకాణం లూటీ కేసులో బ్యాడరహళ్లి పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. లూటీ అనంతరం హైదరాబాదుకు విమానంలో వెళ్లటానికి యత్నించిన హుసేన్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద కొద్దిపాటి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు సికందర్, శివ, వికాశ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. చోరీలకు పాల్పడుతున్న శివకు జైల్లో హైదరాబాద్‌కు చెందిన హుసేన్, సికందర్, వికాస్‌లు పరిచయం అయ్యారు. అందరూ కలిసి దోపిడీకి పథకం వేశారు. గురువారం ఉదయం నలుగురు రెండు బైకుల్లో బ్యాడరహళ్లి పోలీసుస్టేషన్ పరిధిలో పైప్‌లైన్ రోడ్డులోని వినాయక జ్యువెలరీ దుకాణం వద్దకు వచ్చారు. అనంతరం యజమాని మనోజ్ లోహర్‌పై పిస్తోల్‌తో దాడి చేసి కేజీ బంగారు నగలు దోచుకోని పరారయ్యారు. హుసేన్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

హోసూరు వార్తలు..

కావేరి సమస్య పరిష్కరించాలి


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ

హోసూరు: కావేరి సమస్యను పరిష్కరించకపోతే రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం కేంద్రంలోని కాంగ్రెస్ కూటమి నుంచి వైదొలగిపోవాలని క్రిష్ణగిరి జిల్లా బర్గూరు సమితిలో అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ ఎంపీ తంబిదురై విలేకరుల సమావేశంలో తెలిపారు. క్రిష్ణగిరి జిల్లా బర్గూరు సమితిలోని తొగరపల్లి గ్రామంలో ఎంపీ నిధుల నుంచి రూ. 14 లక్షల ఖర్చుతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం కేంద్ర కాంగ్రెస్ పార్టీ కూటమిలో ఉండడంతో కర్ణాటక ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకురావడం లేదని, పార్లమెంట్ సమావేశంలో కూడా అన్నాడీఎంకే ఎంపీలు మాత్రమే కావేరి సమస్యపై ధ్వజమెత్తుతున్నారని, డీఎంకే, కూటమిపార్టీల ఎంపీలు మౌనంగా ఉండిపోతున్నారని, 2026లో జరిగే శాసనసభ ఎన్నికల్లో డీఎంకే పార్టీని ప్రజలు ఇంటికి పంపడం ఖాయమని, గత అన్నాడీఎంకే హయాంలో కావేరి సమస్య తలెత్తిన సమయంలో అన్నాడీఎంకే పార్టీ ఎంపీలు పార్లమెంట్ సమావేశంలో పోరాడి సమస్యను పరిష్కరించామని, ప్రస్తుతం పార్లమెంట్ సమావేశంలో డీఎంకే కూటమి పార్టీల ఎంపీలు మౌనం పాటించడంతోనే సమస్య తలెత్తిందని, కావేరి సమస్యకు రాష్ట్ర ప్రభుత్వానికి తమ మద్దతు కల్పిస్తున్నామని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజేంద్రన్, పంచాయతీ అధ్యక్షులు ఉమాలక్ష్మి, ప్రభు, వెత్రిసెల్వన్, మాదయ్యన్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

తుపాకీతో కాల్చుకుని జ్యువెలరీ యజమాని ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న సురేశ్ (ఫైల్)

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో ప్రముఖ జ్యువెలరీ దుకాణం యాజమాని తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన శుక్రవారం వెలుగులోకొచ్చింది. క్రిష్ణగిరిలోని వేంకటేశ్వర జ్యువెలరి యాజమాని, అన్ని వాణిజ్య సంఘాల అధ్యక్షులు సురేశ్‌గాంధీ శుక్రవారం తనకు తానుగా తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. విషయం తెలుసుకొన్న క్రిష్ణగిరి పట్టణ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

ఉద్యోగం పేరుతో వంచన

● ఇద్దరి అరెస్ట్

హోసూరు: ఉద్యోగం ఇప్పిస్తామని వంచనకు పాల్పడిన హోసూరుకు చెదిన పద్మ, శివ అనే నిందితులను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు పట్టణంలోని తేరుపేటకు చెందిన వినోద్‌కుమార్‌ను నిందితులు సంప్రదించారు. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపి రూ. 8 లక్షలు తీసుకొన్నారు. అనంతరం నకిలీ నియామక ఉత్తర్వులు అందజేశారు. అవి నకిలీవని తేలడంతో తాను ఇచ్చిన నగదు వాపస్సు ఇవ్వాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశాడు. నగదును అందజేసేందుకు నిరాకరించడంతో బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని శివ, శ్రీధర్‌ను అరెస్ట్ చేశారు.

బస్సు ఢీకొని ఇద్దరు దుర్మరణం

కెలమంగలం: ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన తళి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకొంది. డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని దేవగానపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు యోగిక్రిష్ణ (22), అదే గ్రామానికి చెందిన నరసింహయ్య (50)లు మృతి చెందారు. వీరిద్దరు ద్విచక్రవాహనంలో మదగొండపల్లి నుంచి దేవగానపల్లి వైపు వస్తుండగా ఎదురుగా వచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొంది. దీంతో ఇద్దరు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో యోగి క్రిష్ణకు ఏడాది క్రితం పెళ్లి జరగ్గా అతని భార్య ఎనిమిది నెలల గర్భిణి. విషయం తెలుసుకొన్న తళి పోలీసులు ఘటనా స్థలాన్ని, కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

బస్సు కోసం విద్యార్థుల ఆందోళన

కెలమంగలం: తారురోడ్డు ధ్వంసం కావడంతో గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆరోపిస్తూ ఆర్టీసీ బస్సును అడ్డగించి విద్యార్థులు ఆందోళన చేపట్టారు. డెంకణీకోట బస్టాండు నుంచి అటవీ ప్రాంత గ్రామాలైన దొడ్డబిలిముద్ర, కాడిచిపల్లి, సావరబత్తం తదితర గ్రామాలకెళ్లే ఆర్టీసీ బస్సు దొడ్డబిలిముద్ర గ్రామానికెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో ఆ మార్గాన్ని మళ్లిస్తూ రావడంతో గ్రామానికి చెందిన 300 మందికి పైగా రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు సమయాని కెళ్లలేక పోవడంతో సమస్యను సంబంధిత శాఖాధికార్ల దృష్టికి తీసుకెళ్లారు. ఫలితం లేకపోవడంతో ఆగ్రహానికి గురైన విద్యార్థులు, గ్రామస్తులు ఆర్టీసీ బస్సును అడ్డగించారు. విషయం తెలుసుకొన్న డెంకణీకోట ఎస్ఐ సుకుమార్ నేతృత్వంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. గ్రామానికి బస్సు వచ్చే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష


పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో బీపీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తూర్పుపల్లిలో జగనన్న సురక్ష క్యాంపులో రోగులకు వైద్య పరీక్షల అనంతరం మందులు అందజేస్తున్న సిబ్బంది


ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని గుణదలలో రోగులకు పరీక్షలు చేసి, మందులిస్తున్న వైద్య సిబ్బంది


నంద్యాల జిల్లా చాకరాజువేములలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఓపీ నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగులు


తిరుపతి జిల్లా సత్యవేడులోని 4వ సచివాలయం పరిధిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు

ఏమీ తెలియదంటూ.. 17ఏ రక్షణ కావాలంటే ఎలా?

ఇవి రెండూ పరస్పర విరుద్ధ వాదనలు కాదా?

చంద్రబాబు క్వాష్ పిటిషన్లో ఏపీ ప్రభుత్వ న్యాయవాది రోహత్గీ ప్రశ్నలు

- నిజాయితీపరుల రక్షణకే 17ఏ... గత ఘటనలకూ పాత చట్టాలు వర్తిస్తాయి
- ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా దర్యాప్తు చేశాయి... కోర్టుకు నివేదన
- చంద్రబాబుకు డబ్బు చేరినట్లు ఎలా గుర్తించారని ప్రశ్నించిన ధర్మాసనం
- షెల్ కంపెనీల ద్వారా బాబు, ఆయన పార్టీ ఖాతాల్లోకి చేరిందన్న రోహత్గీ
- ఒప్పందం సీఎం స్థాయిలోనే జరిగిందని కూడా వెల్లడి
- తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం గురించి తనకేమీ తెలియదన్నప్పుడు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ద్వారా రక్షణ కావాలని చంద్రబాబు ఎలా అడుగుతారని ఏపీ ప్రభుత్వ సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ప్రశ్నించారు. అలా కోరడంలో అర్థం లేదన్నారు. 'అధికార విధులు నిర్వర్తించడమంటే అవినీతికి పాల్పడడం కాదు కదా? చట్టాల్లో నిజాయితీపరులకే రక్షణ కల్పించారు. సెక్షన్ 17ఏ కూడా అలాంటివారి కోసమే' అంటూ దీనిపై సుప్రీంకోర్టు ఇచ్చిన పలు రూలింగ్‌లను ప్రస్తావించారు. 'స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో గవర్నరు అనుమతి లేకుండా తనను అరెస్టు చేశారు కనక... మొత్తం కేసును కొట్టేయాలంటూ చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. నేరం జరిగిందా? లేదా? అన్న అంశంపై కాకుండా టెక్నికల్‌గా చంద్రబాబు అరెస్టు చెల్లదు కాబట్టి కేసును కొట్టేయాలంటూ ఆయన లాయర్లు కోరటంతో శుక్రవారం కూడా ఈ విషయంపైనే వాదనలు కొనసాగాయి. జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం ఎదుట... చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు హరీశ్‌సాల్వే, సిద్ధార్థ లూథ్రా, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. మరోవైపు ఫైబర్ నెట్ కుంభకోణం కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్ కూడా ఇదే ధర్మాసనం ముందుకు వచ్చింది. రెండు కేసుల విచారణను మంగళవారానికి కోర్టు వాయిదా వేసింది.

సవరణకు ముందు జరిగిన ఘటనకు పాత చట్టమే...

'రద్దు చేసిన సెక్షన్ల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చా అని ఈ ధర్మాసనం ఇదివరకు అడిగింది. సరిగ్గా ఇదే పాయింట్‌పై ఓ తీర్పు ఉంది' అంటూ ఎంసీ గుప్తా కేసును ముకుల్ రోహత్గీ ప్రస్తావించారు. 1947లో చట్టం రద్దు చేశాక దాంట్లోని నిబంధనల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయజాలరని ఎంసీ గుప్తా కేసులో పిటిషనర్ వాదించారన్నారు. కానీ కొత్త చట్టం అమల్లోకి రాకముందే నేరం జరిగిన విషయాన్ని కోర్టు గుర్తించిందని... చట్టాన్ని రద్దు చేసినా, వెనక్కి తీసుకున్నా నేరం జరిగే నాటికి ఉన్న చట్టమే వర్తిస్తుందని తీర్పునిచ్చిందని చెప్పారు. సరిగ్గా చంద్రబాబు కేసులోనూ అంతే జరిగిందన్నారు. చంద్రబాబుపై సెక్షన్ 13 (సీ),(డీ) కింద అభియోగాలు మోపారని, వాటిని తర్వాత రద్దు చేసినప్పటికీ, రద్దుకు ముందు నేరం జరిగిందని రోహత్గీ వివరించారు. 'చట్ట సవరణలు సాధారణం. పాత చట్టాల్లో కొంత భాగం పోతుంది. కానీ సవరణకు ముందు జరిగిన ఘటనలకు మాత్రం ఆ పాత చట్టమే వర్తిస్తుంది' అని వ్యాఖ్యానించారు. ఈ కేసుకు ఎట్టి పరిస్థితుల్లోనూ సెక్షన్ 17ఏ వర్తించదని రోహత్గీ తేల్చి చెప్పారు. 'సెక్షన్ 17ఏ జులై 2018లో అమలులోకి వచ్చింది. నేరం 2015–2016 మధ్య జరిగింది. ఆ సమయంలో చట్టంలో సెక్షన్ 17ఏ లేదు' అని రోహత్గీ తెలిపారు. చట్ట సవరణకు ముందు కేసు కాబట్టి 17ఏ వర్తించదన్నారు.

సుప్రీంకోర్టులో ఎన్నడూ ఇలా జరగలేదు...

దర్యాప్తు ప్రారంభించిన ఐదు-పది రోజుల్లోనే విచారణను అడ్డుకోవడానికి కోర్టు అంగీకరించే అవకాశం లేదని ముకుల్ రోహత్గి చెప్పారు. హైకోర్టులో కస్టడీని వ్యతిరేకిస్తూ వాదించి, అదే రోజున సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయడం తాను ఎన్నడూ చూడలేదన్నారు. విచారణ ప్రారంభమైందనడానికి 2018 మే, జూన్ నెలల డాక్యుమెంట్లున్నాయని, వీటిని హైకోర్టుకు కూడా ఇచ్చామని, తమ వాదనలతో కోర్టు ఏకీభవించిందని చెప్పారు.

బాబుకు డబ్బు అందినట్లు ఎలా గుర్తించారు?

చంద్రబాబు అనుకున్నది జరిగితే దర్యాప్తు ప్రాథమిక దశలోనే నిలిచిపోతుందని, ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే కాకుండా ఎన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలు దర్యాప్తు చేశాయో చూడాలని రోహత్గీ కోరారు. 'ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రెండు సంస్థలతో ఒప్పందం చేసుకోవడం కోసం ప్రారంభమైంది. ఎలాంటి టెండర్ లేదు. సంస్థలు 90 శాతం పెట్టుబడి పెడతాయన్నది ఆలోచన' అని రోహత్గీ చెబుతుండగా.. ఈ నిర్ణయం ఏ స్థాయిలో తీసుకున్నారని జస్టిస్ త్రివేది ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్థాయిలో తీసుకున్నారని రోహత్గీ తెలిపారు. చంద్రబాబుకు సొమ్ములు అందాయని ఎలా గుర్తించారని న్యాయమూర్తి ప్రశ్నించగా.. సొమ్ములు షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు, ఆయన పార్టీ ఖాతాలకు చేరాయని, అది ప్రజాధనమని, దీనిపై దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని రోహత్గీ తెలిపారు. దీంతో మరో రోజు విచారణ చేపడతామని జస్టిస్ బోస్ పేర్కొంటూ మంగళవారానికి వాయిదా వేశారు.

అరెస్ట్ భయం ఉంది...

అనంతరం ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులో చంద్రబాబు ముందస్తు బెయిలు పిటిషన్‌పై లూథ్రా వాదనలు ప్రారంభించారు. ఒక కేసులో అరెస్టు చేశాక... పలు కేసులు తెరపైకి తెచ్చారన్నారు. 2021లో ఎఫ్ఐఆర్ నమోదైందని, తర్వాత ఏమీ జరగకున్నా.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టయ్యాక సెప్టెంబరు 19న ఫైబర్‌నెట్ కేసులో నిందితుడిగా చేర్చి కోర్టు ముందు హాజరు కావాలని అధికారులు పీటీ వారెంట్ దాఖలు చేశారన్నారు. పీటీ వారెంట్‌ను ఏసీబీ కోర్టు అనుమతించిందని, ఇప్పుడు అరెస్టు చేస్తారేమో అని లూథ్రా ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ పూర్తి చేశామంటున్నారని, ఇక్కడ కూడా సెక్షన్ 17ఏ వర్తిస్తుందని, అయినప్పటికీ అధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదని లూథ్రా చెప్పారు. ఈ కేసులో ముగ్గురు ఇప్పటికే ముందస్తు బెయిలుపై బయట పున్నారని, మరో ముగ్గురు రెగ్యులర్ బెయిలుపై ఉన్నారని చెప్పారు. ఈ కేసులో చంద్రబాబును అరెస్టు చేయాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయన్నారు. ఈ కేసులోనూ సెక్షన్ 17ఏ వర్తిస్తుందా అని జస్టిస్ బోస్ ప్రశ్నిస్తూ.. షార్ట్ నోటీసు ఇచ్చి మంగళవారం విచారణ చేపడతామన్నారు.

ఫైబర్‌గ్రిడ్ కేసులో పీటీ వారెంట్ అమలు వాయిదా

సాక్షి, అమరావతి: ఫైబర్‌గ్రిడ్ కేసులో నిందితుడైన మాజీ సీఎం చంద్రబాబునాయుడు హాజరు కోసం సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్ అమలు విషయంలో ఏసీబీ కోర్టు తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఫైబర్‌గ్రిడ్ కేసులో చంద్రబాబును కోర్టు ముందు హాజరుపరచాలంటూ సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌ను అనుమతించిన ఏసీబీ కోర్టు.. ఈ నెల 16న చంద్రబాబును కోర్టుముందు హాజరుపరచాలని ఆదేశించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఫైబర్‌గ్రిడ్ కేసులో ముందస్తు బెయిలివ్వాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా చంద్రబాబు అరెస్టు గురించి ఆయన న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ స్పందిస్తూ.. 18వ తేదీ వరకు చంద్రబాబును అరెస్ట్ చేయబోమని చెప్పారు. సుప్రీంకోర్టులో పరిణామాల నేపథ్యంలో ఏసీబీ కోర్టు పీటీ వారెంట్ అమలు విషయంలో విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

నారా ఫ్యామిలీ నటనా చాతుర్యం అమోఘం

- మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోగ్యంపై నారా ఫ్యామిలీ ప్రదర్శిస్తున్న నటనా చాతుర్యం అమోఘమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ విమర్శించారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్యం, భద్రత గురించి పూర్తిగా అబద్ధాలు చెబుతున్నారని, జైలు అధికారులు, డాక్టర్ల మీద ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తాజాగా చంద్రబాబు బరువు తగ్గారంటూ అసత్య ప్రచారానికి తెగబడ్డారని, ఇలాంటి దుష్ప్రచారం చేయడానికి సిగ్గుపడాలన్నారు.

క్లుప్తంగా...

'సిట్' కోసం ముగ్గురు ప్రత్యేక పీపీలు

- నియామక ఉత్తర్వులు జారీ చేసిన హోం శాఖ

సాక్షి, అమరావతి: సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు చేస్తున్న ప్రధాన కేసులకు సంబంధించి న్యాయస్థానాల్లో వాదించేందుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను హోం శాఖ నియమించింది. సిట్ దర్యాప్తు చేస్తున్న పలు కీలక కేసులు ప్రస్తుతం విజయవాడ ఏసీబీ న్యాయస్థానం, హైకోర్టుల్లో విచారణ దశలో ఉన్నాయి. దాంతో ఆయా కేసుల్లో సిట్ తరఫున వాదనలు వినిపించేందుకు ముగ్గురు ప్రభుత్వ న్యాయవాదుల(జీపీ)ను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమిస్తూ హోం శాఖ ముఖ్యకార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే వై.నాగ వివేకానంద ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరిస్తుండగా.. ఆయనకు స్కిల్ డెవలప్‌మెంట్ కేసు కేటాయించారు. అదనంగా మరో ఇద్దరు.. టీఎంకే చైతన్య (ఏపీ ఫైబర్ నెట్), శెట్టిపల్లి దుష్యంత్ రెడ్డి (ఇన్నర్‌రింగ్ రోడ్డు) ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమితులయ్యారు.

అంగళ్లు కేసులో బాబుకు ముందస్తు బెయిల్

సాక్షి, అమరావతి: 'యుద్ధభేరి' పేరుతో ప్రాజెక్టుల సందర్శన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద టీడీపీ శ్రేణులు సాగించిన విధ్వంసంపై ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసులో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి శుక్రవారం తీర్పునిచ్చారు. అంగళ్లు కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం వాదనలు విన్న న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెలువరించారు. రూ.లక్ష చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని, దర్యాప్తునకు సహకరించాలని చంద్రబాబును ఆదేశించారు. సాక్షులను ఏ రకంగానూ ప్రభావితం చేయరాదని స్పష్టంచేశారు.

స్కిల్ స్కామ్‌లో సీఐడీ ఎదుట అపర్ణ హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న అపర్ణ ఉపాధ్యాయుల శుక్రవారం సీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. తాడేపల్లిలోని సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కార్యాలయానికి వచ్చిన ఆమె.. ముందస్తు బెయిల్‌కు సంబంధించిన పత్రాలను సమర్పించారు. ఉత్తర ప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన అపర్ణ.. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఎస్ఎస్‌డీసీ డిప్యూటీ సీఈవోగా స్కిల్ స్కామ్‌లో కీలక పాత్ర పోషించారు. అపర్ణ భర్త డీవీఆర్ భాస్కర్ డిజైన్‌టెక్ కంపెనీ ప్రతినిధిగా ఉండగా, పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టానికి వ్యతిరేకంగా ఆమెను ఏపీఎస్ఎస్‌డీసీ డిప్యూటీ సీఈవోగా నియమించారు. కాగా, ఈ కేసులో ఆమెకు న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఆ బెయిల్ షరతుల మేరకు అవసరమైన పత్రాలను ఆమె సిట్ కార్యాలయానికి వచ్చి అందించారు.

బాబుకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలి

- టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ

సాక్షి, అమరావతి: చంద్రబాబును ప్రజల నుంచి దూరం చేసేందుకు సీఎం జగన్ కుట్ర చేస్తున్నారని, ఆయన ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆరోపించారు. తక్షణం ఆయనకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. స్కిన్ ఎలర్జీతో బాధపడుతున్న చంద్రబాబుకు జైల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బంది పెట్టడమే కాకుండా ఆయన్ను అనారోగ్యం పాల్జేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు.

బాబు హెల్త్ బులిటెన్ జైలు అధికారి ఎలా ఇస్తారు?

- యనమల రామకృష్ణుడు

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబు హెల్త్ బులిటెన్‌ను వైద్యాధికారులు విడుదల చేయాల్సి ఉందని, జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎలా ప్రకటన ఇచ్చారని ఆ పార్టీ నేత సభ్యుడు యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిప్యూటీ సూపరింటెండెంట్ సొంతంగా లేఖ రాసి బయటకు వదిలారని ఆరోపించారు.

బరువు తక్కువ డ్రామా!

▶ మొదటి పేజీ తరువాయి

రకరకాల అంశాలను ఆయన కుటుంబ సభ్యులతో పాటు పార్టీ నేతలు తెరపైకి తెచ్చి హడావుడి చేశారు. దీనిపై జైళ్ల శాఖ అధికారులు సత్వరమే స్పందించి వాస్తవాలను బహిర్గతం చేయడం ద్వారా దుష్ప్రచారానికి తెర దించారు. వాస్తవానికి జైలుకు వచ్చినప్పటి కంటే ప్రస్తుతం చంద్రబాబు బరువు మరో కిలో పెరగడం గమనార్హం. చంద్రబాబు తీసుకునే ఆహారం ఇంటి నుంచే వస్తోంది. ఆయనకు ప్రతి రోజూ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బయట తిరగడం లాంటి శారీరక శ్రమ ఏమాత్రం లేదు. అలాంటప్పుడు బరువు ఎందుకు తగ్గుతారనే స్పృహ లేకుండా నిస్సిగ్గుగా ఆరోపణలు చేయడంపై అంతా విస్తుపోతున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని చంద్రబాబు యథేచ్ఛగా పాల్పడ్డ కుంభకోణాలు వరుసగా బయటపడుతుండటంతో టీడీపీ బెంబేలెత్తుతోంది. చంద్రబాబు 34 రోజులుగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉండటంతోనే టీడీపీ నేతలు, కార్యకర్తలు కాడి వదిలేశారు. మరోవైపు లోకేశ్ రాజకీయ కార్యక్షేత్రం కాడి వదిలేసి ఢిల్లీలో తలదాచుకోవడంతో భవిష్యత్‌పై టీడీపీ ఆశలు వదిలేసుకుంది. చంద్రబాబు అరెస్టు వ్యవహారంలో ఏమాత్రం సానుభూతి కలసి రావడం లేదని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. గత్యంతరం లేక ఏదో ఒక ఆందోళన నిర్వహిస్తున్నా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే కనిపిస్తున్నారని, సామాన్యులు ఎవరూ ఇందులో పాలు పంచుకోవడం లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో దింపుడు కళ్లెం ఆశతో టీడీపీ చివరి అస్త్రంగా చంద్రబాబు ఆరోగ్యం బాగా లేదనే అవాస్తవ ప్రచారాన్ని తెరపైకి తెచ్చింది. వైద్యుల నివేదికలు, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు అధికారుల ప్రకటనతో ఆ యత్నం కూడా బెడిసికొట్టింది.

మొన్ననే బాగున్నారన్న పయ్యావుల..

మూడు రోజులుగా చంద్రబాబుకు అరోగ్యం బాగా లేదంటూ వ్యూహాత్మకంగా ప్రచారాన్ని టీడీపీ తెరపైకి తెచ్చింది. గతవారం రెండో ములాఖత్‌తో చంద్రబాబును కలిసిన లోకేశ్, పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడుతూ తమ అధినేత పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన వద్దని, చంద్రబాబు పార్టీ కోసం, రాష్ట్రం కోసం ఆలోచిస్తున్నారని కూడా వ్యాఖ్యానించారు. అయితే రాజకీయ ప్రయోజనాల కోసం హఠాత్తుగా చంద్రబాబు ఆరోగ్యం సరిగా లేదంటూ ప్రచారానికి దిగారు. ఎంత పకడ్బందీగా దీన్ని వ్యాప్తిలోకి తెచ్చారంటే.. చంద్రబాబు ఆరోగ్యం బాగా లేదంటూ నారా భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి వరుసగా ట్వీట్లు పెట్టారు. ఆ వెంటనే యనమల రామకృష్ణుడు అందుకున్నారు. అచ్చెన్నాయుడుతోపాటు పార్టీ సీనియర్ నేతలు సమావేశమై చంద్రబాబు ఆరోగ్యం బాగా లేదంటూ ప్రకటనలు చేశారు. చంద్రబాబు ఏకంగా ఐదు కిలోల బరువు తగ్గారని, కిడ్నీలు దెబ్బ తింటాయంటూ తామే వైద్యులమనే తరహాలో హడావుడి చేశారు. బాబు శరీరంపై దద్దుర్లు వచ్చాయని, ఏసీ లేకపోవడంతో ఈ సమస్య వచ్చిందని నిర్ధారించేయడం విస్మయ పరుస్తోంది. చంద్రబాబుకు స్టెరాయిడ్లు ఇస్తున్నారనే దుష్ప్రచారాన్ని తెరపైకి తేవడం టీడీపీ దిగజారుడుతనానికి నిదర్శనం. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుపై గుర్తు తెలియని డ్రోన్లు తిరిగాయని ఆరోపిస్తూ చంద్రబాబు భద్రతపై ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించారు. వెంటనే ఎయిమ్స్ ఆసుపత్రికిగానీ ఏదైనా ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రికిగానీ తరలించాలని డిమాండ్ చేశారు. తద్వారా ఆసుపత్రి నుంచి రాజకీయం నెరపవచ్చన్నది టీడీపీ ఉద్దేశం. అందుకోసమే అనారోగ్యం, భద్రతకు ప్రమాదం అంటూ అసత్య ఆరోపణలు ప్రచారంలోకి తెచ్చారు.

మాన్యువల్ ప్రకారం సదుపాయాలు


చంద్రబాబు ఆరోగ్యంపై టీడీపీ కుట్రపూరితంగా చేసిన అసత్య ఆరోపణలను జైళ్ల శాఖ సమర్థంగా తిప్పికొట్టింది. జైలు మాన్యువల్‌లోని నిబంధనలను కచ్చితంగా పాటిస్తున్నామని వివరించింది. జైళ్ల శాఖ మాన్యువల్‌లోని 1037, 385, 386 నిబంధనల్లో పేర్కొన్న ప్రకారం వీఐపీ ఖైదీలకు నిర్దేశించిన అన్ని సదుపాయాలను ఆయనకు కల్పిస్తున్నట్లు తెలిపింది. జైలు గదిలో ఫర్నిచర్, ఇతర వసతులను కూడా ఆమేరకు సమకూర్చినట్లు పేర్కొంది. జైళ్ల శాఖ మాన్యువల్ ప్రకారం జైలులో ఏసీగానీ ఎయిర్ కూలర్‌గానీ కల్పించే వెసులుబాటు లేదని వెల్లడించింది. మాన్యువల్‌కు విరుద్ధంగా వ్యవహరించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. చంద్రబాబు ఉన్న జైలు గదిలో 8 ఫ్యాన్లు ఏర్పాటు చేశామని, న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇంటి నుంచి భోజనాన్ని అనుమతిస్తున్నామని తెలిపింది. రోజూ జైలు వైద్య అధికారులు, సిబ్బంది చంద్రబాబును పరీక్షిస్తున్నారని, ఆయనకు ఎలాంటి అనారోగ్యం లేదని వెల్లడించింది. సెకండ్ ఒపీనియన్ కోసం జీజీహెచ్ వైద్యులను కూడా పిలిపించి పరీక్షలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసింది. చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యుల నివేదిక కూడా వెల్లడించింది. ఇక జైలుకు వచ్చినప్పటి కంటే ప్రస్తుతం చంద్రబాబు ఒక కేజీ బరువు పెరిగి ప్రస్తుతం 67 కిలోల బరువు ఉండటం గమనార్హం.

బాలయ్య దూకుడుతో..

పూర్తి ఆధారాలతో చంద్రబాబు అవినీతిని వెలికి తీసిన సీఐడీ పకడ్బందీగా కేసులు నమోదు చేసింది. 'స్కిల్' కుంభకోణం కేసులో చంద్రబాబు రిమాండ్ ఖైదీగా జైలులో ఉండగా ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు అల్లర్ల కేసులు వెయిటింగ్ లిస్టులో ఉన్నాయి. అమరావతిలో అసైన్డ్ భూముల కుంభకోణం కేసు కూడా ఉంది. సీఆర్‌పీసీ, అవినీతి నిరోధక చట్టాల్లోని సెక్షన్లకు వక్రభాష్యం చెబుతూ ఢిల్లీ నుంచి రప్పించిన న్యాయవాదులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. చంద్రబాబుకు ఇప్పట్లో బెయిల్ రావడం సాధ్యం కాదని నిపుణులు తేల్చి చెబుతున్నారు. పోనీ చినబాబును పట్టుకుని రాజకీయ గోదారి ఈదుదామనుకుంటే ఆయనేమో కేసుల భయంతో ఢిల్లీలో దాక్కున్నారు. ఇదే అవకాశంగా టీడీపీలో ఆధిపత్యం కోసం బాలకృష్ణ దూకుడుగా వ్యవహరించడం నారా కుటుంబాన్ని బెంబేలెత్తించింది. దాంతో తెలంగాణ ఎన్నికల సాకుతో బాలయ్యను ఆ రాష్ట్రానికే పరిమితం చేశారు.

కిలో బరువు పెరిగారు

- జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ తెలిపారు. జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు హై ప్రొఫైల్ ఖైదీ అయినందున తొలి రోజే ఆయనకు స్నేహ బ్యారక్‌ను కేటాయించామని గుర్తు చేశారు. ఆయన వద్ద 24 గంటలూ ఒక హెడ్ వార్డర్, ఆరుగురు వార్డర్లుంటారని, ఒక జైలర్ స్థాయి అధికారి విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. ఆయనకు వచ్చే ఆహారం, ఇతరత్రా అన్నీ ఆయనే తనిఖీ చేసి చంద్రబాబుకు అందిస్తారని తెలిపారు. ములాఖత్‌కు చంద్రబాబు బయటకు వచ్చేప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులు ఆ ప్రాంతంలోకి రాకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీతో వారానికోసారి భద్రతపై చర్చిస్తున్నామన్నారు. చంద్రబాబు భద్రతకు ఎలాంటి ఢోకా లేదని, సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంటున్నారని స్పష్టం చేశారు.

రోజుకు మూడుసార్లు పరీక్షలు..

చంద్రబాబు జైలుకు వచ్చినప్పుడు ఆయన ఆరోగ్యం, మందుల వివరాలను సేకరించామని డీఐజీ తెలిపారు. జైలులో వైద్యాధికారులు చంద్రబాబుతో మాట్లాడడమే కాకుండా ఆయనకు చికిత్స అందించిన వ్యక్తిగత వైద్యుడితోనూ సంప్రదించినట్లు చెప్పారు. ఆయన మందులు వేసుకుంటున్నారా లేదా? అనేది జైలు వైద్య సిబ్బంది పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. రోజుకు మూడుసార్లు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారని వెల్లడించారు. జైలుకు వచ్చినప్పుడు చంద్రబాబు 66 కేజీల బరువు ఉండగా ప్రస్తుతం 67 కిలోలు ఉన్నట్లు వెల్లడించారు. బరువు తగ్గిపోయారంటూ వస్తున్న తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని సూచించారు. రెండు రోజుల క్రితం డీహైడ్రేషన్ అని తెలియజేయగానే వైద్యాధికారులతో మాట్లాడి తగిన లిక్విడ్‌లు ఇచ్చినట్లు చెప్పారు. చర్మంపై దద్దుర్లకు సంబంధించి అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వైద్య పరీక్షలు చేశారని, అవేమీ ప్రమాదకర స్థాయిలో లేవన్నారు. చంద్రబాబు గదిలో 8 ఫ్యానులతో పాటు దోమ తెర ఏర్పాటు చేశామన్నారు. జైల్లోకి వచ్చినప్పుడు తెచ్చుకున్న మందులను కొనసాగిస్తున్నారన్నారు.

తప్పుడు వార్తలపై చర్యలు

చంద్రబాబుకు ఫైబర్ నెట్ కేసులో పీటీ వారెంట్‌కు సంబంధించి కోర్టు సీలు, న్యాయమూర్తి సంతకం లేనందున వివరణ కోరినట్లు డీఐజీ తెలిపారు. సెంట్రల్ జైల్లో 2,039 మంది ఖైదీలున్నారని, వారిలో చంద్రబాబు ఒకరని, రిమాండ్ ఖైదీ పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అలానే తీసుకుంటున్నట్లు తెలిపారు. తమపై ఒత్తిళ్లు ఉన్నాయనే వార్తలు అవాస్తవమన్నారు. సోషల్ మీడియా, పత్రికల్లో వస్తున్న తప్పుడు వార్తలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జైలేమైనా అత్తారిల్లా!?

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: జైలు ఏమైనా అత్తగారి ఇల్లా?.. దేశంలో ఎక్కడాలేని రీతిలో రాజమండ్రి జైలులో ఏసీలు పెట్టాలా? అంటూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి.. చంద్రబాబు కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలకు చురకలు అంటించారు. చంద్రబాబు కంటే ఎక్కువ వయసున్న లాలూప్రసాద్ యాదవ్, ఓం ప్రకాశ్ చౌతాలా కూడా జైల్లో ఉన్నారు కదా... అని గుర్తుచేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో అనారోగ్యానికి గురయ్యారంటూ రెండు మూడ్రోజులుగా కొత్త డ్రామాకు తెరలేపిన లోకేశ్, భువనేశ్వరి, బ్రాహ్మణి, ఇతర టీడీపీ నేతలు.. శుక్రవారం దాన్ని రక్తికట్టించే ప్రయత్నంలో చంద్రబాబు ఆరోగ్యం విషమించిందని ఎల్లో మీడియాలో అదే పనిగా దుష్ప్రచారం చేశారని సజ్జల మండిపడ్డారు. స్కిల్ స్కాం నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ డ్రామా ఆడుతున్నారన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నారని.. స్కిన్ అలర్జీ వచ్చిందని.. దోమలు కుడుతున్నాయని నిన్నామొన్న ప్రచారం చేసిన ఆయన కుటుంబ సభ్యులు.. ఇప్పుడు దానికి పరాకాష్టగా జైలులో తన తండ్రికి స్టెరాయిడ్స్ ఇచ్చి చంపే ప్రయత్నం చేస్తున్నారని లోకేశ్ ట్వీట్ చేయడాన్ని ప్రస్తావించారు. డీహైడ్రేషన్, స్కిన్ అలర్జీ ప్రాణాంతకమా? అని ప్రశ్నించారు. కోర్టు ఆదేశాల మేరకు ఇంటినుంచే భోజనాన్ని అధికారులు అనుమతిస్తున్నారన్నారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే.. భువనేశ్వరి చెప్పినట్లుగా చంద్రబాబు బరువు 5 కేజీలు తగ్గలేదు. కేజీ పెరిగారు. ఆయన షర్ట్ విప్పడు. దానివల్ల చెమటతో స్కిన్ అలర్జీ వచ్చి ఉండొచ్చు. జైలు అధికారులు వైద్యులను రప్పించి.. పరీక్షలు చేయించి, సరైన మందులు ఇప్పిస్తున్నారు.

అమిత్ షానే పిలిపించుకున్నట్లుగా ప్రచారం..

చంద్రబాబు అరెస్టు వెనుక తాము లేనట్లుగా స్పష్టంచేయడానికే తనను అమిత్ షా పిలిపించుకున్నారని.. నిజం వైపు ఉండాలని తాను ఆయన్ను కోరానని లోకేశ్ మీడియాకు చెప్పినట్లు ఎల్లో మీడియా రాసింది. నిజానికి.. అమిత్ షా అలా భావిస్తే.. ఆయనే స్వయంగా ఇక్కడికి వచ్చేవాడు. చంద్రబాబు అరెస్టు వెనుక బీజేపీ ఉందని మేమెక్కడైనా చెప్పామా? నిజానికి.. టీడీపీ నాయకులే ఆ మాట చెప్పారు.

చంద్రబాబు ఈ దేశానికి లభించిన ఆస్తి

- వెంటనే బాబును ఆస్పత్రికి తీసుకెళ్లాలి: అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: రాజమండ్రి జైల్లో చంద్రబాబుకు స్టెరాయిడ్స్ అధికంగా ఉన్న మందులిచ్చారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. అవి వాడితే చంద్రబాబు ప్రాణానికే ప్రమాదమన్నారు. చంద్రబాబు కేవలం టీడీపీ అధినేత మాత్రమే కాదని, దేశానికి లభించిన ఆస్తి అని తెలిపారు. అలాంటి వ్యక్తికి ఈ ముఖ్యమంత్రి కనీసం స్నానానికి వేడినీళ్లు కూడా ఇచ్చే ఏర్పాట్లు చేయలేదన్నారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం చంద్రబాబు ఆరోగ్యంపై అందుబాటులో ఉన్న నేతలతో అచ్చెన్నాయుడు చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తక్షణమే చంద్రబాబుకి ఆయన వ్యక్తిగత వైద్యులతో పరీక్షలు చేయించి, వారి పర్యవేక్షణలోనే ఆస్పత్రికి తరలించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు పొన్నాల గుడ్‌బై

తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి బీసీల కాక మొదలైంది. బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తూ గత 45 ఏళ్లుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్న సీనియర్ నేత, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య పార్టీకి రాజీనామా చేశారు. పార్టీకి నాలుగు దశాబ్దాలకు పైగా సేవ చేసిన తనకు చివరకు అవమానాలే మిగిలాయని, ఈ ఆవేదనతోనే తాను పార్టీని వీడుతున్నానంటూ ఆయన శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాసిన లేఖ పార్టీవర్గాల్లో సంచలనం సృష్టించింది. కాంగ్రెస్‌తో కలిసి నాలుగు దశాబ్దాలకు పైగా పనిచేసిన తాను బాధాతప్త హృదయంతో ఈ లేఖను రాస్తున్నానని అందులో పొన్నాల పేర్కొన్నారు.

గర్భవతుల విషయంలో సాధారణ ప్రసవం అనే మాట ఈ రోజుల్లో ఆశ్చర్యంగా మారింది. దేశమంతటా సిజేరియన్ ప్రసవాలు పెరిగాయని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కూడా తన నివేదికల్లో చూపింది. అయితే, ప్రభుత్వ- ప్రైవేట్ ఆసుపత్రులలో నార్మల్, సిజేరియన్ ప్రసవాల సంఖ్యలో తేడా మాత్రం ఉంది. ఈ విషయాన్ని తన సొంత అనుభవంతో గమనించిన ఫిలాంత్రపిస్ట్ డాక్టర్ జాహ్నవి నిలేకని మెటర్నల్ హెల్త్‌కేర్ వైపు దృష్టి సారించింది. బెంగళూరులో మురికివాడల్లోని నగర గర్భిణుల్లో సాధారణ ప్రసవాల గురించి అవగాహన కల్పించడంతో పాటు అస్త్రికా మిడ్‌వైఫరీ పేరుతో ప్రసవాల సెంటర్‌నూ ప్రారంభించింది. సాధారణ ప్రసవం ఆవశ్యకతవైపు వేసిన ఆమె అడుగుల గురించి ఆమె మాటల్లోనే..


డాక్టర్ జాహ్నవి నిలేకని

నార్మల్ డెలివరీలు 'నార్మల్' కావాలి

డాక్టర్ జాహ్నవి నిలేకని

''చదువుకుంటున్నప్పుడే స్వదేశం కోసం ఏదైనా చేయాలనే ఆలోచనలు ఉండేవి. అమ్మ మరాఠీ, నాన్న కోంకణి. పుణేలో పుట్టి, బెంగుళూరులో పెరిగాను. గ్రాడ్యుయేషన్ కోసం అమెరికా వెళ్లాను. నా భర్త యేల్ జార్ఖండ్‌కు చెందినవాడు. ఆ విధంగా నేను ఒకే ఒక ప్రాంతానికి చెందినదానిని అని చెప్పలేను. 2012లో పెళ్లయ్యింది. ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు కర్ణాటక లో రీసెర్చ్ చేస్తున్నాను. ఆ సమయంలో నార్మల్ డెలివరీ కోసం నగరాల్లోని చాలా ఆసుపత్రుల వారిని కలిశాను. కానీ, నార్మల్ డెలివరీకి వారెలాంటి హామీ ఇవ్వకపోవడం ఆశ్చర్యమేసింది. మన దేశంలో చాలా రాష్ట్రాల్లో గర్భిణులకు సరైన సమయంలో మందులు, డాక్టర్లు, నర్సుల సేవ అందడం లేదనీ, దీనివల్ల తల్లీ బిడ్డలిద్దరి ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆ సమయంలోనే తెలుసుకున్నాను. ప్రయివేటు ఆసుపత్రులు సిజేరియన్ ప్రసవాన్ని వ్యాపారంలా మార్చేశాయి. జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే ప్రకారం జమ్మూ, కాశ్మీర్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లోని 80 శాతం ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్ ప్రసవాలు జరుగుతున్నాయి. సి-సెక్షన్ ఆ మహిళకు, బిడ్డకు మంచిది కాదు. నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నప్పటికీ సర్జరీ చేయడం తప్పు. కానీ, వైద్యులు సాధారణ ప్రసవానికి చాలా సమస్యలు చెప్పారు. ఆ విషయంలో నాకు ఎన్నో సందేహాలు తలెత్తాయి. చివరకు హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో నాకు నార్మల్ డెలివరీ అయ్యింది.

దేశమంతటా..

మొదట వాయుకాలుష్యంపై పరిశోధనలు చేస్తూ వచ్చాను. కానీ, బిడ్డ పుట్టాక మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కోసం పనిచేయాలనుకున్నాను. 2019లో అస్త్రికా ఫౌండేషన్‌ను ప్రారంభించాను. దీని ద్వారా భారతదేశం అంతటా ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎమ్‌లు, జీఎన్ఎమ్‌లకు శిక్షణ ఇచ్చాను. దీంతో వారు సురక్షితమైన ప్రసవం గురించి మహిళలకు అవగాహన కల్పించారు. అనవసరమైన సిజేరియన్ ప్రసవాల నుంచి వారిని రక్షించగలుగుతున్నారు.

ప్రసవ సమయంలో అగౌరవం

ప్రతి గర్భిణి గౌరవప్రదమైన ప్రసూతి సంరక్షణ పొందాలి. కానీ, ఒక గర్భిణికి నొప్పులు వచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులలోని లేబర్‌రూమ్‌లో సిబ్బంది ఆమె మీద చెడు మాటలతో విపరీతంగా అరుస్తారు. చెప్పుతో కొట్టడం కూడా చూశాను. ఇది నాకు చాలా పాపం అనిపించింది. ఇలా జరగకూడదు, దీన్ని ఆపాలి అనుకున్నాను. 2021 వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తూ వచ్చాను. అది కూడా సరిపోదని ప్రైవేట్ సెక్టార్ ఆసుపత్రుల్లో అడుగుపెట్టాను. ధనికులైనా, పేదవారైనా ప్రతి స్త్రీకీ మంచి చికిత్స పొందే హక్కు ఉంది. ఇది గుర్తించే, బెంగళూరులోనే ఒక పేరున్న ఆసుపత్రిలో నా ఏడు పడకల కేంద్రాన్ని ప్రారంభించాను. గర్భిణిని కూతురిలా చూసుకునే మంత్రసాని ఉండాలని నమ్ముతాను. విదేశాల నుంచి సర్టిఫైడ్ మంత్రసానులను, వైద్యులను ఈ సెంటర్‌లో నియమించాను. ఎందుకంటే, ఇక్కడ చేరడానికి డాక్టర్లు ఎవరూ రెడీగా లేరు. దీంతో బయటివారిని సంప్రదించాల్సి వచ్చింది. ఆరోగ్య సంరక్షణ బృందాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే చాలా ఇబ్బంది అయ్యింది. ఆరోగ్య కార్యకర్తలు కూడా ఎవరూ ముందుకు రాలేదు. ఈ పనిచేయడానికి నాకు చాలా టైమ్ పట్టింది. అంతేకాదు, హాస్పిటల్‌లో ప్లేస్ కోసం కూడా చాలా కష్టపడాల్సి వచ్చింది. నిజానికి ప్రైవేట్ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకంటే సి-సెక్షన్‌లకే ప్రాధాన్యమిస్తుంటారు. ఇక నార్మల్ డెలివరీ అంటేనే మహిళలు, వారి కుటుంబసభ్యులు కూడా భయపడుతున్నారు. వారి దృష్టిలో సిజేరియన్ డెలివరీ సురక్షితమైంది.



> మా సెంటర్‌లో మేం ప్రసవానికి మూడు నెలల ముందు నుంచి గర్భిణులకు శిక్షణ, కౌన్సెలింగ్ ఇస్తాం. గర్భిణి ఏం తినాలి, ఎలాంటి వ్యాయామం చేయాలో చెబుతాం. దీనివల్ల నార్మల్ డెలివరీకి భయపడకుండా ఉంటారు.
> – డాక్టర్ జాహ్నవి నిలేకని

కౌన్సెలింగ్‌తో నార్మల్...

నా సంస్థ కర్ణాటక వాణివిలాస్‌లోని అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తోంది. ఓ రోజు హాస్పిటల్ బోర్డ్ మెంబర్ డ్రైవర్ భార్య మా సెంటర్‌కి వచ్చింది. ఆమె నార్మల్ డెలివరీకి భయపడింది. మా మంత్రసాని ఆమె మనసులోని భయాన్ని కౌన్సెలింగ్ ద్వారా తొలగించింది. ఫలితంగా ఆమెకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన సాధారణ ప్రసవం జరిగింది.

మా సెంటర్‌లో మేం ప్రసవానికి మూడు నెలల ముందు నుంచి గర్భిణులకు శిక్షణ, కౌన్సెలింగ్ ఇస్తాం. గర్భిణి ఏం తినాలి, ఎలాంటి వ్యాయామం చేయాలో చెబుతాం. దీనివల్ల డెలివరీ సమయంలో నార్మల్ డెలివరీకి భయపడకుండా ఉంటారు. అంటే, వారికి మానసిక, శారీరక బలాన్ని అందిస్తాం. వారికి సహాయం చేయడానికి మా బృందం ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉంటుంది. ఈ రెండేళ్లలో 200 మంది గర్భవతులలో కేవలం ఇద్దరికి మాత్రమే సిజేరియన్ అవసరం పడింది. అది కూడా వారికి ప్రసవంలో సమస్య ఉండటం వల్ల. మిగతా అందరికీ సాధారణ ప్రసవాలు జరిగాయి.

అస్త్రికా మిడ్‌వైఫరీ సెంటర్లో ముప్పైమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్రపంచంలో ఉన్న నర్సులు, మంత్రసానుల కోసం అస్త్రికా స్పియర్ పేరుతో డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ఏర్పాటు చేశాం. దీని ద్వారా సిబ్బంది అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవచ్చు.

దేశవ్యాప్తంగా దాదాపు రెండువేల మంది సర్టిఫికెట్లు పొందారు. యూరప్ నుంచి కూడా అధ్యాపకులు ఉన్నారు. మా మెటర్నిటీ ఫౌండేషన్ శిక్షణ తీసుకోవాలనుకునేవారికి కోర్సులను కూడా అందిస్తుంది. ప్రసూతి మరణాలకు ప్రధాన కారణాన్ని లక్ష్యంగా చేసుకొని పనిచేస్తున్నందుకు గర్వంగా ఉంది'' అని వివరిస్తారు జాహ్నవి. ●

ఆత్మరక్షణ

ఆత్మవిశ్వాసమే అసలైన గురుదక్షిణ

రాజస్థాన్‌లోని ఒక గ్రామంలో దివ్యాంగురాలైన ఒక స్టూడెంట్ అత్యాచారానికి గురైన సంఘటన ఆశా సుమన్‌ను షాక్‌కు గురిచేసింది. స్కూలు, కాలేజీల్లో చదివే అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పాలని ఆ సమయంలో సంకల్పించుకుంది ఆశ. దివ్యాంగులు, సాధారణ యువతులు 30 వేల మందికి పైగా ఆత్మరక్షణ విద్యలు నేర్పించిన ఉపాధ్యాయురాలు ఆశా సుమన్ గురించి...



తొమ్మిది సంవత్సరాల క్రితం రాజస్థాన్ అల్వార్ జిల్లాలోని ఖార్కర గ్రామంలో...

ఆరోజు స్కూల్‌కు వెళ్లింది ఆశా సుమన్. బడిలో మగపిల్లలు తప్ప ఆడపిల్లలు ఎవరూ కనిపించలేదు. ఆమెకు ఏమీ అర్థం కాలేదు. ఈ లోపే ఎవరో ఊళ్లో జరిగిన దుర్ఘటన గురించి చెప్పారు. దివ్యాంగురాలైన ఒక అమ్మాయి సామూహిక అత్యాచారానికి గురైంది. ఈ సంఘటనతో గ్రామం ఉలిక్కిపడింది.

విషయం తెలిసిన ఆశ హుటాహుటిన బాధితురాలి ఇంటికి వెళ్లింది. ఆ సంఘటనకు సంబంధించిన విషయాలు చెవిన పడుతున్నప్పుడు ఆమె మనసు దుఃఖసముద్రం అయింది.

ఈ సంఘటన ప్రభావంతో కొద్దిమంది తల్లిదండ్రులు అమ్మాయిలను స్కూల్‌కు పంపడం మాన్పించారు. నిజానికి ఆ ప్రాంతంలో ఆడపిల్లల చదువుకు అంతగా ప్రాధాన్యత ఇవ్వరు. ఇచ్చే వాళ్లు కూడా తమ ఇంటి ఆడపిల్లలను బడికి పంపడానికి భయపడుతున్నారు.

స్కూల్‌కు వెళ్లినా, స్కూల్ నుంచి ఇంటికి వచ్చినా ఆ పాశవిక సంఘటన, తల్లిదండ్రులపై దాని ప్రభావం పడి ఆడపిల్లలు స్కూల్‌కు దూరం కావడం... ఇవి పదే పదే గుర్తుకు వచ్చి ఆశను విపరీతంగా బాధపెట్టాయి.

'ఆ అమ్మాయికి తనను తాను రక్షించుకోవడం తెలిస్తే ఇలా జరిగేది కాదేమో. ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్య నేర్పాలి' అనుకుంది. మొదటి అడుగుగా... పిల్లల తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి వారితో మాట్లాడింది. పిల్లలను తిరిగి స్కూల్‌కు పంపించడానికి వారు మొదట్లో ససేమిరా అన్నారు. చదువు అనేది ఎంత అవసరమో వివరించి, అమ్మాయిలు తమను తాము కాపాడుకునే ఆత్మరక్షణ విద్యల గురించి చెప్పి వారిలో మార్పు తీసుకువచ్చింది.

కొన్ని రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి అమ్మాయిలను తన స్కూటర్‌పై స్కూల్‌కు తీసుకువచ్చేది.

రెండు నెలల తరువాత పరిస్థితి మామూలుగా మారింది.

స్కూల్‌లోని అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పించడంతో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చెప్పేది. ఆశ గురించి విన్న చుట్టుపక్కల ఊళ్లలోని స్కూల్, కాలేజీ వాళ్లు 'మా స్టూడెంట్స్‌కు కూడా నేర్పించండి' అంటూ ఆహ్వానించారు. కాదనకుండా వారి ఆహ్వానాన్ని మన్నించి ఎన్నో స్కూళ్లు, కాలేజీలలో ఎంతోమంది అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పించింది.

వైకల్యం ఉన్న బాలికలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పే విధానం వేరుగా ఉంటుంది, వారు సులభంగా అర్థం చేసుకునేలా, అర్థం చేసుకున్నది ఆచరణలో చేసేలా రోజువారి సంఘటనలను ఉదాహరిస్తూ, డమ్మీని ఉపయోగిస్తూ నేర్పిస్తుంటుంది. దృష్టిలోపం ఉన్న మౌనిక అనే స్టూడెంట్ ఆశ టీచర్ దగ్గర సెల్ఫ్-డిఫెన్స్ టెక్నిక్స్ నేర్చుకుంది.


యువతులకు ఆత్మరక్షణలో శిక్షణ ఇస్తున్న ఆశా సుమన్

'నేను బయటికి ఎక్కడికి వెళ్లినా తోడుగా అన్నయ్య వచ్చేవాడు. అన్నయ్య లేకుంటే బయటకు వెళ్లడానికి సాహసించేదాన్ని కాదు. అయితే ఇప్పుడు నా గురించే నేనే కాదు, తల్లిదండ్రులు కూడా భయపడడం లేదు. ఎవరైనా నాకు చెడు చేయడానికి ముందుకు వస్తే నిమిషాల్లో మట్టి కరిపించగలననే నమ్మకం వచ్చింది' అంటుంది మౌనిక.

స్టూడెంట్స్‌లోనే కాదు వారి తల్లిదండ్రులలోనూ ఇప్పుడు ఎంతో ధైర్యం వచ్చింది. 'చాలామందిలాగే నేను కూడా మా అమ్మాయిని స్కూల్‌కు పంపడానికి భయపడ్డాను. ఇప్పుడు అలాంటి భయాలేవీ లేవు. స్కూల్ అయిపోగానే అమ్మాయిల కోసం ఆశా టీచర్ నిర్వహిస్తున్న సెల్ఫ్-డిఫెన్స్ క్లాసులను దగ్గర నుంచి చూశాను. అమ్మాయిల్లో ఎంతో ఆత్మవిశ్వాసం కనిపించింది. ప్రతి స్కూల్లో ఆశలాంటి టీచర్ ఒకరు ఉండాలి' అంటున్నాడు ఆ ఊరికి చెందిన జస్వంత్.

అమ్మాయిలలో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి ఆశ టీచర్ చేస్తున్న కృషికి ఎన్నో పురస్కారాలు లభించాయి. ఆత్మరక్షణ విద్యల వల్ల అమ్మాయిల్లో కనిపించే ఆత్మవిశ్వాసమే తనకు అసలు సిసలు గురుదక్షిణ అంటుంది ఆశా సుమన్. ●

సినిమా

మిలన్‌కు బై బై


● గోపీచంద్

మిలన్‌కు బై బై చెప్పారు గోపీచంద్. శ్రీను వైట్ల దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. వేణు దోనేపూడి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా తొలి షెడ్యూల్ ఇటలీలో మొదలైన విషయం గుర్తుండే ఉంటుంది. అక్కడి మిలన్ నగరంలో ప్లాన్ చేసిన షెడ్యూల్ ముగిసింది. గోపీచంద్‌తో పాటు ఇతర ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. అలాగే శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ పాటతో ఈ విదేశీ షెడ్యూల్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్.

ఆమిర్‌కు జోడీగా?


● జెనీలియా

'సై', 'బొమ్మరిల్లు', 'ఆరెంజ్' వంటి చిత్రాలతో హీరోయిన్‌గా జెనీలియా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. రితేష్ దేశ్‌ముఖ్‌ని పెళ్లి చేసుకుని, ఇద్దరు బిడ్డలకు తల్లయిన జెనీలియా చాలా గ్యాప్ తర్వాత మళ్లీ సినిమాలు ఒప్పుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమిర్ ఖాన్‌కు జోడీగా ఆమె ఓ సినిమాలో ఎంపికయ్యారని బాలీవుడ్ టాక్. ఆమిర్ ఖాన్ తాజా చిత్రం 'సితారే జమీన్ పర్' చిత్రంలో హీరోయిన్ పాత్రకు జెనీలియాను తీసుకున్నారని, ఆర్ఎస్ ప్రసన్న ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారని సమాచారం. మరి.. ఆమిర్‌కు జోడీగా జెనీలియా కనిపిస్తారా? చూడాలి. మరోవైపు దశాబ్దం తర్వాత 'జూనియర్' అనే తెలుగు సినిమాలో జెనీలియా కీలక పాత్ర చేస్తున్నారు. ఇక 2012లో రానా హీరోగా వచ్చిన 'నా ఇష్టం' తెలుగులో హీరోయిన్‌గా జెనీలియా నటించిన చివరి చిత్రం.

ప్రస్తుతానికి అందుబాటులో లేను!


● పూజా హెగ్డే

పుట్టినరోజు (అక్టోబర్ 13) సందర్భంగా పూజా హెగ్డే తన తాజా చిత్రం గురించి థ్రిల్లింగ్ న్యూస్ ఒకటి చెప్పారు. షాహిద్ కపూర్ సరసన తొలిసారి ఆమె కథానాయికగా నటించనున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు రోషన్ ఆండ్రూస్ తెరకెక్కించనున్నారు. ఇలా బర్త్ డేకి ఓ థ్రిల్లర్ మూవీకి సైన్ చేయడం పట్ల పూజా హెగ్డే ఆనందంగా ఉన్నారు. ''ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఎందుకంటే కథాంశం కొత్తగా ఉంది. అలాగే నాది చాలా విభిన్నమైన పాత్ర. షాహిద్ కపూర్‌తో స్క్రీన్ షేర్ చేసుకోనుండటం హ్యాపీగా ఉంది. తను మంచి నటుడు. అందుకే ఈ సినిమా ప్రయాణాన్ని ఆరంభించడానికి ఆసక్తిగా ఉన్నాను'' అని పేర్కొన్నారు పూజా హెగ్డే. ఇక పుట్టినరోజుని ఎలా జరుపుకున్నారంటే.. ప్రస్తుతం ఈ బ్యూటీ మాల్దీవుల్లో ఉన్నారు. 'కరెంట్లీ అన్ అవైలబుల్' (ప్రస్తుతం అందుబాటులో లేను) అంటూ మాల్దీవుల్లో సేద తీరుతున్న ఫొటోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు పూజా హెగ్డే.

వ్యక్తుల సంఘర్షణే వ్యూహం

– రామ్‌గోపాల్ వర్మ


● దాసరి కిరణ్ కుమార్, రామ్‌గోపాల్ వర్మ

''నాకు టీడీపీ గురించి తెలియదు. వైసీపీ గురించి తెలియదు. నేను రాజకీయాలు ఫాలో కాను. ఈ 'వ్యూహం' చిత్రానికి పార్టీలకు, ప్రభుత్వాలకు సంబంధం లేదు. ఇది కేవలం వ్యక్తుల మధ్య ఉండే కాన్‌ఫ్లిక్ట్ (సంఘర్షణ)'' అని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అజ్మల్, మానస ప్రధాన పాత్రధారులుగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన తాజా పొలిటికల్ చిత్రం 'వ్యూహం'. ఈ సినిమా రెండో భాగం 'శపథం'. రామదూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన 'వ్యూహం' సినిమా నవంబరు 10న, 'శపథం' చిత్రం జనవరి 25న విడుదల కానున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'వ్యూహం' సినిమా ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ – ''వాస్తవ సంఘటనలు, వాటి తాలూకు పాత్రల పట్ల నాకు ఎప్పుడూ ఆసక్తి ఉంటూనే ఉంటుంది. నా దర్శకత్వంలో వచ్చిన సినిమాల్లో దాదాపు 80 శాతం వరకు ఏదో ఒక సంఘటన నుంచి స్ఫూర్తి పొందినవే ఉంటాయి'' అన్నారు. దాసరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ –''ప్రజలకు తెలియని ఎన్నో విషయాలు ఉంటాయి. ఆ అంశాలను పొందుపరిచి ఓ సందేశంగా.. సినిమాగా చెప్పాలనిపించి, సమయానుకూలంగా 'వ్యూహం'ని ఇప్పుడు నిర్మించి, విడుదల చేస్తున్నాం. ఇది బయోపిక్ కాదు. ఈ సినిమాని చాలా పెద్ద స్థాయిలో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఐదు లక్షల మందితో నవంబరు 5న ప్రీ రిలీజ్ వేడుకను భారీ ఎత్తున జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

''నటనకు కావాలని విరామం ఇవ్వలేదు. నాకు నటించాలనే ఉంది. అయితే ఓ సినిమా ఒప్పుకునే ముందు కథ, అందులోని నా పాత్ర, ఆ చిత్ర దర్శక-నిర్మాతలు... ఈ మూడు అంశాలను పరిగణనలోకి తీసుకుంటాను. ఇలా ఈ మూడు అంశాలతో నేను ఏకీభవించి నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'" అన్నారు నటి, దర్శక-నిర్మాత రేణూ దేశాయ్. రవితేజ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో మయాంక్ సింఘానియా సహనిర్మాతగా అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రేణూ దేశాయ్ చెప్పిన విశేషాలు.

వయసుకి తగ్గ పాత్రలే చేస్తాను

– రేణూ దేశాయ్


● 'టైగర్...'లో హేమలతగా రేణు

● 'టైగర్ నాగేశ్వర రావు'లో హేమలత లవణంగారి పాత్ర చేశాను. లవణంగారి మేనకోడలు కీర్తిగారిని కలిసి ఆవిడ గురించి చాలా విషయాలు తెలుసుకున్నాను. 1970 కాలంలోనే జోగిని వ్యవస్థ, అంటరానితనంపై పోరాటాలు చేశారామె. దొంగలు, బందిపోట్లలో మంచి మార్పు కోసం కృషి చేశారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలతో స్ఫూర్తిగా నిలిచిన హేమలతగారి పాత్ర చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఆమె బాడీ లాంగ్వేజ్‌ను వెండితెరపై ప్రతిబింబించడం సవాల్‌గా అనిపించింది. నా కెరీర్‌లో ఇప్పటివరకూ నాకు ఏ పశ్చాత్తాపం లేదు. అయితే హేమలత లవణంగారి గురించి తెలుసుకుని, ఆమె పాత్రలో నటించిన తర్వాత ఆమెను కలవలేకపోయానని పశ్చాత్తాపపడుతున్నాను. హేమలతగారి స్ఫూర్తితో చిన్నారుల ఆకలి తీరేలా నా వంతుగా ఓ స్వచ్ఛంద సేవా సంస్థను మొదలు పెట్టాలనుకుంటున్నాను. 'టైగర్ నాగేశ్వర రావు' సినిమా ట్రైలర్ చూసి, నా వయసుకి తగ్గ పాత్రలో నటించినందుకు మా అమ్మాయి ఆద్య తనకు గర్వంగా ఉన్నట్లు చెప్పింది. నాకు బెస్ట్ కాంప్లిమెంట్ అది. నా గురించి నా పిల్లలు ఏమనుకుంటున్నారన్నదే నాకు ముఖ్యం. భవిష్యత్‌లో నా వయసుకు తగ్గ పాత్రలే చేయాలనుకుంటున్నాను. ● మా నాన్నమ్మ 47 ఏళ్లకే హార్ట్ ఎటాక్‌తో చనిపోయారు. మా నాన్నా హార్ట్ ఎటాక్‌తోనే చనిపోయారు. ఇలా జన్యుపరంగా నాకు గుండె సంబంధిత సమస్యలున్నాయి. అయితే ప్రమాదం లేదు. అలాగని అజాగ్రత్త వహించకూడదు. చికిత్స తీసుకుంటున్నాను.

బంజారా నేపథ్యంలో...


● మల్లారెడ్డి, రాకేష్

తెలంగాణ ప్రాంతం బంజారా (తండా) నేపథ్యంలో రూపొందుతున్న సినిమాకు 'కెసిఆర్' (కేశవ్ చంద్ర రమావత్) అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'రాకింగ్' రాకేష్, అనన్య హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా చేస్తూనే, దర్శకత్వం వహిస్తున్నారు 'గరుడ వేగ' అంజి. గ్రీన్ టీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో విభూది క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను తెలంగాణ మంత్రి మల్లారెడ్డి విడుదల చేశారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో 50 అడుగుల కటౌట్‌తో 50,000 మంది స్టూడెంట్స్ సమక్షంలో జరిగిన 'కెసిఆర్' టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణతో పాటు 'కెసిఆర్' చిత్రబృందం పాల్గొంది. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్.

గోవాలో సంతోషం


● సురేష్ కొండేటి

సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డుల వేడుక డిసెంబరు 2న గోవాలో జరగనుంది. సంతోషం 22వ 'సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డులు-2023' వేడుక గోవాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో జరగనున్నట్లు, జాతీయ సినిమా దినోత్సవం సందర్భంగా శుక్రవారం హీరోయిన్ శ్రీలీల ఓ వీడియోలో వెల్లడించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ మరియు బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరు కానున్నట్లు నిర్వాహకుడు, 'సంతోషం' పత్రికాధినేత సురేష్ కొండేటి పేర్కొన్నారు.

మాస్ స్టెప్స్‌తో..


● కంచర్ల ఉపేంద్ర

కంచర్ల ఉపేంద్ర, సావిత్రి కృష్ణ జంటగా ఎస్‌కే ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. 'పోకిరీ జులాయిలు...' అంటూ సాగే పాటను చిత్రీకరిస్తున్నారు. కంచర్ల ఉపేంద్ర, వంద మంది జూనియర్ ఆర్టిస్టులు, ఇరవై మంది డ్యాన్సర్లు పాల్గొంటుండగా ఈ మాస్ పాటను చిత్రీకరిస్తున్నారు. ఊటీలో చిత్రీకరించే మరో పాటతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ''హీరో కావాలన్న మా అబ్బాయి ఆసక్తిని గమనించి, ఐదు చిత్రాలు నిర్మిస్తున్నాం'' అన్నారు కంచర్ల అచ్యుతరావు. ఈ చిత్రానికి సంగీతం: రాము అద్దంకి.

మార్పు రావాలి


● తాప్సీ

కథానాయికగా సౌత్, నార్త్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు తాప్సీ. అయితే హీరోయిన్‌గా మిగిలిపోకుండా నిర్మాతగానూ నిరూపించుకోవాలనుకున్నారామె. తొలి ప్రయత్నంగా తాప్సీ నిర్మించిన హిందీ చిత్రం 'ధక్ ధక్' శుక్రవారం విడుదలైంది. అయితే నిర్మాతగా తనకు చేదు అనుభవం ఎదురైందని తాప్సీ అంటున్నారు. ఓ ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ – ''బాలీవుడ్‌లో స్టార్ సిస్టమ్ వల్ల చిన్న సినిమాలకు నష్టం జరుగుతోంది. కథ వినేటప్పుడే 'హీరో ఎవరు?' అని అడుగుతున్నారు. దాంతో జనాలు 'కంటెంటే కింగ్' అనుకుంటారనే నా భ్రమ తొలగిపోయింది. హీరోని బట్టి పెట్టుబడి ఉంటుంది. ఓ నటిగా నేను ఒక కథ వినేటప్పుడు ఆ నిర్మాతలు ఎంత పెద్దవాళ్లు, కో-స్టార్ ఎవరు? అని అడగలేదు. కొత్త దర్శకులతో, కొత్త నటులతో సినిమాలు చేశాను. కానీ వేరేవాళ్లు అలా చేయడానికి ఇష్టపడటంలేదు. ఎందుకీ తేడా? ఈ విషయంలో ఏ ఒక్కర్నో నిందించాల్సిన అవసరం లేదు. యాక్టర్లు, స్టూడియోలు, ప్రేక్షకులు... అందరూ బాధ్యులే. బాలీవుడ్ అర్థవంతమైన చిత్రాలు చేయడంలేదని అంటుంటారు. కానీ, చేసినప్పుడు మాత్రం సపోర్ట్ దక్కదు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి. పెద్ద సినిమాలకు పెట్టుబడి పెట్టి, డిజిటల్ రైట్స్ ద్వారా డబ్బు రికవర్ చేసుకోవచ్చని అనుకుంటారు. చిన్న సినిమాలకు పెట్టుబడి పెట్టడం కష్టం.. రిలీజ్ చేసుకోవడమూ కష్టమే. ఈ పరిస్థితి స్టార్స్‌కి, యాక్టర్స్‌కి మధ్య దూరం పెంచుతుంది'' అని చెప్పుకొచ్చారు. ఇక తాప్సీ ఒక నిర్మాతగా వ్యవహరించిన 'ధక్ ధక్' కథ నలుగురు మహిళల చుట్టూ తిరుగుతుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
125	43
66,282	19,751

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	13,468	▽ 106
డోజోన్స్	33,766	△ 134
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,600	▽ 45
డాక్స్	15,187	▽ 238
షాంఘై	3,088	▽ 20
నికాయ్	32,316	▽ 179

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,396 △	252
బంగారం (99.5 స్వచ్ఛత)	58,163 △	252
వెండి (కిలో)	69,731 △	32

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.49	84.16
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	100.01	103.37
€	యూరో	ఒకటి	86.36	89.40
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.79	56.50
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.63	53.92
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.92	61.85
SAR	సౌదీ రియాల్	[illegible]	21.25	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.77	23.57
¥	చైనా యువాన్	[illegible]	10.27	12.36

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ లాభం అప్

క్యూ2లో రూ. 377 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 15 శాతం ఎగసి రూ. 377 కోట్లను తాకింది. ఇందుకు అధిక పాలసీల విక్రయం తోడ్పడింది. మొత్తం ప్రీమియం ఆదాయం సైతం 12 శాతం వృద్ధితో రూ. 26,613 కోట్లకు చేరింది. కొత్త బిజినెస్ ప్రీమియం 11 శాతం పుంజుకుని రూ. 12,970 కోట్లుగా నమోదైంది. వ్యక్తిగత ప్రీమియం 11 శాతం బలపడి రూ. 4,478 కోట్లను తాకింది. ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ సంస్థ మొత్తం వార్షిక సమాన ప్రీమియం (ఏపీఈ) 7 శాతం మెరుగై రూ. 3,045 కోట్లకు చేరింది. దీంతో కంపెనీ మార్కెట్ వాటా 10.3 శాతం వద్ద నిలకడ చూపింది. వెరసి ఎల్ఐసీ, ఎస్‌బీఐ లైఫ్ తదుపరి మూడో పెద్ద కంపెనీగా నిలిచింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేరు బీఎస్‌ఈలో నామమాత్ర నష్టంతో రూ. 625 వద్ద ముగిసింది.

ఫోర్బ్స్ ఇండియా సంపన్నుల జాబితాలో జాయ్ అలుక్కాస్



కొచ్చి: ఫోర్బ్స్ 100 మంది సంపన్న భారతీయుల జాబితాలో జోయాలుక్కాస్ కంపెనీ చైర్మన్ జాయ్ అలుక్కాస్ 50వ స్థానం దక్కించుకున్నారు. తద్వారా భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక జ్యువెలర్‌గా ఖ్యాతి గడించారు. జ్యువెలరీ రంగంలో పెను మార్పులు తీసుకురావడంలో జాయ్ అలుక్కాస్ కీలక పాత్ర పోషించారు. ఆర్థిక సంక్షోభం(2008), కరోనా మహమ్మారి(2020) వంటి అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులను విజయవంతంగా అధిగమించి వ్యాపారాన్ని నిర్వహించారు. ప్రపంచంలోనే అతిపెద్ద అవుట్‌లెట్‌ను చెన్నైలో ప్రారంభించడం, ప్రోత్సాహంగా రోల్స్ రాయిస్ కార్లను బహుమతిగా ఇవ్వడం, రష్యా తూర్పు భాగం ప్రాంతాల కొత్త మార్కెట్లలో ప్రవేశించడం వంటి వినూత్న ఆలోచనలతో జోయాలుక్కాస్‌ను 'వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్' గా జోయాలుక్కాస్ సంస్థగా తీర్చిదిద్దారు.

ఎగుమతులు 3 శాతం డౌన్..

- సెప్టెంబర్‌లో 34.47 బిలియన్ డాలర్లకు పరిమితం
- దిగుమతులు 15 శాతం తగ్గుదల; 53.84 బిలియన్ డాలర్లు
- 19.37 బిలియన్ డాలర్లకు తగ్గిన వాణిజ్య లోటు



న్యూఢిల్లీ: ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఎగుమతులు 2.6 శాతం క్షీణించి 34.47 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే వ్యవధిలో ఎగుమతులు 35.39 బిలియన్ డాలర్లు. కమోడిటీల ధరలు తగ్గుముఖం పట్టడంతో వరుసగా 10వ నెల దిగుమతుల భారం కాస్త తగ్గింది. శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం .. దిగుమతులు 15% క్షీణించి 53.84 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గత సెప్టెంబర్‌లో ఇవి 63.37 బిలియన్ డాలర్లు. సెప్టెంబర్‌లో దేశ వాణిజ్య లోటు 19.37 బిలియన్ డాలర్లకు దిగి వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కాలంలో ఎగుమతులు 8.77% క్షీణించాయి. 211.4 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇదే వ్యవధిలో దిగుమతులు 12.23% తగ్గి 326.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఫలితంగా వాణిజ్య లోటు 115.58 బిలియన్ డాలర్లుగా ఉంది.

ఎగుమతులపై ఆశాభావం..

అంతర్జాతీయంగా సవాళ్లు నెలకొన్నప్పటికీ సెప్టెంబర్ గణాంకాలు ఎగుమతులపరంగా ఆశావహ అవకాశాలను సూచిస్తున్నాయని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బరత్‌వాల్ తెలిపారు. మిగతా ఆరు నెలల్లో ఎగుమతులు సానుకూల వృద్ధి నమోదు చేయగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏప్రిల్, మే, జూన్, జూలైలో క్షీణత రెండంకెల స్థాయిలో ఉండగా.. ప్రస్తుతం సింగిల్ డిజిట్ స్థాయికి దిగి వచ్చిందని సునీల్ పేర్కొన్నారు. 2023లో అంతర్జాతీయంగా వాణిజ్యం 0.8 శాతమే పెరగవచ్చని వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ అంచనా వేసినప్పటికీ ఎగుమతులపరంగా భారత్ మెరుగ్గా రాణిస్తోందని సునీల్ చెప్పారు.

ఆగస్టు గణాంకాల సవరణ..

కేంద్రం ఆగస్టు ఎగుమతుల గణాంకాలను 34.48 బిలియన్ డాలర్ల నుంచి 38.45 బిలియన్ డాలర్లకు సవరించింది. అలాగే దిగుమతులను 58.64 బిలియన్ డాలర్ల నుంచి 60.1 బిలియన్ డాలర్లకు మార్చింది. సెప్టెంబర్ 15న విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆగస్టులో ఎగుమతులు అంతక్రితం ఏడాది అదే వ్యవధితో పోలిస్తే 6.86 శాతం క్షీణించినట్లు నమోదు కాగా.. తాజా సవరణతో 3.88 శాతం పెరిగినట్లయ్యింది.

మరిన్ని విశేషాలు..

- గత నెల ఎగుమతులకు సంబంధించి 30 కీలక రంగాల్లో 12 రంగాలు సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. ముడిఇనుము, కాటన్ యార్న్, మాంసం, డెయిరీ, పౌల్ట్రీ, ఫార్మా, ఇంజినీరింగ్ ఉత్పత్తులు వీటిలో ఉన్నాయి.
- దిగుమతులపరంగా చూస్తే 30లో 20 రంగాలు ప్రతికూల వృద్ధి కనపర్చాయి. వెండి, ఎరువులు, రవాణా పరికరాలు, బొగ్గు, విలువైన రాళ్లు, క్రూడ్, రసాయనాలు, మెషిన్ టూల్స్ వీటిలో ఉన్నాయి.
- చమురు దిగుమతులు 20.32 శాతం క్షీణించి 14 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో దిగుమతులు 22.81 శాతం తగ్గి 82.3 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అటు పసిడి దిగుమతులు 7% పెరిగి 4.11 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రథమార్థంలో 9.8% పెరిగి 22.2 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఆర్‌బీఐ కార్యాలయాల ముందు క్యూ

19 కేంద్రాల్లో రూ. 2 వేల నోట్ల మార్పిడి



న్యూఢిల్లీ: రూ.2,000 నోట్ల మార్పిడి, డిపాజిట్ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కార్యాలయాల ముందు జనం బారులు దీరారు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలను దేశవ్యాప్తంగా 19 ఆర్‌బీఐ కార్యాలయాలు కొనసాగిస్తున్నాయి. రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు 2023 మే 19న ఆర్‌బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. మార్పిడి, డిపాజిట్‌కు సెప్టెంబర్ 30 వరకు అనుమతించారు. ఆ తర్వాత ఆఖరు తేదీని అక్టోబర్ 7 వరకు పొడిగించారు. ఆర్‌బీఐ కార్యాలయాల వద్ద వ్యక్తులు, కంపెనీలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను ఒకసారి రూ.20,000 వరకు మార్చుకోవచ్చు. బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్‌కు మాత్రం ఎటువంటి పరిమితి లేదు. వ్యవస్థ నుంచి రూ.3.43 లక్షల కోట్ల విలువైన రూ.2 వేల నోట్లు వెనక్కి వచ్చాయని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ గత శుక్రవారం వెల్లడించారు. రూ.12,000 కోట్ల విలువైన నోట్లు ఇప్పటికీ చలామణిలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. 2016 నవంబరులో రూ.500, రూ.1,000 నోట్ల రద్దు తర్వాత ఆర్‌బీఐ రూ.2,000 నోట్లతోపాటు కొత్త రూ.500 నోట్లను పరిచయం చేసింది.

బిగ్ 'సి'.. దసరా ధమాకా ఆఫర్స్



హైదరాబాద్: మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ 'సి' దసరా ధమాకా ఆఫర్లు ప్రకటించింది. ప్రతి స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.10వేల వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు రూ.4వేల వరకు కచ్చితమైన బహుమతి ఇస్తుంది. ప్రతి మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌ట్యాప్ కొనుగోలుపై స్మార్ట్ వాచ్ ఆఫర్, 5% తక్షణ డిస్కౌంట్, లాయల్టీ పాయింట్లు వంటి మరెన్నో ఆఫర్లు అందిస్తుంది. ఐఫోన్ మొబైల్స్ కొనుగోలుపై రూ.4వేల వరకు క్యాష్ బ్యాక్ ఇస్తుంది. బ్రాండెడ్ యాక్సెసరీలపై 51% వరకు డిస్కౌంట్ అందిస్తుంది. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలు కొనుగోలు చేయవచ్చు. ప్రజలంతా ఈ ఆఫర్లు వినియోగించుకోవాలని సంస్థ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరీ కోరారు.

బ్యాంకింగ్, ఐటీ షేర్లలో అమ్మకాలు

సూచీలు రెండో రోజూ డీలా



ముంబై: బ్యాంకింగ్, ఐటీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ నష్టాలు చవి చూశాయి. అమెరికాలో అంచనాలకు మించి ద్రవ్యోల్బణ డేటా నమోదు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచింది. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 125 పాయింట్లు నష్టపోయి 66,282 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43 పాయింట్లు పతనమై 19,751 వద్ద నిలిచింది. బలహీన అంతర్జాతీయ సంకేతాలతో ఉదయం సూచీలు నష్టాలతో మొదలయ్యాయి. ప్రథమార్థంలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ఒక దశలో సెన్సెక్స్ 513 పాయింట్లు క్షీణించి 65,895 వద్ద, నిఫ్టీ 116 పాయింట్లు పతనమై 19,635 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. అయితే ద్వితీయార్థంలో ఆటో, ఎఫ్ఎంసీజీ, రియల్టీ, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కొంత మేర నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు 17 ట్రేడింగ్ సెషన్ల వరుస విక్రయాల తర్వాత తొలిసారి రూ.317 కోట్ల ఈక్విటీ షేర్లు కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.103 కోట్ల షేర్లు అమ్మేశారు. ఇజ్రాయెల్ – హమాస్ యుద్ధం, యూఎస్‌లో ద్రవ్యోల్బణం పెరగడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- క్యూ2 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో ఇన్ఫోసిస్ షేరు 2.24% నష్టపోయి రూ.1432 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 4.26% క్షీణించి రూ.1402 వద్ద నిలిచింది. ఎక్స్ఛేంజీలో మొత్తం 11.35 లక్షల షేర్లు చేతులు మారాయి.
- స్పైస్‌జెట్‌లో వాటా కొనుగోలుకు ఇండిగో సహ వ్యవస్థాపకుడు రాకేష్ గంగ్వాల్ చర్చలు జరుపుతున్నట్లు వార్తలు రావడంతో స్పైస్ జెట్ 19% ర్యాలీ చేసి రూ.43.60 వద్ద స్థిరపడింది.
- క్యూ2 నికర లాభం 10% వృద్ధి చెందడంతో హెచ్‌సీఎల్ టెక్ షేరుకు డిమాండ్ లభించింది. 2.55% లాభపడి రూ.1255 వద్ద స్థిరపడింది.

5 బిలియన్ డాలర్లకు క్లినికల్ ట్రయల్స్ పరిశ్రమ

- అయిదేళ్లలో అంచనా
- పారెక్సెల్ ఇండియా ఎండీ సంజయ్ వ్యాస్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా క్లినికల్ ట్రయల్స్ పరిశ్రమ ఏటా 7–8 శాతం మేర వృద్ధి చెందనుంది. 2.3 బిలియన్ డాలర్లుగా ఉన్న పరిశ్రమ వచ్చే అయిదేళ్లలో దాదాపు 5 బిలియన్ డాలర్ల స్థాయికి చేరనుంది. అంతర్జాతీయంగా క్లినికల్ రీసెర్చ్ దిగ్గజాల్లో ఒకటైన పారెక్సెల్ భారత విభాగం ఎండీ సంజయ్ వ్యాస్ శుక్రవారమిక్కడ విలేకరుల సమావేశంలో ఈ విషయాలు తెలిపారు. దేశీయంగా దాదాపు 40 పైగా అధ్యయనాలు జరుగుతుండగా.. వాటిలో తమ సంస్థ సుమారు 12–15 స్టడీస్ నిర్వహిస్తోందని ఆయన చెప్పారు. భారత్‌లో తమకు మొత్తం 5 కేంద్రాల్లో 6,000 మంది పైచిలుకు సిబ్బంది ఉండగా.. హైదరాబాద్, చండీగఢ్ సెంటర్లు అతి పెద్దవని వ్యాస్ వివరించారు. వచ్చే అయిదేళ్లలో ఉద్యోగుల సంఖ్యను 8,000కు పెంచుకోనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో తమకు 2,500 మంది పైగా సిబ్బంది ఉన్నట్లు వివరించారు. తెలంగాణ సహా దేశీయంగా క్లినికల్ ట్రయల్స్ నిర్వహణకు పరిస్థితులు, నిపుణుల లభ్యత బాగుంటున్నాయని ఆయన చెప్పారు. అయితే, పేషెంట్లలో అవగాహన, తృతీయ శ్రేణి పట్టణాలు మొదలైన చోట్ల మౌలిక సదుపాయాలు, అధ్యయనాల మధ్యలోనే పేషెంట్లు తప్పుకోవడం తదితర అంశాలపరంగా కొన్ని సవాళ్లను అధిగమించాల్సి ఉందని వ్యాస్ పేర్కొన్నారు. విద్యార్థుల్లో పరిశ్రమకు అవసరమయ్యే నైపుణ్యాలను పెంపొందించేందుకు విద్యా సంస్థలతో కూడా కలిసి పనిచేస్తున్నామని, తెలంగాణ ప్రభుత్వంతోనూ ఈ విషయంలో సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన వివరించారు.

ఇర్కాన్‌కు నవరత్న హోదా

జాబితాలో చేరిన 15వ సీపీఎస్ఈ

న్యూఢిల్లీ: పీఎస్‌యూ.. ఐఆర్‌సీవోఎన్ (ఇర్కాన్) ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు నవరత్న హోదా లభించింది. ప్రభుత్వం తాజాగా నవరత్న గుర్తింపును ప్రకటించినట్లు ఇర్కాన్ ఇంటర్నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ప్రభుత్వ సంస్థల విభాగం నుంచి ఈ మేరకు సమాచారం అందినట్లు వెల్లడించింది. పీఎస్‌యూలలో అత్యుత్తమ పనితీరు ప్రదర్శించే కంపెనీలకు నవరత్న గుర్తింపు లభిస్తుంది. తద్వారా కంపెనీకి పాలనాపరమైన స్వేచ్ఛతోపాటు ఆర్థిక అధికారాలు లభిస్తాయి. వెరసి నవరత్న హోదా పొందిన 15వ కేంద్ర ప్రభుత్వ రంగ కంపెనీ(సీపీఎస్ఈ)గా ఇర్కాన్ నిలిచింది.

ఎన్ఎస్ఈలో శుక్రవారం ఇర్కాన్ షేరు 9.5% జంప్‌చేసి రూ. 149 వద్ద ముగిసింది.

జాతీయం / అంతర్జాతీయం

పంచతంత్రం

ఛత్తీస్‌గఢ్‌లో 11 మంది అభ్యర్థులతో ఆప్ మూడో జాబితా

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి వచ్చే నెలలో జరిగే ఎన్నికల కోసం ఆమ్ ఆద్మీ పార్టీ శుక్రవారం 11 మంది అభ్యర్థులతో కూడిన మూడో జాబితా విడుదల చేసింది. దీంతో, ఇప్పటి వరకు ఆప్ 33 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించినట్లయింది. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తుందని ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఇప్పటికే ప్రకటించారు. అసెంబ్లీలోని 90 సీట్లకుగాను 2108 ఎన్నికల్లో ఆప్ 85 చోట్ల అభ్యర్థులను బరిలోకి దించినప్పటికీ ఖాతా తెరవలేకపోయింది.

ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీ

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ అసెంబ్లీకి నవంబర్ 17వ తేదీన జరగనున్న ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు శుక్రవారం కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీ అయ్యింది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ జనరల్ సెక్రటరీలు, రణదీప్ సూర్జేవాలా, కేసీ వేణుగోపాల్, పీసీసీ అధ్యక్షుడు, మాజీ సీఎం కమల్‌నాథ్ హాజరయ్యారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను అనంతరం ఖర్గే 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పూర్తిస్థాయి మెజారిటీ సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దొడ్డిదారిన అధికారం చేజిక్కించుకున్న బీజేపీకి రాష్ట్ర ప్రజలు ఈసారి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వరన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలిస్తాం

మధ్యప్రదేశ్ సీఎం చౌహాన్ హామీ

భోపాల్: రాష్ట్రంలోని నీడలేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలిస్తామని మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. 'రాష్ట్రంలో చాలా ఏళ్లుగా నివాసం ఉంటూ అస్సలే భూమి లేని వారికి ఇళ్లప్లాట్లు పంపిణీ చేస్తాం. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ముఖ్యమంత్రి ఆవాస్ యోజనల కింద వారికి ఇళ్లు కట్టిస్తాం. ఇల్లు లేని వారంటూ లేకుండా చేస్తాం'అని శుక్రవారం భోపాల్‌లోని గోవింద్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన ప్రకటించారు. తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 'లాడ్లీ బెహనా' పథకంతో మహిళల పట్ల ఆయా కుటుంబాల్లో గౌరవం పెరిగిందన్నారు.

కులగణన చుట్టూ...

హిందీ బెల్ట్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికల అస్త్రం

బీజేపీ హిందుత్వ ఎజెండాను తిప్పికొట్టే ప్రయత్నం

కులగణన.. మూడు హిందీ హార్ట్‌ల్యాండ్ రాష్ట్రాల్లో ఇప్పుడిదే హాట్ టాపిక్. బీజేపీ హిందుత్వ ఎజెండాని తిప్పికొట్టడానికి కాంగ్రెస్ పార్టీ కులగణన అనే బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీసింది. వచ్చే నెలలో రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కులగణన చుట్టూ తిరుగుతున్నట్టే కనిపిస్తోంది. ఇప్పటికే తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కులగణన చేపడతామని ప్రకటించిన కాంగ్రెస్ దేశవ్యాప్తంగా కులగణన కోసం పట్టుబడుతోంది. బీజేపీ కులగణన చేపడతామని అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లపై గురి పెట్టింది. మన దేశంలో 2011లో కులగణన చేపట్టినప్పటికీ అందులో వివరాలను అధికారికంగా వెల్లడించలేదు. బిహార్‌లో కులగణన నిర్వహించి రాష్ట్ర జనాభాలో 63% మంది వెనుకబడిన వర్గాలు ఉన్నారని తేల్చి చెప్పడంతో అదే తరహాలో దేశవ్యాప్తంగా కులాల జనాభా వివరాలను సేకరించాలన్న డిమాండ్ ఊపందుకుంది. కాంగ్రెస్ కులగణన డిమాండ్‌ను తిప్పికొడుతున్న బీజేపీ సమాజాన్ని విభజించడానికే కాంగ్రెస్ ఇదంతా చేస్తోందని ఎదురు దాడికి దిగుతోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

> గత కొన్ని దశాబ్దాలుగా ఎన్నికల్లో కులం కార్డు అత్యంత కీలకంగా మారింది. కుల సంఘాలు నానాటికీ శక్తిమంతంగా మారుతున్నాయి. ఎన్నికల్ని శాసిస్తున్నాయి. టికెట్ల కేటాయింపు దగ్గర్నుంచి ఎన్నికల తర్వాత పదవుల పందేరం వరకు కులాల లెక్కల పైనే జరుగుతున్నాయి. గెలిచిన వారికి సన్మానాలు, సత్కారాలు చేస్తున్నాయి. ఈ సారి ఎన్నికలు కులగణన చుట్టూనే తిరుగుతాయి – నారాయణ్ బరేథ్, రాజకీయ విశ్లేషకుడు



రాజస్తాన్

రాజస్తాన్‌లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని కుల సంఘాలు మహా సమ్మేళనాలు నిర్వహించి తమ బలాన్ని ప్రదర్శించాయి. కులగణన చేపట్టాలని, తమకు రిజర్వేషన్ల శాతం పెంచాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది. సీఎం అశోక్ గెహ్లాత్ అన్ని కులాలకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డుల్ని ఏర్పాటు చేయడమే కాకుండా కులగణన కూడా చేపడతామని ప్రకటించారు. కులాల జనాభాకనుగుణంగా రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీనికి వివిధ కులాల దగ్గర్నుంచి మంచి స్పందన వచ్చింది. రాజస్తాన్‌లో అత్యంత కీలకమైన రాజ్‌పుత్‌లు ఓబీసీలకు ఉన్నారు. ఓబీసీల సంఖ్య ఎంతో ఎవరికీ తెలీకపోవడంతో రిజర్వేషన్లలో వారికి అన్యాయం జరుగుతోందనే వాదన వినిపిస్తోంది. రాజస్తాన్ జనాభాలో 50శాతానికి పైగా ఓబీసీలు ఉన్నారని అంచనాలుంటే ప్రస్తుతం వారికున్న రిజర్వేషన్లు 21% ఉన్నాయి. రాజస్తాన్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా వ్యవస్థలో 64% రిజర్వేషన్లు ఉన్నాయి. ఇందులో ఎస్సీలకు 16%, ఎస్టీలకు 12%, ఓబీసీలకు 21%, మోస్ట్ బాక్‌వార్డ్ క్లాసెస్ (ఎంబీసీ)లకు 5%, ఆర్థికంగా బలహీన వర్గాల వారికి 10% రిజర్వేషన్లు ఉన్నాయి. జాట్లు, గుజ్జర్లు, రాజ్‌పుత్‌లు సహా 92 కులాలు ఓబీసీ కేటగిరీలో ఉన్నాయి. దీంతో తమకు అన్యాయం జరుగుతోందన్న ఆవేదన వారిలో తీవ్రంగా ఉంది.

మధ్యప్రదేశ్

మధ్యప్రదేశ్‌లో ఓబీసీ జనాభా 50% వరకు ఉంటుంది. కానీ ఆ జనాభాకు తగ్గట్టుగా పథకాలేవీ వారికి అందడం లేదు. రాష్ట్రంలో పార్టీల గెలుపోటములను శాసించే సత్తా వారికి ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఓబీసీలో కిరార్ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. అయినప్పటికీ ఈ సారి బీజేపీ ఆయనను సీఎం అభ్యర్థిగా ప్రకటించలేదు. బీజేపీ ఎంపీలు, ప్రముఖ నేతలు ఎన్నికల బరిలో ఉండడంతో ఎన్నికల్లో పార్టీ గెలిచినా చౌహాన్‌ను మరోసారి సీఎంను చేస్తారన్న నమ్మకం కూడా కేడర్‌లో లేదు. బీజేపీ ఆయనను సీఎం ఫేస్‌గా ప్రకటించకపోవడం వల్ల పార్టీకే ఎదురు దెబ్బ తగులుతుందన్న ఆందోళన రాష్ట్ర బీజేపీలో ఉంది. కాంగ్రెస్ కులగణన చేపడతామని హామీ ఇవ్వడంతో కనీసం ఓబీసీ నాయకుడ్ని సీఎం అభ్యర్థిగా ముందుంచి ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర నేతలు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర జనాభాలో ఆదివాసీలు 21%, ఎస్సీలు 15.6% ఉన్నారు. మరోవైపు కులగణన వల్ల కాంగ్రెస్‌కు ఎన్నికల్లో లబ్ధి చేకూరుతుందని చెప్పలేమని రాజకీయ విశ్లేషకుడు దినేష్ గుప్తా వ్యాఖ్యానించారు. బీజేపీ కులగణన హామీకి బదులుగా ఎక్కువ మంది ఓబీసీలకు టికెట్లు ఇస్తూ దానిని బ్యాలెన్స్ చేసే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు సీఎం చౌహాన్ ఓబీసీలకు తొమ్మిది సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేశారు.

ఛత్తీస్‌గఢ్

ఛత్తీస్‌గఢ్ గిరిజన రాష్ట్రంగా ఉన్నప్పటికీ ఓబీసీ జనాభా అధికం. అధికారిక గణాంకాల ప్రకారం 43.5% మంది ఓబీసీలే ఉన్నారు. 2018లో సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన భూపేష్ బఘేల్ రాష్ట్ర మొట్టమొదటి ఓబీసీ ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కారు. ఓబీసీలకుండే రిజర్వేషన్లను 14 నుంచి 27శాతానికి పెంచుతూ బిల్లు తీసుకువచ్చారు. కానీ గవర్నర్ దానిని ఇంకా ఆమోదించలేదు. దీంతో బీజేపీ ఓబీసీలకు వ్యతిరేకమన్న ప్రచారాన్ని కాంగ్రెస్ విస్తృతంగా చేస్తోంది. మళ్లీ అధికారంలోకొస్తే కులగణన చేపడతామన్న హామీ ఇచ్చి ఓబీసీల్లో పట్టు పెంచుకున్నారు. కాంగ్రెస్ ప్రచారానికి కౌంటర్‌గా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఓబీసీ నేత అరుణ్ సావోను నియమించింది. ఇప్పటివరకు 90 స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటిస్తే అందులో 29 మంది ఓబీసీ నాయకులే. కాంగ్రెస్ కులగణన అస్త్రం మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతవరకు పని చేస్తుందో వేచి చూడాలి.

రాజస్తాన్‌లో అప్పుల భారం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్

జైపూర్: రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంపై అప్పుల భారం పెంచిందని కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఆరోపించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ద్రవ్యోల్బణ రిలీఫ్ క్యాంపుల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ ఐదేళ్లలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆక్షేపించారు. రైతు రుణాల మాఫీ, నిరుద్యోగ భృతి వంటివి ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంపై అప్పుల భారం పెరగడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జీడీపీ దారుణంగా పడిపోయిందని మంత్రి మేఘ్వాల్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుపరిపాలన కాదు, దుష్పరిపాలన సాగుతోందని మండిపడ్డారు. ఆర్థిక వ్యవస్థ పతనం కావడంతో నిరుద్యోగం పెరిగిపోయిందని, నేరాలు పెచ్చరిల్లుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు, పెట్టుబడులు రావడం లేదని విమర్శించారు.

బుల్లెట్‌పై బ్యాలెట్ విజయం..!

రాయపూర్: ఉన్న ఊరు కదలకుండా ఓటు వేసుకొనే హక్కు వారికి వచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లకి ఆ గ్రామాల ప్రజలకి ఈ అపూర్వ అవకాశం దక్కింది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా మారుమూల విసిరేసినట్టున్న 120 గ్రామాల ప్రజలు ఈ సారి తమ స్వగ్రామాల్లోనే ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తొలిసారిగా ఆ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఒకప్పుడు మావోయిస్టు ప్రాబల్యం కలిగిన ఈ గ్రామాల్లో ఇప్పుడు శాంతి భద్రతలు నెలకొనడంతో పోలింగ్‌కు ఏర్పాట్లు చేసినట్టుగా ఎన్నికల అధికారులు చెప్పారు. బుల్లెట్‌పై బ్యాలెట్ విజయం సాధించిందని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. గతంలో ఆ 120 గ్రామాల ప్రజలకి ఓటు వేయాలన్న ఉత్సాహం ఉన్నప్పటికీ 8 నుంచి 10 కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేయాల్సి వచ్చేది. ఓటు వేయడానికి వెళ్లే ప్రతీసారి మావోయిస్టుల నుంచి ఎలాంటి ముప్పు వస్తుందోనన్న ఆందోళన కూడా ఉండేది. కానీ ఇప్పుడు బస్తర్ జిల్లాలో భద్రత పెరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా బలోపేతం కావడంతో 120 గ్రామాల్లో కొత్త పోలింగ్ కేంద్రాలు కళకళలాడిపోతున్నాయి.

రాజస్తాన్‌లో హెలికాప్టర్ అద్దెలకు రెక్కలు



జైపూర్: రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకున్న వేళ హెలికాప్టర్ల అద్దెలకి రెక్కలు వచ్చాయి. సుడిగాలి ప్రచారానికి పార్టీల నాయకులు హెలికాప్టర్ల మీద ఆధారపడడంతో వాటి అద్దెలు అమాంతం పెరిగిపోయాయి. ఆరు నెలల క్రితం సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్ అద్దె గంటకి లక్ష రూపాయలైతే , ఇప్పుడా అద్దెలు రెట్టింపు అయ్యాయి. సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్ గంటకి అద్దె రూ.2 లక్షలు అంతకంటే ఎక్కువగా ఉంటే డబుల్ ఇంజిన్ హెలికాప్టర్లు గంటకి అద్దె రూ.3–4 లక్షలుగా ఉంది. ఇంక అభ్యర్థుల జాబితా పూర్తిగా రాకముందే ఈ స్థాయిలో ధరలు ఉంటే వచ్చాక మరింతగా పెరిగిపోయే అవకాశం ఉంది. ముమ్ముందు హెలికాప్టర్లకి ఇంకా డిమాండ్ పెరిగిపోతుందని జైపూర్‌కు చెందిన ప్రైవేటు హెలికాప్టర్ సంస్థ సీఈఓ సోహన్ సింగ్ చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ, ఆర్ఎల్‌పీ పార్టీల నాయకులు ముందస్తుగానే హెలికాప్టర్లను బుక్ చేసుకున్నారని డిమాండ్‌కు తగినన్ని హెలికాప్టర్లు తమ వద్ద లేవని ఆయన తెలిపారు.

"మూడో స్పిన్నర్‌ను ఆడించే విషయంపై ఇప్పుడే చెప్పలేను. పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటాం. తుది జట్టులో అవసరమైతే ఒకటి రెండు మార్పులు చేస్తాం. గత నాలుగేళ్లలో నేనేమీ పెద్దగా మారలేదు. బ్యాటర్‌గా చూస్తే ప్రతీ మ్యాచ్‌కు ముందు నా లోపాలు సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తా. దాని వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సన్నద్ధతలో లోటు ఉండదు. ప్రతీ రోజు కొత్త సవాలే. అన్నింటికీ సిద్ధంగా ఉంటా. నా ఆటేంటో, జట్టుకు నా అవసరం ఏమిటో బాగా తెలుసు. కెప్టెన్‌గా ఈ మ్యాచ్ కోసం సహచరులకు ప్రత్యేక సూచనలేమీ చేయను. వరల్డ్‌కప్‌లో అన్ని మ్యాచ్‌లలాగే ఇదీ ఒకటి. –రోహిత్ శర్మ, భారత కెప్టెన్



సారథిగా నాపై ఎలాంటి ఒత్తిడీ లేదు. ఒక్క మ్యాచ్ వల్ల నాకు కెప్టెన్సీ రాలేదు. ఈ ఒక్క మ్యాచ్ వల్ల అది పోదు. దేవుడు ఎంత ఇస్తే అంతే దక్కుతుంది. భారీ సంఖ్యలో ఉన్న ప్రేక్షకుల మధ్య గతంలో ఎన్నోసార్లు ఆడాం కాబట్టి ఇదేమీ కొత్త కాదు. పాక్ అభిమానులను అనుమతిస్తే బాగుండేది. కానీ మద్దతు లేకపోయినా మేం దీనికి సిద్ధమయ్యే ఉన్నాం. చరిత్ర గురించి నేను పట్టించుకోను. రికార్డులు ఏదో ఒక రోజు బద్దలవుతాయి. 2021 టి20 ప్రపంచకప్‌లో మేం భారత్‌ను ఓడించాం. అంతకుముందు అదీ లేదు కదా. కాబట్టి దేనికైనా ఎక్కడో ఒక చోట ముగింపు తప్పదు. –బాబర్ ఆజమ్, పాకిస్తాన్ కెప్టెన్"

చలో చిరకాల సమరానికి...

నేడు భారత్, పాకిస్తాన్ మధ్య వరల్డ్ కప్ మ్యాచ్

- అభిమానుల్లో అమితాసక్తి, ఉత్కంఠ
- మూడో విజయంపై టీమిండియా గురి
- ఆత్మవిశ్వాసంతో బరిలోకి పాక్

మధ్యాహ్నం గం. 2 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం



రోహిత్ శర్మ





బాబర్ ఆజమ్

ప్రపంచకప్‌లో 51 మ్యాచ్‌లు ఉన్నా, అందరూ ఎదురు చూసేది 'ఈ' మ్యాచ్ కోసమే... ఈ మ్యాచ్ కోసమే ప్రసారకర్తలు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు సిద్ధం చేస్తారు... ఈ మ్యాచ్ కోసమే ఫ్లయిట్ టికెట్లు, ప్రకటనల రేట్లు ఆకాశానికి అంటుతాయి... ఈ మ్యాచ్ కోసమే అభిమానులు ఎన్ని కష్టాలకోర్చి అయినా మైదానంలోకి అడుగు పెట్టాలని ఆశపడతారు... ఈ మ్యాచ్ కోసమే ఆస్పత్రి మంచాలు కూడా హోటల్ బెడ్‌లుగా మారిపోతాయి... ఈ మ్యాచ్ కోసమే సినీ తారలతో ప్రత్యేక సంగీత కార్యక్రమం ఉంటుంది... ఈ మ్యాచ్ అంటే బీసీసీఐ, ఐసీసీ దృష్టిలో 'నవరాత్రి' సంబరం...

చరిత్ర అంతా ఒక వైపే ఉండవచ్చు... వన్డే ప్రపంచకప్‌లో ఏడుసార్లు తలపడితే ప్రతీసారి భారత్‌నే విజయం వరించి ఉండవచ్చు... ప్రస్తుత బలాబలాలు, ఇటీవలి ప్రదర్శన చూస్తే మరో మాటకు తావు లేకుండా టీమిండియానే ఫేవరెట్ అనవచ్చు... అయినా సరే ఈ పోరుకు ఎక్కడ లేని ఆకర్షణ... సరిహద్దు ఉద్రిక్తతలు, రాజకీయాల కారణంగా ఇది ఆట మాత్రమే కాకుండా అంతకు మించిన భావోద్వేగ సమరం... ఆటగాళ్లు మాకు అన్ని మ్యాచ్‌లాగే ఇదీ ఒకటి అని పైకి చెప్పవచ్చు కానీ వారికీ తెలుసు... మైదానంలో దిగాక తమ గుండె చప్పుడు ఎలా ఉంటుందో...

దాదాపు ఏడాది క్రితం అక్టోబర్ 23, 2022న టి20 ప్రపంచకప్‌లో రవూఫ్ బౌలింగ్‌లో కోహ్లి బాదిన రెండు వరుస సిక్సర్లు గుర్తుకొచ్చాయా... నాడు 90 వేల మంది సామర్థ్యం గల మెల్‌బోర్న్ స్టేడియం దద్దరిల్లింది. ఇప్పుడు 1,32,000 మంది ప్రేక్షకులతో నరేంద్ర మోదీ మైదానం మోతెక్కడం ఖాయం. ఈ రెండింటి మధ్య ఆసియా కప్‌లో తలపడినా వరల్డ్‌కప్ లెక్క వేరు... మన అభిమానులతో స్టాండ్‌లు 'నీలి సముద్రం'గా మారబోతుండగా, ఏడేళ్ల తర్వాత భారత గడ్డపై భారత్‌ను ఎదుర్కొంటూ తమకు మద్దతిచ్చే ఒక్క అభిమానీ లేని పాక్ తట్టుకోగలదా అనేది ఆసక్తికరం.

అహ్మదాబాద్: వరల్డ్‌కప్‌లో అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న మెగా సమరానికి రంగం సిద్ధమైంది. ఉత్కంఠ, భారీ అంచనాల నడుమ నేడు నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగే లీగ్ మ్యాచ్‌లో భారత్, పాకిస్తాన్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిస్తే పాక్‌పై వన్డే వరల్డ్‌కప్ మ్యాచ్‌లలో భారత్ ఆధిక్యం మరింత పెరుగుతుంది. మరోవైపు ఒక్కసారైనా టీమిండియాను ఓడించి పేలవ గణాంకాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని పాక్ భావిస్తోంది. టోర్నీలో తమ తొలి రెండు మ్యాచ్‌లలో ఆస్ట్రేలియా, అఫ్గానిస్తాన్‌లపై భారత్ భారీ విజయం సాధించగా... నెదర్లాండ్స్, శ్రీలంకలను ఓడించిన పాక్ ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఇటీవలి ఆసియా కప్ ప్రదర్శనను బట్టి చూస్తే అన్ని రంగాల్లో భారత్ ఆధిక్యం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే అనూహ్యంగా ఆడే పాక్‌ను తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు.

గిల్ బరిలో దిగుతాడా...

భారత్ తుది జట్టు విషయంలో మామూలుగానైతే ఎలాంటి సమస్య లేదు. కానీ డెంగీ జ్వరం కారణంగా గత రెండు మ్యాచ్‌లు ఆడని శుబ్‌మన్ గిల్ బరిలోకి దిగడంపైనే ఉత్కంఠ నెలకొంది. అనారోగ్యం నుంచి కోలుకున్న అతను గురువారం స్వల్ప సమయం పాటు సాధన చేసినా... శుక్రవారం మాత్రం సుదీర్ఘంగా బ్యాటింగ్ చేశాడు. కెప్టెన్ రోహిత్ 'గిల్ 99 శాతం ఫిట్‌గా ఉన్నాడు' అని చెప్పడం అతను ఆడే అవకాశాలను మెరుగుపర్చింది. ఈ ఏడాది అద్భుత ఫామ్‌లో ఉండటంతో పాటు ఐపీఎల్‌లో ఇది అతని సొంత మైదానం కావడం కూడా మరో కారణం. అయితే ఆ ఒక్క శాతం పూర్తిగా కోలుకోకపోతేనే సమస్య. గిల్ లేకపోతే ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు. రోహిత్, కోహ్లి, కేఎల్ రాహుల్‌ల బ్యాటింగ్ ఫామ్ భారత్‌కు పెద్ద బలం. అఫ్గాన్‌పై సెంచరీతో రోహిత్ తన స్థాయిని చూపిస్తే కోహ్లి ప్రశాంతంగా రెండు అర్ధ సెంచరీలు సాధించాడు. 2015లో కోహ్లి, 2019లో రోహిత్ పాక్‌పై సెంచరీలతో చెలరేగారు. రాహుల్ కూడా తన విలువను ప్రదర్శిస్తుండగా, మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్ మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. పాండ్యా, జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనకు సిద్ధం కాగా, కుల్దీప్, సొంతగడ్డపై ఆడనున్న బుమ్రా బౌలింగ్‌ను పాక్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. ఎనిమిదో స్థానంలో శార్దుల్ ఠాకూర్‌ను తప్పించి అశ్విన్‌కు మళ్లీ అవకాశం ఇవ్వవచ్చు. అయితే రెండు సీజన్లుగా ఈ మైదానంలో ఉత్తమ రికార్డు ఉన్న షమీ కూడా పరిశీలనలో ఉన్నాడు.

జోరు కొనసాగేనా...

శ్రీలంక బౌలింగ్ బలమైనది కాకపోయినా సరే వరల్డ్‌కప్ మ్యాచ్‌లో 345 పరుగుల లక్ష్యఛేదన అంత సులువు కాదు. కానీ దీనిని సాధించడం కచ్చితంగా పాకిస్తాన్ జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆ మ్యాచ్‌కు ముందు నెదర్లాండ్స్‌తో తడబడిన తీరుతో పోలిస్తే ఆ జట్టు పరిస్థితి మారింది. హైదరాబాద్‌లో ఆడిన తుది జట్టునే పాక్ ఇక్కడా కొనసాగించవచ్చు. రిజ్వాన్ ఫామ్‌లో ఉండగా, అబ్దుల్లా షఫీక్ రూపంలో దూకుడైన ఓపెనర్ వెలుగులోకి రావడం సానుకూలాంశం. మిడిలార్డర్‌లో షకీల్, ఇఫ్తికార్ తమ వంతు పాత్ర పోషించగలరు. అయితే ఇమామ్ పేలవ ఆటతో పాటు జట్టు నంబర్‌వన్ బ్యాటర్ బాబర్ ఆజమ్ విఫలం కావడమే టీమ్‌ను ఆందోళన పరుస్తోంది. గత ఐదు ఇన్నింగ్స్‌లలో కలిపి బాబర్ 71 పరుగులే చేశాడు. అతను తన స్థాయికి తగినట్లుగా ఆడితే జట్టుకు ప్రయోజనం కలుగుతుంది. బౌలింగ్‌లో ఇప్పటికీ ప్రధాన అస్త్రం షాహిన్ అఫ్రిదినే. తన పదునైన లెఫ్టార్మ్ పేస్‌తో ఆరంభ ఓవర్లలో అతను భారత బ్యాటర్లను నిలువరించాలని జట్టు కోరుకుంటోంది. ఆపై రవూఫ్ కూడా కీలకం కానున్నాడు. భారీగా పరుగులిచ్చే హసన్ అలీ స్థానంలో వసీమ్ ఆడే అవకాశం ఉంది. టీమ్‌లో ఒక ప్రధాన స్పిన్నర్ లేకపోవడం పాక్ జట్టు పెద్ద బలహీనత. షాదాబ్, నవాజ్‌లను భారత బ్యాటర్లు అలవోకగా ఎదుర్కోగలరు.

పిచ్, వాతావరణం

గత రెండేళ్లలో ఇక్కడ జరిగిన నాలుగు వన్డేల్లో 59.8 శాతం వికెట్లు తీసి పేసర్లు ఎక్కువ ప్రభావం చూపించారు. అయితే ఈ మ్యాచ్ కోసం నల్లరేగడి మట్టి ఉన్న పిచ్‌ను ఎంచుకున్నారు. అంటే పిచ్ నెమ్మదిగా మారిపోయి బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. ప్రేక్షకుల కోణంలో పరుగుల వరద కోసమే నిర్వాహకులు సిద్ధమైనట్లు అర్థమవుతోంది. వేడి వాతావరణం, వర్ష సూచన లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్/ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, పాండ్యా, జడేజా, అశ్విన్/షమీ, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), షఫీక్, ఇమామ్, రిజ్వాన్, షకీల్, ఇఫ్తికార్, షాదాబ్, నవాజ్, షాహిన్ అఫ్రిది, హసన్/వసీమ్, రవూఫ్.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	3	3	0	6	1.604
దక్షిణాఫ్రికా	2	2	0	4	2.360
భారత్	2	2	0	4	1.500
పాకిస్తాన్	2	2	0	4	0.927
ఇంగ్లండ్	2	1	1	2	0.553
బంగ్లాదేశ్	3	1	2	2	-0.699
శ్రీలంక	2	0	2	0	-1.161
నెదర్లాండ్స్	2	0	2	0	-1.800
ఆస్ట్రేలియా	2	0	2	0	-1.846
అఫ్గానిస్తాన్	2	0	2	0	-1.907

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

మ్యూజిక్... మస్తీ!

భారత్, పాక్ మ్యాచ్‌కు ముందు వినోద కార్యక్రమం



అరిజిత్

అహ్మదాబాద్: సరిహద్దులో తీవ్రవాదుల చేతుల్లో భారత సైనికులు చనిపోయి నెలరోజులు కూడా కాలేదు... కానీ పాకిస్తాన్ ఆటగాళ్లకు 'గర్బా' నృత్యాలతో పూలు చల్లుతూ స్వాగతం చెబుతారా? వరల్డ్ కప్ టోర్నీకి ప్రారంభోత్సవం జరపలేదు కానీ ఈ మ్యాచ్‌కు ముందు ఉత్సవం నిర్వహించి పాక్ టీమ్‌కు ఎక్కడలేని ప్రాధాన్యతనిస్తారా? ఆర్మీకి మాత్రమే బాధ్యత ఉంటుంది తప్ప వేరేవారికి దేశం గురించి బాధ్యత లేదా? బీసీసీఐకి ఆదాయం మినహా త్యాగాలు, ప్రజల భావోద్వేగాలంటే లెక్క లేదు? ఇలా నేటి మ్యాచ్ గురించి దేశవ్యాప్తంగా ఎంత ఆసక్తి ఉందో అంతే స్థాయిలో తీవ్ర విమర్శలు కూడా వస్తున్నాయి. అయితే వీటన్నింటిని బీసీసీఐ పట్టించుకునే పరిస్థితిలో లేదు! ముందే ప్రకటించినట్లుగా భారత్, పాక్ మ్యాచ్ ఆటకు ముందు రంగురంగుల వేడుకను జరపనుంది. టాస్‌కు ముందు ప్రముఖ గాయకులు అరిజిత్ సింగ్, శంకర్ మహదేవన్, సుఖ్వీందర్ సింగ్, సునిధి చౌహాన్‌ల సంగీత ప్రదర్శన ఉంటుంది. ఇది 45 నిమిషాల పాటు సాగుతుంది. ఇన్నింగ్స్ విరామం మధ్యలో కూడా నేహ కక్కడ్, దర్శన్ రావల్ తమ గాత్రంతో అలరిస్తారు. ఈ మ్యాచ్‌కు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులతో పాటు అమితాబ్ బచ్చన్, రజనీకాంత్‌వంటి స్టార్లు హాజరు కానున్నారు.

కివీస్ 'హ్యాట్రిక్' విక్టరీ

- 8 వికెట్లతో బంగ్లాదేశ్‌పై విజయం
- రాణించిన విలియమ్సన్, మిచెల్

చెన్నై: గత ప్రపంచకప్‌ను త్రుటిలో కోల్పోయిన రన్నరప్ న్యూజిలాండ్ ఈ మెగా ఈవెంట్‌లో వరుస విజయాలతో దూసుకెళుతోంది. శుక్రవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో గెలుపొందిన కివీస్ 'హ్యాట్రిక్' విజయాన్ని నమోదు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. ముష్ఫికర్ రహీమ్ (75 బంతుల్లో 66; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), మహ్మదుల్లా (49 బంతుల్లో 41 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), షకీబుల్ హసన్ (51 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. కివీస్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫెర్గూసన్ 3, బౌల్ట్, హెన్రీ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన న్యూజిలాండ్ 42.5 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 248 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ విలియమ్సన్ (107 బంతుల్లో 78 రిటైర్డ్‌హర్ట్; 8 ఫోర్లు, 1 సిక్స్), డారిల్ మిచెల్ (67 బంతుల్లో 89 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) కివీస్‌ను గెలిపించారు. ఓపెనర్ కాన్వే (59 బంతుల్లో 45; 3 ఫోర్లు) రాణించాడు. ముస్తఫిజుర్, షకీబ్ చెరో వికెట్ తీశారు.



విలియమ్సన్, మిచెల్

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: లిటన్ దాస్ (సి) హెన్రీ (బి) బౌల్ట్ 0; తంజిద్ (సి) కాన్వే (బి) ఫెర్గూసన్ 16; మిరాజ్ (సి) హెన్రీ (బి) ఫెర్గూసన్ 30; నజ్ముల్ (సి) కాన్వే (బి) ఫిలిప్స్ 7; షకీబ్ (సి) లాథమ్ (బి) ఫెర్గూసన్ 40; ముష్ఫికర్ (బి) హెన్రీ 66; తౌహిద్ (సి) సాన్‌ట్నర్ (బి) బౌల్ట్ 13; మహ్మదుల్లా (నాటౌట్) 41; టస్కిన్ అహ్మద్ (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 17; ముస్తఫిజుర్ (సి) లాథమ్ (బి) హెన్రీ 4; షోరిఫుల్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 245. వికెట్ల పతనం: 1-0, 2-40, 3-56, 4-56, 5-152, 6-175, 7-180, 8-214, 9-225. బౌలింగ్: బౌల్ట్ 10-0-45-2, హెన్రీ 10-0-58-2, ఫెర్గూసన్ 10-0-49-3, సాన్‌ట్నర్ 10-1-31-1, ఫిలిప్స్ 2-0-13-1, రచిన్ రవీంద్ర 7-0-37-0, మిచెల్ 1-0-11-0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (ఎల్బీడబ్ల్యూ) (బి) షకీబ్ 45; రచిన్ (సి) ముష్ఫికర్ (బి) ముస్తఫిజుర్ 9; విలియమ్సన్ (రిటైర్డ్‌హర్ట్) 78, మిచెల్ (నాటౌట్) 89; ఫిలిప్స్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 11, మొత్తం (42.5 ఓవర్లలో 2 వికెట్లకు) 248. వికెట్ల పతనం: 1-12, 2-92. బౌలింగ్: ముస్తాఫిజుర్ 8-0-36-1, షోరిఫుల్ 7.5-1-43-0, టస్కిన్ అహ్మద్ 8-0-56-0, షకీబ్ 10-0-54-1, మిరాజ్ 9-0-58-0.



భారత్ 7 పాకిస్తాన్ 0

వన్డే ప్రపంచకప్‌లో భారత్, పాక్ జట్ల మధ్య 7 మ్యాచ్‌లు జరగ్గా ఏడింటిలోనూ భారతే నెగ్గింది. 2007లో వెస్టిండీస్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు గ్రూప్ లీగ్ దశలోనే నిష్క్రమించడంతో రెండు జట్లు ముఖాముఖిగా తలపడే అవకాశం రాలేదు.

1992 ప్రపంచకప్ (మార్చి 4 : సిడ్నీ)
భారత్ ఇన్నింగ్స్: 216/7 (49 ఓవర్లలో) (సచిన్ 54 నాటౌట్); పాకిస్తాన్ ఇన్నింగ్స్: 173 ఆలౌట్ (48.1 ఓవర్లలో). ఫలితం: భారత్ 43 పరుగులతో గెలుపు

1996 ప్రపంచకప్ (మార్చి 9 : బెంగళూరు)
భారత్ ఇన్నింగ్స్: 287/8 (50 ఓవర్లలో) (సిద్ధూ 93); పాకిస్తాన్ ఇన్నింగ్స్: 248/9 (49 ఓవర్లలో). ఫలితం: భారత్ 39 పరుగుల తేడాతో విజయం

1999 ప్రపంచకప్ (జూన్ 8 : మాంచెస్టర్)
భారత్ ఇన్నింగ్స్: 227/6 (50 ఓవర్లలో) (ద్రవిడ్ 61, అజహరుద్దీన్ 59); పాకిస్తాన్ ఇన్నింగ్స్: 180 ఆలౌట్ (45.3 ఓవర్లలో) (వెంకటేశ్ ప్రసాద్ 5/27). ఫలితం: భారత్ 47 పరుగులతో గెలుపు

2003 ప్రపంచకప్ (మార్చి 1 : సెంచూరియన్)
పాకిస్తాన్ ఇన్నింగ్స్: 273/7 (50 ఓవర్లలో) (అన్వర్ 101); భారత్ ఇన్నింగ్స్: 276/4 (45.4 ఓవర్లలో) (సచిన్ 98, యువరాజ్ 50 నాటౌట్). ఫలితం: భారత్ 6 వికెట్ల తేడాతో విజయం

2011 ప్రపంచకప్ (మార్చి 30 : మొహాలీ)
భారత్ ఇన్నింగ్స్: 260/9 (50 ఓవర్లలో) (సచిన్ టెండూల్కర్ 85, వహాబ్ రియాజ్ 5/46); పాకిస్తాన్ ఇన్నింగ్స్: 231 ఆలౌట్ (49.5 ఓవర్లలో). ఫలితం: భారత్ 29 పరుగులతో విజయం

2015 ప్రపంచకప్ (ఫిబ్రవరి 15 : అడిలైడ్)
భారత్ ఇన్నింగ్స్: 300/7 (50 ఓవర్లలో) (ధావన్ 73, కోహ్లి 107, రైనా 74); పాకిస్తాన్ ఇన్నింగ్స్: 224 ఆలౌట్ (47 ఓవర్లలో) (మిస్బా 76, షమీ 4/35). ఫలితం: భారత్ 76 పరుగులతో విజయం

2019 ప్రపంచకప్ (జూన్ 16 : మాంచెస్టర్)
భారత్ ఇన్నింగ్స్: 336/5 (50 ఓవర్లలో) (రోహిత్ శర్మ 140, కోహ్లి 77, ఆమిర్ 3/47); పాకిస్తాన్ ఇన్నింగ్స్: 212/6 (40 ఓవర్లలో). ఫలితం: డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ 89 పరుగులతో విజయం

2028 ఒలింపిక్స్‌లో క్రికెట్!

ఐఓసీ ఆమోదం లాంఛనమే

ముంబై: అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఓటింగ్ లాంఛనం పూర్తయితే 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం చేస్తుంది. మరోవైపు బాక్సింగ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. అంతర్జాతీయ బాక్సింగ్ సమాఖ్యపై ఐఓసీ వేటుకు సిద్ధమైన నేపథ్యంలో బాక్సింగ్‌ను ఒలింపిక్స్‌లో కొనసాగించాలనే నిర్ణయాన్ని నిలిపివేసింది. మరోవైపు కొత్తగా కాంపౌండ్ ఆర్చరీ ఈవెంట్‌ను చేర్చాలన్న ప్రతిపాదనను తిరస్కరించింది. 2028లో అమెరికా నిర్వహించనున్న ఈ విశ్వక్రీడల కోసం క్రికెట్ సహా మరో నాలుగు క్రీడలు బేస్‌బాల్–సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోసి (సిక్సెస్), స్క్వాష్ ఆటలు చేర్చే ప్రతిపాదనల్ని ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదించింది. ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాచ్ నేతృత్వంలోని కమిటీ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. దీంతో కేవలం లాంఛనప్రాయమైన ఓటింగ్ మాత్రమే మిగిలుంది. ముంబైలో ప్రస్తుతం జరుగుతున్న ఐఓసీ సెషన్స్‌లోనే ఆ లాంఛనం కూడా ఆదివారం పూర్తి కానుంది. ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదం లభించడంతో ఓటింగ్‌లో ఏ సమస్య ఎదురవదు. మెజారిటీ ఓట్లు ఖాయమవుతాయి. 'విశ్వవ్యాప్తంగా క్రికెట్ విశేష ఆదరణ పొందుతోంది. ముఖ్యంగా టి20 ఫార్మాట్ అందర్ని అలరిస్తుంది. వన్డే ప్రపంచకప్ అయితే ఏళ్ల క్రితమే విజయవంతమైంది. ఈ నేపథ్యంలో ఒలింపిక్స్‌కు క్రికెట్ దగ్గరైంది' అని ఐఓసీ చీఫ్ థామస్ బాచ్ అన్నారు. ఆదివారం ఓటింగ్ ప్రక్రియ పూర్తయితే లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో టి20 ఫార్మాట్‌లో క్రికెట్ నిర్వహిస్తారు. చివరిసారి 1900 పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ఆడించారు. ఆ తర్వాత క్రికెట్‌ను విశ్వ క్రీడల నుంచి తొలగించారు.



క్రికెట్‌కు కుక్ గుడ్‌బై

లండన్: ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ అన్ని స్థాయిల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఐదేళ్ల క్రితం అతను అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. 2018లో టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాక కౌంటీ క్రికెట్‌లో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగించాడు. ఈ ఐదేళ్ల పాటు ఎస్సెక్స్ కౌంటీ జట్టు తురుపుముక్కగా ఈ వెటరన్ బ్యాటర్ సేవలందించాడు. మొత్తం కౌంటీ క్రికెట్‌లో ఎస్సెక్స్‌కే అంకితమైన రికార్డు కుక్‌ది! 2003లో కౌంటీ చాంపియన్‌షిప్‌లో అరంగేట్రం చేసినప్పటి నుంచి ఎస్సెక్స్ జట్టుకే దాదాపు రెండు దశాబ్దాలు ఆడాడు. 'నా వరకైతే క్రికెట్ నుంచి రిటైర్ కావడం అంత సులువైన పని కాదు. నేను కలలో కూడా ఊహించుకోలేని ప్రదేశాల్ని నాకు క్రికెటే చూపించింది. మేటి జట్లలో భాగమయ్యేలా, విజయవంతమయ్యేలా చేసింది' అని తన వీడ్కోలు సందేశంలో కుక్ వివరించాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో కుక్ 352 మ్యాచ్‌లాడి 26,643 పరుగులు చేశాడు. ఇందులో 74 సెంచరీలు, 125 అర్ధసెంచరీలున్నాయి.





సెమీస్‌లో రష్మిక

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లోకి ప్రవేశించింది. థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక 6-2, 6-3తో వలెరి జీనీనా (రష్యా)పై గెలిచింది. 79 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక నాలుగు ఏస్‌లు సంధించింది. మరోవైపు న్యూఢిల్లీలో జరుగుతున్న ఫెనెస్టా ఓపెన్ జాతీయ చాంపియన్‌షిప్‌లో అండర్-14 బాలుర డబుల్స్ విభాగంలో హృతిక్ కటకం (తెలంగాణ)-తవీష్ (హరియాణా) జోడీ టైటిల్ సొంతం చేసుకుంది. ఫైనల్లో హృతిక్-తవీష్ ద్వయం 6-4, 7-5తో శౌర్య-రణ్‌వీర్ జంటపై నెగ్గింది. సింగిల్స్‌లో హృతిక్ ఫైనల్లోకి ప్రవేశించాడు. సెమీఫైనల్లో హృతిక్ 6-4, 6-1తో అనురాగ్‌పై గెలిచాడు.



సెమీస్‌లో సింధు

వాంటా (ఫిన్‌లాండ్): ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ సింధు గంటా 31 నిమిషాల్లో 20-22, 22-20, 21-18తో ప్రపంచ 26వ ర్యాంకర్ థయ్ లిన్ ఎన్గుయెన్ (వియత్నాం)పై కష్టపడి గెలిచింది. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా)తో సింధు ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 2-0తో ఆధిక్యంలో ఉంది.

క్లుప్తంగా...

ఇజ్రాయెల్ నుంచి రాష్ట్రానికి 10 మంది

సాక్షి, అమరావతి: ఇజ్రాయెల్‌లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో అక్కడున్న భారతీయులను క్షేమంగా భారత్‌కు తీసుకురావడానికి కేంద్ర విదేశాంగ శాఖ 'ఆపరేషన్ అజయ్' చేపట్టిన సంగతి తెలిసిందే. దీన్లో భాగంగా గురువారం భారత్‌కు చేరుకున్న తొలి విమానంలో ఏపీకి చెందిన 10 మంది ఢిల్లీకి చేరుకున్నట్లు ఏపీ ఎన్ఆర్టీఎస్ శుక్రవారం తెలిపింది. రాబోయే రోజుల్లో మరికొంతమంది ఏపీ వాసులు స్వదేశానికి తీసుకురానున్నట్లు పేర్కొంది. ప్రయాణ ఖర్చులు భరించలేని వారిని ప్రభుత్వ ఖర్చులతో ఏపీలోని స్వగ్రామాలకు తీసుకురావాల్సిందిగా సీఎం జగన్ ఢిల్లీలోని ఏపీ రెసిడెంట్ భవన్ అధికారులకు ఆదేశాలిచ్చారు. భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ నెంబర్: +972 35226748 లేదా ఈ లింక్‌లో https://sxnqsinzgbxy1u0&adwdemo.adb.ap&hyderabad&1.oraclecloudapps.com/ords/r/mea/evacuaid/evacu&aid?session=113613339334455 నమోదు చేసుకోవాలని కోరారు. ఇజ్రాయెల్‌లో చిక్కుకున్న రాష్ట్ర వాసులను క్షేమంగా తీసుకురావడానికి ఏపీ ఎన్ఆర్టీఎస్ 24 గంటల హెల్ప్‌లైన్ నంబర్లు +91 8500027678 (వాట్సాప్), 0863 2340678 ఏర్పాటు చేసింది.

పరిపాలన వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి



పూజలు చేస్తున్న హనుమంతు లజపతిరాయ్, దువ్వాడ వాణి తదితరులు

టెక్కలి: పరిపాలన వికేంద్రీకరణతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అన్ని వనరులు కలిగిన విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తే ఉత్తరాంధ్రకు మరింత లబ్ధి చేకూరుతుందని పరిపాలన వికేంద్రీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. విశాఖలో పరిపాలనా రాజధానిని స్వాగతిస్తూ శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒక్క అమరావతిలో కాకుండా అన్ని ప్రాంతాలు అభివృద్ధి జరగాలంటే పాలన వికేంద్రీకరణ జరగాలని లజపతిరాయ్ స్పష్టం చేశారు. ఈనిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ 'కారుణ్యం'

- కోవిడ్‌తో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం
- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలకు 241 మంది అర్హులు
- ఇప్పటికే 164 మందికి నియామక ఉత్తర్వులు జారీ
- మిగిలిన వారికి వెంటనే నియామక ఉత్తర్వులు జారీ చేయాలని సీఎస్ ఆదేశం



సాక్షి, అమరావతి: కోవిడ్–19తో మృతి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కారుణ్యం చూపుతోంది. కోవిడ్‌తో 2,917 మంది ప్రభుత్వ ఉద్యోగులు మృతి చెందగా.. వారి కుటుంబాల్లో ఒకరికి చొప్పున కారుణ్య నియామకాలను చేపట్టిన విషయం తెలిసిందే. గతంలోనే కారుణ్య నియామకాల కోసం 2,744 మంది దరఖాస్తు చేసుకోగా 1,488 మందికి ఉద్యోగాలను కల్పించింది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మృతి చెందిన ఉద్యోగికి మైనర్ పిల్లలు ఉంటే వయసు, విద్యార్హతల ఆధారంగా జీవిత భాగస్వామికి ఉద్యోగం ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాల్లో స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల విద్యార్హతలు, సాంకేతిక అర్హతలు ఆధారంగా కారుణ్య నియామకాలను భర్తీ చేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాల నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాల కోసం 330 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 241 దరఖాస్తులు అర్హమైనవిగా గుర్తించారు. వీటిలో ఇప్పటి వరకు జిల్లాల వారీగా 164 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. మిగతా 77 మంది అర్హత గల కుటుంబాల్లోని వారికి వెంటనే ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.జవహర్ రెడ్డి ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లను ఆదేశించారు. ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు అందరూ ఉద్యోగాల్లో చేరిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సిందిగా సీఎస్ సూచించారు.

'స్కిల్' విచారణ సీబీఐకి!

- ఉండవల్లి అరుణ్‌కుమార్ పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు
- చంద్రబాబు, అచ్చెన్న, రాష్ట్ర ప్రభుత్వం, సీబీఐ సహా 44 మందికి నోటీసులు
- కౌంటర్లు దాఖలు చేయాలంటూ... విచారణ నవంబరు 10కి వాయిదా
- సీబీఐకి ఇవ్వాలని నాలుగేళ్ల క్రితమే మా వైఖరిని చెప్పాం
- ఇప్పుడు కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు: రాష్ట్ర అడ్వొకేట్ జనరల్
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా దర్యాప్తును సీబీఐకి అప్పగించాలి
- హైకోర్టును కోరిన ఉండవల్లి తరఫు సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం తీవ్రత దృష్ట్యా ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై (పిల్) హైకోర్టు స్పందించింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సీఐడీలతో పాటు స్కిల్ కుంభకోణంలో కీలక నిందితులైన మాజీ సీఎం చంద్రబాబు, అచ్చెన్నాయుడు, అప్పటి అధికారులు గంటా సుబ్బారావు, డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, నిమ్మగడ్డ వెంకట కృష్ణ ప్రసాద్, డిజైన్‌టెక్ ఎండీ వికాస్ వినయ్ కన్విల్కర్, సీమెన్స్ మాజీ ఎండీ సుమన్ బోస్, సంజయ్ డాగా, ఐఏఎస్ అధికారిణి అపర్ణ ఉపాధ్యాయ సహా 44 మందికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ తదుపరి విచారణను నవంబర్ 10కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద రావు, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సీబీఐకి...

ఉండవల్లి తరఫున సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి వాదనలు వినిపిస్తూ, ఈ కేసులో రూ.371 కోట్ల ప్రజాధనం ముడిపడి ఉందన్నారు. గత ప్రభుత్వంలోని కీలక వ్యక్తులందరూ ఇందులో నిందితులుగా ఉన్నారని, ప్రజా ప్రయోజనాల కోసం, సమర్థమైన దర్యాప్తు కోసం కేసును సీబీఐకి బదిలీ చేయాలని కోరారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ ఈ కేసుతో మీకు సంబంధమేంటని ప్రశ్నించింది. మాజీ ఎంపీ అయిన పిటిషనర్‌కు ఇపుడు ఏ పార్టీతోనూ సంబంధం లేదని, రాష్ట్ర విభజనపైన, పోలవరం విషయంలో కేంద్రం ఇవ్వాల్సిన నిధులపై వ్యాజ్యాలు వేసి న్యాయ పోరాటం చేస్తున్నారని కృష్ణమూర్తి తెలిపారు.

సీబీఐ దర్యాప్తును అప్పుడే కోరాం...

తరువాత రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ 'ఈ కుంభకోణంలో వేరువేరు రాష్ట్రాల్లో డబ్బులు భారీగా చేతులు మారాయి. రాజకీయ పార్టీలకూ సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. వాస్తవానికి కేబినెట్ సబ్‌కమిటీ సిఫారసుల ఆధారంగా 2020లోనే ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేత విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. కానీ సిట్‌ను వ్యతిరేకిస్తూ హైకోర్టులో సవాల్ చేశారు. ఆ సందర్భంగా... కేంద్రాన్ని దీన్లో చేర్చాలని రాష్ట్రం కోరింది. దర్యాప్తును సీబీఐకి అప్పగించడానికి స్వచ్ఛందంగా అంగీకరించింది. కానీ సిట్‌కు సంబంధించి తదుపరి ప్రొసీడింగ్స్ అన్నిటిపైనా స్టే ఇస్తూ... ఇంప్లీడ్ అప్లికేషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు పక్కనబెట్టింది. కేంద్రాన్ని సుమోటోగా ఇంప్లీడ్ చేసి... కేసును మళ్లీ హైకోర్టుకు పంపింది. మళ్లీ విచారించాలని, రాష్ట్ర అభ్యర్థన మేరకు కేంద్రం కౌంటర్ గనక అఫిడవిట్ వేస్తే... దాన్ని కూడా విచారించాలని పేర్కొంది'' అని వివరించారు. తద్వారా సిట్ చూస్తున్న వ్యవహారాలను సీబీఐకి బదలాయించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదనేది తేటతెల్లమవుతోందని, అందుకే ఆ రెండు పిటిషన్లలో ఇంప్లీడ్ అప్లికేషన్లు వేసిందని వివరించారు.

దాడుల హెచ్చరికలు సరికాదు...

నిందితుడు చంద్రబాబు తరఫు లాయర్లు వ్యవహరిస్తున్న తీరును ఏజీ హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ''నిందితుడి తరఫున వివిధ కోర్టుల్లో హాజరవుతున్న లాయర్లు ప్రభుత్వ న్యాయాధికారుల్ని బెదిరిస్తున్నారు. భౌతికంగా దాడులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. వాస్తవానికి న్యాయాధికారులు తమ బాధ్యతల్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నారు. అది వారి విధి. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినంత వరకూ ఈ రిట్ పిటిషన్లో, దర్యాప్తులో ఎలాంటి రాజకీయ కోణమూ లేదు'' అని వివరించారు. దీంతో కోర్టు వివిధ పక్షాలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

బయోటెక్నాలజీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ కోర్సులో చేరదలచిన జీఏటీ–బి ప్రవేశ పరీక్ష పాసైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ రజినీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 29వతేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.spmvv.ac.in వర్సిటీ వెబ్‌సైట్‌ను వీక్షించాలని తెలియజేశారు. అదేవిధంగా ఎన్జీరంగా యూనివర్సిటీ పరిధిలో చిరుధాన్యాలు, పుట్టగొడుగుల పెంపకం, వర్మీ కంపోస్ట్, బయో ఫెర్టిలైజర్స్‌కు సంబంధించి ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) ద్వారా సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని, మరిన్ని వివరాలకు www.angrau.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు గుంటూరులో శిల్పారామం ప్రారంభం

- రూ.4.56 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణం
- శిల్పారామం సొసైటీ సీఈవో శ్యామ్‌సుందర్‌రెడ్డి




గుంటూరులో నూతనంగా నిర్మించిన శిల్పారామం

సాక్షి, అమరావతి: గుంటూరులో రూ.4.56 కోట్లతో నిర్మించిన శిల్పారామాన్ని పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా శనివారం (నేడు) ప్రారంభిస్తున్నట్టు శిల్పారామం సొసైటీ సీఈవో శ్యామ్‌సుందర్‌రెడ్డి చెప్పారు. 3.60 ఎకరాల పార్కు, 5.30 ఎకరాల కొలను, 3.31 ఎకరాల్లో పార్కింగ్ సౌకర్యాలతో పాటు అధునాతన ల్యాండ్ స్కేపింగ్, వాణిజ్య దుకాణాలు, ఫుడ్‌కోర్టులు, యాంపీథియేటర్, వాటర్ ఫౌంటెన్స్‌తో ఈ శిల్పారామాన్ని సుందరంగా తీర్చిదిదినట్లు వివరించారు. ఆయన శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు రాష్ట్రంలో తిరుపతి, విశాఖపట్నం, కడప, పులివెందుల, అనంతపురం, పుట్టపర్తి, కాకినాడ, విజయనగరంలలో శిల్పారామాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గుంటూరులో ప్రారంభమయ్యేది తొమ్మిదో శిల్పారామమన్నారు. ప్రతి జిల్లాలో శిల్పారామం ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత 2022–23లో సందర్శకుల సంఖ్య గతంతో పోలిస్తే 125 శాతం పెరిగిందని, అత్యధికంగా రూ.7.50 కోట్ల రాబడి వచ్చిందని చెప్పారు. ఫలితంగా శిల్పారామం ఉద్యోగులకు 30 శాతం జీతాలు పెంచామన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో 13.18 ఎకరాల్లో రూ.9.20 కోట్లతో శిల్పారామాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు.

పర్యాటక కేంద్రంగా కొండవీడు కోట

- ఆకర్షించే స్థాయిలో అభివృద్ధి
- సీఎస్ జవహర్ రెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లాలోని కొండవీడు కోటను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి తెలిపారు. కొండవీడు కోట ఎకో టూరిజం పార్కు సహా ఇతర అభివృద్ధి పనులపై సీఎస్ తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకూ చేపట్టిన అప్రోచ్ రోడ్లు సహా ఇతర అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని రహదారులు–భవనాలు, ఆర్కియాలజీ, దేవదాయ, అటవీ శాఖ అధి కారులను సీఎస్ ఆదేశించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో లక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయం, ఆర్కియాలజీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న శివాలయం పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. సాయంత్రం వేళల్లో సందర్శకులు, పర్యాటకులకు ఆకట్టుకునేలా కోట ఆవరణలో సౌండ్ అండ్ లైటింగ్ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు సీఎస్ వివరించారు. కోట చుట్టూ సుందరీకరణ, వెలుపల పార్కులు, ల్యాండ్ స్కేపింగ్ వంటివి అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. పీసీసీఎఫ్ వై మధుసూదన్ రెడ్డి, ఆర్కియాలజీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ మోహన్, రాష్ట్ర పర్యాటక శాఖ ఎండీ కే కన్నబాబు, దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, రహదారులు–భవనాల ఈఎన్సీ నయీముల్లా, సీతఈ శివారెడ్డి, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాస రెడ్డి, కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె.శివారెడ్డి, డీఎఫ్ఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

గ్రీన్‌టగ్స్ నిర్మాణంలో ▸ నంబర్ వన్ దిశగా..

హిందుస్థాన్ షిప్‌యార్డు వడివడిగా అడుగులు ● 40, 80 టన్నుల గ్రీన్‌టగ్స్ నిర్మాణానికి ప్రణాళికలు

● ఎలక్ట్రికల్ టగ్స్‌తో కాలుష్య నియంత్రణ ● ఒక్కో టగ్ నిర్మాణానికి 8 నుంచి 12 నెలల్లోపే సమయం

సాక్షి, విశాఖపట్నం: గ్రీన్ ఇండస్ట్రీ విభాగంలో దూసుకెళ్లేలా.. హిందూస్థాన్ షిప్‌యార్డు (హెచ్ఎస్ఎల్) వడివడిగా అడుగులు వేస్తోంది. 2030 నాటికి గ్రీన్ షిప్ బిల్డింగ్‌కు భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న తరుణంలో.. హెచ్ఎస్ఎల్ కూడా అదే దారిలో పయనిస్తోంది. ఇంధన వనరుల ఆదా, కాలుష్య నియంత్రణకు అనుగుణంగా గ్రీన్‌టగ్స్ నిర్మాణంపై దృష్టి పెట్టింది. ఒక్కో టగ్‌ను ఏడాదిలోపే పూర్తి చేసేందుకు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ.. దేశంలో నంబర్ వన్‌గా ఎదిగేలా అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని భావిస్తోంది.

షిప్ బిల్డింగ్ హబ్‌గా విశాఖ

విశాఖపట్టణాన్ని షిప్ బిల్డింగ్ హబ్‌గా తీర్చిదిద్దేలా రూ.19,048 కోట్లతో ఐదు భారీ యుద్ధ నౌకల నిర్మాణ పనుల్ని దక్కించుకున్న షిప్‌యార్డు, త్వరలోనే గ్రీన్‌టగ్ హబ్‌గా మారేందుకు ప్రణాళికలు రచిస్తోంది. 2030 నాటికి అన్ని పోర్టుల్లో గ్రీన్‌టగ్‌ల వినియోగం సంఖ్య 50 శాతానికి చేరుకోవాలని కేంద్ర జలవనరులు, పోర్టులు, జలరవాణా మంత్రిత్వ శాఖ ఆదేశించింది. టగ్‌ల ఆర్డర్లు అత్యధికంగా వచ్చే అవకాశం ఉండడంతో షిప్‌యార్డు ఆ దిశగా సన్నద్ధమవుతోంది.



హిందూస్థాన్ షిప్‌యార్డు

నంబర్ వన్‌గా నిలవాలని...



గ్రీన్‌టగ్స్‌కు క్రమేణా డిమాండ్ పెరుగుతోంది. దీంతో వాటి నిర్మాణంపై దృష్టి పెట్టాం. భారీ బ్యాటరీలు, సోలార్ ఎనర్జీ, సీఎన్‌జీతో నడిచే హైబ్రిడ్ టగ్స్ నిర్మించనున్నాం. ఈ టగ్స్ అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉండదు. కేవలం పోర్టులు, తీర ప్రాంతాల్లో మాత్రమే పనిచేస్తాయి. ఇప్పటికే దేశంలోని వివిధ పోర్టులు, టగ్ ఆపరేటర్లు, షిప్పింగ్ కంపెనీలతో ఆర్డర్ల కోసం సంప్రదింపులు జరుపుతున్నాం. త్వరలోనే గ్రీన్‌టగ్స్ నిర్మాణంలో నంబర్ వన్‌గా నిలుస్తాం.

– కమొడర్ హేమంత్ ఖత్రి, సీఎండీ, హిందుస్థాన్ షిప్‌యార్డు

టగ్స్‌తో ఇవీ ఉపయోగాలు

పెద్ద కార్గో షిప్‌లను లాగడానికి, బెర్త్ నుంచి సముద్రం లోపలికి నెట్టడానికి, భారీ షిప్స్‌కు భద్రత కల్పించేందుకు, అత్యవసర సమయంలో స్టాండ్‌బై నౌకగా వినియోగించడానికి టగ్‌బోట్స్‌ను ఉపయోగిస్తారు. భారీ షిప్స్‌ను లాగినప్పుడు, లేదా నెట్టినప్పుడు మాత్రమే టగ్స్‌కు అధిక శక్తి అవసరమవుతుంటుంది. ఇందుకోసం డీజిల్ ఇంజిన్‌ను వినియోగిస్తారు. వీటి స్థానంలో ఎలక్ట్రిక్, సోలార్‌తో నడిచే గ్రీన్‌టగ్స్ నిర్మాణానికి షిప్‌యార్డు సిద్ధమవుతోంది.

రెండు రకాల గ్రీన్‌టగ్స్



గ్రీన్ టగ్స్

ఎలక్ట్రికల్ టగ్స్ నిర్మాణంలో 2026నాటికి స్వయం ప్రతిపత్తి సాధించాలని హెచ్ఎస్ఎల్ నిర్దేశించుకుంది. ఇందుకోసం ఆర్ అండ్ డీ సంస్థలు, ఎంఎస్ఎంఈలతో సమన్వయం చేసుకుంటూ రెండు రకాలైన గ్రీన్‌టగ్స్‌ను నిర్మించనుంది. 40, 80 టన్నుల టగ్స్‌ను అందించనుంది. ఎనర్జీ మేనేజ్‌మెంట్, బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్, స్టోరేజీ సిస్టమ్, హై పవర్ ఎలక్ట్రానిక్స్, హై ఎఫిషియన్సీ.. ఇలా.. భిన్నమైన టెక్నాలజీలతో వీటి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. నిర్మాణ సమయాన్ని కూడా కుదించేలా కొత్త టెక్నాలజీని వినియోగించనుంది. దీనివల్ల కేవలం 8 నుంచి 12 నెలల్లోనే గ్రీన్‌టగ్స్‌ను నౌకాయాన సంస్థలకు డెలివరీ చేయగలమని హిందూస్థాన్ షిప్‌యార్డు ధీమా వ్యక్తం చేస్తోంది.

భారత జట్టుకు భరత్ ఆడటం గర్వకారణం

- క్రికెటర్ భరత్ సన్మాన సభలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- సీఎం మాటలు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చాయి: క్రికెటర్ భరత్



భరత్‌ను సన్మానిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్

బీచ్‌రోడ్డు (విశాఖతూర్పు): భారతదేశం జట్టుకు తెలుగు బిడ్డ శ్రీకర్ భరత్ ఆడటం గర్వకారణమని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో భరత్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పట్టుదలతో శ్రీకర్ భరత్ అంతర్జాతీయ స్థాయికి ఎదిగారన్నారు. భరత్‌ను ప్రోత్సహించేందుకు ఇంటి స్థలంతో పాటు గ్రూప్–1 ఉద్యోగం ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఈ ఏడాది నుంచి 'ఆడుదాం..ఆంధ్ర' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖలో ప్రపంచ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందన్నారు. త్వరలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ స్టేడియానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ భరత్ దేశానికి గర్వకారణమన్నారు. యువత క్రికెటర్లు రాయుడు, భరత్‌లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భరత్ అకాడమీ పెడితే ప్రభుత్వం తరఫున సహకారం అందించేందుకు సిద్ధం ఉన్నట్లు ప్రకటించారు. భరత్ జట్టుకు ఎంపికైన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశానని, ఆ సమయంలో ఆయన తనకు చెప్పిన మాటలు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చాయని క్రికెటర్ భరత్ చెప్పారు. తాను ఈ స్థాయికి చేరుకోవడంలో తన తల్లిదండ్రులు, ఏసీఏ, కోచ్‌ల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తోందన్నారు. 'ఆడుదాం..ఆంధ్ర' వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో జనసేన నేత కేతంరెడ్డి చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన కేతంరెడ్డి వినోద్‌రెడ్డికి పార్టీ కండువా కప్పుతున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు నగరానికి చెందిన జనసేన నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. స్థానిక వీపీఆర్ కన్వెన్షన్‌లో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి, పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు కేతంరెడ్డికి కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వినోద్ ఇప్పటికైనా మంచి నిర్ణయం తీసుకున్నారని, ఆయనకు వైఎస్సార్‌సీపీలో మంచి స్థానం, మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

ఏటీఎం చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- హరియాణాకు చెందిన మేవాత్ గ్యాంగ్ అరెస్ట్
- రెండు లక్షల నగదు, రెండు లారీలు, కారు, తుపాకులు స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నాటు తుపాకులను చూపిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: తిరుపతిలో గతనెల 14వ తేదీన తెల్లవారుజామున ఏటీఎంలో జరిగిన నగదు చోరీ కేసును తిరుపతి రూరల్ పోలీసులు ఛేదించినట్లు జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఎంఆర్ పల్లి పరేడ్ గ్రౌండ్స్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. గత నెల 14వ తేదీన తెల్లవారుజామున తిరుపతి రూరల్ మండలం, ధనలక్ష్మీ నగర్, కెనరా బ్యాంక్ సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోని 18 లక్షల ఇరవై ఆరు వేల 500 రూపాయలను గుర్తుతెలియని దొంగలు దోచుకెళ్లారు. ఘటనా స్థలంలో దొరికిన ఫింగర్ ప్రింట్ ఆధారంగా దర్యాప్తు చేపట్టగా ఇదే తరహా దొంగతనం హిమాచల్‌ప్రదేశ్‌లోని చిగురువాడ పోలీస్ స్టేషన్లో జరిగినట్లుగా గుర్తించారు. అక్కడ దొరికిన ఆధారాలను బట్టి హరియాణా రాష్ట్రానికి చెందిన మేవాత్ గ్యాంగ్ ఏటీఎం చోరీ చేసినట్లుగా గుర్తించారు. ఈ గ్యాంగ్‌ను తిరుపతి రూరల్ మండలం గరుడాద్రి అపార్ట్‌మెంట్స్ సమీపంలో శుక్రవారం అరెస్ట్ చేశారు. విచారణలో నిందితులు సర్దార్ ఖాన్, వసీం, అర్షద్ ఖాన్, ఇర్షాద్ అలియాస్ అప్సర్ కాన్, నసీరుద్దీన్ అలియాస్ నస్రు ఏటీఎం దొంగతనం చేసింది తామేనని ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు లక్షల రూపాయలు, తిరువల్లూరులో దొంగిలించిన ఈఈసిఓ కారు, 21 కేజీల గంజాయి, రెండు నాటు తుపాకులు, గ్యాస్ గన్, గ్యాస్ సిలిండర్, ఆక్సిజన్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్యాంగ్‌కే చెందిన రహదీ సద్దాం, అమీర్ ఖాన్ పరారీలో ఉన్నారు. వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. కాగా, పట్టుబడిన నిందితులపై వివిధ రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయని పోలీసులు చెప్పారు.

● తెలంగాణ

ఎయిర్‌పోర్టులో మాజీ ఎంపీ కావూరి కుమార్తె అరెస్ట్

- పాత కేసులో రాజస్థాన్ పోలీసుల లుక్‌అవుట్ నోటీస్
- ఓ భూయజమానిని ఆర్థికంగా మోసం చేశారని కేసు

శంషాబాద్: రాజస్థాన్ పోలీసుల లుక్‌ఔట్ నోటీసు మేరకు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారంరాత్రి ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు వచ్చిన శ్రీవాణిని అడ్డుకుని రాజస్థాన్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం రాజస్థాన్ పోలీసులు వచ్చి కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు. తమ స్థలంలో మట్టిని తవ్వి తరలించిన విషయంలో ఆర్థికంగా మోసం చేసినట్లు సంబంధిత భూయజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం. సంబంధిత కేసులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో అక్కడి పోలీసులు లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. తాజాగా కోర్టు ముందు హాజరుపర్చిన అనంతరం ఆమెను రాజస్థాన్‌కు తరలించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

అతిథి ఉపాధ్యాయుడి ఆత్మహత్య


శివపుత్రప్ప(ఫైల్)

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరులో అతిథి ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. మృతుడిని నగరంలోని 17వ వార్డులో నివాసమున్న శివపుత్రప్ప(47)గా గుర్తించినట్లు సీఐ దురుగప్ప వెల్లడించారు. మానసికంగా అస్వస్థతకు గురైన శివపుత్రప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని సింధనూరు తాలూకా ఆస్పత్రికి తరలించి భార్య శశికళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర

కంప్లి: ఇటీవల ఆడపిల్లలు కనిపించకుండా పోతున్నారనే కేసులు అధికం అయ్యాయని, మానవ దొంగ రవాణాకు లోనవుతున్న అంశాలు నిత్యం పత్రికల్లో గణాంకాలతో ప్రకటిస్తున్నారని కర్ణాటక రాష్ట్ర హక్కుల నిఘా కేంద్రం సభ్యులు హెచ్‌సీ.రాఘవేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేవలాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. బాలికల రక్షణ, ఆరోగ్యం, విద్య, కుటుంబం, పాఠశాలల్లో బాలికలపై వివక్ష నుంచి విముక్తి లభించాల్సి ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శి హెచ్.హులుగప్ప బాలికల రక్షణపై వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ ట్రస్ట్ బెంగళూరు యోజన సహాయకులు కౌశిక్, హరగి, పంచాయతీ అధ్యక్షులు, సభ్యులు అంగన్‌వాడీ, స్వసహాయ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జీపీ అధ్యక్షురాలిగా సునీత ఏకగ్రీవం



బళ్లారిఅర్బన్: జిల్లాలోని సిరుగుప్ప తాలూకా బలకుంది గ్రామ పంచాయతీకి జరిగిన ద్వితీయ అవధి గ్రామ పంచాయతీ అధ్యక్ష ఎంపికలో 1వ వార్డు సభ్యురాలు సునీత పంపయ్యస్వామి శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆమెను ఆ పంచాయతీలోని సభ్యులు ఎన్నికల అధికారి, పీడీఓ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

పథకాలపై అవగాహన అవసరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని విజ్ఞాన భవన్‌లో పాత్రికేయులకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రధానమంత్రి ఫసల్ బీమా, ప్రధాన మంత్రి సురక్ష పథకం, ప్రధానమంత్రి గ్రామ సడక్, జల జీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ పథకం, ప్రధానమంత్రి జన్‌ధన్, ముద్రా పథకాలపై ప్రజలకు వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వార్తా శాఖాధికారి గవిసిద్దేశ్వరప్ప, చెన్నబసవ, దేవిక, ప్రకాష్, మేనకా పాటిల్, లోకేష్, రవి, దేవరాజ్‌లున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి


మరణించిన ఆవు

బళ్లారిఅర్బన్: నగరంలోని అనంతపురం రోడ్డు బీపీఎస్‌సీ స్కూల్ ఎదురుగా ప్రధాన రోడ్డులో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని లారీ రోడ్డు పైన ఆవును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానిక సాయి కాటరింగ్ రాధాకృష్ణ శెట్టి గమనించి కార్పొరేషన్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వాహనంలోకి ఎక్కించి దూరంగా తరలించినట్లు తెలిపారు. నగరంలోకి లారీలు, ప్రధాన వాహనాలు రాకుండా అరికట్టాలని డిమాండ్ చేశారు. బైపాస్ మీదుగా భారీ వాహనాలు తరలి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూగజీవాలు రోడ్డుపై రాత్రి వేళల్లో ఉండటం సహజమే, వాటిని గమనించకుండా డ్రైవర్లు వాహనాలు నడపడం సరికాదని వాపోయారు.

రైలు నిలయం..అసౌకర్యాలమయం

- కంటోన్మెంట్‌లో కూర్చోడానికి ఆసనాలు లేవు
- స్టేషన్‌లోని కొళాయిల్లో సరఫరా కాని మంచినీరు
- ప్రయాణికుల పాట్లు పట్టించుకోని అధికారులు


కంటోన్మెంట్ రైల్వేస్టేషన్‌లో ఆసనాలు లేక కింద కూర్చొన్న ప్రయాణికులు


నిరుపయోగంగా ఉన్న మంచినీటి కొళాయిల సదుపాయం

సాక్షి బళ్లారి: నగరంలోని కంటోన్మెంట్ రైల్వేస్టేషన్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. నగరంలో ప్రధాన జంక్షన్ రైల్వే స్టేషన్‌తో పాటు కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ కూడా ఉంది. జిల్లాధికారి కార్యాలయం ఎదురుగా ప్రధాన రైల్వే స్టేషన్ ఉండగా, హొసపేటె రోడ్డులో ఉన్న కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ నుంచి కూడా ఇటీవల పలు రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి. మరమ్మతు పనుల అంతరాయం వల్ల ప్రధాన రైల్వేస్టేషన్‌కు వెళ్లకుండా పలు రైళ్లు కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ మీదుగానే బెంగళూరు, హొసపేటె, హుబ్లీ తదితర నగరాలకు నేరుగా రైళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. వీటితో పాటు హుబ్లీ మీదుగా బళ్లారి వచ్చే ప్రతి రైలు కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ మీదుగానే రాకపోకలు సాగించడం సర్వసాధారణం. నిత్యం పెద్ద సంఖ్యలో రైళ్ల రాకపోకలు సాగించే ఈ స్టేషన్‌లో దిగేవారు, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు రైల్వే ఫ్లాట్‌ఫాం మీద కూర్చోవడానికి ఆసనాలు కూడా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైల్వే స్టేషన్‌లో మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేశారే కానీ అందులో నీరు మాత్రం రాకపోవడంతో ప్రయాణికులు యాతన పడుతున్నారు. ఘన చరిత్ర కలిగిన కంటోన్మెంట్ రైల్వేస్టేషన్‌లో కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇక నగరంలోని ప్రధాన జంక్షన్ రైల్వే స్టేషన్‌లో కూడా లిఫ్ట్ సమస్య ఉందని నగరవాసి ఎర్రిస్వామి పేర్కొన్నారు. లిఫ్ట్ ఉన్నఫళంగా మధ్యలోనే ఆగిపోతోందని, తాను దాదాపు అర్ధగంట పాటు లిఫ్ట్‌లో ఇరుక్కొని ఇబ్బంది పడ్డానని వాపోయారు. ఈనేపథ్యంలో నగర రైల్వేస్టేషన్లలోని సమస్యలపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లో సరిగా పని చేయని లిఫ్ట్

సమస్యలపై రైల్వే ఉన్నతాధికారులకు వినతి


రైల్వే ఉన్నతాధికారులను కలిసిన క్రియా సమితి సభ్యులు

సాక్షి బళ్లారి: బళ్లారి రైల్వేస్టేషన్‌కు శుక్రవారం రైల్వే ఉన్నతాధికారుల బృందం ప్రత్యేక రైలులో విచ్చేసింది. ఈసందర్భంగా కర్ణాటక రైల్వే క్రియా సమితి అధ్యక్షుడు కేఎం మహేశ్వరయ్యస్వామి ఆధ్వర్యంలో సమితి సభ్యులు హుబ్లీ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీహర్ష, సీనియర్ డీసీఎం సంతోష్‌కుమార్ హెగ్డే తదితర రైల్వే ఉన్నతాధికారులను కలిసి పలు సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని విన్నవించారు. ముఖ్యంగా గత రెండు నెలల నుంచి మరమ్మతు పనుల సాకుతో హుబ్లీ–గుంతకల్లు రైళ్లను బళ్లారి మీదుగా గుంతకల్లుకు నడపకుండా కేవలం తోరణగల్లు వరకే పరిమితం చేశారన్నారు. ప్రారంభంలో కేవలం సాంకేతిక కారణాలతో నిలిపివేశామని, కొన్ని రోజుల్లో రైళ్లను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపినా ఇంతవరకు పునరుద్ధరించలేదని గుర్తు చేశారు. ఈ రైళ్లను బళ్లారి మీదుగా గుంతకల్లు వరకు కొనసాగించాలన్నారు. బళ్లారి కొత్త బస్టాండు, స్టేడియం పక్కన రైల్వే స్టేషన్ పనులు ప్రారంభించాలని కోరారు. బళ్లారి రైల్వే స్టేషన్‌లో మరో రెండు ఫ్లాట్‌ఫాంలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హుబ్లీ నుంచి బళ్లారి మీదుగా బెంగళూరుకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించాలన్నారు. ముంబై–హొసపేటె ఎక్స్‌ప్రెస్ రైలును బళ్లారి మీదుగా మైసూరుకు పొడిగించాలన్నారు. నాడు మహాత్మాగాంధీ బస చేసిన ఘన చరిత్ర కలిగిన బళ్లారి రైల్వే స్టేషన్ ఎదురుగా గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈసందర్భంగా హుబ్లీ రైల్వే వలయం జెడ్ఆర్‌యూసీ మెంబర్ రవికుమార్, రైల్వే క్రియాశీల సమితి సభ్యులు చంద్రశేఖర్‌గౌడ, బండేగౌడ, గౌరీశంకర్, కొట్రేష్, హాలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టులో పంటలను కాపాడండి


మాట్లాడుతున్న దరూరు పురుషోత్తంగౌడ తదితరులు

సాక్షి,బళ్లారి: ఈసారి ఖరీఫ్ సీజన్‌లో తుంగభద్ర ఆయకట్టు కింద సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితులు తలెత్తినందున పంటలను కాపాడేందుకు పొరుగు రాష్ట్రాల నీటి వాటా కోరాల్సిన అవసరం ఉందని తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షులు దరూరు పురుషోత్తంగౌడ పేర్కొన్నారు. ఆయన శనివారం నగరంలో రైతు సంఘం పదాధికారులు, సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగభద్ర ఆయకట్టు కింద కుడి ఎగువ కాలువ(హెచ్ఎల్‌సీ), కుడి దిగువ కాలువ(ఎల్ఎల్‌సీ)ల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిర్చి పంటకు పూర్తిగా నీరందాలంటే, పంట రైతుల చేతికి దక్కాలంటే నది ద్వారా ఆయా రాష్ట్రాలకు సరఫరా చేసే తెలంగాణ నీటి వాటా కింద 3.5 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ నీటి వాటా కింద 4 టీఎంసీలను ప్రస్తుత పరిస్థితుల్లో నది ద్వారా కాకుండా హెచ్ఎల్ఎల్, ఎల్ఎల్‌సీల ద్వారా సరఫరా చేస్తే విజయనగర, బళ్లారి జిల్లాలతో పాటు పొరుగున ఉన్న కర్నూలు, అనంతపురం జిల్లాల రైతులకు కూడా మేలు జరుగుతుందన్నారు. మిర్చి పంటను కాపాడేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, నీటి పారుదల శాఖ మంత్రి డీకే.శివకుమార్ ఇలా ప్రయత్నించడంతో పాటు కృత్రిమ వర్షాలు కురిపించేందుకు ప్రయత్నించాలని కోరారు. ఈసందర్భంగా రైతు సంఘం నాయకులు శివయ్య వీరభద్ర నాయక్, ఈరణ్ణగౌడ తదితరులు పాల్గొన్నారు.

అత్త హత్య కేసులో అల్లుడికి జీవిత ఖైదు

హుబ్లీ: అల్లుడే అత్త గొంతు కోసి హత్య చేసిన కేసును విచారణ జరిపిన బెళగావి 10వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం నిందితునికి జీవితఖైదు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. వివరాలు.. గదగ్ జిల్లా నరగుంద తాలూకాకు చెందిన బసవరాజ్ శిక్షకు గురైన వ్యక్తి. మూడలగి తాలూకా యాదవాడ గ్రామ నివాసి శోభ మిర్జి హత్యకు గురైన మహిళ. ఈ కేసులో తన తల్లిని హత్య చేసినట్లుగా భర్తకు వ్యతిరేకంగా ఓ భార్యే సాక్ష్యం ఇచ్చి భర్తను శిక్షకు గురి చేయడం గమనార్హం. 2011లో బసవరాజ్‌తో తన కూతురు లక్ష్మికి పెళ్లి జరిపించిన శోభ మిర్జి, తరచు కూతురికి అల్లుడు పెడుతున్న వేధింపులను సహించలేక కూతురిని పుట్టింటికి పిలుచుకొని వచ్చింది. ఈ క్రమంలో పుట్టినింటికి వెళ్లిన భార్య కోసం అల్లుడు తరచు వచ్చి తన భార్యను తనతో పంపించాలని అత్తను కోరేవాడు. దీనికి అత్త ససేమిరా అంటూ హెచ్చరించి అల్లుడిని వాపసు పంపేది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్న బసవరాజ్ 2014 మార్చి 21న తిరిగి యాదవాడకు వచ్చి భార్య ఎదుటే మిత్రుడు ఉమేష్ నాగఠాణ సహకారంతో అత్త శోభను హత్య చేశాడు.

పాలస్తీనాకు మద్దతుపై ఆగ్రహావేశాలు

- కాంగ్రెస్ నాయకుడి బంధువుపై ఎఫ్ఐఆర్ నమోదు


నవాజ్(ఫైల్)

హొసపేటె: ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య జరుగుతున్న భీకర యుద్ధంలో పాలస్తీనాకు మద్దతు తెలిపిన స్థానిక కాంగ్రెస్ నేత బంధువు ఒకరు వాట్సాప్‌లో స్టేటస్ వేసి ఉగ్రవాదులకు మద్దతిచ్చిన విషయంపై నగర పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఘటన గురువారం జరిగింది. పాలస్తీనాకు అనుకూలంగా నగరానికి చెందిన ఓ ముస్లిం యువకుడు పాలస్తీనా జిందాబాద్ అంటూ స్టేటస్ పోస్ట్ చేయడం పలువురి ఆగ్రహానికి కారణమైంది. స్టేటస్‌లో యుద్ధం జరుగుతున్న పాలస్తీనా పోర్ట్రయిట్‌తో కూడిన వీడియోను ఆయన పంచుకున్నారు. పాలస్తీనా చిత్రంతో మేం పాలస్తీనా కోసం నిలబడతాం, పాలస్తీనాకు విజయం కలగాలి అని తెలిపిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. యుద్ధంలో అతలాకుతలమైన ఇజ్రాయెల్‌కు భారతదేశం మద్దతు ప్రకటించగా, భారతీయ ముస్లింగా యువతకు ఉగ్రవాదులపై ఉన్న ప్రేమతో పాలస్తీనా హమాస్ ఉగ్రవాదులకు మద్దతు ఇవ్వడాన్ని ప్రజలు ఖండించారు. మద్దతు ప్రకటించిన వ్యక్తి జిల్లా కాంగ్రెస్ ప్రచార కమిటీ అధ్యక్షుడు హెచ్ఎన్ఎఫ్ ఇమామ్ నియాజికి బంధువు అయిన నవాజ్ అనే యువకుడు కాగా ఉగ్రవాదానికి అనుకూలమైన దేశానికి మద్దతుగా భారతీయుడు పోస్ట్ చేయడం ఎంతవరకు సబబు? అన్న ఆగ్రహావేశాలు పెద్ద ఎత్తున వినిపించాయి. విషయం తెలుసుకున్న టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని తహసీల్దార్ కోర్టుకు అప్పగించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


వర్షిక(షాట్‌పుట్)


లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం పొందిన వైష్ణవి

కంప్లి: పట్టణంలోని సేక్రెడ్ హార్ట్ పాఠశాల విద్యార్థిని వైష్ణవి బళ్లారిలో జరిగిన జిల్లా స్థాయి లాంగ్‌జంప్ పోటీల్లో ద్వితీయ స్థానం పొంది రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం ఆమెను అభినందించారు. అదే విధంగా సిరిగేరి గ్రామ జీహెచ్‌పీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థిని బీ.వర్షిక షాట్‌పుట్, లాంగ్‌జంప్‌లో రోహిత్ ద్వితీయ స్థానాలు పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

శాఖల ప్రగతిపై సమీక్ష


పాల్గొన్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, అధికారులు

గంగావతి : తాలూకా పంచాయతీ సభాభవనంలో శుక్రవారం టీపీ కేడీపీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి అన్ని శాఖల ప్రగతిని సమీక్షించారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రగతి గురించి వివరించారు. సమావేశంలో టీపీ ఈఓ లక్ష్మీదేవి, కమిషనర్ విరుపాక్షమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత నివారించండి

కంప్లి: వర్షాల కొరతతో భూగర్భ జలాలు ఇంకిపోయి మున్ముందు పశుపక్షాదులకు తాగునీటి కరువు ఎదురవుతుందని జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు తెలిపారు. గుడేకోట గ్రామ పంచాయతీ సభాంగణంలో ప్రజల సమస్యలను తెలుసుకొని ఆయన మాట్లాడారు. మున్ముందు వర్షాలు వస్తాయి. బావులు నిండి భూగర్భ జలాలు ఆశించినంతగా పెంపొందుతాయని భావించవద్దన్నారు. తాగునీటి కొరత ఎదురు కాకుండా పంచాయతీ పాలక మండలి తగిన ముందు జాగ్రత్త వహించాలన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్

బళ్లారిఅర్బన్: నగరంలోని 34, 35వ వార్డులో వేర్వేరు చోట్ల కేఎంఎఫ్ వద్ద సీసీ రోడ్డు పనులకు, విద్యానగర్ కొళగల్ రోడ్డులో డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. రూ.45 లక్షల కేఎంఎఫ్ నిధులతో డ్రైనేజీ పనులు చేపడతారన్నారు. మేయర్ త్రివేణి, ఉపమేయర్ జానకి, మాజీ మేయర్ రాజేశ్వరి, కేఎంఎఫ్ డైరెక్టర్ తిరుపతప్ప, కార్పొరేటర్లు మించు శ్రీనివాస్, నూర్ మహమ్మద్, జగన్, కాంగ్రెస్ నాయకులు సుబ్బారాయుడు, బోయపాటి విష్ణు, వాసు, యోగానంద రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కరపత్రాల పంపిణీ


కరపత్రాలను అందిస్తున్న సీఈఓ పద్మ బసవంతప్ప

కోలారు: తాలూకాలోని దొడ్డవల్లబ్బి గ్రామంలో ఉపాధి హామీ పథకంపై విశేష అభియాన్‌ను ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచడం ద్వారా శుక్రవారం జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఉపాధిహామి కరపత్రాలను పంచి పథకం ద్వారా గ్రామీణ ప్రాంత రైతులకు కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు. జాబ్ కార్డులను మహిళలు ఎక్కువగా పొందాలన్నారు. అనంతరం పలువురు మహిళలకు సీఈఓ స్థలంలోనే జాబ్ కార్డులను అందించారు. పశువుల షెడ్లు, గొర్రెలు, మేకలు, పట్టు పురుగుల పెంపకానికి షెడ్‌లను ఉపాధిహామి పథకం ద్వారా నిర్మించుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంత రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు మహేష్‌బాబు, చౌడదేనహళ్లి పీడీఓ వత్సల తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన రథం ప్రారంభం


రథాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు తదితర అధికారులు

హొసపేటె: జిల్లాలో డెంగీ కేసులు పెరగడంతో నివారణకు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డెంగీపై అవగాహన రథాన్ని శుక్రవారం తల్లి బిడ్డ(ఎంసీహెచ్) ఆస్పత్రి ఆవరణలో జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డెంగీ వ్యాధి ఎలా, ఎక్కడ నుంచి వ్యాపిస్తుంది అనే విషయాన్ని వివరించారు. డెంగీ వ్యాప్తి, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు జ్వరం లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స పొందాలన్నారు. డెంగీ కేసులను తగ్గించేందుకు ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ట్యాంకుల్లో రసాయనాలు వేసి లార్వా ఉత్పత్తిని నాశనం చేయాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమ రుతుక్రమ నిర్వహణపై సదస్సు

మహిళల్లో సక్రమ రుతుక్రమ నిర్వహణను సామాజిక ఉద్యమంగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వాడిన తర్వాత పారవేసే శానిటరీ ప్యాడ్లు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయన్నారు. స్థిరమైన రుతుక్రమం ద్వారా దీనిని నివారించవచ్చన్నారు. కళ్యాణ కర్ణాటక జిల్లాలను వెనుకబాటు నుంచి దూరం చేయడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయన్నారు. అదనపు జిల్లాధికారి అనురాధ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై సమాజం, కుటుంబ ఆరోగ్యం ఆధారపడి ఉంటాయన్నారు. స్త్రీలు సక్రమ రుతుక్రమం కోసం పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లు బెంగళూరు డాక్టర్ మీనాక్షి, డాక్టర్ శాంతి, యూఎన్ఐసీఈఎఫ్ ప్రతినిధి దిలీప్ కుమార్, ఆర్‌సీహెచ్ఓ డాక్టర్ జంబయ్యతో పాటు మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ డీడీ శ్వేత పాల్గొన్నారు.

పథకాల అమల్లో సర్కారుకు చిక్కులు


మాట్లాడుతున్న ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు

బళ్లారిఅర్బన్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీ ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టి రాష్ట్ర ప్రజలకు అమలు చేయడంలో ఇబ్బందులు పడుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ముఖ్యమంత్రి చంద్రు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక స్వర్ణోత్సవ కార్యక్రమాలకు సీఎం సిద్దరామయ్య నిధులు విడుదల చేయకపోవడం విచారకరం అన్నారు. కన్నడ సంస్కృతి శాఖ మంత్రి శివరాజ్ తంగడిగి ఆ శాఖకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినా తీసుకోలేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. 6 ప్రాధికారల చెర్మన్ పదవులను కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. నిర్లక్ష్యం చేస్తున్న మంత్రి శివరాజ్ తంగడిగి రాజీనామా చేయాలన్నారు. రైతులకు పగటి పూట నిరంతరంగా 8 గంటలు విద్యుత్ ఇస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. 5 గ్యారెంటీ పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ప్రజలకు కోట్లాది రూపాయలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పార్టీ ఉనికి కోసం ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టి 5 గ్యారెంటీలతో అధికారం చేజిక్కించుకున్నారన్నారు. కావేరి జలాల సంరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ విషయంలో బీజేపీ, జేడీఎస్‌లు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. తుంగభద్ర డ్యాంలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, విద్యుత్ కొరతతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విమ్స్ ఆస్పత్రిలో ఈ సమస్యలతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. కేకేఆర్‌డీబీ, డీఎంఎఫ్ నిధులు ఉన్నా ఉపయోగించడం లేదన్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నవలి హిరేమట్, సమన్వయ కార్యదర్శి అర్జున్ హాలగిగౌడ, జిల్లాధ్యక్షులు కేవీ.మంజునాథ్, బసవరాజ్ పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని అతిథి అధ్యాపకుల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

కంప్లి: అతిథి ఉపన్యాసకుల జీతాలు పెంచాలని అఖిల కర్ణాటక ఇంజినీరింగ్ కళాశాలల ఉపన్యాసకుల క్షేమాభివృద్ధి సంఘం పదాధికారులు హూవినహడగలి పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే కృష్ణనాయక్ చేతికి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో 17 ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో చాలా ఏళ్లుగా కేవలం రూ.15 వేల వేతనాలకే విధులు నిర్వహిస్తున్నారన్నారు. అయితే కాలానికి తగ్గట్టుగా వేతన సవరణ చేయాలన్నారు. చాలీచాలని వేతనాలతో విద్యార్థులకు బోధన చేస్తూ కష్టాలను ఓర్చుకొని జీవిస్తున్నామని, మానవతా దృక్పథంతో తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

17న భూములు పంచాలని రాస్తారోకో


మాట్లాడుతున్న మానసయ్య

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరు తాలూకాలో ఉన్న మిగులు భూమిని పేదలకు పంచాలని సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్, రైతు సంఘ్ అధ్యక్షుడు మానసయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి వెంకట్రావ్ నాడగౌడ తల్లి సిద్దలింగమ్మ పేరుతో ఉన్న 1400 ఎకరాల మిగులు భూములను పేదలకు పంచాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు చేపట్టక పోతే ఈనెల 17న సింధనూరులో రాస్తారోకో చేపడతామని హెచ్చరించారు.

బాణసంచా దుకాణాలపై దాడులు

గంగావతి: టపాసులు నిల్వ ఉంచిన దుకాణాలపై పోలీస్ అధికారులు, పలు శాఖల ఉన్నతాధికారులు దాడి చేసి రూ.లక్షలాది విలువ చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని కరిబసప్ప అంగడి, అశోక్ హలాగార్, మహాబళేశ్వర్, పాండురంగ, బళ్లారి చెన్నప్ప, చంద్రశేఖర్, పార్వతి, ప్రహ్లాద దుకాణాల్లో అధికారులు పరిశీలించి, పలు దుకాణాల్లో నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల బెంగళూరు, తమిళనాడులో బాణసంచా నిల్వ ఉంచిన గోడౌన్‌లకు నిప్పంటుకొని పలువురు మృతి చెందిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వీటిపై పరిశీలించాలని ఆయా ప్రాంత ఉన్నతాధికారులకు ఆదేశాలను జారీ చేసింది. దీంతో నగరంలో ఈ దుకాణాలను పరిశీలించి బాణసంచా దొరికిన దుకాణాల యజమానులపై కేసులను నమోదు చేశారు. దాడిలో డీఎస్పీ సిద్దలింగేశ్వర, కమిషనర్ విరుపాక్షమూర్తి, టీపీ ఈఓ లక్ష్మీదేవి, ప్రజాపనుల శాఖ ఇంజినీర్ విశ్వనాథ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులను నిషేధించరూ..


వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తులను నిషేధించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు భీమేష్ మాట్లాడారు. గంజాయి, హుక్కా, పొగాకులతో కూడిన మత్తు పదార్థాల సేవ నంతో యువత, విద్యార్థులు దారి తప్పుతున్నారన్నారు. అలాంటి వాటిని పూర్తిగా నిషేధించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా పాండు, ప్రణీత్, భాగ్యలక్ష్మి, రంగనాథ్‌లున్నారు.

అక్రమ టపాసుల విక్రయం ..ముగ్గురి అరెస్ట్

- రూ.24 లక్షలు విలువ చేసే బాణసంచా సీజ్

రాయచూరు రూరల్: జిల్లాలో అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నిఖిల్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింధనూరు తాలూకా గుంజళ్లి క్యాంప్‌లో సత్యనారాయణశెట్టి ఇంటిని నాగరాజ్ అద్దెకు తీసుకొని అందులో అక్రమంగా టపాసులను నిల్వ ఉంచి విక్రయాలకు సిద్ధమైనట్లు సమాచారం అందుకున్న తుర్విహాళ్ పోలీసులు దాడులు జరిపారు. నగరంలోని గీతా మందిర్ వద్ద రమేష్ ఇంటిపై దాడులు జరిపి ఇద్దరి నుంచి రూ.24 లక్షలు విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువరైతు ఆత్మహత్య

హొసపేటె: చేతికొచ్చిన పంటలు ఎండిపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపంతో ఇంటిలో ఉరి వేసుకొని యువ రైతు ఆత్మహత్య చేసుకొన్న ఘటన శుక్రవారం జరిగింది. విజయనగర జిల్లా హూవిన హడగలి తాలూకా హిరేహడగలి పోలీస్ స్టేషన్ పరిధిలోని కత్తెబెన్నూరుకు చెందిన హాలేష్ బేలిమని(23) తనకు ఉన్న మూడు ఎకరాల పొలంలో మొక్కజొన్న పంట వేశారు. సరిగా వర్షాలు లేకపోవడంతో చేతికి వచ్చిన పంట ఎండిపోయింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక తీవ్ర మనస్తాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కేసు దర్యాప్తులో ఉందని హిరేహడగలి పోలీసులు తెలిపారు.